# పుట్టపర్తి వారి ఖండకావ్యములు

## శివతాండవము
## పరిశీలన

50049

డా॥ వజ్ఝల రంగాచార్య

# పుట్టపర్తి వారి ఖండకావ్యములు

# శివతాండవము

## ప రి శీ ల న

(తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆర్థిక సహాయంతో)

డా॥ వజ్ఝల రంగాచార్య

# PUTTAPARTHI VARI KHANDAKAVYAMULU SHIVATANDAVAM PARISILANA

By
Dr. V. RANGA CHRYULU
J L.
Bishop Solomon Jr, College,
Karimnagar.

First Edition Oct 1993
Copies 1000
Copy Right-Author

Published by
VASUMATHI PUBLICATION
Karimnagar

Cover Des'gn ; AGA CHARY

For Copies ;
Smt. S.B, VASUMATHI
W/o, Dr, V. Ranga Charyulu
C.S.I. School Compound,
Karimnagar.

Printed at

MAYURA PRINTERS
Mission Hospital Road,
Karimnagar-505 002.

Price ; 50-00



ఊర్ధ్వతాండవము



Saraswatiputra

# Sriman putta parthi Narayanacharyulu

| Birth | Death |
|---|---|
| 28-3-1914 | 1-9-1990 |



శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల సన్మాన సభలో వారి మేనమామ
శ్రీమాన్ రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ ప్రసంగిస్తున్న దృశ్యము



జననీ జనకులు

శ్రీమతి రాఘమ్మ శ్రీ రత్నమాచార్యులకు,

అంకిత మీకృతి పితరుం
డింపుగ నాశక్తి తోడ నొలిచితి, వాగ
ర్థాంక శివాకృతి శ్రీవ
త్సాంకుని కృప పేమ్మజన్మ సార్థక్యముకై

తీర్పగ వచ్చునా ధర పితౄణము నెవ్విధి నైనగానినే
యుర్వున రూపమెత్తె నిటు అమ్మగ నింతటి కమ్మదీవెనల్
కూర్చున మీకరాబ్జముల కొల్చెద కావ్యవివేచనా కృతిన్
పేర్చెద సంతసించి కురిపించు ముదంబుపుతో తరింపగన్

పెల్లొంప వేంకటేశుని
కొల్వంగా జీవితములు కోవెలగా,యా,
నిల్వలుగా మను పితరుల
నెల్లింజా పాపములు డెతునుపూజన్.

# భూ మి క

తెలుగు సాహిత్యములో కాల్పనికోద్యమము 1910 నుండి 1930 వరకు కొత్త ప్రవాహమై దాని పూర్వస్థితిని సంపూర్ణముగా మార్చివేసినది. కాల్పనికోద్యమము అభివ్యక్తిలో ఎంత సూక్ష్మత్వమును సంపాదించిననూ, ప్రపంచమును ఆవరించెడి విశాలమైన వస్తువు లేకుండుటచే క్షీణమై 1933-34 ప్రాంతమున ఒక వైపు నవ్యసంప్రదాయ ఉద్యమముగ, మరొక వైపు ప్రగతివాద ప్రయోగవాదములుగ కొనసాగినవి ఈ ఉద్యమము ప్రభావము, ప్రాబల్యము, సర్కారు జిల్లాలలో కొంత అధికముగా, ఇటు తెలంగాణములోగాని, అటు రాయల సీమను గానీ, ఉన్నదని చెప్పుటకు తగిన అవకాశము లేదు అయితే తెలంగాణమున నూతన అభివ్యక్తి, సంప్రదాయ కవితా ధోరణి నుండి విడివడి స్పష్టమైన గొంతుకతో కాల్పనిక, ప్రయోగవాదముల సంగమముగ దాశరథి అగ్నిధారతో నిర్గతమైనది రాయలసీమలో సంప్రదాయకవితా ధోరణి రామలింగారెడ్డి "ముసలమ్మమరణము" తో కొంచెము మార్పు పొందినను, నవ్యసంప్రదాయ ఉద్యమము వచ్చువరకు, అక్కడ ఆధునికమైన కవిత్వము. అభివ్యక్తి జన్మించలేదు. శ్రీదుర్భాక రాజశేఖర శతావధాని రాణాప్రతాపసింహచరిత్ర, జాతీయోద్యమ భావ భూమికతో ఆధునిక కవిత్వమై నవ్యసంప్రదాయ ఉద్యమానికి తొలిరోజుల్లో అభివ్యక్తియై వెలువడినది. ఆ తరువాత శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి శివభారతము ఈ మార్గమున మరొక శిఖర స్థాయి అందుకున్నది.

శ్రీపుట్టపర్తి నారాయణాచార్యులు పుట్టి పెరిగినది కాల్పనికోద్యమము ప్రబలముగా విజృంభించిన కాలము. ఆయనలోని బహువిషయ సంగ్రహణ శీలము, ఆయనను భాషలు నేర్చునపుడుగాని, శాస్త్రములు అధ్యయనము చేయునపుడుగానీ, దేశములో జరుగుచున్న ఉద్యమములను అవగాహన చేయునపుడుగానీ ఒకచోట నిలువనీయలేదు. ఈ లక్షణము వలన ఆయనతన ప్రాంతములోని కవుల కన్న అధికముగా ఆధునిక సాహిత్య ఉద్యమముల యెడల ప్రతిస్పందించినాడు. ఆయన కవితా యాత్ర మొత్తము పరిశీలించినచో ఒక క్రమ గతి కంటే, అనిబద్ధ ప్రవాహమువలె, అన్నివైపులకు వ్యాపించుట తెలియవచ్చును. వ్యక్తిత్వము రూపు కట్టు నాటికి ఆంధ్రపౌరుషము, ఆంధ్రావళి, ఆంధ్రప్రశస్తి కావ్యములు ప్రాచుర్యములో నుండెను. హంపిక్షేత్రము కూడా ప్రచారములోనికి వచ్చినది. ఇది ప్రేరణయై ఆయన తొలికావ్యమైన పెనుగొండలక్ష్మి వెలువడినది.

పెనుగొండలక్ష్మి గత చరిత్రలోని ఉజ్జ్వల ఘట్టములను స్మరించి నేటిదీనావస్థను మనసునకు చెప్పరాని విషాదమును చిత్రించిన కావ్యము. ఈ కావ్యము వెనువెంటనే ఆయన రచించిన షాజీ, ఆయన జీవితములోను, వ్యక్తిత్వములోను శృంగార వైరాగ్యముల సంఘర్షణగా రూపుకట్టినది. ఈ కావ్యము నారాయణాచార్యులు సాధనలో ఏర్పడిన విలక్షణ సన్నివేశములను, సన్నికర్షణను శక్తిమంతముగా ఆవిష్కరించినది. దీని తరువాతి వచ్చిన ప్రముఖ కావ్యము గాంధీజీ మహా ప్రస్థానము గాంధిజీ మహాప్రస్థానములో కూడ జాతీయోద్యమితాదాత్మ్యము గాంధీజి వంటి మహాపురుషుడు లేనపుడు దేశమేమగునోయన్న దైన్యము పరిహాస వస్తువు ఈకావ్యము రచించునాటికి నారాయణాచార్యుల వయస్సు యౌవన ప్రౌఢదశల సంధి కాలము. అప్పటికి ఆయన తులసీ రామాయణము ఎన్నోసార్లు పారాయణము చేసెను. అసంఖ్యాకముగ అష్టాక్షరీజపము కొనసాగించుచుండెను ఆత్మదర్శన కాంక్షతో హిమాలయములు చుట్టివచ్చెను యోగులను వైరాగులను, ఆశ్రమములను సందర్శించెను. మెరపుమెరసినట్లు అనుభూతులు కల్గినను, మనస్సునకొక నిశ్చలస్థితి సంభవింపలేదు. ఆయనలోని అఖండమైన అభ్యాసశక్తి బహుభాషలను స్వాధీనపరచెను సంగీత సాహిత్యములు,పద్యగద్యములు సంస్కృతాంధ్రములు, ఆయన వాగ్దేవతకు విహారభూములైనవి జపము, యోగము, సంకీర్తనము, ఆయన చేయగల్గినంత చేసెను. ఆయనలోని సృజనాత్మకశక్తి అత్యున్నత స్థితిలోనుండగా, హరిహరాద్వైతభావము, విశిష్టాద్వైత తత్వము, శ్రీ అరవిందుల పూర్ణయోగము ఆయన భావుకతకు ఆధారముకాగా, శివతాండవ కావ్యము అవతరించినది అదిఒక భవ్యకవితావేశము. మార్గదేశీ సంప్రదాయములు, సంస్కృతాంధ్ర కవితా ధోరణులు నృత్య-నృత్తములు, వాచిక అంగిక అభినయములు, భక్తి జ్ఞానములు, ఈ ద్వంద్వసమాసములన్ని, ఏకత్వముపొంది తెలుగు సాహిత్యములో వింధ్యశిఖరము వంటి భావకావ్యము ఆవిష్కృతమైనవి. తెలుగు సాహిత్యములో శివతాండవముతో పోల్చదగిన కావ్యము లేదనుట సత్యోక్తిమాత్రమే.

శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు శివతాండవములో విశ్వతత్వమును వ్యాఖ్యానించుటలో అసామాన్యమైన సృజనాత్మక ఉపలబ్ధిని పొందినారు. దీనిలో రచన పొందిన అత్యద్భుతమైన రూపసౌష్టవము, ఆధునికాంధ్ర కవులలో ఆయన స్థానమును సుస్థిరముగా చేసినది.

తరువాత నారాయణాచార్యుల సాహిత్య కృషివ్యుత్పత్త్యభ్యాసముల తోడుగా ప్రతిభ సాగించిన ప్రయాణము మాత్రమే. పండరీ భాగవతము, జనప్రియ రామాయణం శ్రీనివాసప్రబంధము, ఆయన రచనాశక్తిలోని వైవిధ్యమును

వైచిత్రిని ప్రదర్శించు ప్రయోగములు మాత్రమే ఆయన రచనలో మేఘదూతము నందు ఆయనలోని సామ్యవాద ఉద్యమముతోడి సామీప్య సాముజ్య స్థితి వ్యక్తమగును.

నారాయణచార్యులు జీవితములో సాహిత్యములో, నిరంతర విరుద్ధభావముల తాకిడికి ఎప్పుడును ప్రతిస్పందించుచు, బహుముఖ గతిశీలమున సంచరించినవాడు ఒక బిందువు వద్ద నిలచి సింహావలోకము చేసికొని తన మార్గమును స్పష్టముగా నిర్దేశించుకొనలేక పోయినారు. శివతాండవమునాడు ఆయన చేరుకున్న శిఖర స్థితి, ఆబిందువై తరువాతియాత్ర నిర్దిష్ట లక్ష్యలక్షితమైనచో ఈ శతాబ్దమున ఆయన సరసన ఉండదగినవారు ఒక్కరిద్దరికి మించి యుండెడివారుకారు.

చిరంజీవి వజ్ఝల రంగాచార్యులు ప్రాచ్యవిద్యా కళాశాలలో చదువుకొని కవి శార్దూల కేసరి న.చ. రఘునాథాచార్యస్వామివారి వద్ద, ఈ శతాబ్దపు సంస్కృత కవిశ్రేష్ఠులలో కనిష్ఠికాధిష్ఠితులైన శ్రీభాష్యం విజయసారథి వద్ద అంతేవాసిత్వము చేసి మా విశ్వవిద్యాలయమునకు వచ్చిన విద్యార్థి కవిత్వము, అభినయము, బహువిషయ పరిజ్ఞానము ఇతనిని ఒక విలక్షణమైన వ్యక్తిగా చేసినవి తన పరిశోధనాంశముగా పుట్టపర్తి వారి ఖండకావ్యములు ఎన్నుకొని వానిలో శివతాండవము ప్రధాన పరిశీలన కావ్యముగా స్వీకరించి కొనసాగించినాడు వస్తువివేచనలో, విశ్లేషణలో, మూల తత్వములను తెలియజేసెడి సన్నివేశముల రంగాచార్యుల కృషి, చిత్తశుద్ధి, ఆత్మవిశ్వాసము, స్పష్టముగా వ్యక్తమగుచున్నవి ఈ రచనా ప్రపంచమును పరిశీలించునపుడు తాను అనేక శాస్త్రముల మౌలిక అంశములను, పరిశీలించి స్వతంత్రముగ తన నిర్ణయములను, వెలువరించినాడు ఇతని ఈ సిద్ధాంతగ్రంథము తన సాహిత్య కృషిలో ప్రథమ గ్రంథమే అయి ముందు ముందు సాహిత్య విమర్శకు, అధ్యయనమునకు కొత్త వెలుగునిచ్చు అనేక గ్రంథములను రచించుటకు ప్రేరణ కాగలదనియు విశ్వసించుచున్నాను. ఆత్మకళయైన శ్రీ సరస్వతి ఇతని రచనాధోరణికి అధ్వదీపికయై ప్రకాశింపవలెనని ఆశంస.

తేది 23-2-1991, కోవెల సుప్రసన్నాచార్య

వరంగల్లు.

# ఉపస్కృతి

రంగాచార్య త్వయా ఽఽ యుష్మన్, పుట్టపర్తి కృతీః ప్రతి
ఆకలయ్య లిఖామీషత్ కృతాం శోధముఖీం కృతిమ్

సిద్ధాంతా బహవస్సంతి వస్తుబుద్ధి ప్రభేదతః
శోధ సారస్వతే కోపి సర్వ తంత్రాయతే సుధీః

వాఙ్మయ్యాః స్వాదు శైలూష్యాః ప్రజ్ఞా భూమి విభూమికాః
ఉపస్కృతా స్త్వయా ఽఽ యుష్మన్ పుట్టపర్తి మహాకవేః

ప్రతిభాన పరిస్పంద బంధురా సుందరా కృతిః
శోధశాణ చణోల్లేఖై స్సమిద్ధాతే సమేధతామ్

కవీనామ్ ప్రఖ్యానమ్ నవరస పరీవాహలులితం
చమత్కారం సూక్తీనాం పరిమల పరిస్పంద శబలమ్
ప్రసూతే విమృష్టా ప్రతి పదముపస్కార బహుళైః
విశేషైః కావ్యాని స్ఫుటమతి కూలంకష తమైః

అమ్లాన ప్రతిభా వికస్వర నవవ్యాహార భంగీమయం
ముద్రాముగ్ధ ముదారరీతి మధురం పాత్రౌచితీ సుందరమ్
యుక్తిస్ఫీత మయత్న సిద్ధ లలితాలంకారరోచి స్స్ఫురం
శ్రీనారాయణ భవ్యకావ్య భువనం సమ్యగ్ విమృష్టం త్వయా

ఆజాన ప్రతిభాన భాసుర పదన్యాస స్ఫురన్మాధురీ
ధారాస్పందముదార బంధమభితో లావణ్య లీలాయుతమ్
అక్లేశ స్ఫురితార్థ సౌభగమభివ్యక్తాభిజాత్యం నవం
శ్రీనారాయణ భవ్య కావ్య భువనమ్ సమ్యగ్ విమృష్టం త్వయా

వైచిత్ర్యాత్ విషయస్యదీప్త మసృణ చ్ఛాయస్య సీమాయుతం.
సత్త్వాదేర్ ధృతిదీప్తి విస్తర గతిస్రోతాయుతం చోద్గమాత్
సంవిద్బోధ వశాత్ పరస్పర భిదాతీతాద్వయానందభు
శ్రీనారాయణ భవ్యకావ్య భువనం సమ్యగ్ విమృష్టం త్వయా

ఆయుష్మన్ సనుతాం తవం పరశివో ఽ కార్షీత్ ప్రదోషేనవా
శ్రీనారాయణ శారదాత్మ జనుషా తేనైవ సంపాదితమ్
లీలాతాండవ మంగహార కరణైశ్చారీభి రారాధితం
భావైః దీప్ర రసోత్కటై రభినయైరత్యద్భుతమ్ భావయే.


శ్రీ శ్రీ భాష్యం విజయసారథిః
అధ్యక్ష:
సర్వవైదిక సంస్థానమ్ - కరీంనగర్

# సహృదయ సారస్వత ప్రియులకు
# సమస్సులు

సరస్వతీ పుత్రి శ్రీమాన్ పుట్టపర్తి నారాయణాచార్యుల ఖండకావ్యములను, అందు ప్రత్యేకముగా శివతాండవమును పరిశోధనాంశముగా స్వీకరించి కాకతీయ విశ్వవిద్యాలయమునకు 1988లో సమర్పించిన పరిశోధనా గ్రంథమిది.

ప్రొద్దుటూరు ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుచుండగా పుట్టపర్తి వారి "అభయ ప్రదానం" అను నవల చదివి వారి రచనాశైలికి ముగ్ధుడనైతిని. వారి సాహిత్య వ్యక్తిత్వమును గురించి గొప్ప అభిప్రాయము అనాడే నాకు కలిగినది. కాకతీయ విశ్వవిద్యాలయంలో శివతాండవాది కావ్యములు, వసుచరిత్ర-విమర్శ నాది గ్రంథములు చదివి వారి సృజన విమర్శనాత్మక శక్తులకు సమ్మోహితుడనై వారి సృజనాత్మక రచనలపై పరిశోధన చేయుటకు పూనుకొంటిని

విభిన్న సిద్ధాంతములను, బహుకావ్య గత సంస్కార సమ్మేళనమును, విచిత్ర శైలీ సంవిధానమును గర్భీకరించుకున్న వారి సృజనాత్మక సాహిత్యమును ఒక సిద్ధాంత వ్యాస పరిధిలోనికి ఒదిగించుట నాకు కష్టతరమైనది. ఈ స్థితిలో సరియగు మార్గము నిర్దేశించి, కావ్య అంతస్సత్వమును వ్యాఖ్యానించుటలో హేతుపూర్వకమైన ఆలోచనా దృష్టి కల్గించి అమూల్యమగు సూచనలందించిన గురువులు శ్రీమాన్ కోవెల సుప్రసన్నాచార్యులకు కృతజ్ఞతాభివందనములు. పుట్టపర్తి వారి సాహితీ వ్యక్తిత్వ పరిచయము కల్గించి వారితో తమకు గల అనుభవములను వివరించి పరిశోధనకు ప్రోత్సహించిన ఆచార్య శ్రీ పెరుంబుదూరు లక్ష్మణమూర్తి గారి సహృదయత్వమునకు సర్వదా కృతజ్ఞుడను.

కడపలో తమ ఇంటి గడప త్రొక్కిన నన్ను ఆదరించి, ఓపికగా సాహిత్యానుభవములను వివరించిన పుట్టపర్తి పుణ్యదంపతులను భక్తి పూర్వకంగా స్మరించుకుంటున్నాను. ఈ పరిశోధనా వ్యాసంగమునకు అనుమతినిచ్చిన బిషప్ సాలమన్ జూనియర్ కళాశాల పాలక వర్గమునకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

వ్యాసరచనారంభమునుండి, ముద్రణ రూపమువరకు సహకరించిన పెద్దలు, శ్రేయోభిలాషులు, స్నేహితులు, బంధువులు ఎందరో జ్ఞాపకమున్నంత వరకూ—, అలభ్యములగు పుట్టపర్తి ఖండకావ్యముల కొన్నింటిని పోస్టుద్వారా పంపించి నా కృషిని ప్రోత్సహించిన శ్రీ ముద్దెల నారాయణ తెలుగు పండితులు కడప గారికి....

ఆంధ్రాంగ్ల విషయ వివేచనా చర్చలో సహకరించిన కీ॥ శే॥ శ్రీమాన్ **S B.V.N.** ఆచార్యులగారికి, శ్రీమాన్ **S.L.** నరసింహాచార్యుల గారికి
తన అనారోగ్యమును కూడ లెక్కచేయక అందంగా వ్రాత ప్రతిని సిద్ధముచేసిన చి॥ సంపత్కుమారాచార్యునకు

ఈ గ్రంథము డాక్టరేటు పట్టాకు అర్హమైనదిగా ఆమోదించిన ఆచార్యబేతవోలు రామబ్రహ్మంగారికి, ఆచార్య యస్. వి. రామారావుగార్కి,
గ్రంథరచనా సమయంలో సదుపదేశం చేస్తూ వెన్నుతట్టి ప్రోత్సహించి 'ఉపస్కృతి'తో ఈ గ్రంథాన్ని అలంకరించిన గురువులు శ్రీ శ్రీ భాష్యం విజయ సారధి గార్కి శ్రేయోభిలాషులు శ్రీమాన్ డా॥ కె. వెంకటాచార్య, విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాల ప్రిన్సిపాల్, శ్రీ **E.Y.S.** సంజీవరావు బిషప్ సాలమన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గార్లకు శ్రీ చకిలం ఆగయ్య గార్కి,
మిత్రులు జి నాగభూషణం, వేణుశ్రీ, దత్తాద్రి గార్లకు,
సహోద్యోగులు సి హెచ్. మురళీధర్, యం. శ్రీనాథరెడ్డి, యన్. కనకయ్య ఎ. లక్ష్మారెడ్డి, పి.యస్. ధనరాజ్, కె.పి. జీవానందం గార్లకు,

ఆర్థిక సహకారం అందించి ప్రోత్సహించిన పెద్దలు శ్రీ నూకల మఠ్ఠి గంగయ్యాచార్యులు; శ్రీ బొమ్మ వెంకటేశ్వర్, న్యాయవాది, శ్రీ యదవల్లి జగ్గారెడ్డి, న్యాయవాది, శ్రీ పి. శంకరయ్య కరస్పాండెంట్ శాతవాహన పబ్లిక్‌స్కూల్, శ్రీ శ్రీనివాసరావు ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసర్ గార్లకు,

అందమైన ముఖచిత్రంతో గ్రంథమునలంకరించిన కళాతపస్వి శ్రీ ఆగాచారిగార్కి పుట్టపర్తి వారి ఛాయచిత్రములనందించినవారి కుమార్తె, శ్రీమతి నాగపద్మినిగార్కి అందంగా, అనుకూలంగా గ్రంథమును ముద్రించిన ఉజ్వలా ప్రింటర్స్ సిబ్బందికి, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ శ్రీ చుక్కారెడ్డిగార్కి, చైర్మన్ శ్రీ వామన్ రావు గార్కి, **ఒక్కొక్కరికీ అందరికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు**

ఈ పరిశోధనాధ్వమున అలసిపోయి నిరాశపడిన సమయములలో ప్రోత్సాహపాదేయమునందించి కార్యకుశలునిగ చేసిన సహచారి అ.సౌ. వసుమతికి ఈ నా జీవితమే అంకితం.

సుజన విధేయుడు
**డా॥ వఝ్ఝల రంగాచార్య**

# -: విషయసూచిక :-

ప్రథమభాగము


| | | | పు.సం॥ |
|---|---|---|---|
| I | పుట్టపర్తి వారి సాహిత్య జీవనం | | **1-12** |
| II | జాతీయ భావ కావ్యములు | | **13-38** |
| | పెనుగొండ లక్ష్మి | 13–21 | |
| | సిపాయి పితూరి | 22–27 | |
| | గాంధీజీ మహాప్రస్థానము | 28–38 | |
| III | కాల్పనికోద్యమ కావ్యములు | | **39-62** |
| | షాజీ | 39–51 | |
| | అగ్నివీణ | 52–62 | |
| IV | భక్తి కావ్యములు | | **63-94** |
| | పాదుకా | 65–70 | |
| | వేసనాశతకము | 70–76 | |
| | విభూతిశతకము | 77–81 | |
| | సాక్షాత్కారము | 81–94 | |
| V | ప్రగతి భావకావ్యములు | | **95-129** |
| | పురోగమనము | 95–100 | |
| | గుడిగంటలు | 100–102 | |
| | మేఘదూతము | 103–129 | |
| VI | కావ్యస్వరూప విశేషము | | **130-141** |

# శివతాండవము

## ద్వితీయ భాగము


| | | పు. సం॥ |
|---|---|---|
| 1) | శైవసంప్రదాయము | 142-150 |
| 2) | విగ్రహశిల్పము-నటరాజు | 151-163 |
| 3) | తాండవము-పుట్టుపూర్వోత్తరములు | 164-175 |
| 4) | పూర్వ సాహిత్యమున శివతాండవ ప్రసక్తి-ప్రశస్తి-వర్ణన | 176-188 |
| 5) | కావ్యస్వరూపము-నిర్వహణము | 189-205 |
| 6) | శివతాండవమున సృష్టితత్త్వము | 206-219 |
| 7) | తాండవము తద్భేదములు | 220-223 |
| 8) | ముద్రాతత్త్వము-నటరాజ భంగిమలు | 234-246 |
| 9) | కావ్యవర్ణనా సౌందర్యము | 247-263 |
| 10) | శివతాండవానుకరణ కావ్యములు | 264-272 |

అనుబంధము

| | |
|---|---|
| పుట్టపర్తితో సాహిత్య ప్రసంగము | 273-275 |
| ఉపజీవ్య గ్రంథసూచి | 276-286 |

# పుట్టపర్తి వారి సాహిత్య జీవనము

అమృతమయమైన యా వసంతా గమమున
పల్కు కోయిల నెవడాపు వాడు తండ్రి
విచ్చు నలవాటు గల మల్లె విరుల కెవడు
విరుగడనుదెచ్చి గుణము దప్పించువాడు

( పెనుగొండ లక్ష్మి - 117 )

ఇరువదవ శతాబ్ది కాలము తెలుగు సాహిత్యమునకు వసంతకాలము. ఎందరో కవి కోకిలలు తమ మధుర గళములు విప్పి నవ్య కవిత్వమును గా న ము చేసిరి. గురజాడ, రాయప్రోలు అబ్బూరి, విశ్వనాథ, కృష్ణశాస్త్రి, దువ్వూరి, నాయని, వేదుల మొదలగు కవులందరు రొమాంటిక్ ఉద్యమముచే ప్రభావితులై, స్వాతంత్ర్యోద్యమముచే ప్రేరితులై సంప్రదాయ సాహిత్యము వెన్ను బలముగా నవ్యకావ్యములు నిర్మించుచుండిరి. దేశము స్వాతంత్ర్యోద్యమముతోను, సమాజము సంస్కరణములతోను, సాహిత్యము కాల్పనికోద్యమ జనిత నవ్యకళా రూపములతోను ప్రతిస్పందించుచున్న కాలమున ది. 28-3-1914 - ఆనంద నామ సంవత్సర చైత్రమాసమున పుట్టపర్తి నారాయణాచార్యులు అనంతపురము జిల్లా లోని తన మాతామహుల గ్రామమగు "చియ్యేడు" లో జన్మించిరి.

తెలుగులో తొలి నవ్యకావ్యమైన తృణకంకణము (1913) ఆవిర్భవించిన రోజులలో జన్మించిన పుట్టపర్తి దాదాపు పదునైదేండ్ల వరకు సంప్రదాయ వాతావరణము, తండ్రిగారి పురాణ వరన ప్రభావమునకు లోనయ్యెను. తండ్రి శ్రీనివాసాచార్యులు సంస్కృతాంధ్ర సాహిత్య విద్వాంసులు. తెలుగు పండితులుగా పనిచేసినవారు. నాటకములలో వేషధారణ చేసెడివారు. గొప్ప పౌరాణికులు. తల్లి కొండమ కాశీ పండిత వంశములో జన్మించిన విదుషీమణి. బాల్యమున ఈమె పుత్రునకు అమరము మొదలగు సంస్కృత నిఘంటు శ్లోకములను పఠింపజేసినది. ఆ సంస్కారము తోడనే అళువుగా పద్యము వ్రాయ బోయి,

" అల కవితా లోకమునకు
కలిమికి వైరంబదేల కల్గెను చెపుమా ? ॥

అని పూర్వార్ధము మాత్రము చెప్పి ఉత్తరార్ధము పూరింప లేపోయిరి. అపుడు వారి తండ్రిగారు, కలికాల మహిమ సద్గుణ
కలితుల నృపసింహముల గనకుండుటయే

అని పూరించినట్లు తెలియుచున్నది. ఈ పద్యమే తన తొలిరచనయని ఆయన ప్రకటించిరి[3].

బాల్యమున తల్లి బోధించిన నిఘంటు పాఠము తండ్రిగారి ఆశుకవితా ప్రకటనము పుట్టపర్తికి అవధానములపై ఉత్సాహము కలిగింపచేసెను. చిన్నవయసుననే తెలుగు, సంస్కృత భాషలందు అవధానములు చేసిరి[4]. తిరుపతివేంకటకవుల ప్రభావముచేత నాటికాలములోని నవ్య కవులలో పలువురు మొదటగా ఈ"వేగాతివేగోక్తిని" అవధానాసక్తిని ప్రకటించినవారే. పుట్టపర్తి ఈ విధముగానే మొదటగా అవధాన కవిత్వముపై ఆసక్తిని ప్రకటించెను. తండ్రిగారి వద్ద నేర్చుకొన్న పద్య పఠనము, సంక్రమించిన హావభావ ప్రకటనముతో నాటకములు ప్రదర్శించిరనియు[5], హరికథలు చెప్పిరనియు తెలియుచున్నది[6].

పుట్టపర్తి బాల్యజీవనము పెనుగొండలో గడిచినది. పెనుగొండ కోట శిథిలావశేషములను పరికించినపుడు ఆయనలో కలిగిన ప్రతిస్పందన జాతీయభావ స్ఫోరకముగా "పెనుగొండ లక్ష్మి" కావ్యముగ ప్రకటింపబడినది. తిక్కన భారతము పఠించుటవలన కలిగిన పద్యరచనా సంస్కారము[7], చరిత్ర విషయములయెడనున్న శ్రద్ధ దేశీయోద్యమ ప్రేరణ పెనుగొండ లక్ష్మియందు కన్పించును. పంతొమ్మిదవయేట వెలుగుజూచిన ఈ కావ్యమును గూర్చిన ఆలోచనలు పుట్టపర్తికి బాల్య ప్రాయము నుండి నెలకొని యున్నట్లు కావ్యమునుబట్టి తెలియును.

ఈయన తిరుపతిలో విద్యాభ్యాసము చేయుచున్నపుడు భావకవుల రచనల వలన స్ఫూర్తిని పొందెను. రాయప్రోలు, విశ్వనాథ రచనల మర్మములను మిత్రులకు వ్యాఖ్యానించి చెప్పెననుటలో నవ్య కవిత్వంపై ఆయనకుగల ఆసక్తిని గమనింపవచ్చును[8]. ఈ ప్రభావముతోడనే "షాజీ" కావ్యము రచించెను. ఆ కాలమునాటికి నవ్య కవులకు పారసీ కవులను కవిత్వమును అభిమానించుట, అనువదించుట రచనోత్సాహములలో నొకటిగా నుండెను. షాజీ కవినిగూర్చిన ఆలోచన, కవితారచన పుట్టపర్తి యందిట్టి ప్రభావమును ప్రకటించుచున్నది.

మొదటినుండియు చారిత్రక విషయములపైనున్న అభిమానము, నాటి స్వాతంత్ర్యోద్యమావేశము "సిపాయి పితూరి" కావ్యరచనకు హేతువులైనవి. మీరట్‌నుండి ఢిల్లీవరకు సిపాయిలు అంగ్లేయులనెదిరించి పోరాడిన విధమిందు వర్ణితమైనది. తన ఇరువది రెండవయేట ఈ కావ్యము రచించెనని కవి ప్రకటించెను[9].

తాత్త్వికమైన ఆలోచన పుట్టపర్తికి మొదటినుండియు వెన్నంటియున్నది. “పెనుగొండ లక్ష్మి”లోని మొదటి పద్యము సృష్టినిగూర్చిన జిజ్ఞాసతో ప్రారంభమైనది. సంప్రదాయానుగుణముగ రక్తగతమైన భక్తిభావము, చరిత్రాంశముల యెడనున్న ఆదరము, తనకిష్టమగు తులసీ రామాయణముపైగల గౌరవము “సాక్షాత్కార” కావ్యముగ రూపుకట్టినది. నాటి కవిత్వమున ప్రకటింపబడిన కులపాలికా ప్రణయచ్ఛాయలు కలిగిన ఈ కావ్యము రక్తిభక్తి భావనల సమాహారమని చెప్పవచ్చును.

భక్తి జీవేశ్వరుల మధ్యవారధి. శతకము ఐహిక ఆముష్మిక భావ సమ్మిశ్రితము. భక్తిభావన సుకుమారముగ వెలువరించుట మధురభక్తి లక్షణము. చిన్నతనము నుండి కవి అనుభవించిన కష్టనష్టములు జాతిమర్దశ మొదలగు ఐహిక విషయములు, భగవంతునిపైగల మధురభక్తిభావనలు ‘పాద్యము’ ‘విఘూలి శతకము’ ‘వేదనాశతకము’లుగా ప్రకటింపబడినవి.

యౌవన కాలములో జీవితముపై రోసి కుముద్వతీ ప్రవాహము ప్రక్కన ఆశ్రమము నిర్మించుకొని పుట్టపర్తి జీవించెను. ఆ సమయమున రచించిన “అస్తసామ్రాజ్యము” అను కావ్యము పొంగిన కుముద్వతీ ప్రవాహములోన కొట్టుకు పోయినదని వారి మిత్రులు చెప్పుచున్నారు[10].

1936 తరువాత కవి జీవితమున వచ్చిన మార్పు వివాహము. వివాహానంతరము ప్రొద్దుటూరిలో కొప్పరపు సుబ్బయ్యగారు పుట్టపర్తిని ఆదరించిరి. సుబ్బయ్యగారు మరణించినపుడు ఆవేదనతో ఆ రాత్రి “అశ్రుతర్పణము” అను కావ్యము రచించిరి. ఇది స్మృతి కావ్యము. “బాష్పతర్పణము” అను పేరున పుట్టపర్తి రచనలలోనున్న కావ్యము అశ్రుతర్పణమే కావచ్చును[11]. ఈ కావ్యప్రతి లభింపలేదు.

పుట్టపర్తి భార్య శ్రీమతి కనకమ్మగారు కవయిత్రి, విదుషీమణి. ఈ దంపతులు రచించిన “గాంధీజీ మహాప్రస్థానము” తాత్త్విక స్మృతి కావ్యమై వెలసినది. కనకమ్మగారి కవితావైదుష్యము, నారాయణాచార్యుల తాత్త్వికాలోచనలు, గాంధీజీని అవతారముగా సంభావించిన విధము కావ్యమున ప్రకటింపబడినది. “అగ్నివీణ” అను ఖండకావ్య సంపుటిలో కూడ కనకమ్మగారి రచనలు ప్రకటింపబడినవి. ఈమె సాహిత్యసేవను గుర్తించి, అంతర్జాతీయ మహిళా సంవత్సరోత్సవములను పురస్కరించుకొని ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి 1974గవ సంవత్సర ఉత్తమ కవయిత్రిగ ది. 27-11-1975న సత్కరించినది. కనకమ్మగారి సంస్కృత రచనలెన్నియో అముద్రితముగా నుండి పోయినవి. [12]

కవిగా పుట్టపర్తికి సాహిత్యలోకమున శాశ్వత స్థానమును కల్పించినది "శివతాండవము." "ఏమో ఈ వికటంపు రూపకము" అని ప్రారంభమయిన ప్రాథమిక కవితా రచన వికటరూపక తత్త్వములను ఆవిష్కరించు నటరాజ వర్ణనముతో శివతాండవమున ఒక అన్వయము కుదుర్చుకొన్నది. సంగీతనాట్యశాస్త్రములు కలుపుకొని, మార్గ-దేశి చ్ఛందోరూపములలో రసవాహినిగా రచింపబడినది.

నారాయణాచార్యుల కవితకు ఆవేశము ప్రధానము. ఆవేగము జీవన స్వభావము. అందులకే ఆయన కవిత పద్య, గద్య, వచన, గేయ ఛందములలో వివిధరూపములలో సాగినది. సాహిత్యమున ఛందోవైవిధ్యమువలె జీవనములో సాంప్రదాయ వైవిధ్యమున్నది. వైష్ణవమతమునకు చెందియున్నను, ప్రొద్దుటూరి లోని అగస్త్యేశ్వర దేవాలయమున శివుని గూర్చి తపించినారు. నమకచమకములు ఆయనకు కంఠస్థము. ఆలయ ప్రదక్షిణము చేయుచున్న సమయమున హఠాత్తుగ హృదయమునుండి పైకుబికి వచ్చిన భావాధార శివతాండవమని, తరువాత దానిని పదికొంత మార్పులకుగాని, చేర్పులకుగాని యత్నించిన సఫపడలేదని చెప్పినారు 13 చిన్నతనమున "మహాలక్ష్మమ్మ" అను విద్యాంసురాలివద్ద నాట్య సంగీతములు అభ్యసించిన సంస్కారము, ప్రొద్దుటూరిలోని "పెద్ద జమాలప్ప"గారివద్ద నేర్చిన కర్ణాటక శాస్త్రీయ సంగీతము శివతాండవ రచనలో సంతర్పవించినవి.14

చిన్నతనమునుండి అనుభవించిన దారిద్ర్యము, 1935 తరువాత తెలుగు సాహిత్యమున వచ్చిన అభ్యుదయ కవితా ప్రభావము పుట్టపర్తిలో ప్రగతి భావ కవిత్వమును పలికించినది. మానవుని కనీసావసరములు తీరనిదే మహోన్నత వ్యక్తిగా రూపొందలేడను అభిప్రాయమును ఆయన మార్క్సు రచనల ప్రభావముతో ప్రకటించెను.15 "అగ్నివీణ", "పురోగమనము", "మేఘదూతము"లలో ప్రగతి భావములు సామ్యవాద సిద్ధాంతము ప్రకటింప బడినవి. మేఘదూతములోని చారిత్రక విశేషణముకూడా ఈ మార్గములోనే నడచినది.

ఈ ఉరవడి కూడా పుట్టపర్తిలో చిరకాలము నిలుపలేదు. మహారాష్ట్ర వాఙ్మయ పరిచయము, హిందీ సాహిత్యములోని భక్తిసంప్రదాయము లాయనను అమితముగా ఆకర్షించినవి. తుకారాం మీరా, నామ్‌దేవ్ వంటి భక్తుల జీవిత చరిత్రలను కావ్య వస్తువులుగా "పండరీభాగవతము" అనుపేర బృహత్కథా కావ్యము ద్విపదలలో రచించెను. శ్రీనాధుని, పాల్కురి సోమనాధుని రచనలవలె "పండరీభాగవతము" ద్విపదలలో సాగిన భక్తి భావనా ప్రబంధము.

తులసీరామాయణమువంటి గానానుకూలమైన గ్రంథము తెలుగులో రచింపవలెనని పుట్టపర్తి ఆశయము. కంబ తులసీ రామాయణాది వాల్మీకేతర గ్రంథాంశముల పొందుపరచి విశిష్టముగా షట్పదులలో 'జనప్రియ రామాయణము'' రచించెను. ఇంతవరకు కిష్కింధబాలకాండలు మాత్రము వెలువడినవి. వార్థక్య భారముచే తరువాతి భాగము రచింపలేనని చెప్పిరి.

''శ్రీనివాస ప్రబంధము'' బ్రహ్మాండపురాణమందు చెప్పబడిన వేంకటేశుని కథనాధారముగా ప్రబంధరీతిలో వృత్తములలో రచింపబడినవి. తిరుమల తిరుపతి దేవస్థానము వారు ప్రకటించెడి ''సప్తగిరి'' పత్రికలో ధారావాహికముగా ప్రచురింపబడినది ఈ ప్రబంధ రచన పుట్టపర్తి పాండిత్యమును, భక్తిభావనా కల్పనలను, ఛందస్సుపై వారికిగల అధికారమును ప్రకటించును.

ఇట్లు పుట్టపర్తి సృజనాత్మక సాహిత్యమునంతయు పరిశీలించిన స్వరూపమును బట్టి మార్గ-దేశి కవితా రీతులను వృత్తఛంద జాతిచ్ఛందములను సాధికారముగా పోషించిన విధము కన్పించును. వస్తు విషయమున వైవిధ్యమున్నను పుట్టపర్తి కవితావిహంగమునకు భక్తి, దేశభక్తులే ప్రధానపక్షములు. చరిత్ర భూమికగా దేశభక్తి చిత్రములను, మనోభూమికపై భక్తి చిత్రములను ప్రదర్శించిన పుట్టపర్తి తన సమకాలములో వచ్చిన కవితోద్యమము లన్నింటికిని ప్రతిస్పందించి తనదైన ఒక విశిష్ట మార్గమున సాగిపోయెను. ఆయన సాహిత్య జీవనములోని మరియొక అంశము బహుభాషాపాండిత్యము.

## బహుభాషాపాండిత్యము :

రాజశేఖరకవి కావ్య మీమాంసా గ్రంథమున మహాకవి కన్నను కవిరాజు ఉత్తమ శ్రేణికి చెందిన వాడనియు, అతనికి బహుభాషలు లిపులు, బాగుగా తెలియుననియు, వ్యాఖ్యానించెను. సంస్కృతమున 'సాహిత్య దర్పణము' రచించిన విశ్వనాధ కవిరాజు అష్టాదశ భాషా వారవిలాసినీభుజంగుడనని సగర్వమున చెప్పికొనెను. ప్రపంచములో అనేక భాషలు నేర్చినవారు సర్ జార్జ్ గ్రియర్సన్ మహాశయుడు. స్వాతంత్ర్యోద్యమ కాలమున అనేక భాషలలో విశేష పాండిత్యమున్నవారుండిరి. డాక్టర్ రఘువీర్ రాహుల్ సాంకృత్యాయన్ మొదలగువారు. తెలుగువారిలో లింగం లక్ష్మీజీ పంతులు, వేదం వెంకటాచలమయ్య, బూర్గుల రామకృష్ణారావు, కోట సుందరరామశర్మ, పోతుకూచి సుబ్రమణ్యశాస్త్రి గారలు ముఖ్యులు. పుట్టపర్తి కూడ వీరివలె బహుభాషాకోవిదులు.

" తల్లిదండ్రుల మేధ విద్యానిషద్య
పాండితీ శోభ పదునాల్గుభాషలందు "

అని జనప్రియరామాయణమున కవి ప్రకటించెను. చిన్నతనమునుండి వైవిధ్య పూర్ణమైన జీవితము గడుపుట చేత, భారతదేశమంతటను తిరుగుట చేత, పాశ్చాత్య విదుషీమణుల సహకారము చేత, సహజముగ బహుభాషలు నేర్చుకొనవలెనను జిజ్ఞాస పుట్టపర్తికి బహుభాషాపాండిత్యము కల్గించినవి.

తల్లి చిన్నతనమున గతించుటచే తండ్రిగారి పోషణలో, పెంపకములో సంస్కృతాంధ్రములు అభ్యస్తములైనవి. కర్ణాటక రాష్ట్రంలోని మైసూరునందు మేన మామ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ సాంగత్యముచే కన్నడము, ప్రాకృతము ప్రాకృతభేదములైన అపభ్రంశములయందు పరిచయము పాండిత్యం లభించినవి.16 అనంతకృష్ణశర్మ సాహిత్య ప్రభావము పుట్టపర్తి వచన రచనలందు గమనించ వచ్చును.

కన్నడ భాషయందు పుట్టపర్తికి గల పాండిత్యమును, నన్నయ భట్టు పంపభారతమనువదించిన విధానము వివరించిన వ్యాసమున గమనింపవచ్చును. ప్రాకృతభాషా సారస్వతముల గూర్చి విజ్ఞాన సర్వస్వము ఆరవ సంపుటమునొ రచింపబడిన వ్యాసములు పుట్టపర్తి ప్రాకృత భాషాపాండిత్యమును ప్రకటించుచున్నవి. మరాఠీ భాషలో విశేషముగ కృషిచేసి "తెలుగు వాఙ్మయముపై మహారాష్ట్ర వాఙ్మయ ప్రభావము" అను వ్యాసం రచించెను. ఇది విజ్ఞాన సర్వస్వం మూడవ సంపుటం నందున్నది. మరాఠీ భాషలో ధర్మానందకోశాంబి రచించిన "*భగవాన్ బుద్ధ*" అను బుద్ధ చరిత్రమును, వినాయక సావర్కార్ రచించిన స్వర్ణపత్రములను "*మహారాష్ట్ర జీవన ప్రభావము*" అనునవలను సానే గురూజీ రచించిన "శ్యామని తల్లి" కృష్ణశంకర్‌దేవ్ రచించిన "*చరిత్రలో సమర్థ రామదాసు*" అనేది గ్రంథమును తెలుగులోనికి అనువదించెను. "*భగవాన్ బుద్ధ*" అను గ్రంథమును కేంద్ర సాహిత్య అకాడమీవారు ప్రచురించిరి.

మళయాళ భాషలో పుట్టపర్తి కూలంకష పాండిత్యము సంపాదించెను. తెలుగు నుండి మళయాళ భాషలోనికి విశ్వనాథ సత్యనారాయణ '*ఏకవీర*' నవలను అను వదించెను. వారిని కేరళ సంస్థవారు నిఘంటు నిర్మాణములో తోడ్పడ వలసినదిగా ఆహ్వానించిరి. "*సూరనాడు కుంజన్ పిళ్ళె*" వంటి మహాపండితుల ప్రభావము.

పుట్టపర్తి పైనున్నది. మళయాళము నుండి తెలుగులోనికి పద్య గద్య కావ్యములన నువదించిరి. తీరని బాకి ఏకాంకికలు, కథాగుచ్ఛము, స్మశాన దీపము మొదలగునవి. మళయాళ భాషా సాహిత్య చరిత్రను గూర్చి పుట్టపర్తి రచించిన వ్యాసములు విజ్ఞాన సర్వస్వము ఆరవ సంపుటమున చూడవచ్చును.

హిందీ భాషయనిన పుట్టపర్తి కభిమాన మధికము. అందునా వ్రజ భాష యనినచో అసక్తి మెండు. కృష్ణుడు దర్శనమిచ్చినచో తనతో వ్రజ భాషలో సంభా షింప వరముకోరుదునని ఆయన చెప్పెను.17 తులసీదాసు రచించిన 'రామ చరిత మానస్' గ్రంధమును ఆయన నిరంతరము పఠించుచుండుటయేగాక ఇంటిలోని వారందరి చేత కంఠస్థము చేయించిరి కబీరు వచనావళి హిందీ నుండి తెలుగునకు అనువదించిన గ్రంధమును కేంద్ర సాహిత్య అకాడమి ప్రకటించినది.

పుట్టపర్తి అభిమానించిన వారిలో శ్రీ అరవిందులు ముఖ్యులు. ఆయన ప్రభావము తనజీవితముపై అధికమని పుట్టపర్తి ప్రకటించెను.18 అరవిందా శ్రమములో గ్రీకు, లాటిన్, ఫ్రెంచి, భాషలలో పరిశ్రమచేసినట్లు తెలిపిరి. మెరుపులు తలపులు, గీతోపన్యాసముల పేరున శ్రీ అరవిందుల రచనలను తెలుగునకనువదించెను.

పెనుగొండ సబ్ కలెక్టరుగా పనిచేసిన పిట్ సతీమణి చిన్నతనమున పుట్టపర్తికి ఆంగ్లభాష బోధించెను. 19 "షేక్స్పియర్, మిల్టన్" వంటి ఆంగ్లకవుల సాహిత్య మును పఠించి ఆంగ్లభాషాభివృద్ధి చేసికొనెను.

ఆంగ్లమున లీవ్స్ ఇన్ ది విండ్ (LEAVES IN THE WIND) అనుకవితా సంపుటిని రచించిరి. దీనికి హరీంద్రనాథ్ చటోపాధ్యాయ పీఠికను వ్రాసిరి. భారత కథలోని సుయోధనపాత్ర ఇతివృత్తముగ ఆంగ్లభాషలో "THE HERO" అనునాటకము రచించిరి.

నారాయణాచార్యులు శ్రీవైష్ణవులగుటచేత ద్రవిడ సాహిత్యము సంప్రదాయా నుగుణముగ కంఠస్థమైనది. ప్రాచీన తమిళ భాషనుకూడా నభ్యసించి "శిలప్పది గారము" వంటి గ్రంధముల ప్రాశస్త్యము వివరించుచు వ్యాసములు రచించిరి.

సంస్కృతభాషలో పుట్టపర్తి రచించిన "శివకర్ణామృతము త్యాగరాజ సుప్రభాతము, అగస్తీశ్వర సుప్రభాతము మాల్యాపుర చెన్నకేశవ సుప్రభాతము"

ప్రశస్తములైనవి.గాంధీజీ నిర్యాణానంతరము '"హేగాంధిదేవ శిశిరీకురులోచనంమే' అనెడి మకుటముతో శ్లోకములు రచించిరి. శివతాండవ కావ్యమున నంది నాంది, విజయాప్రార్థనము. సంస్కృత రచనలు. స్రగ్ధరా వృత్తము వీరికి వశమైనది.

చారిత్రకాంశములు ఇతివృత్తముగా గైకొని "అభయప్రదానము" "ప్రతీకారము" "హరిదాసి"వంటి స్వతంత్ర నవలలు రచించిరి. జమ్మలమడక మాధవరామశర్మతో కలిసి 'చారుదత్త' నాటకము సంస్కృతమునుండి తెలుగున కనువదించిరి.

## పరిశోధనలు :

పుట్టపర్తికి చిన్నప్పటినుండియు చరిత్రపై అభిమానము. విజయనగరరాజులకు వారి వంశీయులు పురోహితులుగ నున్నట్లు చెప్పుకొనిరి. ఆ యభిమానముచే 'విజయనగర రాజుల సామాజిక చరిత్ర' అను పరిశోధక గ్రంథము ప్రకటించిరి. భాగవతమును మథించి విమర్శనాత్మకముగ తెలుగున 'మహాభాగవతోపన్యాసములు' అనుగ్రంథమును, మహాభారతమునందలి పాత్రల గుణశీలములు, కథాకథనము విమర్శించుచు "మహాభారతవిమర్శనము" అను గ్రంథమును రచించిరి. ప్రాకృత మళయాళ భాషలపై ప్రామాణిక వ్యాసము ప్రకటించిరి. జైన బౌద్ధ సారస్వతములో విశేషముగ కృషి చేసిరని 'నవ్యాంధ్ర సాహిత్యవీధులు' పేర్కొనినది.20

## వచనరచనలు :

ప్రబంధనాయికలు, రాయలనాటి రసికతా జీవనము రామకృష్ణుని, రచనావైఖరి వ్యాసపంపుటి, విజయతోరణము, విప్లవయోగీశ్వరుడు, విజయాంధ్రులు, సమర్థ రామదాసు, తెనుగువీరులు, ఆంధ్రమహాకవులు. శ్రీసాయిలీలామృతము, నవ్యాంధ్రపై తాళికులు, సరోజినీదేవి, కర్మయోగులు, వ్యాససౌరభము రాయల నీతికథలు, తెనాలి రామకృష్ణులు, నందితిమ్మన, అల్లసాని పెద్దన, వీరసావర్కర్ అరవిందయోగి బాలగంగాధర్ చరిత్ర, వీరేశలింగంపంతులు, వాదవిజయము, రామకథ, వాగ్గేయకారులు, పదసాహిత్యం, మొదలగునవి వారి వ్యాసములలో కొన్నియని షష్టిపూర్తి సన్మాన సంచికయందు సంపాదకులు పేర్కొనిరి.21

ఇంకను వ్యాసములు, పద్యములు, గేయములు అధికముగా నున్నవి. కొన్ని రచనలు ముందు ప్రకటింపబడిన తరువాత పుస్తకరూపమున ముద్రింపబడినవి.

అర్చుద, గుంటూరు శేషేంద్రశర్మ, జానుమద్ది హనుమచ్ఛాస్త్రి వంటి రచయితల పుస్తకములకు పీఠికలు రచించిరి.

## విశేషములు :

ఇట్టి బహుభాషాపాండిత్యముగల పుట్టపర్తి "హృషీకేశ్" వెళ్ళినపుడు శ్రీ శివానంద సరస్వతీ స్వామివారు స్వయముగా పరీక్షించి 'సరస్వతీపుత్ర' బిరుదము ప్రసాదించిరి. శివతాండవ కావ్యమువిని కంచికామకోటి పీఠాధిపతులు సంతసించి సన్మానించిరి. వీరిని భారతప్రభుత్వము పద్మశ్రీ బిరుదుతో సత్కరించెను. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయము "డాక్టర్ ఆఫ్ లిటరేచర్" నిచ్చి గౌరవించెను. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి విశిష్ట సభ్యత్వము నిచ్చి సంభావించెను. జనప్రియ రామాయణమునకు కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారము లభించినది. కడపలో వివేకానంద ఆడిటోరియంలో తేది 6-3-1977 న పుట్టపర్తి షష్టిపూర్తి సన్మానము జరిగినది. ఈ సందర్భమున ప్రముఖుల ఉపన్యాసములతో కూడిన సన్మాన సంచిక "సాహితీ విస్మేరం" ప్రకటింపబడినది. ఇటీవల ప్రభవ ఉగాదికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము విశిష్టవ్యక్తులలో నొకరిగా సన్మానించినది. హైదరాబాద్‌లోని టాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన తెలుగు వైతాళిక శిలాప్రతిమల ఆవిష్కరణోత్సవమున "తిక్కన" ప్రతిమ పుట్టపర్తిచే ఆవిష్కరింపబడెను. ఢిల్లీ దూరదర్శన్ కేంద్రమువారు పుట్టపర్తి జీవితముపై ఒక డాక్యుమెంటరీ రూపకం నిర్మించినారు. శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము "డీలిట్" పట్టముతో సత్కరించినది.

అయిదుగురు కుమార్తెలు ఒక కుమారుడు మనుమలు మనుమరాండ్రు గల పెద్ద కుటుంబము వారిది. శ్రీమతి కనకమ్మగారు అతిథిసభ్యాగతుల నాదరించు ఆదర్శ గృహిణిగ నిలచి నూటఎనమిది పర్యాయములు రామాయణము పారాయణము చేసిన ధన్యజీవి. 1984 లో ఈమె స్వర్గస్థురాలగుట కుటుంబమునకు తీరనిలోటైనది.

భార్యా వియోగముతో తన శేష జీవితమును భగవంతుని కీర్తించుటకై పుట్టపర్తి వినియోగించెను. సంగీతపరమగు కృతులు రచించుచు వాటికి స్వరములు కూర్చుకొనుచు సాహిత్య సంగీత సాధన చేయుచున్న డెబ్బదిఆరు సంవత్సరముల సారస్వతమూర్తి శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులు, ఇటీవలనే కొద్దిపాటి అస్వస్థతకు గురియై ది. 1-9-1990 శనివారం తెల్లవారుఝామున పరమపదించిరి.

భారత సాహిత్యలోకము వారిశేముషీ వైభవమును, సృజన, విమర్శనాత్మక సాహిత్య ప్రదానమును, పత్రికలలో, సమావేశములలో ఆకాశవాణి, దూరదర్శనులలో సంస్మరించి సగౌరవముగా సమ్మానించెను. వారి సృజనాత్మక సాహిత్యములోని ఖండకావ్యములు మాత్రమే ఈ పరిశోధనా వ్యాసమునకు ఎన్నుకొనబడినవి.

పుట్టపర్తి కవితా ప్రపంచము విశ్లేషించు కార్యము క్లేశసాధ్యము. ఆయన రచనలలో రూపవైవిధ్యము, వస్తువైవిధ్యము, భావవైవిధ్యము, స్ఫుటముగా కన్పించును. సమకాలీన ఉద్యమములన్నియు ఆయన రచనలలో అంతయో ఇంతయో ప్రతిఫలించినవి. ఇంతటి విశిష్టమైన ఈకవి కవిత్వమును అంచనా వేయుట ఒకసిద్ధాంత వ్యాస పరిధిలో సాధ్యమైన పనికాదను కొందును. కావున పుట్టపర్తివారి బృహత్కావ్యములు అనగా *" పండరీ భాగవతము "* *" శ్రీనివాస ప్రబంధము "* జనప్రియ రామాయణములను వదలి మిగిలిన కావ్యముల పరిశీలనము ఈ వ్యాసవస్తువుగ స్వీకరింపబడినది. వస్తువును బట్టి ఉద్యమమును బట్టి ఈ కావ్యములు నాలుగు విధములుగ విభజింపబడినవి.

1) జాతీయ భావ కావ్యములు

2) కాల్పనికోద్యమ కావ్యములు

3) భక్తి కావ్యములు

4) ప్రగతి భావ కావ్యములు

శివతాండవము ప్రత్యేకముగ అధ్యయనము చేయదగిన విశిష్ట రచన. ఇది సాహిత్య పరిధినిదాటి సంగీత నాట్యాది శాస్త్రాంశములను తనలో పొదుగుకొన్నది. ఈ ఉద్దేశ్యముచే శివతాండవము పై విభజనకు అతీతముగా విశిష్ట అధ్యయనాంశముగ స్వీకరింపబడినది,

# జ్ఞాపికలు

1) 'తీరుగని నాటి ఆంధ్ర సారస్వతమునకు వసంతోదయమైనది'
కృష్ణశాస్త్రి - ఏకాంతసేవ పీఠిక

2) రేడియోలో పుట్టపర్తి ఇంటర్వ్యూ శీర్షిక - 'వెలుగుబాట'
పరిచయకర్త డా॥ రావూరి భరద్వాజ, ది. 30-1-1986

3) 'తెలుగులో అవు కవిత్వం' సిద్ధాంత వ్యాసము
డా॥ కె. కమలాకుమారి

4) 'బహుముఖ ప్రజ్ఞానిధి డా॥ పుట్టపర్తి' జానుమద్ది హనుమచ్ఛాస్త్రి
ది. 28-6-1987 ఆంధ్రపత్రిక ఆదివారం అనుబంధము

5) పాదుకా పట్టాభిషేకంలో దశరథుడి పాత్ర ధరించి ఎంతటి ప్రేక్షకుడి
నైనా కంటతడి పెట్టించి యుండిరి' —పైడి లక్ష్మయ్య పేజి 380

"జ్ఞాపకాలు-వ్యాపకాలు" తెలుగు విద్యార్థి ప్రచురణ

6) 'తెలుగు హరికథా సర్వస్వము' —తూమాటి దోణప్ప పేజి 434

7) "నాకానాటికి ఛందస్సు కూడా రాదు. తిక్కన భారతము చదువుట
మాత్రము అలవాటు" పుట్టపర్తి 'ముందుమాట' పెనుగొండ లక్ష్మి

8) 'మధుర స్మృతులు' కలచవీడు శ్రీనివాసాచార్యులు
'సాహితీ విస్మేరం' పుట్టపర్తి సన్మాన సంచిక

9) పీఠిక - సిపాయి పితూరి - పుట్టపర్తి

10) "He Lived for some time in an ashram when he was Young boy" పుట్టపర్తి సన్మాన సంచిక

11) 'మహాకవి పుట్టపర్తి' - కె. సుబ్బయ్య
సర్వోదయ పబ్లికేషన్స్, ప్రొద్దుటూరు

12) శ్రీమతి పుట్టపర్తి కనకమ్మ జానుమద్ది హనుమచ్ఛాస్త్రి
'సాహితి విస్మేరం' పుట్టపర్తి సన్మాన సంచిక

13) పీఠిక- శివతాండవము - పుట్టపర్తి

14) ఇంటర్వ్యూ 'సంఘర్షణ' పత్రిక - ప్రొద్దుటూరు

15) 'మహాకవి పుట్టపర్తి' కె. సుబ్బయ్య - పేజి 27

16) "బహు భాషా వైదగ్ధ్యం" - స్వామి శివశంకర శాస్త్రి
"సాహితి విస్మేరం" పుట్టపర్తి సన్మాన సంచిక

17) రేడియోలో పుట్టపర్తి ఇంటర్వ్యూ
పరిచయకర్త డా॥ రావూరి భరద్వాజ దిః 30-1-1986

18) "నేను దర్శించిన పెద్దలు" - పుట్టపర్తి

19) 'శ్రీమతి విట్ దొరసానే నాకు ఇంగ్లీషులో నాలుగు ముక్కలు తెలిసే
టట్లు చేసింది' -పుట్టపర్తి 'నేను దర్శించిన పెద్దలు'

20) 'ఆయన బౌద్ధ వాఙ్మయములో బాగా కృషి చేశాడని వినికిడి'
నవ్యాంధ్ర సాహిత్య వీధులు - తృతీయ భాగము పేజి 493
కురుగంటి సీతారామయ్య - పిల్లలమర్రి వెంకట హనుమంతరావు

21) చూడుడు "సాహితి విస్మేరం" - పుట్టపర్తి అభినందన సంచిక

# జాతీయ భావకావ్యములు

## పెనుగొండ లక్ష్మి

పుట్టపర్తి రచించిన అంద కావ్యములన్నియు చరిత్ర భూమికగా కల్గి జాతీయ భావమునో, భక్తిభావమునో ప్రబోధించునట్టివి. క్షేత్ర మాహాత్మ్యమును వర్ణించినను స్మృతి గీతములు రచించినను, మహాపురుషులను కీర్తించినను, వారి జీవిత చరిత్రములను విశ్లేషించినను కవికి చరిత్రాంశములు ఆధారమయ్యెను.

చారిత్రక సంఘటనల ద్వారా దేశభక్తిని, పౌరాణిక సంఘటనల ద్వారా భక్తిప్రపత్తిని, భావ కవిత్వ ప్రేరణచే ప్రేమ గీతములను, అభ్యుదయ కవిత్వ ప్రభావముచే ప్రగతి భావనలను పుట్టపర్తి ప్రకటించెను.

సౌలభ్యము కొరకు చరిత్రలోని కొన్ని సంఘటనలనాధారముగ వర్ణింపబడిన కావ్యములను చారిత్రక కావ్యములుగ పరిగణింపవచ్చును. అట్టివి పెనుగొండలక్ష్మి సిపాయి పితూరి, గాంధీజీ మహాప్రస్థానము. ఈ కావ్యములు జాతీయ భావమును ప్రబోధించినవి.

చరిత్ర మానవ జీవితమును గూర్చి వివరించును. కావ్యము మానవ జీవితమును వర్ణించును. ఈ రెంటియొక్క సమ్మేళనమే చారిత్రక కావ్యము. దీనినే విమర్శకులు చరిత్రచే ప్రభావితమగుచున్న సాహిత్యము మరల సృష్టించుచున్న చరిత్రమే "చారిత్రక కావ్యము" అనిరి.[1] కాని సృష్టించుట అనుటకంటె వర్ణించుట అనుట మంచిది.

కావ్యమునకు, చరిత్ర కావ్యమునకు స్వల్ప భేదము కలదు. కావ్యమునందు కవికి స్వతంత్రత హెచ్చు. తనకు ఇచ్చవచ్చిన కల్పనలు చేసికొన వచ్చును. చారిత్రక కావ్యమున అట్లు కాదు. సత్యమునకు దూరము కాక చరిత్రకు కావ్యత్వము కల్పింపవలెను. కేవలము సత్యమైన చరిత్ర ఇతివృత్తముగా చేయబడిన రచన మాత్రమే కావ్యస్థితిని పొందదు. రమ్యమైన కాల్పనిక వాతావరణము, అలంకారికమైన శైలి మొదలగు కవిత్వాంశములున్నప్పుడే అది కావ్యమగును. చరిత్రలోని ఏదో ఒక కథ కావ్యముగా మారుటలో కొంత కల్పన తప్పనిసరిగా తోడుపడవలెను. అపుడు చరిత్ర కావ్యము సత్యాసత్యముల కలయిక కలదగుచున్నది. కావున చారిత్రక కావ్యము రచించుట కష్టసాధ్యము. దాదాపు పదిహేడవ శతాబ్దము వరకు వచ్చిన చారిత్రక కావ్యములలో కల్పనలు అధికమై సత్యము మరుగున పడినదని విమర్శకులు చెప్పుచున్నారు.[2]

చరిత్ర చదువుటవలన పాఠకులు పూర్వీకుల జీవన విధానము, సమాజ పరిణామములోని మేలు గీళ్ళు అవగతము చేసుకొని ప్రస్తుత సమాజము ముందుకు సాగిపోవుటకు తగిన ఆలోచనలు చేయుదురు. కాని సాధారణముగ చరిత్ర చదువుట కొందరికి విసుగును కలిగించును. చరిత్రలోని సంఘటనలకు కావ్యత్వము కల్పించి రమ్యముగ చెప్పినచో పాఠకుల హృదయములు రసవంతములగును. రసవంతమైన అనుభూతి హృదయమున గాఢముగా నాటుకొని భవిష్యజ్జీవనమునకు తగిన ఆలోచ నోత్సాహములు కల్గించును. అసత్యముగాని అంశములు కవి ప్రతిభతో మేళవింపబడి సర్వజనాదరణీయముగ రచింపబడవలెను. ఇట్టి రసవంతములగు చారిత్రిక కావ్యములు రచింపబడవలయునన్న కవులకు బలమైన ప్రేరణ యుండవలయును. వ్యక్తిగతమైన ప్రేరణకన్న సామాజికమైన ప్రేరణ,కవి ఎన్నుకొను ఇతివృత్తమును విశ్వజనీనము కావించును. పందొమ్మిదవ శతాబ్దిలోని భారత స్వాతంత్ర్యోద్యమము కవులకు గొప్ప ప్రేరణ కల్గించినది.

స్వాతంత్ర్యోద్యమ కాలములో భారతీయులలో దేశభక్తిని పెంపొందింప జేయుటకు, వారికి ప్రేమ, భక్తి భావనలు ఇనుమడింపజేయుటకు కవులు గత చరిత్ర వైభవమును గానము చేసిరి, పరాక్రమవంతులైన చరిత్ర పురుషుల సాహసగాధలను కావ్యములుగా రచించిరి, చక్రవర్తులు పరిపాలించిన నాటి వైభవమును వేనోళ్ళ కీర్తించిరి. పౌరాణిక ఇతివృత్తముగాగల ఖండ కావ్యములు అధికముగా రచించిరి. జన్మభూమియొక్క గొప్పతనమును వర్ణించి, ఈ భూమిని పరాయిపాలన నుండి విముక్తిచేయుమని కొన్నిచోట్ల వ్యంగ్యముగను కొన్నిచోట్ల సూటిగను ప్రబోధించిరి.

తెలుగులో వచ్చిన నవ్య కవిత్వము పొందిన ప్రేరణలను గూర్చి విమర్శకు లిట్లు వివరించిరి."*తెలుగు భాషలో ఈ ఆధునిక కవిత్వానికి బాహిరమైన ప్రేరణలు రెండు. పాశ్చాత్య సంస్కారము, స్వదేశములో సాగుతున్న స్వాతంత్ర్యోద్యమము. అంతరంగ ప్రేరణలు రెండు. క్షీణప్రబంధయుగంలో శిథిలమైపోయిన తెలుగు కవిత్వానికి క్రొత్త సంవిధానాన్ని, అభివ్యక్తినికూర్చడం, ఎప్పుడో కోల్పోయిన జాతి ఆత్మను అన్వేషించి దర్శించి దాన్ని మళ్ళీ కవిత్వంలో పునఃప్రతిష్ఠించడం.*"3

విమర్శకులు చెప్పిన స్వాతంత్ర్యోద్యమ ప్రేరణలు కలిగిన చారిత్రిక కావ్యములు, క్షీణప్రబంధయుగములో శిథిలమై పోయిన సంవిధానమును తెలుగు కవిత్వమునకు క్రొత్తగా సమకూర్చినవి. జాతిఆత్మను అన్వేషించి దర్శించి కవిత్వంలో

పునఃప్రతిష్ఠించినవి. "ఆంధ్ర ప్రశస్తి, హంపీక్షేత్రము, పెనుగొండ లక్ష్మి, రాణా ప్రతాపసింహ చరిత్ర" మొదలగు చారిత్రకేతివృత్త కావ్యములిట్టివే. తెలుగుభాషకన్న ముందు వంగభాషలో రచింపబడిన బంకించంద్ర చటర్జీ "వందేమాతరగీతము" ఒక మంత్రమువలె నినాదమువలె మాతృదేశ రూపమును కన్నులకు కట్టినట్లు వర్ణించినది. జాతిభౌతిక, మానసిక, ఆధ్యాత్మిక, శక్తులన్నింటికి ప్రేరణగా వందేమాతరగీతము వేదఋషివాక్కువలె విరచింపబడినది. తెలుగుదేశమున చిలకమర్తి రచించిన "భరతఖండంబు చక్కని పాడియావు" అను పద్యమున నాటిదుర్దశ వర్ణింపబడినది. ఈ విధముగ భారతజాతిని జాగృతముచేయుటకు జాతిఆత్మను సాక్షాత్కరింపజేయుటకు కవులు రచనలు చేయసమకట్టిరి.

ఆంధ్రదేశములో స్వాతంత్ర్య గీతికల నాలపించిన కవులు రాయప్రోలు, అబ్బూరి, దువ్వూరి, విశ్వనాధ, బసవరాజు, కొడాలి, గరిమెళ్ళ సత్యనారాయణ, జాషువ మొదలైనవారు. వీరు తమతమ గీతములద్వార, పద్యములద్వార, స్వాతంత్ర్య భావనోద్దీప్తి కల్గించిరి. రాయప్రోలు సుబ్బారావు "ఏదేశమేగినా ఎందుకాలిడినా పొగడరా నీతల్లి భూమిభారతిని" అని భారత జాతీయ భావమును ప్రబోధించెను. దువ్వూరి రామిరెడ్డి "స్వాతంత్ర్యరథము" మొదలగు రచనలలో జాతీయోద్యమ భావములు ప్రకటింపబడినవి. ప్రాచీన చారిత్రక ఔన్నత్యము, వీరుల విక్రమము శిల్పములు మొదలగు వాటిప్రశంస ఈ రచనలయందున్నవి అబ్బూరి రామకృష్ణారావు "పృథ్వీప్రశంస" గేయములో ఈ భూమిని మానవ జీవనమునకు కేంద్రముగా వర్ణించిరి.

1924-25 ప్రాంతములో దామరాజు పుండరీకాక్షుడు జాతీయ భావనతో నాటకములు రచించెను "గాంధీవిజయము" "పాంచాలీ పరాభవము" మొదలగు నాటకములలోని పద్యములు నాటిరాజకీయ పరిస్థితిని ప్రతిబింబింపజేయుటయే గాక తీవ్రమైన ఉద్రేకమును ప్రదర్శించినవి. ఆయన సూటిగా తన భావములనిట్లు వెలడించినాడు.

" కత్తులులేవు హస్తమును గాండివమున్ మొదలేవు శక్తినో
రెత్తి ప్రచండ వాక్పటిమ నేనియు దాటదు వైరిమీద దం
డెత్తగ సేనలేదు బలహీనము కాయము కోపతాపముల్
బొత్తుగసున్న అట్టివరమూర్తి మనోబలశాలి గాంధినే
యెత్తి నమస్కరించి స్మరియించెద మెప్డుస్వరాజ్యసిద్ధికిన్ 4 "

ఆ కాలములోనే గత చరిత్ర వైభవమును గానము చేసిన ఖండకావ్యము హంపీక్షేత్రము. దేశ భక్తిని జాతీయ భావనను గత చరిత్ర వర్ణనము ద్వారా ఈ కావ్యము ప్రబోధించెను.

> నర్తనశాలలో ప్రణయ నాట్యమొనర్చిన భీమ బాహువై
> వర్తన మప్పు కీచకుని వంతితి హాసములోన తెల్లు భూ
> భర్త పసిండి పాలవయి బారిన మ్లేచ్ఛుల కంటి చూపులన్
> వర్తిలుకీచకత్వముల వంతున కొక్కడు లేడె భీముడై 5

మ్లేచ్ఛులు కీచకులు కాగా భారతీయులను ఒక్కొక్కని భీమునిగా తయారు కమ్మని కవి ప్రబోధించెను.

> "స్వాతంత్ర్యలక్ష్మి విశాల సేవలకు జీవితమును నేదీసి పెట్టినాడ
> బ్రహ్మాండ మంత విపత్తు వచ్చిన నోర్తునింపుకేనియు చింతింపదోను
> బరతంత్ర గతినొందు వైభవంబునకన్న స్వాతంత్ర్యమున వచ్చు చావుమేలు[6]"

అనెడి ప్రతాపుని వతిజ్ఞ ద్వారా దేశభక్తిని ప్రబోధించిన *రాణా ప్రతాప సింహ చరిత్ర* స్వాతంత్ర్యోద్యమ కాలములోనే రచింపబడిన చారిత్రకేతి వృత్తము గల మహా కావ్యము. ఇది అస్వతంత్ర జాతికి స్మృతి గ్రంథము వంటిదని పేర్కొనిరి[7].

ఇంచుమించు ఇదే కాలమున రచింపబడినది పుట్టపర్తి నారాయణాచార్యుల '*పెనుగొండ లక్ష్మి*' పెనుగొండ ప్రాంతమున గల శిథిలావశేషములను దర్శించుట వలన కలిగిన అనుభూతి ఈ కావ్యమున జాతీయ భావ స్ఫోరకముగ ప్రబోధించ-బడినది.

ఈ కావ్య రచనా కాలము గూర్చి భిన్నాభిప్రాయములు గలవు. కవి తన పన్నెండవ ఏట ఈ కావ్యము రచించినట్లు పీఠికలో తెలిపియున్నాడు, అతని మిత్రులు పదునాలుగవ సంవత్సరమున వ్రాసినాడనియు పంథొమ్మిదవ సంవత్సర-మున ప్రకటింపబడినదనియు తెల్పిరి.[8] ఈ విభిన్నాభిప్రాయములనిట్లు సమన్వయించు కొనవచ్చును. బాల్య జీవితమున పెనుగొండను గూర్చి ప్రగాఢమైన ప్రభావము పొందిన కవి తన చిననాటినుండి అప్పుడప్పుడు రచించిన ఖండికలు ఒక పుస్తక రూపమును పొందువరకు కొంత సమయము పట్టియుండవచ్చును. దేశబంధు, ముద్రాక్షరశాలలో 'పెనుగొండలక్ష్మి' మొదటిసారిగా పంథొమ్మిది వందల ముప్పది అయిదులో (1935) ముద్రింపబడినదని తెలియుచున్నది.[9] దీనిని బట్టి హంపీక్షేత్రము

తరువాత పెనుగొండలక్ష్మి వెలుగు చూచినదనియు, రాణా ప్రతాప సింహ చరిత్ర రచనాకాలము నాటిదనియు స్పష్టమగుచున్నది.

ఈ ఖండ కావ్యములో పన్నెండు ఖండికలు కలవు. అవి వరుసగా 1) ముదల 2) ఊరడింపు 3) కోట 4) రణభూములు 5) రాజవీధి 6) రామ బురుజులు 7) దేవాలయము 8) శిల్పము 9) బాబయ్య గోరి 10) గగనమహలు 11) కడచూపు 12) తెలుగు రాయడు.

ఈ ఖండికలలో కవి పెనుగొండకు సంబంధించిన చరిత్రాంశముల వివరణ కన్నను నాటి దుస్థితిని గూర్చిన వర్ణనము ద్వారా జాతీయ సంపదను తిరిగి కాపాడుకొనవలెనను ప్రబోధమును కల్గించెను. హైందవజాతికి వెన్నుబలములైన మూల్యములను వివరించి జాతి చైతన్యమును జాగృతము చేయుట ఈ ఖండ కావ్య తాత్పర్యముగా కన్పించును.

'మునుల తేజో బలంబున వేదమంత్రముల్
జ్వాలనోపమంబులై వెలయు వఱకు
దాతలనాటి యుత్తమ తత్త్వ సంపత్తి
సుంతైన నెడబాయ నంతవఱకు
మా తల్లి పూర్వుల మహిమ బాటలు గాగ
సల్లి, యుయ్యాలూచు నంతవఱకు
తలగోసి యిచ్చు స్వార్థ త్యాగ రోచిస్సు
మాతోడు నీడయై మలయు వఱకు
నీ జగములన్ని యొక్కటై యోజగూడి
యెత్తి వచ్చిన గాని మాయింప లేవు
భావనాకాశ పంచ రత్నబలరుక్స
హస్ర హైందవ సూర్య కరస్రవంతి'

ఈ పద్యము దేవాలయమను ఖండికలోనున్నది. భారతజాతి ధర్మసౌధమునకు మూలము దైవీ భావన. దైవీభావనకు కేంద్రము దేవాలయము. ఈ దేవాలయములు శిథిలమగుటకు కారణములు వైదేశిక అధర్మశక్తులని కవి పరోక్షముగ తెలుపుచున్నాడు. తాత్కాలికముగ అస్వతంత్రత అను చీకటి జాతిని ఆవరించినను అది శాశ్వతము కాదని, తరతరములుగా జాతి వెన్ను బలములుగా వచ్చిన మానవతా మూల్య

ములున్నంతవరకు జాతికి పతనము లేదని భవిష్యత్తుపై అకుంఠిత విశ్వాసమును కవి ప్రకటించెను. ఈ విషయమును శ్రీ అరవింద యోగి ఇట్లు చెప్పిరి.

' మహా పురుషుల తపస్సు, స్వార్థ త్యాగుల
కష్ట స్వీకారము, సాహస వంతుల ఆత్మ
విసర్జనము, యోగుల యోగశక్తి, జ్ఞానుల
జ్ఞాన సంచారము, సాధువుల విశుద్ధి '

ఇవన్నియు ఆధ్యాత్మిక బలమునకు జన్మస్థానములు. ఒకమారు ఈ సకల విధమైన పుణ్యము భారతమును సంజీవనీ సుధయందు ముంచి యెత్తి మృతజాతిని సజీవముగను తేజోవంతముగను చేసి ఉద్ధరించును.10

ఈ విశ్వాసము కవికి ఆత్మనంటి యుండుటవలన,

' కాలమను హంతకారి కుస్తీలయందు
చీల్చివైచెను మనసుధా జీవనంబు' (రాజవీధి-9)

అని వాపోయి గత చరిత్ర స్మరణము చేత, స్వస్తుతి చేత నూతనోత్తేజము పొంది 'హైందవ సూర్యకర స్రవంతి' అనాచ్ఛాదితము అవిచ్ఛిన్నము అని చాటినాడు.

కావ్యారంభమున జాతిని గూర్చి జాతి పోగొట్టుకొన్న సంపదల గూర్చి నిర్వీర్యమైన ఆంధ్ర శక్తిని గూర్చి ఆవేదన ప్రకటింపబడినది.

తమ ముల్లాళ్లక్కలు జాను జీవిత ప్రబంధం బందు నొక్కప్పుడే
ని మనోజ్ఞంబులు పండు వెన్నెలలు లేనే లేవు ......... .. ...
. ... ... ...... .... .... ....... ... ..................
రుజా
భయమనుత్సాహము శుష్క జీవితము లజ్జా ఏమి సాధింతుమే
(ఉరవడింపు-8)

ఉలి చేరాలకు చక్కిలింతలిడు శిల్పులు, గండ పెండేరములు తొడిగించుకున్న కవులు కన్నడ రాజ్య వైభవశ్రీలు. కాలగర్భమున కలసిపోగా నిశ్శబ్దము పాడుపడిన కోట గోడలలో తాండవించుచున్నదని కవి ఆవేదన పొందెను. పుడమియందు సుఖ దుఃఖములు 'నిత్య సంభూతి'గా భావించి ఆవేదనను అభిగమించి గత వైభవమును స్మరించెను.

గత వైభవ స్మరణముతో దర్శించిన ప్రతి వస్తువు వీరోచితముగ నాటి జాతి పౌరుష ప్రతాపములకు దీటుగ దర్శనమిచ్చినది. కోటను జూచి కవి

అదిమా కోట విపక్షవక్ష హృదయోద్యద్భక్తి భారౌఘముల్
పది వేల్నారులు చవ్వరించి దిశలెల్లన్ దద్దరిల్లంగ బే
రెవ గాండ్రించిన యట్టి క్రోఢపులి నేడీరీతి వాపోవుచు
న్నది దుర్దాంత జరాభరక్రమ విభిన్నాంగంబులన్ సోదరా!

(కోట-1)

కోటను క్రోలుపులిగా వర్ణించి, నేడది జరాభరము చేత వాపోవుచున్నదని చెప్పుటలో నాటి ఆంధ్ర పౌరుషము నేడు పరదాస్యము వలన కృంగిపోవుచున్నదను విషయము కూడా ధ్వనించుచున్నది.

చరిత్రలో భర్తలకు శౌర్యస్ఫూర్తి కల్గించి, వారిని సమరోన్ముఖులుగా జేసిన వీర నారీమణులు వర్ణింపబడిరి. స్త్రీలకు కూడా స్వాతంత్ర్య భావన కలిగించుటకీ వర్ణన చేయబడినది. స్వాతంత్ర్య సమరములో పాల్గొను పురుషులకు స్త్రీల నుండి ప్రోత్సాహము కలుగవలెనను ప్రబోధము ఇట్లు ధ్వనించుచున్నది.

........................ .......... ప్రేమ మాధుర్యసం
భరితాలౌ కడగంటి చూపులు విజ ప్రాణేశు పైనంబుకై
తిరమౌ నవ్వుల వెన్నెలల్జానిపి పాథేయంబుగా నిచ్చి చె
చ్చెర రండంచును బల్కు నాంధ్ర రమణీశ్రీ నెంతున క్రాంతమున్

(రాజవీధి-10)

గగన మహలు అను శీర్షికలో నాటి సౌధమును రాజ్యలక్ష్మిగను కవికుమారిగ తత్వార్థదాయిగ సంభావించుటచే విజయనగర సామ్రాజ్య స్వర్ణయుగము ధ్వనింపబడెను. ఇట్టి ఉన్నతోన్నత స్థితికి కారణము "*అంధ్రోర్వీగత*" స్వాభిమానమని "*దయాశాంతులని*" కవి ప్రజలకు జ్ఞాపకము చేసెను. క్రమముగ దయాశాంతులు హృదయముల నుండి తొలగిపోయి, స్వాభిమానము పరస్పరాహంకారము వలన దురభిమానమై

మనసిపు పాము కాటు వలె మత్సరమాత్మను చీల్చివైచికై
వన మొనర్చుకొన్న గరుపమ్మున నన్నలు దమ్ములెల్ల వై
క్కసమున మొత్తులాడిరట . .. . ......... ... ...... . ...

(రణభూములు-11)

గరువంతో కల్గిన అనైక్యత వలన వైదేశికుల పాలన స్వదేశములో నిలదొక్కు-కొనుటకు కారణమైనది.

ఒకానొక కాలములో భారతదేశమున మాణిక్య సంపద 'రాసులు పోసి వీధు-లను దివారాత్రములు' అమ్మినారని ఈ విచిత్రతను కనుగొని పాశ్చాత్యులు భూత భవిష్యత్కాలములో ఇట్టిది అపూర్వమని 'ఈర్ష్యాగ్రహ బుద్ధులై' దేశ సంపదను తరలించుటకు వ్యాపార నిమిత్తముగా ప్రవేశించి క్రమక్రమముగ దేశమునాక్రమించి ప్రజలను బానిసలుగ చేసికొన్నారని అస్వతంత్రత ఏర్పడుటకు గల కారణములు వివరింపబడినవి. ఆవేదనతో ధరిత్రీ మాతను "ఆంధ్రుల రక్తనాళముల జిల్కం రాదె తేజంబులన్" అని కవి అర్థించుట వినిపించును.

శిథిలమైన కోటగోడలు, వాటిలోతలదాచుకొను ఘోర ఘూకాలు, గబ్బిలములు అస్వతంత్ర సమాజములోని పాలితులు పాలకుల ప్రతీకలుగ వర్ణింపబడినవి.

తలలన్ వ్రాలిచి దీర్ఘకాలముగ నిద్రల్పోవునీ కోట గో
డలలో దాగిలి మాతలాడుకొనుచుండన్ ఘోర ఘూకాలు గ
బ్బిలములుచ్చల గొల్లుదీరగను.................................. .......

(ఊరడింపు-4)

తలలు వంచి దీర్ఘకాలముగ కోటగోడలు నిద్రపోవుచున్నవని చెప్పుటలో తురుష్క, ఫ్రెంచి, డచ్చి, పోర్చుగీసు, ఆంగ్లేయజాతుల దాడులవలన స్వశక్తిని కోల్పోయి బానిస తనమునకు అలవాటుపడి తలలు వంచుకొనిన భారత జాతి ధ్వనింపబడు చున్నది. ఈ విధముగ తలలు వాల్చి నిదురబోవుచుండిన కోట గోడలలో కొలువు చేయుచుండిన వైదేశిక ప్రభుత గుడ్లగూబలుగ గబ్బిలములుగ చెప్పబడినవి. అందులకే కవి ఇంతకాలము నిద్రబోవు ఈ జాతి "రక్తంబందు మాహాత్మ్యముల్" లేవా అని ప్రశ్నించినాడు.

ఈ విధముగ మొదట ఆంధ్రజాతి పతనావస్థను చెప్పి తరువాత భారతజాతి పతనావస్థను ప్రతీకాత్మకముగ వర్ణించుటలో ప్రాంతీయాభిమానముదాటి కవిజాతీయాభిమానిగా ఎదిగి వచ్చుట కన్పించుచున్నది. పుడమియందు సుఖ-దుఃఖ సంఘాతి నిత్యమని భావించి భవిష్యదాశాకిరణముల సూహించి నిద్రాణమై యున్న జాతికి ఉజ్వల భవితవ్యమున్నదను ఆశంస కవి అలంకారికముగ ప్రకటించెను.

అమితౌద్ధత్యముతోడ గూలంకషణంబై పారు కాలప్రవా
హము, ప్రావృష్ఘన మేఘజాలము తిరంబా? యింకరావాశర
త్సమయంబుల్ మృదురీతిబల్కఁగవిహంసల్ బుట్టరాలోకమాం
ద్యమునిద్రింపద? పిచ్చితల్లి, ఇటులేలా? సంకుచద్భావముల్?

(ఊరడింపు-13)

ఈ పద్యమున "పిచ్చి తల్లి" అని ప్రకటింపబడిన ఊరడింపు పెనుగొండ లక్ష్మికి ప్రతీకగానే గాక భారత మాతననియే చెప్పవలెను. ఇందు వర్ణింపబడిన శరదాగమనము భారతజాతి స్వాతంత్ర్య జైత్రయాత్ర సిద్ధించెడి అనుకూల సమయము. వీరరసోద్దీపకము. అందువలన దేశమున తాత్కాలికముగా ఆచ్ఛాదింపబడిన అస్వంతంత్రత యను "ప్రావృడ్ఘన మేఘజాలము" స్థిరముకాదని చెప్పబడినది. మృదు రీతి బల్కు కవి హంసలు బుట్టి జాతిని జాగృతము చేయుదురని సోమరితనము నశించి పోవునని భవిష్యత్ విజయావకాశములు ప్రకటింపబడినవి. అందులకే ఖండికల చివర తెలుగు రాజైన శ్రీకృష్ణదేవరాయలను ఆదర్శముగా నిలిపి ఖండకావ్యము పూర్తియైనది.

ఈ విధముగ ఈ ఖండికలలో చారిత్రకాంశములను ఊతగా గొని ఆంధ్రాభిమానముతో పాటు జాతీయాభిమానమును ప్రకటించి ప్రతీకాత్మకముగా ఆలంకారికముగా గతవైభవమును స్మరించుటయేగాక స్వాతంత్ర్య సమరోన్ముఖుల మైనచో తప్పక విజయము సిద్ధించునను ప్రబోధముచేయబడినది.

TIRUPATI

# సిపాయిపితూరి

1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు భారతదేశ చరిత్రలో ప్రథమ స్వాతంత్ర్యోద్యమము. ఈ ఉద్యమ సన్నివేశమే ఈ కావ్యేతివృత్తము.

ఏ దేశమందైనను ఏ జాతియందైనను అవిచ్ఛిన్నముగా సాగివచ్చు నాగరికత ఆయా ప్రజల జీవన విధానములను సాంఘిక రాజకీయ ఆర్థిక పరిణామములనంటిపెట్టు కొనియుండును. జీవన విధానములో సాంఘిక రాజకీయ విధానములలోని మార్పుల వలన పెద్దయెత్తున పరిణామము సంభవింపదు. సమాజ సంక్షేమమునకు విరుద్ధమైన ఆర్థిక అసమానత, మనసు ప్రగాఢముగా విశ్వసించిన మతధర్మమునకు విరసన జరిగినపుడు జాతి యావత్తు జాగృతమై పునరాలోచనము పొంది పునఃసృష్టికొరకై పరితపించి పురోగమించును. ఈ విధమైన తీవ్ర పరిణామమే 1857లో జరిగిన ప్రథమ భారత స్వాతంత్ర్యోద్యమము. ఈ ఉద్యమ సారథులైన సిపాయిలు బ్రిటిష్‌పాలకుల నెదిరించి స్వాతంత్ర్యేచ్ఛను ప్రకటించిరి. ఇది బ్రిటిష్‌వారి చరిత్రలో తిరుగుబాటుగా (Mutniy) గా వ్యవహృతమైనది. 11

ఇది కేవలము ఒక్క సైనికులయందు కల్గిన జాగృతమేకాగు. నాటికి సామ్రాజ్య వశిష్టులైన ప్రభువులయందు జమీందారులయందు, మతాధికారులయందు పౌరులయందు ఆంగ్లేయుల పరిపాలనపెడల విముఖత అధికమై యుండినది. 12 సర్వే సర్వత్ర వ్యాప్తమైన ఈ విరసన భావమునకు కారణము కావ్యమునందిట్లు వర్ణితమైనది.

సంపదలెత్తినారు నవజాతుల రత్నములెత్తినారు నై
లింభ విభూతి శోభిలు ధరిత్రిని పీడుగ నెత్తినారు నె
య్యంపు పచస్సులాడి భరతావని దాస్యము విత్తినారు పై
ముంపగ బూనినారు మతమున్ మనపాలిటి భాగ్యశేషమున్

(సిపాయి పితూరి_28)

మన పాలిటి భాగ్యశేషమైన మతమునందు వారి ప్రవేశము అత్యంత తిరస్కార హేతువైనది. దేశములో తలయెత్తిన ఈ తిరస్కారము తొలుత సిపాయిలు ఎదిరించుటతో ప్రత్యక్ష దశకు చేరినది. దాదాపు దేశములోని అన్ని రాష్ట్రములలోని

సైనికులు ఒకేసారి ప్రభుత్వమునకు ఎదురుతిరిగిరి. మీరట్‌నందు బ్రిటిష్ పాలకుల నెదిరించి ఢిల్లీ కోట వరకు రణము సల్పిన సిపాయిల వీరవిక్రమము ఈ కావ్యము నందు వర్ణింపబడినది.

మీరట్ ప్రదేశమున సైనికులు సమావేశమై తమ కష్టనష్టములు చర్చించు కొని సమైక్యముగ పోరాడుటకు ఉద్యమించిరి. హిందూ-ముస్లిమ్ అనుభేదము మరచి శత్రుత్వములు మరచి ఐక్యమై కార్యసాధనకు పూనుకొనిరి. ఈ సన్ని వేశముతో కావ్యమారంభమైనది.

మీరటునందు శీతల సమేదితమౌ నొక చెట్టు నీడలో
జేరిరి విప్లవ జ్వలిత చిత్తులు గత్తులనూది కూరుచు
న్నారల వక్ర శౌర్య పరిబద్ధులు(బింగళనేతృ)డడ్డినన్
బారికి నిల్చి భాగ్యరమ బట్టెద మంచను నట్టి గన్నులన్
(సిపాయి పితూరి-7)

1957 మార్చి ఇరువది తొమ్మిదవనాడు మంగల్‌సింగ్ అను సిపాయి కలకత్తాకు పదహారు కిలోమీటర్ల దూరమునందు సైనిక వ్యూహము నతిక్రమించి మత సంరక్షణార్థమై ఎదురుతిరిగి పోరాడవలసినదిగా తన సహచరులను హెచ్చరించెను[13] చరిత్రలోని ఈ సైనికుని చర్య కావ్యమునందు వర్ణింపబడినది. మీరట్‌నందు సమావేశమైన సైనికులలో నొక్కడులేచి వారలనుద్దేశించి ప్రసంగించెను.

అందరిలోన నొక్కడు సమున్నత వక్షుడు శౌర్యవహ్నిని
ష్యంది విలోచనుండు రభసంబుగలేచి కరంబు వీచిసం
క్రందన సూతినీతి నిటుగా బలికెన్ జిటి తమ్ములార భా
గ్యేందిర గాంచియున్నది సమీరిత సంగర రంగమందునన్
(సిపాయి పితూరి-8)

నాటి సైనికుల తిరుగుబాటునకు కారణములు రెండు. ఒకటి సైన్యములో అధికార భేదము. రెండవది మతసంబంధమైన ఉద్రిక్తత.

దేశీయ సైన్యముతోనే ఈ దేశములోని రాజ్యములు బ్రిటీష్‌వారు జయించిరి. నామ మాత్రముగనున్న విదేశీ సైన్యములకు అధిక వేతనములు-సౌకర్యములుండినవి. స్వదేశీ సైన్యమునకగు ఖర్చునకన్న విదేశీ సైన్యమునకు పెట్టెడి ఖర్చు మూడువంతులు ఎక్కువ. ఎంతటి ధైర్యసాహసములు ప్రదర్శించినను వారు విదేశీ సైనికుల క్రిందనే

పని చేయవలసి వచ్చినది మీదు మిక్కిలి గుర్తింపు కూడ నుండెడిది కాదు. కుటుంబ పోషణకై సైనికి వృత్తి చేపట్టిన సిపాయిలకు చాలీచాలని జీతములతో అసౌకర్యములతో అతికష్టమైన జీవితమును గడుపవలసి వచ్చెను. ఈ విషయమును కావ్యమిట్లు వర్ణించినది.

వేలకు వేలు జీతాలు వారికి నెంత
 వడి నోరుదెరచిన బదులు మనకు
'దర్జా' దొలంకు సౌధాలు వారలకుజీ
 కటి పుట్టసై నట్టి కుటులు మనకు
కొత్త కొత్తని సీటుగుడ్డలు దొరలక
 క్కరరాని ప్రాత చింపిరులు మనకు
వివిధంబులయి నట్టి విందు లవ్వారికి
 గొంతులో దిగగట్టి కూడు మనకు

త్రాగి తొంటట వారి విత్యనెథి-మనకు
గోరి కొన్నను మజ్జిగ నీరులేదు
స్వర్గమునుండి దిగ్గిన దేవతల వారు
బ్రతుకిరానట్టి పశువుల పడుపు మనము
(సిపాయిపితూ.-13)

ఈ విధముగ హేయమగు జీవితము గడుపు సైనికులకు బ్రిటిష్-పక్షపల్యాధికారులు, నాయకులుగానున్న విదేశి సైనికులు నీచమైన పదజాలముతో ప్రవర్తనతో అవమానించెడి వారు. ఇది సైనికుల ఆత్మాభిమానమునకు సహింపరాని విషయమయ్యెను.

"గౌరవముదక్కి నశించుచుండేనా ధరనొక వీరజాతి" అని ఆత్మగౌరవము భిన్నపరచు తంపెనివారిపై కష్ట మొదవైనది. మరియు తమ సహాయముచేతనే జయించిన రాష్ట్రమునుండి ఆంగ్లేయులు తమదేశమునకు సంపదలు తరలించుటగూడ సిపాయిల దృష్టికి వచ్చినది

" భవ్యమైనట్టి దేశ సౌభాగ్యలక్ష్మి
పోయినది- పోవుచున్నదిప్పుడనుదాటి "

వ్యాపారమను పేరున "నాల్గు వ్యాపారములు" దాటి వచ్చిన "అత్యంతభారతిలైన" లాంగ్లేయుల ఈ ఆత్యాశను గమనించి

" సంపదలదోచి వేరుదేశమునకెచటి
కెత్తిపోదురు యెటుల జీవింప నేర్తురు.

అని గర్జించినారు. మరియు అసైనికుల కూటమిలోనికి కొందరు మతకర్తలు ప్రవేశించి దేశపరిస్థితి వివరించిరని చరిత్రవలన తెలియుచున్నది.

"స్త్రీలను మానభంగముచేయుట, దేవాలయములు మసీదులను నాశనముచేయుట హైందవ సంప్రదాయములైన దత్తస్వీకారము సహగమనము ఇత్యాది విషయములలో జోక్యము కలుగజేసికోవడము, దేవాలయములకు దానధర్మ సంస్థలకు ఇచ్చిన మడి మాన్యములు లాగుకోవడము, అన్నింటికంటె ముఖ్యంగా భారతీయ పూజావిధాన సంప్రదాయములను భ్రష్టపరచడమూ_14" మొదలగు అంశములు సైనికుల దృష్టికి వచ్చినవి దానితోవారికి భారత సంపదలపైననేగాక ఆంగ్లేయులు సంస్కృతి సభ్యతల పైనను దాడిచేయుచున్నారని అవగతమైనది. సంపదను సంస్కృతిని కోల్పోవుచున్న భారతభూమి ఇట్లు వర్ణింపబడినది.

" పాడి పంటలతోగూడ పసుపుకుంకు
మల(బ)కాశించు(బతి పత్ని భూమినాడు
పాడిపంటలు దిగబడి పసుపుకుంకు
మలనుదుడిచిన విగత మాంగళికనేడు"

(సిపాయిపితూరి_19)

ఈవిధమగు దేశ చిత్రణము సైనికుల హృదయమున హత్తుకొన్నది. సంపూర్ణముగా ఆక్రమించుచున్నారని శాశ్వతముగా దేశమును తమ ఆధీనములోనికి తెచ్చుకొనుటకు క్రైస్తవ మిషనరీలను పురికొల్పి దేశమున క్రీస్తు మతమును వ్యాపింపజేసి మత మార్పిడి చేయుచున్నారని అర్థముచేసికొనిరి. తమనుగూడ మతము మార్చుకొమ్మందు రేమోయను ఆశంక వారిలో బయలుదేరెను. అవమానములు, ఆర్థిక అసమానతలు, మతాంతరీకరణలు_వీటితో కుతకుతలాడుచున్న సైనికులకు తూటాప్రయోగము అగ్నికి ఆజ్యము పోసినట్లయింది.

గర్భదారిద్ర్యముచే బాధపడుతున్నపుడు దొరలయుప్పు తిన్నందుకు వారికి విధేయులమైయుంటిమనీ_"శాంతి దీపంబు" వంటి మనలనార్పి "దుర్గాతి దొరలు" ధర్మసేతువుగూల్ప సిద్ధపడువంకు' వచ్చిరని అది సహింపలేమనిరి. సైన్యములో

అధికముగ బ్రాహ్మణులు కొంతతక్కువగా మహమ్మదీయులు చేరియుండిరి. సైనికులు యుద్ధమున ఉపయోగించు తూటాలు పందిక్రొవ్వులోను, ఆవుక్రొవ్వులోను పూయబడి యుండును తూటాలను ప్రయోగించునపుడు వాటిని నోటితో కొరుకవలసియుండును. హిందువులకు పరమ పవిత్రమైనది గోవు. ధర్మమును గోవుగా భావించెడి సంప్రదాయము వారిది.

ఏతరిగాని హైందవుడొకింతయు భేదమునెన్నబోడుగో
మాతకు మాతకున్ననదు మానస మందున నట్టిచోటదు
ర్జాతులు గోవులన్నలిమి చంపుటెగాక తదీయరక్తపుం
బూతల తోడ గుండ్లగమి ముట్టుకొనుండనిపల్కు బాడియే

(సిపాయిపితూరి-66)

మరియు అతిధికి, ధేనువునకు ఆవంతయైన భేదమెన్నని హైందవులకు గోవుక్రొవ్వులో పూయబడిన తూటాలు కొరుకుట అపచారమయ్యెను. మహమ్మదీయులు పంది మాంసము ముట్టరు. వారికి పంది క్రొవ్వుతో తయారు చేయబడిన తూటాలు కొరుకుట అసహ్యము. ఈ విధముగ హిందూ-ముస్లిమ్ సిపాయిలకు జరిగిన అవమానము వారి ఐక్యత కారణమయ్యెను.

ఎన్నిదినముల్ ముస్లిముల్ హిందువులను
పులులు మేకల విధమున బొసగలేరొ
అంతవరకును దొరల భాగ్యాక్షరములు
మాసిపోబోవు బ్రతుకులు మనకు లెవు

(సిపాయిపితూరి-74)

అను సత్యము వారు గ్రహించిరి. మనమందరము భారతీయులమను జాతీయభావనము వారిలో అంకురించెను.

భారతీయులిందరము హేమారవింద
శతపములిగురించు దివ్యదేశంబు మనది- (74)

మరియు వారి కండ్లముందు ఒంటరిగా తిరగబడిన సైనికులిదొరలు కాల్చివేయుట కూడ వారి కండ్లు తెరిపించినవి. చరిత్రలో *"ఇనాం కమీషన్ వారి చర్యలకు కారణంగా అలజడికి లోనైయున్న కర్ గుండసర్దారు సాయుధుబై ఎదురుతిరిగి*

బ్రిటిష్‌వారి క్రోధ క్రౌర్యములకు బలియైనాడు." అని వ్రాయబడియున్నది. కావ్యమున ఈ సంఘటన ఇట్లు చెప్పబడినది.

మొన్నజూచితిరేకదా ముక్కుపచ్చ
లారనట్టి చిన్న సిపాయి నరిమిజూచి
కాల్చెమనకండ్ల ఎదుటనే కటికదొరమ
హాపరాధంబు ధిక్కారమనుచు జాటి

[సిపాయిపితూరి-17]

ఇట్టి అమానుష చర్యలను సహింపలేక వారందరు ఢిల్లీలో పేరుకు చక్రవర్తిగానున్న బహదూర్‌షాను తిరిగి చక్రవర్తి చేయవలెనని సంకల్పించిరి. బహదూర్‌షా పరిపాలనలో మరల "భారతమందున శాంతిదీపముల్" వెలుగునని నిశ్చయించిరి మీరట్‌నందలి కంటోన్‌మెంటును ఛేదిరించి ఢిల్లీకి ప్రయాణమైరి. కాని ఈవిషయము తెలిసిన తెల్లదొరలు తమసైన్యములు ఎదురునడిపి పాదుషాకు సహాయము లేకుండ చేసిరి.

బహదూర్‌షాకు అప్పటికి ఎనుబది సంవత్సరముల ప్రాయము. ఆయన తన క్రిందనున్న సైన్యములకు నాయకత్వము వహించి ఆంగ్లేయుల నెదిరించెను. మూడు నెలలు పోరాటము జరిగినది. భారత వీరులు ధైర్యసాహసములతో పోరాడిరి కాని ఆంగ్లేయులు పంజాబునుండి రప్పించిన సైనిక బలమును, గూర్ఖా సైన్యమును ఎదిరించలేకపోయిరి. అసమాన పరాక్రమము ప్రదర్శించి యుద్ధరంగమున కొందరు మరణించిరి. పట్టుబడిన వారు ప్రభుత్వ కఠినశిక్షలకు బలియైరి. ఆంగ్లేయులు బహదూరుషాను బందీగా పట్టుకొని ప్రవాసము పంపించిరి.

సిపాయిల ఈ స్వతంత్ర పోరాటము హిందూ ముస్లిమ్ ఐక్యతకు జాతీయ భావనకు ప్రేరణమై, జాతియంతయు చైతన్యవంతమై కదలి సమైక్యముగ పోరాటము సాగించి స్వతంత్రదేశమును పొందగలిగినది. ఇట్టికావ్యము ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామమును వర్ణించి జాతీయ భావమును ప్రకటించినది.

# గాంధీజీ మహాప్రస్థానము

జాతీయ భావ ప్రేరణచే రచింపబడిన స్మృతి కవిత్వమునందు దేశనాయక స్మృతి గీతములు కూడ నొకభాగము. మన దేశమును పరిపాలించి, మహోన్నతస్థితిని కలిగించిన మహా పురుషుల చరిత్రలను కావ్యములుగ రచించి జాతీయ భావప్రేరణ కల్గించినట్లు నాయక స్మృతి గీతములు కూడా వారి జీవితమందలి ఉత్తమ సన్నివేశములను వర్ణించి యువతరమునకు స్ఫూర్తి నందించును. సామూహికముగా వీటిని చారిత్రక కావ్యములుగనే పరిగణించవచ్చును.

నవ్య సాహిత్యమున పుత్ర, మిత్ర, కళత్ర, నిర్యాణము కారణముగా అనేక స్మృతి కావ్యములు వెలసినవి. రాయప్రోలు సుబ్బారావు తన కుమారుడి మరణము పట్ల "నందా" అను పేరుతో పద్యములు వ్రాసెను. దువ్వూరి రామిరెడ్డి తన ప్రేయసి మరియు శిశువు స్మృతి పరముగా "భగ్న హృదయము" అను పేరుతో పద్యములు ప్రకటించెను. ఇవిగాక దేశ నాయకులు మరణించినపుడు వారి స్మృతి పరముగ అనేక గేయములు, పద్యములు రచింపబడినవి. రాయప్రోలు రచించిన "రవీంద్రుని అస్తమయము" అను పద్యములు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య మరణానంతరము బసవరాజు అప్పారావు రచించిన గేయములు. దేశ నాయక స్మృతి గీతములై యున్నవి. ఈ పద్ధతిలోనే గాంధీజీ మరణానంతరము అనేక గేయములు, పద్యములు ఖండకావ్యములు వెలిసినవి. జాషువా రచించిన "బాపూజీ" అను ఖండ కావ్యము మహాత్ముని జీవితములోని ప్రధాన ఘట్టములను వర్ణించినది. తుమ్మల సీతా రామమూర్తి "ధర్మజ్యోతి" మహాత్ముని గుణగణములను ప్రస్తుతించినది. పుట్టపర్తి నారాయణాచార్యులు రచించిన "గాంధీజీ మహాప్రస్థానం" అను ఈ ఖండ కావ్యము మహాత్ముని నిర్యాణమునుగూర్చి ఆవేదనతో రచింపబడినది. మహాత్ముని వ్యక్తిత్వమును ఉన్నతముగా ప్రకటించి, అతనిని భగవంతుని అవతారముగా సంభావించినది.

ఆధునికస్మృతికావ్యములలో నాయని సుబ్బారావు రచించిన "మాతృగీతాలు," "విషాదమోహనము" విశ్వనాథ సత్యనారాయణ రచించిన "వరలక్ష్మీ త్రిశతి" తాత్విక దృక్పథము కల్గినవి [15]

తాత్వికమైన స్మృతి కావ్యములపైపొరలలో లౌకికమైన దుఃఖము వ్యక్తమైనను దాని వెనుక దేహము యొక్క అనిత్యత్వము గూర్చిన జ్ఞానము, ఆధారముగా ఆలోచనలు కొనసాగును. లౌకికస్మృతి వలన కలిగిన దుఃఖపుసరిహద్దు దాటిన తరువాత కవి అలౌకిక జీవనమును గూర్చి ఆలోచనమును విశ్వాసమును వీనియందు ప్రాధాన్యము వహించును. చనిపోయిన వ్యక్తి సంబంధముతోడి మోహము త్రెంచుకొని ఆజీవునకు ఉత్తమ గతులు కల్గినట్లు భావన చేయబడవచ్చును. దీనిని మించిన తాత్విక కపు లోతుగలకవి మోక్షమును కాంక్షించును. ఈతాత్విక దృష్టియే సామాన్యస్మృతి కావ్యములకన్న వీనిని విలక్షణముగా నిలిపియుంచును. "గాంధీజీ మహాప్రస్థానం" ఇట్టి విశిష్టమైన తాత్విక స్మృతి కావ్యములకోవకు చెందినది.

మహాప్రస్థానము అను పదమునకు సుదీర్ఘ ప్రయాణమని అర్థము. మహాభారతమున ధర్మరాజు సశరీరముగ స్వర్గారోహణము చేసినది మహా ప్రస్థానము. ఆధునిక కాలమున శ్రీరంగం శ్రీనివాసరావు మహాభారతార్థము ధ్వనించునట్లుగనే తన కావ్యమునకు మహాప్రస్థానమని పేరు పెట్టెను. పుట్టపర్తి గాంధీజీని పరమాత్మగ భావించి ఆయన దేహమును త్యజించి ఊర్ధ్వ లోకములకు పయనించుటను మహా ప్రస్థానముగా భావించెను.

"ఓయి మహర్షీ నీవెక్కడికి శెళ్ళనయ్యా" అని ప్రారంభించి - "యింక నెన్నాళ్ళకీయిలకున్ డిగ్గెదివోయి, దాల్తు వపుడేయే గుర్తులన్ దెల్పరా" అని పరమాత్మ అవతార తత్వమును ప్రకటించెను. నిత్యమగు ఆత్మ అవసరమగు పరిస్థితులలో తనను తాను భూమిపైకి అవతరింపజేసుకొని, విభూతులను ప్రదర్శించి, ప్రజలను ఉద్ధరించి తిరిగి దివ్యలోకములకు ప్రయాణించుటను కవి ఈ కావ్యము ద్వారా ప్రకటించి 'మహా ప్రస్థానము' నకు విస్తృతార్థము కల్పించెను.

గాంధీజీని దేవునిగా భావించి కవితలు రచించు పద్ధతి 1920 ప్రాంతము నుండి ఆరంభమైనది.16 గేయములు పద్యములేకాక ఆయనను గూర్చి మంగళహారతులు పాడుట ప్రసిద్ధమైనది.16 గాంధీ భజన గీతములు పాడుచు ప్రజలు స్వాతంత్ర్యోద్యమమున అత్యుత్సాహముగా పాల్గొనిరి. తిలక్ మహాశయుని నిర్యాణానంతరము గాంధీ యుగ మారంభమైనది. విశ్వనాథ సత్యనారాయణ కొడాలి ఆంజనేయులు "అవతార పరివర్తనము" అను పేరిన నాటకమును రచించిరి. పరశురాముని నుండి శ్రీరామునకు తేజస్సు సంక్రమించినట్లు ఒక అవతార ప్రాముఖ్యము ముగిసి మరొక అవతారము ప్రసిద్ధి పొందినట్లు తిలక్ మహాశయుని ఆశయస్ఫూర్తిని గాంధీజీ అందిపుచ్చ

కొని స్వాతంత్ర్య సముపార్జనకు సారథ్యము వహించెననుట నాటక కథ. ఈ విషయము కథనముగాగల "అవతార పరివర్తనము" బ్రిటిషు ప్రభుత్వముచే నిషేధింపబడినది. కాని సహాయ నిరాకరణము, దండి సత్యాగ్రహము, క్విట్ ఇండియా మొదలగు మహోద్యమములను విజయవంతముగ నిర్వహించి గాంధీజీ చరిత్రలో అపూర్వముగ స్వాతంత్ర్యమును సాధించెను.17 ఈ కార్యసాధన ప్రజలలో గాంధీజీ యెడ కలిగిన దైవభావమును స్థిరీకరించెను. "గాంధీజీ మహాప్రస్థానము" అను ఈ స్మృతి కావ్యము గాంధీజీని అవతారముగ విలక్షణ రీతిలో ప్రకటించినది.

గాంధీజీని గూర్చిన స్మృతి ఈ కావ్యమున మూడు దశలలో సాగినది. మొదట గాంధీజీని హత్య చేసిన విషయము వినిన వెంటనే సామాన్యుని వలె కవి ఆవేదన పొందెను. ప్రపంచమంతయు ఆయన మరణమునకు సానుభూతి ప్రకటించుచున్నదని తలచెను.

రెండవ దశలో గాంధీజీని మహర్షిగా భావించి ఆయన ఉన్నతమైన జీవన వ్యక్తిత్వమును వ్యాఖ్యానించెను. ఈ దశలో క్రమముగ దుఃఖము ఉపశమించబడి మహాత్ముని నియమ పాలనా జీవితము వర్ణించబడినది.

గాంధీజీని భగవంతుని విభూతిగ, అవతారముగ భావించుట మూడవ దశగా గుర్తించవచ్చును. సనాతనముగ భారతీయులు విశ్వసించు పునర్జన్మ సిద్ధాంతము, అవతారతత్త్వమిందు ప్రకటింపబడినది.

గాంధీజీ హత్యచేయబడినాడని వినిన వెంటనే కవి ఆవేదన ఇట్లు వెలువడెను.

" పురుగుంబుట్రయు కూడ నీ కరుణకెప్డుం బాత్రముల్ మర్త్యకా
పురుషుండొక్కడు పొట్టబెట్టికొనె బాపూ నిన్ను మాహైందవో
ర్వరలో జన్మమునెత్తె నేటికొకడ ప్రాచ్యుండు పాశ్చాత్యక
ర్కర విద్యాతత పూత నాగరికతా కారమ్ము సప్రాణమై"

వ్యక్తి మరణమునకు కారణములూహించుట ఆ కారణములను వ్యాఖ్యానించుట కారకులను నిందించుట లోకవ్యవహారమునందున్నది. గాంధీజీ మరణమునకు కారణము హిందూ ముస్లిమ్ సోదరుల మధ్య చెలరేగిన మత వివాదము. అనాదిగా భారత దేశమున అనేక మతములవారు జాతులవారు నివసించిరి. భిన్నభిన్న సంప్రదాయముల ననుసరించి వారు తమతమ భౌతిక అధ్యాత్మ రంగములలో సామరస్యముగ జీవించిరి.

ప్రవక్తలు, మనీషులు, తాత్వికులు జన్మించి ఈ భిన్నత్వములో ఏకత్వమును చాటి చెప్పిరి. గాంధీజీ సర్వమత సమానత్వము బోధించి హిందూ ముస్లిమ్ జాతుల ఐక్యమత్యమునకు కృషి చేసెను. దేశ స్వాతంత్ర్యమును సాధించుటకు జాతి సమైక్యముతో పోరాడుచున్న సమయమున బ్రిటీష్‌వారు తమ కుటిల రాజకీయమునుపయోగించి హిందూ మహమ్మదీయ మతముల మధ్య వైషమ్యమును రగిల్చిరి. విభజించి పాలించెడి భేదోపాయ లక్షణము నవలంబించి మనదేశ ప్రజలను మత ప్రాతిపదికపై విభజించుటకు ప్రధానముగా కృషి చేసిరి.18 ఇట్టి బ్రిటీష్‌వారి సంస్కృతినే కవి *"పాశ్చాత్య కర్కర విద్యా నాగరికత"* అని ఈసడించెను. మతదురభిమానము కల్గిన నాధూరామ్ గాడ్సే అను యువకుడు గాంధీజీని తుపాకితో కాల్చి చంపెను. వానిని కవి *"అప్రాచ్యుడని"* *"పాశ్చాత్యకర్కర విద్యా తదపూత నాగరికతా కారమ్ము"* అనియు నిందించెను. ఇట్టి అమానుష చర్య పాశ్చాత్య విద్యానాగరికతల ప్రభావమని వ్యాఖ్యానించెను.

తుపాకితో కాల్చగా ఆయన శరీరము నుండి స్రవించిన రక్తపు కణములను *"పేరుకొండి–పేరుకొండి"* అని ఆయన అస్తికలను బాకులుగాచేసి *"అన్నదమ్ములిరువైపుల కుమ్ముకొండని"* మతవిద్వేష శక్తులను అసహ్యించుకొనెను. ఈ దేశము కొరకు, దేశ భవితవ్యము కొరకు తన సర్వస్వము ధారపోసిన గాంధీని రక్షించుకొనలేని ప్రజలను,

"ఏడ్వండి బాగా ఏడ్వండి
గొప్పవాళ్ళు పుట్టి పోయినాక
ఏడ్వడమే ప్రపంచం వంతు"

అని అవహేళన చేసెను. మహాత్ముని మరణవార్త తలచినంతనె కవికి *"ఒకపనిచేయ బోవ మరియొక్కటి తోచెను"* *"ఒక్కటాడగా వికలము శబ్దమింకొకటి"* వినవచ్చెను ఏంతో చెప్పదమన్న ఊహ కల్గిననూ యడ్డు పడినయట్లు వాక్కుపై కుబుకుటలేదు. భావి సౌభాగ్యము వెల్గొందునను ఆశలన్నియు నీ చావుతో పూర్తియై పోయినవని తన దుఃఖమును ప్రకటించెను. మహాత్ముని పోగొట్టుకొనిన మనకు జీవనమెక్కడిది?

" మనలుగాకింక దుర్మద మత రథంబు
కీళలు చితికిన ఈ వల్లకాటియందు "

అని మహాత్ముడు లేని దేశము వల్లకాటితో సమానముగ భావించెను. గాంధీజీ పోరాడి సాధించి తెచ్చిన స్వాతంత్ర్యమును అనుభవించుటకు ప్రజలు సిద్ధముగా నున్నారని కాని మహాత్ముని గూర్చిన చింత ఎవరికిని పట్టినట్లులేదని కవి ఆలంకారికముగా ప్రకటించెను.స్వాతంత్ర్యవేడుకలలో గాంధీజీపాల్గొనని విషయమిచ్చట గమనార్హము19

> " వరుసల్‌దీరిన వర్ధి బృందములు భావస్పీన్న నేత్రాంబులన్
> పరమాన్నంబులు ద్రావిత్రేంచుటకు నాహ్వానంబు గావించిన
> ట్టిరసస్నిగ్ధుడు యింటిగేస్తు మొదలేడీ? లేని ఈ చింతయే
> వ్వరికిన్పట్టదుఆత్మ సౌఖ్య పరిలుబ్ధంబైన లోకంబునన్"

ఈ పద్యమునందు ప్రయోగింపబడిన *"ఇంటిగేస్తు"* అను పదబంధము జాతిపిత భావమునకు సంక్షిప్తరూపము. భారతజాతినంతయు ఒకే కుటుంబముగ భావించిన గాంధీజీ అభిప్రాయము ఈ పద్యమునగూఢముగా వ్యక్తమగుచున్నది. ఈ విధముగ నాయకుని మరణము పట్ల దుఃఖము ప్రకటింపబడినది.

రెండవదశలో మహాత్ముని గుణగణములు వ్యక్తిత్వము నియమపాలనా జీవనము ప్రస్తుతింపబడినవి. *"ఓయి మహర్షీ"* అనెడి వచనకవిత గాంధీజీ నియమ పాలనాజీవితమును ప్రకటించుచున్నది. *'సర్వమానవ వ్యతిరేక భావస్పందనలు జయించిన"* వానిగా గాంధీజీ చెప్పబడెను. సత్యాహింసలు ఆయుధములుగా శాంతి సమరము సాగించిన ఆయనరూపము *"అనంత అగ్నిపర్వతములు కూడ గట్టిన రూపముగా"* వర్ణించబడెను.

గాంధీజీ బాల్యమునుండియే *"మానవ వ్యతిరేక భావస్పందనలు"* ఒక్కొ-టొక్కటి జయించుచువచ్చెను. ఈ విషయమిట్లు ప్రతీకాత్మకముగా వర్ణించబడినది.

> " అబ్బ ఏమి జీవితము
> ఆమనిషిలో అనుక్షణం పదివేల దేవదత్తాలు
> మ్రోసినయ్"

దేవదత్తము విజయుని శంఖము. అధర్మమునెదిరించిన ధర్మనినాదము. ధర్మనినాదము అనవరతము ఆయననుండి ధ్వనించెనని-అధర్మ శక్తులను జయించెనని అర్థము. సత్యాహింసలు, విశ్వమానవప్రేమ గాంధీజీ ప్రబోధించుటయేగాక తానాచరించి చూపించెను.*'నిను నిందించిన గర్భశత్రువునుగానీ నీవుప్రేమించినావనుచే సత్యము?* ఇట్టి పవిత్రమైన జీవితము గడిపిన గాంధీజీ హత్య చేయబడెను. ఆయన శరీరము నుండి రక్తము స్రవించెను ఆరక్తపు కణములను

" అవిగో మహాత్ముని రక్తపు కణములు
త్రిభువన పావన గంగా జలములు
జినముని అమృత స్నపితాక్షరములు
కుపిత మహేశ్వర క్రోధజ్వాలలు"

అని ఉల్లేఖించెను పవిత్రత, అమృతత్వము కలిగిన మహాత్ముని శోణిత ధారలు భూమిపై పడినచో క్షామమేర్పడునని భావి భాగ్యము నశించిపోవునను అభిప్రాయముతో కుపిత మహేశ్వర క్రోధజ్వాలలుగ వర్ణించెను.

" నలుబదికోట్ల తంత్రిడిచవినావు నిజంబుగ రాజపూటు భూ
ముల శయనించితో భరతపుత్రులు పండినచోటనీవు వా
రలవలె నొక్క వీరుడవెరా! ఋతఖడ్గము పట్టిలోక పం
ధులకెదురొడ్డి నిల్చితివతంద్రత ముప్పదియారు వర్షముల్"

గాంధీజీని భారతవీరునిగా కవి సమ్మానించెను. ఈ పద్యమునందు "*ఋతఖడ్గము*" అను పదబంధము విలక్షణమైనది ఖడ్గము శత్రు సంహారకము ఋత ఖడ్గము అంతఃశ్శత్రు సంహారకము. విభజించి పాలించెడు పాశ్చాత్య నాగరికతను, సనాతనము వేదప్రబోధమగు "*ఋతఖడ్గము*"తో, గాంధీ జయించెను. అందుకే "*ఋతమ్మె సర్వాతిగమైన శక్తియని ప్రమోయించెన్ సుధాభేరి* " కావున ఇట్టి మహావీరుని మరణము పట్ల కవి సంశయమును ప్రకటించెను. ఆయన జీవనము, ప్రబోధము, పోరాటము, ఆచరణము అపూర్వములని భావించి.

' *ఆయన ప్రతుకే కల*
*చచ్చినా కలే* '

అని అంతటి మహోన్నత వ్యక్తిత్వము మానవులయందు అరుదను భావము వ్యక్తపరచెను.

గాంధీజీని భగవంతుని విభూతిగా, అవతారముగా భావించినతీరు విలక్షణమైనది.

" ఎవరీ విద్యార్థి ప్రపంచంలో - అలానడచి పోతున్నారు
అవును ఆయన విశ్వ పాంధుడు
ఆకాలికింద పడిన ప్రతిభూరేణువూ సుధాకణమౌతుంది
ఆయన గాలిసోకిన ప్రతి వస్తువూ
ఆత్మానుభూతి లోతుల్ని అందుకొంటుంది"

గాంధీజీ 'సంయమి' కనుక ప్రపంచము నిద్రాణమైయున్న స్థితిలో తాను జ్ఞాన మార్గమున ప్రయాణించెను. ఆత్మద్రష్ట కనుక ఆయన స్పర్శించిన ప్రతి ధూరేణువు సుధాకణమౌతున్నది. సిద్ధపురుషుడు కనుక గాంధీజీవి సోకిన ప్రతివస్తువునకు ఆత్మావలోకనము ప్రాప్తిస్తున్నది. ఈవిధముగా భగవచ్ఛక్తి భూలోకమున గాంధీరూపముగా సాధించవలసిన మహాకార్యము సాధించి తిరిగి నిత్యలోకములకు ప్రయాణించుచున్నదని ప్రకటింపబడినది.

గాంధీజీ భౌతిక దేహమును విడచినందుకు బాలలు గోవులు పూవులు విషాదము పొందినవి. "స్థితప్రజ్ఞుల" చావిలా వుంటుందేమో అని కవి ఊహించెను. స్థితప్రజ్ఞత్వము యోగి లక్షణము. దుఃఖించదగిన విషయము తటస్థించినను దుఃఖించక సుఖించతగు విషయములందు స్పృహచెందక అనురాగ,భయ క్రోధములు లేనివాడు ఆత్మమననశీలుడు స్థితప్రజ్ఞుడని భగవద్గీత చెప్పుచున్నది.20 ఈ విషయమునంతయు కవి సంగ్రహముగ,

" ఎవరీ విషాద ప్రపంచములో
అలా నిత్య సంతోషి, ఆవును
ఆయన దివ్య మానవుడు"

నిత్య సంతోషి అనుపదము స్థితప్రజ్ఞత్వమును తెలుపుచున్నది. గాంధీజీ మానవత్వం నుండి దైవత్వమునకు దివ్యగుణముల నాచరించుట ద్వారా ప్రయాణించెను. మానవ చేతనను భగవచ్చే తనలోనికి ఉద్ధరించుకొని దివ్యమానవుడయ్యెను. భగవంతుని దివ్య గుణములైన అహింస సత్యము ప్రేమలను లోక సంగ్రహణార్థమై ప్రకటించెను. ఈ విషయము కావ్యమిట్లు వ్యంగ్యముగ వర్ణించినది.

" ఆయన మాటలనిండా తొలినాటి వేదాలు
ఉపనిషత్తులు .. .... .... .... .... "

వేదోపనిషత్తులు "సత్యంవద," ధర్మంచర, అహింసా పరమో ధర్మం॥" అని చెప్పినవి. సత్య, ధర్మ, అహింసలన్ సూత్రాలుగా గాంధీజీ ప్రకటించెను సత్య వాక్పాలనము, ధార్మిక జీవనము అహింసా మార్గము ఆయనను మహాత్మునిగా దివ్య మానవునిగా నిలబెట్టినవి. చరిత్రలోని మహాపురుషులాచరించిన దివ్యగుణములన్నియు ఏకీకృతమై గాంధీజీ యందు నెలకొన్నవి. అందులకే సత్య వాక్పాలకుడగు శ్రీరాముని తోడను ధార్మిక జీవనము బోధించిన బుద్ధుని తోడను, అహింసను

బోధించిన ఏసుక్రీస్తు తోడను పోల్చబడెను. మానవ రూపమున నివసించుచు, మహా నాయకునిగ దివ్య విజ్ఞానములోని శక్తి-ప్రేమ తేజస్సులను పొంది మహానాయకునిగా ఆదర్శమూర్తిగా వెలుగొందెను. ఇది భగవద్విభూతి లక్షణము.

గాంధీజీ ఎల్లప్పుడు "రఘుపతి రాఘవ రాజారామ్" అని కీర్తించుచుండును. రాముడు పుంసాంమోహనరూపుడు, రామాయణమాది కావ్యము, రామతారకమంత్రము అనాది సౌందర్యము. కావ్యమీ విషయమిట్లు వర్ణించినది,

"ఎవరీరిలా ప్రపంచంలో అలా పాడుతున్నారు
ఆయన నిత్యగాయకుడు
ఆకంఠంలో అనాది సౌందర్యాలు పలుకుతై"

చమ కామ్యములను భగవంతునియందు సన్యసించి భగవత్ చేతనలో జీవించెడి మహాపురుషులు లోకసంగ్రహణార్థమై తమఉనికిని గుర్తించగలరు తమ అనంత నిర్వాణ సాధనలో భగవచ్ఛక్తిని అందిపుచ్చుకొని తాము ప్రయోజించుచు తమ చుట్టున్న ప్రజలను కూడ నడిపింతురు.21

'బాపూ నీ అనంత నిర్వాణ సాధనలో-అనుభవంలో మమ్మల్ని ఒక క్షణమైనా మరచిపోవే నీవు"

అని గాంధీజీ మార్గదర్శిత్వము తెలుపబడినది.

ఒక్కొక్కప్పుడు దివ్యచేతనలోనికి జీవుని ప్రవేశము ఫలితముగ మానవుని ప్రకృతిలోనికి, మనశ్శరీరములోనికి భగవంతుడు తననుతాను అవతరింప జేసుకొనును 22 అప్పుడా మానవుని కన్నులలో "కోటి కామధేనువుల పాలు బలుక వచ్చును" అనగా అతని చూపులలో తోడి జీవులను ఉజ్జీవింపచేయగల శక్తి లక్షణ మున్నదని తాత్పర్యము. అట్టిమానవుని నవ్వులనిండా "అనంత సాగరములు-కోటి చంద్రులు" సాగర శబ్దము గంభీర తాత్విక విచారమును, చంద్రశబ్దము ఆహ్లాద కత్వమును తెలుపుచు మానవ జీవనము గహనము-దాని రహస్య మవగతమైనచో ఆహ్లాదకరత్వము అను భావమును ప్రకటించుచున్నది. గాంధీజీవితమున ఇట్టి దైవ లక్షణము సంపూర్ణముగ భాసించుటచే,

అవతారంబవొమా విభూతివొ సమగ్రానంద నిర్లిప్తుడొ
కవివోః బుద్ధికనూహ్యమౌ జటిల తర్కాగంధివోకాక-క
ర్మ విలాసంబుల వృద్ధి నెందునొక సామాన్యుండవో యిద్దికా
దవునన్నేటికి వాదు నిక్కమగు తాతా యింక రాబోవుగా

కాదు-అవును అనువాదమెందులకని పరమాత్మకు పర్యాయ పదమగు కవిగను, భగవద్విభూతిగను సంభావించెను.

గాంధీజీమరణానంతరము కూడా దేశమున మతకలహములు మాయలేదు. అందులకు "నీవు లేని చీకటులింకనా-ఎఱుకమాయుంగాక భాసించునా" అని గాంధీని తిరిగి అవతరించుమని అజ్ఞానము దూరము చేయమని కోరెను. గాంధీజీని విష్ణుమూర్తిగా సంభావించి, అవతారము పరిసమాప్తి చేసుకొని పాల్కడలిని పవళించిన అతనిని లేచి రమ్మని ప్రార్థించుటతో కావ్యము ముగియుచున్నది.

"చరఖాసుదర్శనంబై
అరిమురి మాయవ్వ లక్ష్మియై కనుచూపుం
బరుపులుగల కలశాబ్ధిగ
పరమాత్మా లేచిరార భక్తులఁ బోవన్"

ఈ విధముగా దేశనాయక స్మృతి కవిత్వము చివరకు భక్తి భావమున పరిణమించినది

# జ్ఞాపికలు

1) "తెలుగులో చారిత్రక కావ్యములు" - సిద్ధాంత వ్యాసము - పేజి 56
- బి. అరుణకుమారి

2) "తెలుగులో చారిత్రక కావ్యములు" ( 16 17, శతాబ్దముల కొఱకు )
పేజి-58, - బి. అరుణకుమారి

3) "నవ్యకవిత్వారంభము" -డా॥ కోవెల ప్రసన్నాచార్య
"విమర్శిని" -కాకతీయ విశ్వవిద్యాలయము 1978

4) "నవ్యాంధ్రసాహిత్య వీధులు" పేజి 395 తృతీయభాగము,
కురుగంటి సీతారామాచార్యులు-పిల్లలమర్రి వెంకటహనుమంతరావు.

5) నర్తనశాల ఖండిక - హంపీ క్షేత్రము - కొడాలి వెంకటసుబ్బారావు.

6) రాణాప్రతాప సింహ చరిత్ర-ద్వితీయాంశము-289వ పద్యము
-దుర్భాక రాజశేఖర శతావధాని

7) "ఈ గ్రంథము అస్వతంత్ర జాతికొక స్మృతిగ్రంధము వంటిది"
విశ్వనాథ - పీఠిక - రాణాప్రతాపసింహ చరిత్ర

8) "మధురస్మృతులు" – కలచవీడు శ్రీనివాసాచార్యులు

9) "మధురస్మృతులు" - కలచవీడు శ్రీనివాసాచార్యులు
"సాహితీవిస్మేరం" - పుట్టపర్తి సన్మాన సంచిక

10) అరవింద వ్యాసావళి, 27వ పుట - శ్రీ అరవిందులు, అరవింద సొసైటీ, తెనాలి,

11) బ్రిటిష్ చరిత్రకారులు 1857లో జరిగిన ఉత్పాతనమును 'తిరుగుబాటు" అని వ్యవహరించిరి. పేజి 46, "భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర" ద్వితీయభాగము తెలుగు - తారాచంద్

12) చూడుడు "భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర" 1857 విప్లవము
పేజి 45 – తారాచంద్

13) చూడుడు 1857 విప్లవము "భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర"
పేజి 84

14) "యినామ్ కమీషన్ వారి చర్యలకు కారణంగా అలజడికిలోనైయున్న కర్ గుండ సర్దారు సాయుధుడై ఎదురు తిరిగి బ్రిటిష్ వారి క్రోధ క్రౌర్యములకు బలియైనాడు" పేజి 107
భారతస్వాతంత్ర్యోద్యమ చరిత్ర - తారాచంద్

15) "విషాద తరంగిణి" పేజి 66 "నాయని సుబ్బారావు కృతులు పరిశీలన"
డా॥ అనుమాండ్ల భూమయ్య

16) తుదకాకాలంలో గాంధీనొక దేవుడిగా భావించి, ఆయనకు దేవుడికి పాడినట్లు హారతులు పాడేవారు పేజి 392, తృతీయభాగము "నవాంధ్ర సాహిత్య వీధులు"

- కురుగంటి సీతారామయ్య - పిల్లలమర్రి వెంకటహనుమంతరావు

17) మహాత్ముడు సాధించిన అఖండమైన తపస్సు, సాధించిన మహాఫలము భారతదేశచరిత్రలోనే కాదు ప్రపంచ చరిత్రలోనే అత్యాశ్చర్యము కలిగించినది. పేజి 415

ఆంధ్రకవిత్వము-గాంధీతత్వము - డా॥ పద్దేపల్లి అంకయ్య

18) గాంధేశకము పేజి 176. భారతదేశచరిత్ర ద్వితీయభాగము డా॥ కె. సుబ్రహ్మణ్యము - తెలుగు అకాడమి ప్రచురణ

19) తెలుగు కవితా వికాసము (1947-1980) - కడియాల రామ్మోహన్‌రాయ్. సాహిత్య అకాడమి ప్రచురణ.

20) "దుఃఖేష్వనుద్విగ్నమనాః సుఖేషు విగత స్పృహః
వీతరాగ భయ క్రోధః స్థితధీర్మునిరుచ్యతే"
సాంఖ్యయోగము 56 శ్లో॥ శ్రీమద్భగవద్గీత

21) "కొందరు తమ మానవ భావము నందే నివసింతురు, తమను అనుప్రాణితము చేయుచునడుపుచున్న దివ్యవిజ్ఞానముయొక్క కొంచెము శక్తి, ప్రకాశము, ప్రేమను పొంది ప్రపంచమున నాయకులగుదురు.
గీతావ్యాసములు ప్రథమ సంపుటము శ్రీ అరవిందులు
తెలుగుసేత - చెలసాని - నాగేశ్వర్‌రావు పేజి 14

22) (అవతరణ ప్రక్రియ) పేజి 175 ప్రథమ సంపుటము గీతావ్యాసములు శ్రీ అరవిందులు-తెలుగుసేత-చలసాని నాగేశ్వరరావు.

# కాల్పనికోద్యమకావ్యములు

## షాజీ

రాయలసీమలో కాల్పనికోద్యమప్రభావము ననుభవించిన తొలి కవులలో పుట్టపర్తి నారాయణాచార్యులను ప్రముఖుడిగ చెప్పవలెను. తిరుపతిలో విద్వాన్ పట్టము కొఱకు చదువుకొను రోజులలో రాయప్రోలు, కృష్ణశాస్త్రి వంటి నవ్య కవుల రచనలు ఆయనను ఆకర్షించినవి. రాయప్రోలు ప్రతిపాదించిన అమలిన శృంగారము కృష్ణశాస్త్రిరచనలలో వ్యక్తమగు స్వేచ్ఛా ప్రణయము పుట్టపర్తి రచనలలో ప్రతిబింబించినవి. ప్రణయకవిత్వములో వచ్చిన ఈ రెండుమార్గములేగాక, కాల్పనికోద్యమ ప్రభావముచే పరిఢవిల్లిన ప్రకృతికవిత్వము తాత్విక స్ఫూర్తితో పుట్టపర్తి రచనలలో ప్రకటింపబడినది. నాటినవ్యకవులు రొమాంటిక్ కవితాప్రభావమునేగాక పారసీ కవిత్వప్రభావమును కూడ పొందిరి. ఆంగ్ల పారసీ భాషల నుండి సాహిత్యమును అనువదించిరి. పుట్టపర్తి కవిత్వముపై రొమాంటిక్ కవితా ప్రభావము, పారసీభాషా సాహిత్య సంప్రదాయ ప్రభావమున్నది. 'అగ్నివీణ షాజీ' రచనలలో ఈ ప్రభావము గమనింపవచ్చును. పారసీ సాహిత్య ప్రభావముతో 1936లో పుట్టపర్తి షాజీకావ్యము రచించెను. షాజీ కావ్యపీఠికలో తనపై గల పారసీ కవిత్వ ప్రభావమును గూర్చి యిట్లు ప్రకటించెను.

> *"ఈ రచన నిండ పార్శీవాసన అప్పుడప్పుడే ఆ భాషతో పరిచయము ప్రణయము, విరహము, మొదలైనవానిపై వారి రచనలు నారక్తము నుఱకెత్తించుచుండెను. నా కలల నిండ బుల్ బుల్ పిట్టలు, తలపులలో గుల్ నార్ పువ్వులు, జీవితమున హాఫీజ్ గీతాలు. ఉమర్ ఖయ్యామ్ నాటినా ఆరాధ్యదైవము"*

కవి యిట్లు ప్రకటించిననూ. షాజీ. కావ్యమున పారసీ సాహిత్య ప్రభావమేగాక రొమాంటిక్ కవితా ప్రభావముతో వచ్చిన భావకవితాప్రభావము కూడ ఉన్నది. ఒక విధముగ షాజీ కావ్యము కాల్పనికోద్యమ కాలమునాటి ప్రణయతత్వమును విపులముగా చర్చించినదని చెప్పవచ్చును.

పారసీ కవిత్వములోని విరహము, ప్రణయము, సవ్యకవులను ఆకర్షించినవి. రాయప్రోలు సుబ్బారావు ఆంగ్లానువాదమాధారముగా "మధుకలశము" దువ్వూరి రామిరెడ్డి "పానశాల" మొదలగు కావ్యములు రచించిరి. పారసీ కవి కథాంశము భూమికగా పుట్టపర్తి షాజీ కావ్యము నిర్మించెను. ఈకథ కల్పితమా — లేక చారిత్రిక సత్యమా అను సందేహమునకు కవియే కావ్యమున ఒక చోట

" ఎట్టులును జెప్పరాని ఈ కట్టు కథను
ఎవరు సరియగు నటు వివరించు వారు"

అని కట్టు కథగానే తెల్పియుండెను.

షాజీ ఒక పారసీక కవిపేరు. మొఘల్ సామ్రాజ్య చరిత్రలో 'జహంగీర్' పరిపాలనా కాలమున సృష్టిసౌందర్యమును "రమ్యైకకార్పణము" గా భావించి అమృతవాక్కులతో గానము చేసిన యోగి పుంగవునిగా ఈ కావ్యము నందు షాజీ కవి వర్ణింపబడెను. షాజీపాత్రనిట్లు కల్పించుటలో కవికి పారసీ కవిత్వములో మహోన్నత స్థానము పొందిన షేక్‌సాదీ కవిపేరకమై యుండవచ్చును.

షేక్ సాదీకవి శతాధిక సంవత్సరములు జీవించెను. తననూట ఇరువదవ యేట గులిస్తాన్, బోస్తాన్ వంటి కావ్యములు నిర్మించెను. దువ్వూరి రామిరెడ్డి గారు ఈ కావ్యములను "గులాబి తోటగను" "పండ్ల తోటగను" అనువదించిరి. సాదీకవి ఆదర్శములు, కవిత్వాంశములు మహోన్నతములని విమర్శకులు నుతించిరి. అపారమైన ప్రపంచానుభవము మహోన్నతమైన వ్యక్తిత్వము, సుదీర్ఘ జీవనము గల సాదీకవియే ఈ కావ్యమున షాజీ పాత్ర రూపకల్పనకు మూలము కావచ్చును.

## కావ్యరచనాంశములు :

పూర్వకవులను నుతించిన పద్యములలో కవి కవిత్వ రచనాంశములు ప్రకటించెను

పదములపసందు మధుర భావముల పొందు
పందెముల పైచుకొని కూడ బారినట్టు
(కవి–3)

తలపు నులిపెట్టు చాపల్యములను వదలి
జీవమయమైన రసముపాసించు నట్టి (కవి-4)

ఈ కవితా ధర్మములు రాయప్రోలు ప్రతిపాదించిన

వదలరీ వృత్త పదమ్ముదు బంధమెందు
నవ్యులు రసవద్వాక్య సంధాన మందుటి

అని చెప్పిన లక్షణమును ప్రకటించినవి.

## ప్రకృతివర్ణన :

ఈ కావ్యము నందు ప్రకృతి వర్ణనము అనేక విధముల సాగినది. ప్రకృతిని వర్ణించుటలో రెండు పద్ధతులు ప్రధానముగా కలవు. ప్రకృతిని మానవీకరించుట, మానవుని కష్ట సుఖములతో ప్రకృతి సహానుభూతి చూపుచున్నట్లు వర్ణించుట ఒకటి. ఈ పద్ధతి తెనుగు సంస్కృత సాహిత్యమునందు అనూచానముగ వచ్చుచున్నదే. ప్రకృతి సౌందర్యమును తన్మయమై వర్ణించుట రెండవ విధానము. ఈ రెండు పద్ధతులు భావ కవిత్వమునందు ప్రకటింపబడినవి[4]. షాజీకావ్యము నందు ఈ విధమగు వర్ణనా పద్ధతులున్నవి ఇట్టి ప్రకృత్యుపాసనము కాల్పనికోద్యమ ప్రభావముచే బహుళముగా నవ్యకావ్యములలో ప్రకటింపబడినది. రాయప్రోలు రమ్యాలోకమున ఆధునికుల దృష్టిని వివరించుచు *"పూర్వుఁడొక ద్రష్టచిన్ని నివ్వరి సిగపతె సన్నగా తపస్సమను ఆత్మకళను దర్శించెను. నేడొక కవి నవ్యతృణకంకణాభరణప్రయుక్తిచే ప్రేమయోగమును భావించెను. ప్రత్యక్షముగా కనిపించని, అనుమాన ప్రమాణమునకు నందియునందని పరతత్త్వము నవలనుంచి నేటికవి పంచభూత భాసితమైన ప్రకృతికళనే సన్నిహిత లక్ష్యముగా భావించెను".* అని వివరించిరి[5]. ఈ విధానము అనంతమైన ప్రకృతియందు, మానవ ప్రకృతియందును నవ్యకవులు దర్శించిరి. షాజీ కావ్యమున ప్రకృతి వర్ణనములో షాజీ పాత్ర ద్వారా ఈ విధమైన ప్రకృత్యుపాసనము ప్రకటింపబడినది.

కత్తిరింపులులేని వికాస గరిమ
దీరియున్నట్టి పూల పందిళ్ళబోలు
అతిమనోహర వేద కన్యకలుగలరు
రండురండోయి ప్రకృతి సామ్రాజ్యమునకు (ఉద్బోధ-7)

"దేవకన్యకలు" అని చెప్పఁ లో పవి వేదములనభ్యసించిన "గార్గి" "మైత్రేయి" వంటి స్త్రీలను జ్ఞాపకము చేసెను. అట్టి స్త్రీలు సంచరించిన ప్రకృతి ఆశ్రమములలో నిత్యమూ దైవము తాండవించునవియు. శాంతివర్షించుననియు, వివరించి

అస్ఖలితమైన జ్యోతిర్మయ స్వరూపి
మాతృదేవత కడగంట మమ్ముజూచు"  (ఉద్బోధ-8)

నని ప్రకృతిని మాతృదేవతగా సంభావించెను. జ్యోతిర్మయ స్వరూపిగా దర్శించెను.

పారసీ కవిత్వమునందును ప్రకృతిని ప్రేమమూర్తిగా దర్శించుట కలదు. హాఫీజు వంటి కవులు ప్రకృతి చిత్రములను అందముగా దర్శించి భావ గీతములను పాడిరి. ఇట్టికవుల కవితా ప్రభావము నవ్యకవులపై యున్నది. పుట్టపర్తి ప్రకృతిని కీర్తించిన పారసీ కవులనుస్మరించెను.

ప్రకృతిని మానవీకరించి వర్ణించుట షాజీ కావ్యమునందెక్కువగా చూడ వచ్చును.

రాణివారింట ముద్దు గులాబి కన్నె
యారబరచిన చెంగావి చీరగట్టె
మాలతీలత చిగురు కెంగేలి తోడ
వియతిపై వెండిపూవులు విసురుచుండె
(ప్రథమ ఖండిక 29)

"చీర కట్టుట" కెంగేలి తోడ పూవులువిసురుట మానవ చేష్టలు పుష్పముల యందు, లతలయందు ఆరోపింపబడినవి.

రాచవారింటఁ బలు నగారాల మ్రోత
ప్రతినదంబిచ్చె ప్రకృతి గర్భంబు నందు
ఉలికిపడిలేచె కన్నులు నులిమికొనుచు
పూలతోబాటు దిక్కు పూబోండ్ల గములు
(తృతీయ ఖండిక-8)

మానవులతోపాటు ప్రకృతికూడ రాచవారింట నగారాలమ్రోతకు ఉలికిపడి లేచినది. షాజీ కవిని గూర్చిన న్యాయ నిర్ణయము ముందుజరుగబోవుచున్నది. రాణీ ఉద్యాన వనమున ప్రవేశించుటయే దోషముగా పరిగణింపబడి పట్టుపడిన షాజీకి శిక్ష

విధింతురో యవి ప్రజలు రాచవారి నగారాలకు ఉలికి పడుట సహజము. ప్రజలతో పాటు ప్రకృతికూడ సౌందర్యారాధకుడైన షాజీని గూర్చి "కనులు నులుముకొనుచు" ఉలుకిపడి లేచినది. కనులు నులుము కొనుటయను మానవ చేష్ట పూవులయందారోపింప బడినది. ఈ విధముగా ఆకాశలక్ష్మి ప్రేమ ప్రసూన మాలను కరములబట్టి యున్నదనుటయు, (తృతీయ ఖండిక-2) మాయాంధకార జగతిపై తూరుపు కులుకు నవ్వు తేలెననుటయు, (తృతీయ ఖండిక-1) ప్రకృతిని మానవీకరించి వర్ణించిన దృశ్యములు.

ప్రకృతిని సహజ సుందరముగా వర్ణించిన సన్నివేశములిందు కలవు. భావనాశక్తితో ప్రకృతిని దర్శించినపుడు యిట్టి వర్ణనములుబికివచ్చును.

"ఎగిరి చివురాకు పాదాల నద్రెత్తి కూయు
కోయిలల ముద్దు పలచెడి కూతలకును
మారువలికెడి సెలల సమ్మదము . .

(షాజీకవి-21)

మొదలైనవి.

తాత్వికమైన ప్రకృతి వర్ణనము ఈకావ్యమున ఔపమ్యంతో ప్రతిభాసించినది.

" ఆత్మచక్షుష్కుడై పరమాత్మతత్వ
వేదియైనట్టి సిద్ధుని ప్రేమవోలె
భువనముల నిండె హెచ్చుతక్కువలు లేక
కొండ గోగుల రంగు నీరెండ చాలు "

(తృతీయఖండిక-4)

ఉదయ సంధ్యాకాలములోని "నీరెండ చాలు" సమముగా భువనములో వ్యాపించుట యను ప్రకృతి సహజమైన విషయమును, ఆత్మచక్షువుతో పరమాత్మతత్వమును తెలిసిన సిద్ధుని ప్రేమవలె సమానమైనదని చెప్పుట తాత్వికమైనది. ఇందు విశిష్టాద్వైతమునకు చెందిన ఆత్మ పరమాత్మ సంబంధము సూచితమైనది.

"ఒక గడియ తీరుబాటు నోచుకొననట్టి
సమయ పురుషుని దీర్ఘ విశ్వాస మట్లు
పిల్లవాయువు లల్లన వీచుచుండె
క్రాగిపోయిన జగతి యురంబునందు

(ద్వితీయఖండిక-2)

కాలమనంతయు యథావిధిగా సాగిపోవుననీ పురుషశబ్దము చేతకాలము పరమేశ్వర స్వరూపము అనెడి తత్వార్థము ప్రకటింపబడినది.

# ప్రకృతి వర్ణనలో కావ్యపాత్రల మనస్తత్త్వము పరివేశముల సూచన

పొగరు హృదయంబు విడనాడిపోవ బోవ
ప్రేమయును శాంతమును మదిపెరుగునట్లు
ముదురు యెండలు గళితమై పోవబోవ
మెల్లనీడలు భువి నాక్రమించుచుండె
(ద్వితీయఖండిక-1)

ఇది ద్వితీయ ఖండికలోని ప్రథమ పద్యము. నూర్జహాన్ షాజీ కవుల ప్రవేశము ఈ ఖండికలో వచ్చును. "హృదయము నుండి పొగరు తొలగిపోయి ప్రేమ శాంతములు పెరుగునట్లు" అను మానవ మనస్తత్త్వ విషయము సాయం సంధ్యా కాలముతో ఉపమింప బడినది. "పొగరు హృదయము" అనుట నూర్జహాన్ ప్రవేశము "ప్రేమశాంతము" అను విశేషణములు షాజీ పాత్ర పరివేశమును సూచించుచున్నవి

కొత్తగా సంపాదించిన వైభవము, తన మాట జవదాటని చక్రవర్తి, అధికమైన తన తెలివితేటలు నూర్జహాన్ గర్వమునకు కారణమయ్యెను. ఆ గర్వముతో ఆమె షాజీకవిని అవమానించి బంధించెను. ఈవిషయము సూర్యాస్తమయవర్ణనముతో పోశవించి వర్ణింపబడినది.

అధిక తేజస్సు తోడి బ్రహ్మాండములకు
కనులు వెలిగించు పడమటి కావిరంగు
నా వినూతన విభవ గర్వాంధకార
కలితమై మ్రింగి వేసెను కాళరాత్రి

ఈ పద్యములో 'కనులు వెలిగించు' అను పదబంధము జ్ఞాన భానుడగు షాజీని చెప్పుచున్నది. ఆయన తన విజ్ఞాన కిరణములచే జనుల అజ్ఞానమును పోగొట్టునట్లుపన్యసించెను. అట్టి సంధ్యారాగము వంటి వాడగు షాజీ కవిని నూతన విభవము వలన వచ్చిన గర్వాంధకారముచేత నూర్జహాన్ అను కాళరాత్రి బంధించివేయును. మూడవ ఖండికలో షాజీ కవి ఈ లోకము నుండియే నిష్క్రమించెను. దానికి కారణము నూర్జహాన్ కావుననే నూర్జహాన్ కాళరాత్రితో పోల్చబడినది. ఈ విధముగా రాబోవు విషయము దృశ్య కావ్యము వలె ధ్వనింపచేయబడినది.

ద్వితీయ ఖండమున ''బిరుసు తలకెక్కినట్టి లేపికలివిట్టి'' ప్రతీకగా గర్వము కల్గిన నూర్జహాన్ రాబోవు ప్రవేశమును కవి సూచించెను. షాజీ కవి ద్వితీయ ఖండమున నూర్జహాన్ ఒంటరిగా నున్నపుడు తోటలోనికి ప్రవేశించును. ఈ విషయమును ప్రతీకాత్మకముగా కవి.

''కష్ట సుఖములు బాహ్య లోకమున నుమ్ము
అంతరంగిక దృష్టికెయ్యదియ లేద
టంచు వచియించెనెవ్వి సాయాహ్నములనొ
వలస వోయిన జక్కవ పులుగు మింట''

(ద్వితీయ ఖండిక.5)

ఇందు షాజీ కవి మనస్తత్త్వము-జక్కవ పులుగు ద్వారా వ్యక్తీకరింపబడినది. ''వలస పోవుట'' షాజీ కవి నిష్క్రమణను కూడ తెల్పుచున్నది. ఈ విధముగా తృతీయ ఖండమునందును. షాజీ కవిని గూర్చిన ప్రతీకాత్మక వర్ణన లున్నవి.

## ప్రణయతత్త్వము :

ఈ కావ్యమున ప్రణయోపాసకులు ఇరువురు. ఒకరు జహంగీర్. మరి ఒకరు షాజీ. జహంగీర్ ప్రణయమునకు రెండంచు లున్నవి. ఒకటి ఆతని నిత్య కళార్చనము. జహంగీర్ లలిత కళోపాసకుడు, సంగీత చిత్రలేఖనాది సుకుమార కళల పోషించుటయేగాక, స్వయముగా నభ్యసించెను.6 కవి ఈతనిని ''రమ్యసౌందర్య పూజా తత్పరుని'' గా 'తపస్వి'గా అభివర్ణించెను. ఖజానాలోని సొమ్ముతో ప్రార్థనా మందిరములలో సభాస్థలములలో 'గోరగించెడి శిల్పములు' కూర్చినాడు. ఆస్థానము లోని కవులు గాయకులు ఆలపించెడి పారశీక కావ్యములలో తన యశో విలాసములు విని పరవశము పొందుచుండెడివాడు. పారశీ నృత్యములను ప్రదర్శించిన కన్యకామణుల సౌందర్యమునకు మెచ్చి ''కనకాభిషేకములు జేసినాడు'' తత్త్వచింతనకు మనసును దార్చితార్చి యెండిపోయిన తన చేరేదేసి కనులగాలువలు కట్టు లేత ముత్యాలతోడ-తరుణ గాయక నుస్తముల్తుడిపినాడు. (ప్రథమ ఖండిక-13) అదియే ''దివ్యకళార్చన'' మని ''ఈశ్వరోపాసన'' యని భావించెను. ఈ విధముగా సంగీత సాహిత్య, నృత్యకళాది విద్యలలో నిరంతరము ఆనందము ననుభవించెను. రాజ్యపరిపాలన మంతయు తన ప్రియురాలైన ''నూర్జహాన్'' కు అప్పగించి తాను జీవరసమైన నివ్య జంషీడు పాత్రకు, ఆ 'అబుల్ ఫజల్'' అప్పురానంద గీతులకు అంకితమైనాడు.7

ఈ విధమైన జహాంగీర్ ప్రణయ తత్వమును చిత్రించుటలో పారశీకసాహిత్య సంప్రదాయములలోని సూఫీ మతములోని ఉమర్ ఖయ్యామ్ తత్వము ఆలంబనమై యుండును. సూఫీ మతము ప్రేమ మూలకమైననూ దానియందు పరమాత్మ భావన కన్న ఐహిక సుఖానురక్తియే ప్రాచుర్యము వహించి వర్ణింపబడినది. క్రమముగా ఈ పద్ధతి నాస్తిక వాదమునకు దారి తీసినది వర్తమానమే వాస్తవమనియు, భవిష్యత్తు అగోచరము అదృశ్యము కనుక ఆలోచింప నవసరము లేదనియు, మదిరాపానము మదవతీ సంభోగమునందే ఆనందమున్నదనియు, సూఫీ సంప్రదాయములోని ఉమర్ ఖయ్యామ్ మతము.8 కొందరు మదిరాపానమనగా భగవంతుని చింతనామృతమనియు. మదవతి ముక్తికాంతకు ప్రతీకయనియు, వ్యాఖ్యానించిరి. కాని ప్రేమ మూలకమైన సూఫీ సంప్రదాయము సామాన్యుల అనుభూతికి దగ్గరగా నుండుటకు దిగివచ్చి వ్యసనముల వర్ణించు పద్ధతిలో నిలిచిపోయినది ఈ కావ్యమున జహాంగీర్ పాత్ర తదనుగుణముగా వర్ణింపబడినది.

అలంకార శాస్త్రములో చెప్పబడిన ధీరలలితుడగు నాయకుని లక్షణమునకు ఒక విధముగా జహాంగీర్ పాత్ర దగ్గరగా నున్నది.9 మంత్రులపై రాజ్యభారముంచి లలిత కళానందము ననుభవించు రాజలక్షణము జహాంగీరు నందు కనిపించుచున్నది.

కాని జహాంగీర్ వ్యక్తిత్వములోని వైరుధ్యము అతనిని "ప్రణయతత్వార్చకునిగా" నిలబెట్టుటలేదు. అతనిలోని కాముకత్వము, దాన్ని సాధించుటకై అతడు ప్రదర్శించిన క్రౌర్యము రాచరికపుటహంకారమునే సూచింపుచున్నది గాని అతనిని నిజమైన "ప్రణయోపజీవి"గా చిత్రించుటలేదు.

నన్ను చంపి నా భార్య మానసము దోచి
నిర్విశంకత నేలు నీ నేరము విను
కట్టి కుడిపించి విషము నగ్గలము గాగ
గాని విడువదు నుమ్మింక గాచి కొమ్ము
(తృతీయ ఖండిక - 38)

జహాంగీర్ పరసతియైన నూర్జహాన్‌ను మోహించి బలవంతముగా ఆమె భర్తను చంపించి తనదానిని చేసికొనెను. తన తండ్రియైన అక్బరుతో జీవితాంతము శత్రుత్వము వహించెను.10 జహాంగీర్ యొక్క యిట్టి నిజరూపమును ఫారసీ కవిపై ఆగ్రహము వహించినప్పుడు కవి స్పష్టముగ వర్ణించెను. "తన వలపు [illegible] నూర్జహాన్ విసము తలకెక్కెను, తేత మిన్నాగువోలె, [illegible] పర్వతము నోరా" ముసలి జోగిపై ఆగ్రహము ప్రదర్శించెను.

ఇట్టి వైరుధ్యపు వ్యక్తిత్వముగల జహంగీర్ ప్రదర్శించినది ప్రణయమా? జహంగీర్ నూర్జహాన్ల మధ్య నున్నది శృంగారమా? అనేది మీమాంస కొరకే షాజీ పాత్ర ఈకావ్యమున ప్రవేశించినది.

షాజీకవి ఒకవిధముగా అవధూతల వంటివాడు. ''హాలోన్మత్త విశాచవత్'' సంచరించువాడు. శీతవాతాతప బాధలను లెక్కచేయక వీధి వీధులలో తిరుగాడెను. ఆహార నిద్రాభయముల వర్జించి వర్చుప్పు-గూడిన పల్కుతోడ, అమృత వాక్కులతో'' ప్రకృతి సౌందర్యము గానము చేసెను. ద్రవీభూతమైన మనస్సుతో ప్రకృతిలో పరిఢవిల్లు చిత్రముల జూచి సహానుభూతి పొందెను. "తరుణ సూర్యునితో వసంతప్పులాడి కుంకుమ పూసికొన్న దిక్కోమలుల" జూచి పారవశ్యమున నాట్యముచేసెను ''చివురు పొదల నెత్తి కూయు కోయిల కూతలకు మారు వలికెడి సెలల సమ్మదను జూచి అద్భుతానంద వీధిని" ఉయ్యాల లూగెను. ఎడబాటు లేకుండ కలసిమెలసియున్న లతా బాలికలజూచి ప్రణయగద్గదవర్తి చేతులెత్తి యల్ల నాశీర్వదించెను. గాలికొనలకేరాలు పుష్పాల జూచి కన్నీరు కార్చెను ''ప్రాతగోరీల బండిని ప్రభువు నూహించి నాటి వారి కీర్తిని స్మరించి ఉద్విగ్నమనస్కుడగును." నిముషమునకెన్నో విధాల'' పరమాత్ముని ప్రతిభ పొడగుచున్నదనీ 'సరస సౌందర్య విధికినాశనము లేని సృష్టికలదేమో'' -అనుచు యోచించుచుండెను.

ఇట్టి సాత్వికమైన మనఃప్రవృత్తి, నాశనములేని సరస సౌందర్య సృష్టిని గూర్చిన ఆలోచన షాజీకవి ఆత్మద్రష్టయని చెప్పుచున్నవి. భగవద్గీతలో యోగాభ్యాస ఫలమును యోగి లక్షణమును గూర్చిఇట్లు వివరించబడెను "యోగాభ్యాసముచే ఆత్మదర్శనము పొందినవాడు సర్వభూతముల యందును సమదృష్టి కలవాడై, తనయాత్మను సర్వభూతముల యందున్నట్లుగాను,- సమస్తభూతములు తనయాత్మ యందున్నట్లుగాను చూచును'' అందులకే జనులీతని ''యోగి పుంగవుడని'' నుతించిరి. షాజీకవి కూడ జహంగీరుతో తనను దోషిగా నిలబెట్టిన న్యాయస్థానమున

సారమేలేని ఐహికాశలకుచిక్కి
కుమిలిపోయెడి మీకు బంధములుగాని
జ్ఞాన ధాముల దిరుగు పైగంబరులకు
డీలుపడజేయ నినుప పేడీలు లేవు

(తృతీయఖండిక-౮౫)

అని స్పష్టముగా తాను జ్ఞానమార్గమున దిరుగు పైగంబరుడనని చెప్పెను. ఇట్టి యోగి పుంగవుడైన ఫాజీ జహంగీరు రాచనగరులోనికి ప్రవేశించుట అతని ప్రణయ తత్వమును పరామర్శించుటకే.

ఫాజీకవికి ప్రకృతియే ఈశ్వరుడు. ప్రణయమే ఉపాసనామార్గము అందులకే అతడు సౌందర్యనిధియైన నూర్జహానును జూచినపుడు ఆమె సౌందర్యము కూడ అతనికి ఈశ్వరకళా విశేషముగ భాసించినది. రాజు తనను దోషిగా నిలబెట్టి మాటాడి నపుడు అతనిలోని క్రౌర్యము, నిరంకుశత్వము జూచి ఫాజీకవి అత్యంత సుందరమైన ఈ ప్రకృతిని గడియకొక "అంగరఖా" తొడగు ప్రకృతిని తన స్వార్థమునకై ఉపయోగించునపుడు మనిషిలోని సైతాన్ ఎట్లు బయటకు వెడలునో గమనించెను. అందులకే ప్రణయకళార్చనము స్వార్థరహితముగా నుండవలెనని ప్రబోధించెను. జహాంగీర్, నూర్జహాన్ల ప్రణయమును ప్రతీకాత్మకముగా.

పొదలచాటు పూవులజూచి మురిసిపొమ్ము
కోసితలలోన జెరిపెడి కుమతిగాకు
కోమలతమ సౌందర్యార్చకుడవు కమ్ము
సిగ్గుచెడి నాకటంచు నాసింపబోకు

(తృతీయ ఖండిక-54)

అని వర్ణించి స్వార్థపూరితమైన జహంగీర్ ప్రణయము మలీమసమైనదనెను. నవ్య కవిత్వములో వచ్చిన అమలిన ప్రణయతత్వము, మధ్యయుగములనుండి సాగినచ్చిన సంభోగశృంగారమును నిరోధించినది. కావ్యములందు కామనా పర్యవసాయియైన సంభోగశృంగారము అధికముగా క్షీణప్రబంధయుగమున వర్ణింపబడినది 12 జహంగీర్ మధ్య యుగములనాటి ప్రణయమునకు నిదర్శనము. అతనికి నూర్జహాన్ పొందలనుస్నది కామముగాని ప్రేమకాదు కీర్తికొరకు, రాచరికపు అహంకారమును ప్రదర్శించుటకే లలితకళల నాదరించెను అట్టి వారి పక్కలమైన ప్రణయము అధర్మ బద్ధమైనది నాటికాలమునకు రాజులకు లేదా తదనుయాయులకు మతానుయాయులకు బహుభార్యత్వము అసహజము, అసమంజసము కాకపోవచ్చును. కాని అది ప్రణయము మాత్రముకాదు. "శృంగారము మలినమెప్పుడవుతుందంటే అది కేవలము సంతృప్తి కోసమో లేక నిషిద్ధదంపతిగతమో అయినప్పుడే మలిన మనవచ్చును. రాయప్రోలు వారి భావంకూడ ఇదే."అని అమలినశృంగారము-అత్మ సౌందర్యమని లక్ష్మీరంజనం పేర్కొనిరి. 18

రాయప్రోలు సుబ్బారావు తృణకంకణమున "వలపు-ప్రేమ" లకు స్పష్టమైన అంతరము పేర్కొనెను.[14] వలపు దేహజన్యము, ప్రేమ ఆత్మప్రణయ సూచకము. ఈ కావ్యమున జహంగీరునకు కలిగినది శరీరగతమైన ఇంద్రియములకు తృప్తిగూర్చెడి "వలపు" అందులకే కవి-నూర్జహాన్ మొగమును, జంషీదు పాత్రను "కలలోనవైన మరువనా వలపు మగడు" అని వర్ణించెను.

"ఏమి చెప్పంగగలము వాచామ గోచ
రంబయిన ప్రేమ బహిరంతర వ్యవస్థ" (తృణకంకణము 102)

అని ప్రేమతత్వము తృణకంకణమున వ్యాఖ్యానింపబడెను. షాజీ సందేశమున "మంత్రములు సర్వలోక సమ్మతములైన శాస్త్రములు ప్రేమ తత్వమే చాటుచుండు ప్రేమ విడిచిన జీవి తరించుటకు తరలి బోలిన సాధనాంతరము లేదు" అని వచించెను. తృణకంకణమున

"పొందిసటించు ప్రాణి వలపుల్ సుడియించిన వేళ నింద్రియా
ళిందనియింప కౌతుక మలీమసమౌ నటబడ్డ ధర్మపం
బంధములీడ్చి యీడ్చి అనపత్యము ఖాదికమైన భూతర
క్తింపగులాని ప్రేమరుచికిన్ వెలియౌట లెరుంగవే చెలీ"

(తృణకంకణము-84)

అని ఇంద్రియములను తృప్తిచేయు ప్రాణి వలపు కౌతుక మలీమసమైనదని, అధర్మ బంధమని, ప్రేమరుచికి వెలియైనదని తెల్పబడినది. షాజీ కవియు జహంగీరు నుద్దేశించి,

శారదాకాశమున మేఘ శకల మట్లు
విండబారి చరించెడు నీదుప్రేమ
నతిమలీమస కాంక్షా చయంబుచేత
పాడువరచుచు సంకోచ పరవబోకు

(తృతీయఖండము-56)

అని బోధించెను.

ఈ విధముగా కాల్పనికోద్యమము నాటి ప్రణయతత్వ పరమార్థము షాజీ పాత్ర ద్వారా కవి ప్రబోధించెను.

## నూర్జహాన్ :

ఈమె జహాంగీర్ ప్రణయమునకు అలంబనము. సత్వరజ స్తమోగుణములలో తమోగుణమునకు ప్రతీక. సర్వాధికారిణియై రాజ్య తంత్రము నడిపించిన మంత్రి గత్తె. తన భర్త మరణానంతరము జహాంగీరును వివాహమాడెను. రాజును నామ మాత్రావశిష్టునిగ జేసి యువరాజగు ఖుర్రమ్‌తో కలసి కొంతకాలము రాజ్య వ్యవహారములు నడిపించెను.15 ఈమె ఎంత సౌందర్యవతియో మానసికముగా నంత కుటిల అందులకేకవి.

"విషముపూసిన వన్నెల విసన కర్ర
రాజ్యమేలెడు పాటసీ రాజీగారు''

అని వర్ణించెను జహాంగీరునకు "ఆమె దయసేయు నొక్క వాక్యంబె"మంత్రదండము నూర్జహాన్ సౌందర్యము ఆ సౌందర్య వీక్షణాంకురములలో జీవించు జహాంగీరును కవి ఇట్లు చిత్రించెను.

కళళ కిరవగు నామె ముఖమ్మునందు
కినులు చెమరించు గరువంపు కళలు గలవు
కొనలు సాగెడి చూపు టెక్కూపమందు
పాదుషా జీవభాగ్యపుష్పములు గలవు
(ప్రథమఖండిక-18)

రాజకీయములందు మునిగి తేలిన యామె జహాంగీరు అనారోగ్యము గాని, మానసిక ఆలజడిన్ని గాని పట్టించుకొనలేదు ఈ విషయము ప్రతీకాత్మకముగా కావ్య మిట్లు వర్ణించినది.

భాగ్య సర్వస్వమైన పుష్పంబు తనదు
పాదముల వజ్జనిడి క్షమాపణముగోరు
దాని వీక్షింప దరగంట గాని రాణి
విభవమెక్కడ? హృదయ పవిత్రతేద
(ద్వితీయఖండిక-18)

పైభవ గర్వముచేత హృదయ పవిత్రతకోలుపోయిన యామె అక్రమ సంబంధమును గూర్చి కావ్యమున సూక్ష్మముగ కవిసూచించెను.

పచ్చి చెక్కిళ్ళపై అరవిచ్చుకొన్న
నగవులో వింత చెలువంబు నాట్యమాడు
గాని అపుడప్డు తలపులు కంటగించు
పండబారిన వసనాభి పరిమళించు
(ప్రథమఖండిక-28)

ఈ విధముగ అధికారగర్వము, అక్రమ ప్రవర్తనము, అతిలోక సౌందర్యవతినన్న అహంకారముగల నూర్జహాన్, సత్వగుణ సంపన్నుడగు షాజీని యోగిగా గుర్తింప లేక పోయెను. తన ఏకాంతమునకు భంగము కల్గించెనన్న కోపముచేత షాజీ కనిని బంధించెను. రాచరికపుటహంకారముచే జహంగీర్ షాజీని దోషిగా పరిగణించెను సత్వగుణ సంపన్నుడు, అమలిన ప్రణయకళార్చన శీలుడు అయిన షాజీ రాజుకు ప్రణయతత్వముపదేశించి తన "తెరువుబట్టి" ఎచటికో వెడలిపోయెను.

షాజీ కావ్యమీవిధముగ సత్వరజస్తమోగుణములకు ప్రతినిధులుగ షాజీ, జహంగీర్ నూర్జహానులను చిత్రించి కాల్పనికోద్యమ కాలమునాటి ప్రకృతి, ప్రణయ తత్వములనావిష్కరించెను. కావ్యము "ఆనందరూపమై మోదమొసగు సాత్విక వ్యక్తికి నమస్కార శతము" యని ప్రారంభమగుట గమనార్హము.

సత్వగుణ సంపన్నుడైన షాజీపాత్రయందు గాంధీజీ వ్యక్తిత్వము ప్రతిఫలించుచున్నదని కొందరిభావన 16 "వీధివీధుల స్వాతంత్ర్య వీణ మీటి, (16) నడచుచున్నాడు నల్లజెండాలనీడ సృష్టిసౌందర్య జీవి షాజీ తపస్వి"-(3-11) మొదలైనవర్ణనము గాంధీజీ స్వాతంత్ర్యోద్యమ సారధ్యమును "సెలవులందు నరవిచ్చు మొలకనవ్వు" -[3-1] "ఆ మహాత్ముని తలపులయందు కలుగు సాత్వికత ప్రాణిహృదయాల సంక్రమించె"-(3-19)మొదలైన వర్ణనము గాంధీజీ రూపమును వ్యక్తిత్వమును స్ఫురింపజేయుచున్నవి.

# అగ్నివీణ

అగ్నివీణలోని కవితా ఖండికలు కవి తన నడియౌవనమున రచించినవి. అనగా 1936-40 ప్రాంతముల మధ్య రచింపబడి యుండవచ్చును, అప్పటికి భావ కవితా ప్రభావము పుట్టపర్తి పై గాఢముగా నున్నది. ఈ ఖండకావ్య సంపుటిలోని భావములు రచనా విధానము భావకవుల ప్రభావమును స్పష్టంగా ప్రకటించినవి. ఇందు భావకవితలేకాక, పారసీ కవిత్వము యొక్క ప్రభావముగా రచింప బడిన కవితలు, ప్రగతి భావకవితలు చారిత్రక కథాంశ భూమికపై వృత్తములలో రచించిన "జోల" మనుచరిత్ర కథానాయిక "వరూథిని" పై రచించిన గీతమాలిక కలవు. రవీంద్రనాథ్ ఠాకూర్ కవితానువాదమొకటి, సుమిత్రానందన్ పంత్ హిందీ కవితానువాదమొకటి ఈ సంపుటినందున్నవి. మొత్తం ముప్పది ఎనిమిది కవితలతో కూడిన ఈ ఖండ కావ్య సంపుటిలో అధికభాగము భావకవితలు.

"అగ్నివీణ"లోని భావకవితా భావములన్నియు ప్రధానముగా వేదనాభరితమైనవి హృదయమును వీణగా భావించి, వేదనను అగ్నిగా రూపించి ఆత్మాశ్రయరీతిలో అనేక భావములను కవి ప్రకటించెను. "భిక్షువ్యంధ భావుకుని వేదన భగ్న ప్రేమికుని బాధ" ఈ కవితలందున్నవన్ని పీఠికా కర్త ప్రకటించెను.17 ఇందలి భావకవితలన్నియు పరిశీలించిన స్వతంత్రబుద్ధి, దుఃఖాభి భూతి, ప్రేమ భావనము ఈశ్వరారాధనము అని నాల్గు పాయలలో ప్రవహించిన భావ కవిత్వాంశముల ఛాయలున్నట్లు గమనించవచ్చును.18

నేను బానిసనేమి లోకాన నార
సార్ద్ర భావంబులను దాచి-ఆత్మనణచి
బ్రతుకు కోసము శ్రమపడవలెన-చీయి
కెన్ని కన్నీరు చిందినా-ఎన్ని వేడి
ఊరుపులు రాల్చినా నన్ను-ఒక్క అడుగు
వెనుకకిడబోను-లేదు ఈ విశ్వమందు
నా కెదిరి నిల్చునది ఈయనంతకాల
వాహినిని దారగొల్పి ఆవలకు ద్రొక్కి
పరిహసింతును సకల ప్రపంచములను (నేను)

ఈ కవితలో కవి తన స్వాతంత్ర్యేచ్ఛను ప్రకటించెను. కవి యన్న వ్యక్తి బానిసకాడు. స్పందించిన భావములను వెలువరించుటలో నిరంకుశుడు. బ్రతుకు కోసమై శ్రమపడెడి వ్యక్తి కవిత్వమును సాధనముగా వాడుకొన్నచో భావదాసుడు కావలసివచ్చును. తాత్కాలిక ప్రయోజనమునపేక్షించు కవిత్వము తాత్కాలిక యశస్సు నార్జించునేమో కాని అనంతకాలమునకు ప్రాతినిధ్యము వహింపదు. కవులు క్రాంత దర్శులు. దేశకాలమాన పరిస్థితులులయించుకొని దేశకాలములనధిగమించి నిత్యానంద భావనలు సృజించువారు. కష్టములకు, గడగండ్లకు వణికి జీవితముతో సంధికుదుర్చుకొని, ఆత్మనణచిపెట్టుకొని అవసరములకై కవిత్వము వ్రాయుకవి కవికాడని పై కవితలో ప్రకటింపబడినది.

రెండవ రొమాంటిక్ ఉద్యమముచే ప్రభావితమైన భావకవిత్వము స్వేచ్ఛగా హృదయ స్పందనలను గానము చేసినది. ప్రణయము, విరహము, కన్నీరు. ప్రకృతి సౌందర్యము, పరమాత్మ భావనము-ఇవి సర్వకాలములందు జనుల అనుభవములంగున్నవే. భావ కవిత్వమున ఈ అంశములు రమ్యశబ్ద సంయోజనము చేత, భావనా శక్తిచేత, నూతనముగా ప్రకటింపబడినవి.

''భయము కలిగించు కష్టాతపంబుమరచి
కరము కలగించు వంత చీకట్లు మరచి
విశ్వమే పరవశమయి వెంటబాడ
జగము నిండ స్వేచ్ఛా గానయురుల నింతు12''

అని కృష్ణశాస్త్రి స్వేచ్ఛా గానము చేసెను. ''నవ్వి పోదురుగాక నాకేటి సిగ్గు'' అని ఆయన ప్రకటించిన స్వేచ్ఛ ప్రవృత్తి కవితలో ''పరహసింతు సకల ప్రపంచములను'' గా మారినది.

కవి ప్రకటించిన స్వేచ్ఛ కవితారచనలో భావకవితలనే గాక అభ్యుదయ గీతములను అనువాద గీతములను పలికించినది.

ప్రధానముగా ఈ ఖండకావ్యసంపుటిలోని కవితలలో దుఃఖము ప్రకటించు సందర్భమున కృష్ణ శాస్త్రి కవితా ప్రభావము స్పష్టముగా కనిపించుచున్నది.

అమ్మరో నీవునన్ను ఓదార్చకమ్మ
మధురమైన విషాద సమాధి నుండి
మేలుకొల్పకు నేను జన్మించినాను
దుఃఖమునకె శోకమె నాదు తోడునీడ

పాడు కొందును ఆవిదితాంబరము నందు
ఎన్నడో నేను రచియించు కొన్నగీతి
అడ్డు రాకుము ఓదార్చకమ్మ నన్ను
సుఖము లెరుగని ప్రేమ భిక్షుకుడ నేను

(భిక్షుకుడు-15)

భావకవులు విరహమును మధురముగా భావించిరి. ఈ కవితలో విరహము 'మధుర విషాద సమాధి" గా చెప్పబడినది. "సుఖములెరుగని ప్రేమభిక్షుకుడు" నని చెప్పుట సంభోగశృంగారము లేదనుటయే కృష్ణశాస్త్రి చెప్పినట్లు

నేను నాదుదుఃఖమె తోడునీడగాగ
గడిపి కొందును నిశయెల్ల కనులు దెరచి

(నిశాలోచనము)

మీరు మనసారగా యేడ్వనీరు నన్ను
నన్ను విడువుడు .. .   .... (మీరు మనసారంగా)20

మొదలగు గీతముల ప్రభావము పై కవిత పై స్పష్టము.

ప్రేయసిని గూర్చిన తలపులు తనకు దుఃఖము కలిగించునవి అనురాగము, నిషేధము, మరణము, ఏల మొదలగు ఖండికలలో వర్ణించబడినది.

"అనురాగము" న ప్రియురాలు వలపు గీతికలలోని అనుభూతులను తన మనసు సైపగాలేదని, అవి తనకు హాలహల ప్రాయములని కవిబాధను వ్యక్తీ కరించెను. "ఆశకుసుమించు ఊర్పు ప్రేతాత్మ తేల" యని తనను ప్రేతాత్మగా చిత్రించుకొనెను. ఈ గీతమునందు "ఏను మరణించుచున్నాను" వంటి కృష్ణశాస్త్రి కవితల జీవచ్ఛవ నైరాశ్యము అనుకరింపబడినది. "రేయి తేనియ బరువు" వంటి కృష్ణపక్ష పదబంధములిందున్నవి.

"నిషేధము" న "నరములు కదలించు" పాటపాట మరచి పోనిమ్మని "అది తలపునకు బారెనా లోకమంత చీకటి కొటారుగ" మారునని గుండె చెదురునని, కనులు పూతపడునని తీవ్ర భావధ్వనులు తనగళమునందె నినదించి పోవునని, సుఖమొ దుఃఖమొకాని "శోక ముగ్ధ నిశీథగీతి" అట్టి గీతమని ప్రకటించెను, ఇట్టి స్థితి వేమూల సత్యనారాయణ "దీపావళి" యందున్నది.

"ఏల అను ఖండికలో తన హృదయవల్లకీ తంత్రులు వణకిపోయి, బాష్పాగ్నిలో వేగి జలదరించుచున్నవని, తనసుకుమారమైన ఎడద చీలి ఒక్క తీయని కలతైన నోచుకొనదేమని కవి ప్రశ్నించుకొనెను. ఈ నైరాశ్యము "మరణము" అను ఖండికలో విచిత్రముగ ప్రకటించబడినది ఇందు ప్రేయసిని కృష్ణసర్పముగను ఆమె ప్రేమను "విషానలార్చిగను" రూపించెను. "జేల" లో కూడ ప్రేయసిని "పన్నగీ నిశ్వాస పటల భీకరముగా పాడకే నాసఖీ" అని సర్పోపమానముతో వర్ణించెను. ఆమె ప్రేమను "చిలువ కన్నెల విసము" గభావించెను. అట్టి ప్రేయసి పలుకరింపులకు తనయాత్మ యులికిపడునని చెప్పెను. ఈ విధముగ వర్ణింపబడిన సర్పోపమానము యోగులు చెప్పెడి కుండలినీ శక్తిని జ్ఞాపకము చేయుచున్నది. మరియు "సవరించునా అగ్నివీణ" అనెడి మొదటి గేయమున "మనసులో మిన్నాగు ఫణమెత్తి పారాడ" అనెడి వర్ణనములోని మిన్నాగును "పరావాచాకుండలిని ఫణో ద్భాసితమైన మిన్నాగు" అని పీఠికా కర్త పేర్కొనెను.[21] సంబోధనలలోని ఈ ప్రతీకార్థము ఖండికలలోని ప్రణయ విరహ భావగీతములకు అన్వయించుట కష్ట సాధ్యము.

"కృష్ణార్పణము" అను కవితలో 'మూగ తలపులు విందవై చివండు సమ యాననే జగము పగబట్టినది" అందువలన ప్రేయసితో తనకుగలిగిన ప్రణయము నకు "అగ్గి రగిలినదింక కృష్ణార్పణమ్ము" అని దుఃఖించెను. ఈ కవితలోని "నిత్యశోభా విలాసిని" "నిర్మల ప్రసన్న దరహాసినీ", సాంధ్య "సముయఫుల్ల క్రమ మల్లికా" అనెడి సంబోధనలు అబ్బూరి రామకృష్ణారావు రచించిన "పృథివీ ప్రశంస" గేయములోని సంబోధనల జ్ఞాపకము చేయుచున్నవి.

'ఆమెలో మరచిపోయిన ప్రేయసిని శాంతి దేవతగా భావించెను. ఈ కవితా రచనలో వేసుల, కృష్ణశాస్త్రి కవితల ప్రభావమున్నది.

అమె పీయూహకలిక నాయంతరంగ
శాంతి దేవత, నిర్వాణజలధి, (అమె)

అనెడి సంబోధనలు.

అమెనవనీత హృదయ నాయంతరంగ
శాంతి దేవత — అళా పథాంతరాళ
పారిజాతమ్ము.... .... .... .... .... .... ... (22)

అనెడి వేముల సత్యనారాయణ పద్యచ్ఛాయ గోచరించుచున్నది కృష్ణశాస్త్రి వర్ణించిన

ఆమె కన్నులలో ననం తాంబరంపు
నీలినీడలు కలవు . . ... ... ... (23)

అనెడి భావము,

" జలద బాలికలోవి యాశలు నడించు
ఆమె కన్నులయందు"....... .........(ఆమె)

అని పుట్టపర్తి కవితలో వర్ణింపబడెను.

" అరుచిస్నిగ్ధ మూర్తి ముగ్ధాను లాపములు
కుదించును మబ్బులు ముసుగుగొన్న
దివ్యపారిజాతములయందు.... .. (ఆమె)

ఈ వర్ణనలో మబ్బులను ముసుగుగా చెప్పుటలో సొగసున్నను, "కుదించును" అను పదము శృతికటువుగను, అన్వయక్లేశమును కల్గించుచున్నది. ఈ విధముగా అగ్ని వీణలో ప్రేయసి తలపులపట్ల దుఃఖము - ప్రణయభావము ప్రకటింపబడినది.

భావకవులు ప్రకృతిలో పరమాత్మను దర్శించిరి. "ననలు, సొనలు, మంజు కుంజములు ఆ పరాత్పరుని ఆనందహాసలేశాంకురములుగా" భావించిరి.24 భావ కవిత్వములోని భక్తిగీతములను, పారమార్థిక కవిత్వముగా, మధుర భక్తికవిత్వముగ, మదిరాతత్వముగ ఆధునికాంధ్ర కవిత్వమున వింగడింపబడినది.

అగ్నివీణలో పారమార్థిక కవిత్వము, మదిరాతత్వము ప్రకటించు గీతములు కలవు:

ఈ మహాదారుణము - బాధ యెందుకోటకు:
పూవుజూచిన, ఆకాశమున జరించు
పక్షులనుజూచినా సుఖస్వప్నమొకటి
తలపునకు బారినా, తీవ్ర దాహభరము
బయలుదేరును నాపేదబ్రదుకు అగ్ని
శకలముగ గానిపించును సౌఖ్యమన్న
కంటగించును మనసు
ఈ మహాదారుణము - బాధ యెందుకోటకు
(ఎందుకోటకు-4)

ఈ కవితలోని పూవు - హృదయ పద్మమును, ఆకాశమున జరించు పక్షి జీవోత్క్రమణమును, సుఖస్వప్నము - ఆత్మానంద లేశమును సూచించుచు శాశ్వతానందమును పొందుటకై కవికి ప్రేరణను వేదనను కలుగజేసెనని, అందువలననే "ఇహాలోక సౌఖ్యమన్న *కంటగించును మనసు*".

"*ప్రతీక్ష యను*" ఖండికలో భగవంతుని దర్శనమునకై నిరీక్షించెను.

నేనునీకోసమే కాచినానుతండ్రి
మూగ కన్నులతో గుండె మోయలేని
బరువుతో..................................
................వత్తువనుచు నాకడకునీవె
ఎందు కనబడనె లేదు నీరాక,

భగవద్దర్శనము లభింపని కారణముచే,

స్తబ్ధమైన ఈ జడ ప్రకృతిలో
జీవరేఖలే శిలధిమైన ఈ పాడుబ్రతుకులో
ఏకాంతంలో గుడ్లగూబలా
ఎవరికోసమై తలపోతును,

అని తనను గుడ్లగూబవలె దైన్యముగ చిత్రించుకొనెను. ఏ ఉపాసనామార్గమున నీదర్శనము లభించునో చెప్పుమని పరమాత్మను ప్రార్థించెను.

పూలగుత్తులు దెచ్చి
మాల గుచ్చుదునా
పసిమి మొగ్గలనులిమి
పారవేయుదునా?
ఓ ప్రభూ చెప్పవా
ప్రేమ నించిన పాత్ర
పెదవి చేర్చుదునా?          (ప్రశ్న)

అని "*ఆత్మవేదనతో అల్లాడెను*" పూలగుత్తులు మాలగుచ్చుట సేవాభావమును పసిమి మొగ్గలు నులుముట వైరభక్తిని, ప్రేమనించిన పాత్ర పెదవిజేర్చుట- మదిరా తత్వమును ప్రకటించుచున్నవి.ఈ మార్గములో ఏది అనుసరణీయమో కవికి తెలియక ఆవేదన పొందెను.

పరమాత్మ తత్వము ప్రకృతి యందంతటను వ్యాపించియున్నదని భావించి,

కొండలో కోనలో
కొరంద లిరుటాకులో
నీ నటనలే తోచు
నీ మాయలే పూచు

(స్మృతి)

అని ప్రకృతినే పరమాత్మగా నుపాసించెను.

సూఫీ కవితలు చదివి రచించిన గీతములు రెండున్నవి. ఒకటి గీతమాలిక, రెండవది చంపకోత్పలమాల

సూఫీ తత్వము ప్రేమమూలకమైనది. ఈ తత్వము నారాధించిన కొందరు మదిరాపానము, మదవతీ సంభోగము లందు ఆనందమున్నదని అనుభవించి కవితలు రచించిరి. కొందరు ప్రకృతి సౌందర్యము నుపాసించిరి. మదిర అనగా అమృత మనియు, మదవతి ముక్తికాంతకు ప్రతీకమనియు తాత్వికముగ భావింతురు.

'నేను' అనెడి కవితలో కవి తాను ప్రేమైక భిక్షుకుడనని చెప్పుకొనెను. సూఫీ కవితలోని సౌందర్యము, కోమల భావములు, ప్రకృతి వర్ణనలలోని గులాబిపొదలు బుల్‌బుల్ పిట్టలు తన "*కండ్లలో పరిభవించి*" కవితలో పరిమళించుననెను.

"వేడికోలు" అను పద్యఖండిక సూఫీ సంప్రదాయములోని ఉమర్‌ఖయ్యామ్ తత్వము ప్రకటించినది.

" అలసిన లేయెండ కుదురై ప్రణయార్చన సేయజాలు, ని
ర్మల మదిరా ప్రపూర్ణము కిలారస పాత్రికదెమ్ము "

అని మదిరా పానమును,

కాలమునిల్వదొక్కనికి గన్నది నిక్కము 'నేడు' సంశయా
భీలము 'రేపు' జీవిత పవిత్రమరందము శాశ్వతంబుగా
వ్రోలలిరాంగి చూపకు మయోమయ లోకము లోకమంతయున్
వ్రాలిన నీ కనుగోనల పజ్జల నేనయి నేడచూచెదన్ "

(వేడికోలు)

అని వర్తమానమే శాశ్వతమని, యావన కాలమందే జీవిత పవిత్రమరందము నాస్వాదింపవలయునని ప్రకటించెను. ఈ ఖండకలోని 'ప్రేమ సంఫుల్లములైన మాహృదయముల్ పెనవైఛుమురియ్ము నెచ్చెలీ" అను పద్యములు, అబ్బూరి రామకృష్ణారావు రచించిన 'కాఫుపాట' లోని "ప్రేయసి లేచిరమ్మ చివురించిన మావుల క్రింద శీతలచ్ఛాయలలోన" అను పద్యములను తలపించుచున్నవి.

కవి మొదటగా రచించిన 'అనతి' లో

"కనులలో రుధిరాశ్రు
కణములుద్ధతి గూడ
మనసులో మిన్నాగు
ఫణమెత్తి పారాడ
సవరింతునా
అగ్నివీణ"

అనివర్ణించెను. రుధిరకణములు క్రోధమును, అశ్రు కణములు దుఃఖమును ప్రదర్శించెను. భావకవితా ప్రభావముతో ప్రేయసి పట్ల దుఃఖము ప్రకటింపబడినది రుధిర కణములు ఈ వ్యవస్థ నెదిరించెడి ప్రగతివాదగీతములను చెప్పుచున్నవి. "బానిసపదము" "అవిగో" "దమ్మిడి" అను కవితలు మతమును దారిద్ర్యమును బానిస తనమును విపరించినవి.
మొదటనే,

తీగెల్లో దారిద్ర్య
ధూమ్రధూమముతాగ
రాగాల్లో మరణ
వేగమ్ము చెలరేగ
సవరింతునా
అగ్నివీణ

అని చెప్పిన లక్షణము ప్రగతిగీతములందున్నది. కాని ఈకవితలు మూడే యున్నవి భావములలో తీవ్రతలేదు.

లేవండోయ్-బానిసలార
లేవండోయ్-పీనుగులార
చీకటులాదే-జీవములార
చింతాసర్ప-విజీర్ణతులారా
(బానిసపదము)

అని వర్ణించినకవి ఎందుకొరకు లేచుట, ఏమిచేయుట చెప్పలేదు. ఈ కవితకు "బానిస పదము" అని పేరుపెట్టుట వెన్నెల పదము, తుమ్మెద పదములను జ్ఞాపకము చేసి పాటకు ఊతగా వచ్చెడి పదముగా బానిస పదమును చెప్పనది.

"అవిగో" అను ఖండికలో మత దురహంకారమునకు బలియైన వారిని "చీకిపోయిన యెముకలు, జీవరేఖలంతరించిన కన్నులు, అహారవంబు మనన గావించు తీవ్రరోదనము"గ వర్ణించెను. మతమౌఢ్యముచేత కలుశితమగు జీవనమును 'వారి మనస్సు పహ్ని సరస్సు' 'జీవనము విషము'గ నున్నదనెను, "ద్రోహాసంకుల తమస్సు"లోన నివసించెడు భారతజాతి 'నిర్జీవమని' ఉపదించెను. తాత్పర్యముగ "ద్రోహబుద్ధి", మతమౌఢ్యము జాతిని నిశ్చైతన్యము చేయునను సందేశము ప్రకటింపబడినది.

"దమ్మిడీ" అను కవితయందు తనను యాచించిన భిక్షగానిని జూచి దానము చేయలేని తన దారిద్ర్యస్థితికి విచారించెను. వానివలె తానును 'బ్రతికి చచ్చినవాడ'నని నిందించుకొనెను "రక్కసి తనంబు గద్దపై రాజ్యమేలెడు చండశాసనమగు ధరా చక్రమందు,' తన వంటి వారి స్థితి ఇట్లే యుండునని ప్రకటించెను. వేదాంతులు తమ గాయములకు కర్మమను పూతపూయుదురని విమర్శించెను.

ఈ విధముగ రచింపబడిన మూడు కవితలలో దారిద్ర్యము, మతము, కర్మము ధనికుల నిరంకుశత్వము వర్ణింపబడి విమర్శింపబడినవి.

ఇవిగాక "వరూధిని" ని వర్ణించినకవిత, శివాజీ తల్లి జిజియాబాయి తలపుల "జోల" ఇందున్నది. మొత్తముమీద అగ్నివీణలోని కవితలన్నియు ఆవేదనను ఆత్మాశ్రయరీతిలో ప్రకటించి కావ్యనామమునకు సార్థక్యము కూర్చినవి.

# జ్ఞాపికలు

1) ముందు మాట - షాటీ స్రట్టపర్తి

2) తెలుగు కవులపై ఉర్దూ ఫారసీ ప్రభావము - పేజి 129
- డా॥ కె. గోపాలకృష్ణారావు

3) రమ్యాలోకము (7-8) - రాయప్రోలు సుబ్బారావు

4) నేటికవిత-ప్రకృతిపూజ - దువ్వూరి రామిరెడ్డి కవికోకిల గ్రంథావళి

5) రమ్యాలోకము 4-12, 13 పద్యములు రాయప్రోలు సుబ్బారావు

6) మొగలాయివంశచరిత్ర - విజ్ఞాన సర్వస్వము సంపుటము - 3 పేజి 652

7) మొగలాయివంశచరిత్ర పేజి 654 విజ్ఞాన సర్వస్వము సంపుటము 3

8) తెలుగుకవులపై ఉర్దూ ఫారసీ ప్రభావము డా॥ కె. గోపాలకృష్ణారావు

9) కావ్యాలంకార సంగ్రహము నాయకలక్షణము పేజి 45 ద్వితీయాశ్వాసము
తెలుగు - సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి

10) *See-Revolt of the Saleem - page 187. H V B V B*

11) శ్లో॥ సర్వభూతస్థమాత్మానం, సర్వభూతానిచాత్మని
ఈక్షతేయోగయుక్తాత్మా, సర్వత్రసమదర్శనః
షష్ఠాధ్యాయము ఆత్మసంయమన యోగము 29వ శ్లో॥ శ్రీమద్భగవద్గీత

12) నవ్యకవిత్వారంభము - డా॥ కోవెల సుప్రసన్నాచార్య విమర్శిని-కాకతీయ విశ్వవిద్యాలయము 1976

13) "తృణకంకణము-ఒక ప్రేమగీతి" ఆచార్య ఖండవల్లి లక్ష్మీరంజనం

14) తృణకంకణము-92వ పద్యము

15) At last her Authority Reached such a stage that the King was only in a name page 187 H V B. V B

16) జాతీయోద్యమ కావ్యములు మద్దూరి సుబ్బారెడ్డి

17) "వాకోవాక్యము" జమ్మల మడక మాధవరాయ శర్మ, అగ్నివీణ

18) కృష్ణపక్షసింహావలోకనము, స్వామి శివశంకర శాస్త్రి, కృష్ణపక్షము

19) స్వేచ్ఛా గానము-కృష్ణపక్షము-కృష్ణశాస్త్రి

20) "నిశాలోచనము, మీరుమరసారగా" ఖండికలు కృష్ణపక్షము

21) వాకోవాక్యము జమ్మలమడక మాధవరాయశర్మ

22) దీపావళి - వేదుల సత్యనారాయణ

23) "ఆమె" కృష్ణపక్షము కృష్ణశాస్త్రి

24) ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయములు ప్రయోగములు పేజి 448
—డా॥ సి. నారాయణరెడ్డి

# భక్తి కావ్యములు

పుట్టపర్తి కవితకు ఆవేశము ప్రధానము. సంప్రదాయకుటుంబమునుండి ఎదిగి వచ్చుట వలన దైవభక్తిభావన రక్తగతమైనది. భక్త్యావేశముతో ఆయన కవిత్వము పాలుకురికి సోమనాథుని, శ్రీనాథుని కవిత్వమువలె ప్రవాహముగా పొంగి వచ్చును. ఆయనరచించిన కావ్యములన్నింటిలోను భక్తికావ్యములే అధికము జాతీయోద్యమ కావ్యములందు ప్రగతి కావ్యములందు కూడ భక్తిభావములున్నవి. ఏ దారిద్ర్యము నైననూ అనుభవింతును గాని భక్తి దారిద్ర్యమును మాత్రము అనుభవింపలేను అని ఆయన ఒకచోట చెప్పిరి.[1]

పుట్టపర్తి రచించిన భక్తికావ్యములు పాద్యము, మేదసా శతకము, విభూతి శతకము, సాక్షాత్కారము. శివతాండవము, ఖండకావ్యములకే పరిమితము చేసుకొన్న విషయము ననుసరించి పైకావ్యములలోని భక్తిభావనలు ప్రస్తుతము వివరింపబడుచున్నవి. శివతాండవము మాత్రము ప్రత్యేక అధ్యయనాంశములోనిది.

పుట్టపర్తి బహుముఖ వ్యక్తిత్వము గలవాడు. భక్తిమార్గమునందును అనేక సంప్రదాయముల పరిభావము పొందినవాడు పుట్టుకతోనే శ్రీవైష్ణవ సంప్రదాయ భక్తిభావనలు వెన్నంటి వచ్చినవి. చిన్నప్పటి నుండి తిక్కన భారత పఠనము వలన హరహరాభేదము కుదురుకున్నది. మరాఠీ సంత్‌కవుల, హిందీకవుల ప్రభావముచే రామకృష్ణోపాసనము అలవడినది. ఆధునిక యుగములో అధ్యాత్మిక ప్రవర్తకులైన రామకృష్ణపరమహంస, వివేకానందులు, శ్రీఅరవిందుల జీవన ప్రభావము కూడ పుట్టపర్తి రచనలపై యున్నది. అందువలన పుట్టపర్తి భక్తి కావ్యములను ఏదో ఒక సంప్రదాయమునకు అన్వయించుట కష్టము.

పుట్టపర్తి సృజనాత్మక సాహిత్యము ఈ సృష్టిని గూర్చి, సృష్టించిన పరమేశ్వరుని గూర్చిన జిజ్ఞాసతో ప్రారంభమైనది.

"ఏమో ఈ వికటంపు రూపకము లిందేయర్థముత్పన్నమై
ప్రేమాధీశ్వరునిండు కన్నులకు దృప్తిన్ గూర్చునో హేతువే
మో మాయాత్మల కందరాదు వెడయూర్పుల్ జిమ్మి నిర్వేదధా
రామాంధ్యమ్మున మోకరిల్లు మతియెల్లన్ యోచనా సంగతిన్"

(పెనుగొండ లక్ష్మి-1)

ఈ పద్యము భగవంతుని ప్రేమాధీశ్వరుడనియు, నిరంకుశ స్వాతంత్ర్యము కలవానిగా

చెప్పి ఆత్మన్యూనతా భావము ప్రకటించినది. ఆత్మలు మాయాధీనములని, వాటి ఆలోచనా శక్తి పరిమితమని స్పష్టముగా పేర్కొనినది. ఈ సృష్టిని గూర్చి దాని స్వభావమును గూర్చి శోధించిన మతి తన అసహాయతను ప్రకటించి దైవమునే శరణు వేడినది. ఈ భావమే తరువాతి నాల్గవ పద్యమున యింతకంటెను స్పష్టముగ ప్రకటింపబడినది.

"నాకేమి దోచదు బుద్ధీంద్రియ మంతరించినది యోస్వామీ భవన్మాన సాంబుద విద్యుల్లత లెట్లు వోయినను బోవు, నిల్పువాడెవ్వండు ధరా చక్రము నీకై మొగిచియుండు సృష్టి సంక్రీడలున్" అని ఈ సృష్టియంతయు పరమేశ్వరుని భోగ్యవస్తువని జీవుని ఆలోచన పరిమితము భగవంతుని లీలలు అపరిమితములని జీవజాలమంతయు అతనికై మోడ్చి యుండునని వర్ణింపబడినది.

ఈ విధముగ సృజనాత్మక సాహిత్య ప్రారంభమే భగవంతుని మహిమాధిక్యమును వర్ణించి, అతని శరణు వేడుటయే జీవధర్మమని సూచించినట్లయినది. జీవేశ్వరులకు సంబంధించిన నవవిధ సంబంధములలో రక్ష్య రక్షక భావము, భోక్తృ భోగ్య భావము, స్వస్వామి భావములు ఈ పద్యతాత్పర్యముల మూలమున సూచింప బడుచున్నవి.

అనంతమైన కాలము అనంతుని అధీనమని, అట్టి కాలమును అతిక్రమించుట మానవులకు సాధ్యము కాదని, ఉత్థాన పతనములు గత చరిత్రలోని మేలు గీళ్లు తలచి విలపించుట తగదని 'పుడమి సుఖదుఃఖ నిత్య సంభూతి లేక అరుగలేదిది" అని సృష్టి పరిణామము చక్రనేమిక్రమమని వ్యాఖ్యానించబడినది.

కాలము నారాయణ స్వరూపమని చెప్పిన పద్యము విచిత్రమైనది.

"కనులు విప్పని ఈ యోగి కంఠమందు
చిలుక సాలను తులసి పేరులను గూర్చి
ప్రతిదినము పూజలొనరించు ప్రకృతిలక్ష్మి
యేమొ ఆ చిట్టి తల్లికే నోము కలదొ"

(పెనుగొండలక్ష్మి)

"కనులు విప్పని యోగి" అనుట వలన యోగనిద్రాపరవశుడైన నారాయణమూర్తి స్వరూపము స్ఫురించుచున్నది. అట్టి యోగికంఠమున ప్రకృతిలక్ష్మి

చిలుక వరుసలు అను టలసి మాలలతొ అర్చించుచున్నదట. అనగా జీవులనుద్ధరించుటకై మాతృ మూర్తియైన లక్ష్మీదేవి భగవంతునికి పురుషకారము చేయుచున్నదను శ్రీ వైష్ణవ సంప్రదాయ రహస్యమిచట సూచింపబడుచున్నది.

పై పద్య వర్ణనలో గోదా శ్రీరంగనాథుల కథనముకూడ స్ఫురించుచున్నది. "అ చిట్టితల్లికే నోము కలదొ" అనెడి పద్యపాదము గోదాదేవి పాటించిన వ్రతమును జ్ఞాపకము చేయుచున్నది. కనులు విప్పనియోగి శ్రీ రంగనాథుడు. శేష తల్పముపై శయనించువాడు. శేషుడు కాలస్వరూపం. అకాల స్వరూపమునధిష్ఠించినది, పరమాత్మ శ్రీ రంగనాథుడు. ఆ రంగనాథుని భర్తగా వరించి తులసిమాలలను సమర్పించినది గోదాదేవి. ఆమె ఈ విధముగా జీవులకు మార్గదర్శకమైనది.2 అందులకే చిలుకసాలు అనుపదబంధము జీవ పరంపరను వ్యక్తము చేయుచున్నదని ఊహించుట. తిరుప్పావు అనుద్రావిడ గ్రంధమునందు గోపికను చిలుకగా సంబోధించుట యున్నది. మరియు వీరబ్రహ్మేంద్రస్వామి తత్త్వములయందు చిలుక జీవ సంకేతముగా బహు పర్యాయములుపయోగింపబడినది. ఈ విధముగ పై పద్యము అలంకారికముగ, తాత్వికముగ, సాంప్రదాయికముగ నర్థముల నిచ్చుచున్నది,

షాజీ కావ్యమునందు మొదటి పద్యములోనే "ఆనంద రూపమై మోదమొసగు సాత్త్విక వ్యక్తికే నమస్కార శతము" అని పరమాత్మ ఆనంద స్వరూపుడనియు ఆనంద ప్రదాతయనియు వర్ణింపబడినది. ఈ కావ్యమునందు పరమాత్మ శక్తిముందు ఆయన సంకల్పబలము ముందు, సాధారణ మానవుల ఆత్మశక్తి సంకల్పములు పని చేయవని "ఎదిరి వచ్చిన శక్తులన్నిటిని మింగి, యాపరాప్పుటు తలవు వాట్యంబు లాడె"-(3గ) అని ప్రకటించెను.

ఈ విధముగా పరమాత్మ సర్వజగన్నియామక శక్తిగా సానంద సాకార స్వరూపునిగా మొదటిరెండు కావ్యములందు వర్ణింపబడెను. యోగిపుంగవునిగా సంభావించబడెను. పాద్యమునందు అట్టి పరమాత్మయే యోగిరూపమున, గురుదేవుని రూపమున తన యింటికరు దెంచెనని చెప్పబడినది.

" తరుణార్కతుహిన ముక్తామాల బోలునే
నేత్రముల దయార్ద్ర బాష్పములతోడ
గంభీరభావ నిష్కలుష దీప్తులు పర్వ
యొరపెట్టి విడిచిన పరిధితోడ

నవరసాలకిసాల ప్రవిమలారుణ కాంతి
నొడిగొన్న జుంజురు జడల తోడ
నావంటి పతితు లెందరినైన రక్షింప
జాచిన అభయహస్తంబు తోడ

యజ్ఞ వేదికవలె బవిత్రారుణములు
నిండు చూపులు దిక్కులనుండి వెలుగ
మాగురు స్వామిః నా పాలి మధుర మూర్తి
వచ్చినాడమ్మః మాయింటి వలుకు నేడు

( పాద్యము-1 )

ఈ పద్యమును "ఇల్లు" అనగా భక్తిభావనా కుటీరము. అందొక సన్ముహూర్తమున పరమేశ్వరుని రూపము ప్రత్యక్షమైనది. ఆ రూపము యోగి రూపము వలెనున్నది. పుట్టపర్తి ఈ రూపమును సంభావించుటకు కారణము ఆయన ఉపాసించెడి అష్టాక్షరీ మంత్ర ప్రభావమనవచ్చును. నారాయణ ఋషి ద్వారా అష్టాక్షరీ మంత్రము లోకమున పరంపరగా ప్రవచింపబడెను. మంత్రమునకు-మంత్రద్రష్టకు అభేదమును భావించుట సంప్రదాయము. ఈ విధముగ పరమాత్మ రూపమును యోగి రూపముగా కవి సంభావించెను ఆయన దివ్యరూపమును కీర్తించి తన వేదన లేక ఆర్తిని ప్రకటించెను. ఈ నివేదన భగవంతుని గుణాధిక్యము ఆత్మన్యూనతా భావముగా ఇరువది ఏడు పద్యములలో సాగినది. సృష్టింపబడిన ఛందోమయాకారం కూడ భావాను గుణముగా నున్నది. భగవంతుని స్వరూపము సీసపద్యమునందు వర్ణింపబడెను. తరువాతి వన్నియు తేటగీతి పద్యములు. ఈ పద్యములలో జీవుని వేదన వెల్లడింపబడి అహంకారము త్యజింపబడినది. చివరకు తన్మయీ భావస్థితిని జీవాత్మ అనుభవించినది.

ఆత్మ సమర్పణము భక్తిభావనా దశలలో చివరిమెట్టు. ఆస్థితిని చేరకముందు భక్తునకు భగవంతుని యెడ ఆసక్తి యుండును. ఈ ఆసక్తి-భావనాపరము. దీనినే నారదాదులు అహేతుకమగు పదునొకండు భక్తిభావనా సక్తులుగా చెప్పిరి. ఆత్మ నివేదన మొనరించిన. భక్తునకు పరమేశ్వరుడు ఎల్లవేళలా అతడు కోరినట్లు దర్శనమిచ్చుచుండును. భగవంతుని అనుభవముగాఢమై భావనలు పరిపక్వమై రస పర్యవసాయి అగును. భక్తి రసాయన కారులు వీటినే దాస్య, సఖ్య, మధుర, శాంత రసములుగా చెప్పిరి.3

| నారదాదులు చెప్పిన భక్తిభావములు | రసములు |
| --- | --- |
| గుణ మాహాత్మ్యాసక్తి | |
| స్మరణా సక్తి | |
| రూపా సక్తి | |
| పూజా సక్తి | |
| దాస్యా సక్తి | దాస్య భక్తి (రసము) |
| ఆత్మ నివేదనా సక్తి | సఖ్యభక్తి ,, |
| వాత్సల్యా సక్తి | వాత్సల్య |
| కాంతా సక్తి<br>పరమ విరహా సక్తి | కాంతా భక్తి |
| తన్మయలా సక్తి | శాంత భక్తి |

పాద్యమునందు వర్ణింపపడిన జీవేశ్వరుల సంబంధము గాఢమైనదికాదు. ఒక సమ్మహూర్తమున 'కలవతె హటాత్తుగా వచ్చి'' భగవంతుని రూపము నిలచినది. ఆ రూపమును కనులార దర్శించి తనివి తీరసంభాషింతమను కున్నంతలో, అందులకు తాను అర్హుడనాయను సందేహము కలిగి జీవుడు కొట్టు మిట్టాడినాడు. ఈ దశలో భావములు ఒకదానిపై ఒకటి యుబికి రాగా వాటిని నిలుపుకోలేక పోయినాడు. జీవుడు భగవంతుని రూపమును దర్శించుటలో కలిగిన ఈ భావాసక్తులనే పాద్యము వర్ణించినది.

"సాత్మస్మిన్ పరమప్రేమ రూపా"4 - ప్రేమ యనగా ఒక వస్తువునందు లేదా వ్యక్తియందు కల్గెడి అనురాగము. లౌకికమైన ప్రేమ ఉపాధుల నాశ్రయించి యుండును. అలౌకికమైన ప్రేమ భగవంతుని రూపము నాశ్రయించి యుండును. అట్టిదియే పరమ ప్రేమ. అదియే భక్తియని నారదాదుల అభిప్రాయము. ఉపనిషత్తుల యందు ఈ ప్రేమ భావనము ఉపాసనయని పేర్కొనబడినది. లౌకిక విషయము లందు ప్రేమ క్షణికమైనది. కాని భగవంతునియందు కల్గెడి ప్రేమ తైలధార వలె అవిచ్ఛిన్నముగా నుండవలెను. పరమశబ్దముచే ఈ ప్రేమను భగవంతుని యందు తప్ప యితరుల యందుండకూడదని నారదాదులు సూచించిరి. భగవంతుని యందుండు ప్రేమ నిష్కామముగా నుండవలెను. పెనుగొండ లక్ష్మియందు మొదటి పద్యము లోని ప్రేమాధీశ్వరుడను వర్ణన మిట్టిదే.

భగవంతుని సర్వజ్ఞత్వ, సర్వశక్తి మత్వములు కవి సృజనాత్మక సాహిత్యము లోని మొదటి పద్యమునందే ప్రకటింపబడినవి. పాద్యమునందు వాత్సల్య, సౌశీల్య, సౌలభ్యములు వర్ణింపబడినవి.

" వాసనయెలేని క్షుద్ర పుష్పమ్మునెవరు
తలధరింతురు? రాలి పోవలెనెగాని
బ్రతుకుజీకిన నాపేద హృదయమెంత
యింపుగానందుకొంటి వోయీ మహర్షి"

(పాద్యము-6)

తన బ్రతుకు వాసనలేని క్షుద్ర పుష్పము వంటిదని ఆత్మన్యూనతను వెల్లడించి, ఇటు వంటి నికృష్ట జీవితమును ఆకర్షించిన భగవంతుని స్తుతించెను. ఈ వర్ణనలో 'మహర్షి' అని భగవంతుని సంబోధించుట చేత *"యమే వైషవృణుతే తేనలభ్యః"* అను ఉపనిషద్వాక్యమిచట అనువర్తించును. పాపిని గానీ, పుణ్యవంతుని గాని, ఎవరినైతే భగవంతుడు స్వీకరించాలనుకుంటాడో ఆతనిపై తన అవ్యాజకృపా కటాక్షము ప్రసరింపజేసి స్వీకరిస్తాడని అర్థము.5 భగవంతుని వాత్సల్యము, అవ్యాజకృపా కటాక్షము పై పద్యమున వర్ణింపబడెను, రెండవ పద్యములో భగవంతుని వాత్సల్య భావమును *"ఆ 'మహాఋషి చూపులయందు పొడమి జీవకారుణ్యమెల్ల చిలికినదియు"* (పాద్యము-2) అని జీవ కారుణ్యమూర్తిగా సంభావించెను, "నా పేదహృదయ మెంత *యింపుగా నందుకొంటివోయీ మహర్షి"* అనుటలో యిట్టిభావన విశదమగుచున్నది. భగవంతుని వాత్సల్య గుణమును సన్నుతించుట భక్తిభావనా సక్తులలోని గుణ మహాత్మ్యాసక్తియని చెప్పవచ్చును.

తనను అకారణముగా ఈ సంఘము బహిష్కరించినదనితాను తిరిగి మరణించుటకే జన్మనెత్తిన జడుడనని తన కారుణ్యగాథ భగవంతునికి నివేదించెను. శివతత్వ సారము మొదలగు భక్తిశతకములలో, "నేనొక నికృష్ట మనుజుడ" నని ఆత్మన్యూనత్వము వెల్లడించుట కనిపించును, ఆధునిక కవులలో భావకవులు కొందరు తమను గాము అతిదైన్యముగా చిత్రించుకొని భగవంతుని కరుణామయుడిగను, పాపులను రక్షించువానిగను అభివర్ణించిరి. ఇది క్రీస్తు మతప్రభావము కావచ్చును. అప్పుడగు జీవుడు తనదైన్యమును భగవంతునకు నివేదించి ఆయన కటాక్షమును కోరును. ఇట్టి దశనెకు ఆర్తుడని పేరు.6 పాద్యమునందు కనిపించెడి జీవుని వేదనలో ఆర్తిలక్షణ మున్నది

" లౌకిక విషాదములకు గుండెరగిలి రగిలి
నీ చరణ సీమ నాశ్రయించితిని నేను"

(పాద్యము-20)

భగవంతుని ఆశ్రయించిననూ ఆ సంబంధములో ఒక సూత్న అనుతాపమును జీవుడు పొందుచున్నాడు. అతని దర్శనము జీవునకు అంత స్పష్టముగా లేదు. అందువలన

" కలవలె హఠాత్తుగ వచ్చి నిలచినావు
తండ్రి పతితుడ ఈ గృహాంతరమునందు
సత్యమునువోలె నెపుడు శాశ్వతము గాగ
నిండు చూపులనన్ను మన్నింపవయ్య

(పాద్యము-11)

అని కోరుకొనెను. స్వప్నావస్థ వలెనున్న అస్పష్టాను భవమును సత్యమువలె శాశ్వతము చేయుమని కవి భావన. ఈ పద్యమునందు రెండు విశేషములున్నవి. పరమాత్మను సత్యముతో నుపమించుట చేత ",సత్యంజ్ఞానం అనంతం బ్రహ్మ" - అను ఉపనిషద్వాక్యమిట అనువర్తించును. పరమాత్మను తండ్రి అని సంబోధించుట, పాద్యమున రెండు మూడుచోట్ల కనిపించును. జీవేశ్వరులకు గల నవ విధసంబంధములలో పితాపుత్ర సంబంధమొకటి, ", పితాచరక్షకశ్శేషీ " అనుసంబంధము పాద్యమున జీవుడు ప్రదర్శించినాడన వచ్చును.

శాశ్వతముగా తన హృదయమున నిలువుమని భగవంతుని" ప్రార్థించిన కవి అతనికి సమర్పించిన ముఖపూజ విలక్షణమైనది. పలుకరింతమని బుద్ధి పుట్టును కానీ వెంటనే సిగ్గు ఆవరించును. "మనసులో భావ శబలత్వమున్నది. దరిజేరి నిలచెదమని నంతనే శరీరము కంపించి గుండెలు దద్దరిల్లుచున్నవి. రాకరాక వచ్చిన గురుదేవుని జూడగా కనుల బాష్పములు నిండినవి. ఆబాష్ప పూరంబుతో పాద్యమిడుదుననుకొని నంతలో 'ప్రతిజల కణముపరమపూతంబు తమ పేరుపలుకదేమొ'-అని సందేహము ఈ విధముగా సాగినది ముఖపూజ. ఇందురేఖా మాత్రముగ కాంతాసక్తి కన్పించు చున్నది. తనను కాంతగా చిత్రించుకొని పరమాత్మను ప్రియునిగా భావించుట కాంతాసక్తి. ఈ విషయము ఐదారు పద్యములలో- వర్ణింపబడి చివరగా,

"*నాతలపు పంట నావాపు, నాథుడవుచు*" అని స్పష్టముగా మధురభక్తి భావన. తరువాతి రెండు పద్యములలో పుత్రభావముతో తల్లడిల్లుట వర్ణింపబడెను. జీవునకు కల్గిన ఈ అనుతాపము అతనికి అంటియున్న అహంకారము వలన కల్గుచున్నదని గ్రహించి ఆ అహంకారమును త్యజించెను.

" నేననెడి భావమున తెగనీల్గిపోవు
శిరము వంచితి గురుదేవు చరణసీమ"

(పాద్యము-13)

నేను అను భావమును విడనాడుటయే అహంకార త్యాగము. అహము తొలగిన వెంటనే సర్వము భగవదధీనము అగును. అదియే ఆత్మనివేదనము. ఈ స్థితిలో కామ్యమునకు తావుండదు. అందువలన అంతఃకరణము పరిశుద్ధమై గురుదేవుని అమృత మయమైన వాక్కులను వినగల్గెను. రూపమును కనగల్గెను. ఆతని శీతలచ్ఛాయలో తన్మయమును అనుభవించెను.

ఈ విధముగా పాద్యపద్య ధారావళియందు జీవేశ్వరుల సంబంధములోని భావాసక్తులు ప్రకటింపబడినవి. ఇందు ప్రకటింపబడిన జీవుని వేదన వేదనాశతకమునందు విస్తృతముగా వివరించబడినది. భగవంతుని గుణాధిక్యము, విభూతులుగా, తద్విభూతుల అనుభవము గాఢమై భక్తిభావాసక్తులు దాస్య సఖ్య, మధుర, శాంతి, రసములుగా విభూతిశతకమునందు పర్యవసించినవి. ఒక విధముగా పాద్యము వేదనాశతక, విభూతి శతకములకు సంక్షిప్త రూపమని చెప్పవచ్చును.

## వేదనాశతకము :

వేదన యనగా అనుభూతి లేక జ్ఞానము అని అర్థము7. లౌకిక ప్రపంచమున వేదన బహువిధములుగా నుండును. కాని వేదాంత విషయమున వేదన ఏకవస్తు పరిజ్ఞానము. భగవదనుగ్రహము కలిగిన జీవులకు ఆ అనుభవమును శాశ్వతము చేసికొనన ప్రయత్నించినపుడు అడ్డుపడెడి అరిషడ్వర్గములతోడి సంఘర్షణములలో వేదనావశలుండును. ఈ వేదనలనధిగమించిన జీవునకు పరమాత్మానుభూతి నిత్యమగును.

లౌకిక ప్రపంచమున అనుభూయమానమగు వేదన రెండు రకములు. వ్యక్తిగతము, సామాజికము. జీవనమునకు కావలసిన నిత్యావసరములకు విరోధము కల్గినపుడు, ఆప్తులు దూరమైనపుడు, శరీరాంగములకు ఆపద సంభవించినపుడు వ్యక్తిగతముగా వేదన సంభవించును. జాతి లేక సమాజము నందు కల్గిన పరిణామములకు

ప్రతిస్పందించి హృదయము వేదనా భరితమగుచున్నది. లౌకికముగా ఈవేదనను ఆవేదనయనుచున్నాము. ఆధ్యాత్మమార్గమున కలిగిన వేదనను సంవేదన అను చున్నాము. రెండింటిలోను అనుభూతియున్నది, ఒకటి తాత్కాలికము, మరియొకటి నిత్యానుభూతి సోపానము. ఆవేదన క్రమముగా సంవేదనగా పరిణమించి స్థిర మైనచో భగవదనుభవము నిత్యమగును. భగవద్విభూతులతో నిత్యసంబంధమేర్పడి అలౌకికానందము సంప్రాప్తించును. వేదనాశతక విభూతిశతకములలో ఈ క్రమ పరిణామము వ్యక్తమగుచున్నది.

భగవంతుడు అనుగ్రహించదలచిన భక్తుని అజ్ఞానము పోగొట్టుటకు జ్ఞాన దీపము ప్రసాదింతునని చెప్పెను[1].

"నీవొక దివ్యదీపమయి నీవెలుగుల్ ప్రసరించుచోట నా
జీవితరేణువింత వికసించినచో మదిజింతలేదు స్వా
మీవెలకట్టరానిది సుమీ! భవదీయ ఋణంబులీనమై
పోవును నా కృతజ్ఞత ప్రభూతము నీకరుణాంబురాశిలో"
(వేదనాశతకము_1)

భగవంతుడు ప్రసాదించినజ్ఞానమనెడి దీపముచే జీవితము వికసించునను అవగాహన కల్గిన కవిఆతని అకారణ కరుణా వారికి కృతజ్ఞతను ప్రకటించెను. "అఖండ రసా కృతిగా" భగవంతుని అనుభవించిన కవికి హృదయగహ్వరమునుండి వేదనా తరంగ ములు పైకుబికి వచ్చినవి. మనస్సును హరించి పూర్వజన్మల సంబంధమైన అనేక వేదనల ప్రాదుర్భవింపజేయుట భగవంతుని లక్షణము[2]. ఈ స్థితి రెండు దశలలో సాగినది.

1) తనబాహ్య అవసరముల కొరతచేత పొందిన వేదనతోపాటు దాస్యముతో కృంగిపోవు జాతి పతనావస్థను చిత్రించుట.

2) ఆత్మోజ్జీవనమునకు ప్రతిబంధకములైన అరిషడ్వర్గములతో కలిగిన మానసిక సంఘర్షణ తనయందే గాక జాతి పరముగా దర్శించి ప్రకటించుట.

ఇట్టి స్థితిని సంపూర్ణమానవత్వమనియు ఇట్టిస్థితి కల్గినవాడు సంపూర్ణమానవుడనియు కఠోపనిషత్ వ్యాఖ్యానమున వివరింపబడెను10. సమాజమునకు వ్యక్తికి అవినాభావ సంబంధముకలదు, పరమేశ్వరుని ఉనికిని జీవుల సమూహమైన జాతి యందు దర్శించి. అనుభవైకవేద్యములను స్వానుభూతిగ్రహించుకొని ప్రకటించుట కవిగా సమ దర్శిత్వమును తెల్పుచున్నది.

## బాహ్యావసరములగూర్చిచింతన :

"*తల్లి గతించిపోయినది తండ్రి దరిద్రత గ్రుంగె*" (27) పుట్టపర్తి నాలుగేండ్లు వయసున తల్లిని కోల్పోయెను. పదిహేనేండ్ల వరకు తండ్రి పెంపకమున పెరిగి పెద్ద వాడయ్యెను. పరంపరాగతమగు ఆస్తి ఏమియు లేనందున తండ్రి దారిద్ర్యముచే కృంగిపోయెను. ఈస్థితిలో బంధువులు కూడ తనను చూచి పల్కరించుట మానివేసిరి. (వేదనాశతకము_26) భగవంతుడైన రాముని నమ్ముకొని ధైర్యము వహించెను, ఇదికవి జీవన పరిస్థితి. ఇటువంటి దారిద్ర్యము తనకే గాక దేశమునకు కూడ సంక్రమించినది. తనసోదరులు దారిద్ర్యముచే పరదేశ విద్య నేర్చుకొని ఆంగ్లుల సమాదరణంబునకు అమ్ముడు వోవుచున్నారని (వేదనాశతకము 67) మనసు చంపుకొని కేవలము ధనము కొఱకు బానిస భావముతో బ్రతుకు జాతికి మోక్షము లేదని (వేదనాశతకము_68) చింతించెను. స్వాతంత్ర్యము కొఱకు పోరాడువ్యక్తులు తమస్వార్థమును వదలి జాతిస్వేచ్ఛ కొఱకు పాటుపడుచుండగా, కొందరు మాత్రము "*మానవత్వంబితరులకు అమ్మి గూండ్లు కట్టి*" నారని తమ సుఖ సంతోషముల కొఱకు వ్యక్తిత్వము బలిపెట్టి పరదేశీయుల దాక్షిణ్యము కొఱకు ప్రాకు లాడి ఇదే అదనుగా అవకాశముగా ధనార్జన చేసిరి.

"తమ్ముల రక్తమాంసములు దాహభక్షమ్మున పీల్చి భోగరా
జ్యమ్మున వసించు నీధనిక జాతికి లజ్జయె లేదటంచు"
(వేదనాశతకము_65)

పరదేశీయులను, పరదేశీయులకు తొత్తులుగా నున్న భారతీయ ధనిక వర్గమును విమర్శించెను. ఈ విధముగా కవి అనాటి తనయొక్క, జాతియొక్క వాస్తవిక దైన్య పరిస్థితిని వివరించెను.

## అంతరమైన జీవునివేదన :

ఆత్మతత్వమును అన్వేషించు జీవుని మార్గములో అడుగడుగున అడ్డుపడెడి కామ క్రోధాది అరిషడ్వర్గములు ప్రాకారములవంటివి. వీటిని తరించినగాని మానసిక చాంచల్యమునణించి చిత్తైకాగ్రత లభింపదు. భగవంతుని పై గల ప్రేమ స్థిరముగా లేనపుడు జీవుడు ఆవేదన పొందును. అశాశ్వతములయిన ఐహిక సుఖములకు నీతి తప్పిచరించు అధర్మ ప్రవర్తనకు, సత్యమగు శాశ్వతమగుపరమ ప్రేమను హృదయమున స్థిరపరచుటకు ఆచరించవలసిన ధార్మిక వర్తనకు మధ్యన కవిపొందిన సంఘర్షణ ఇట్లు చిత్రింపబడినది.

*"పరసతులను కనుంగొనిన పాడుమనంబొక పిచ్చిపక్షియై పరుగిడ"* (వేదనా-శతకము 14) అందోళనము చెందెను. వెంటనే జీవుని యెదలో ఉపనిషద్రుచుల బోధలు యిరమ్మదమువలె మెరసినవి. కోరికలకు, నైతిక సూత్రములకు మధ్య మనస్సు శుష్కకాష్ఠముగా కాలిపోయినది. ఈ సంఘర్షణ కామ భావమునకు మధ్య జరిగినది.

*"పరులను నింద సేయుటది పాపముగా"* తెలిసిననూ, నిగ్రహించుకొనలేక పోయెను. తనమనస్సుకు బాధకల్గించిన వారిని యుక్తాయుక్త వివేకములేక దూషించి పిదప తప్పుచేసితినని అనుతాపము పొందును. ఇది జీవుని క్రోధలక్షణము మధ్య సంఘర్షణము. తనకన్నను దారిద్ర్యముతో బాధపడు వారిని జూచి పైనున్న అంగవస్త్రమును దానము చేయవలెనను కోరిక జనించును. కాని వెంటనే స్వార్థము విజృంభించి *"నాకనెడు"* భావము మనస్సు నాక్రమించగా రాయివలె ఆ భిక్షుకుల వేదనలు కనుగొనుచుండును. కాని దానము చేయలేకుండుట లోభగుణము.

(వేదనాశతకము-63)

విద్యనేర్చితినన్న గర్వము ఇతరులకన్న విద్యాధికుడనను అహంకారము పెచ్చుపెరిగి పెరవారలచూచి నవ్వి హేళన చేసెను. తప్పు గ్రహించి తానే అవిద్యా పరిరంభ జాల్ముడనని" పశ్చాత్తాపము పొందును. ఇది మదము లక్షణమునకు మధ్య జరిగిన సంఘర్షణ.

తన జన్మకు సుఖపడే యోగము లేదని, హాయిగా నవ్వుకొనుటకైనను నోచుకోలేక పోయితినని దుఃఖించుట సహజము. కాని "నవ్వులు భాగ్యవంతులకై ముడివేసి బిగించినారు పో" అని పరులను జూచి అసూయ పడుట మాత్సర్య లక్షణము.

ఈ విధమైన కామక్రోధాది లక్షణములు ఆవేశపూరితమైన తన మనస్తత్వము వలన కల్గుచున్నవనియు "మస్తకమున దయ్యమూనినటు ఒక పనియందు వెన్కలను యోచనలేక మునింగి పైయునని" (వేదనాశతకము–50) తరువాత అనుతాపము పొంది కన్నుల నీరుగ్రమ్మగా దుఃఖింతుననియు భగవంతునకు నివేదించును. "ఈ వికలితబుద్ధి" ఎప్పుడటకు అనేక జన్మ సన్నాటితమైన ఈ జడత కారణమని గ్రహించెను.

"ఆత్మవంతుల – మహాత్ముల జీవితముల్ పఠించి" వారివలె తాను కావలెనని యాశపడెను. వారి సహన సౌశీల్యములను స్మరించుకొని అకలుషమైనవారి చిత్తవృత్తికి ఆశ్చర్యపడెను.

"ఒక యవివేకి యాగ్రహము నూని పదాహతిడుల్ల నేసినన్
బ్రికటము సేయడా మధురబాబుకు దగ్గని కొల్చు ధర్మక
ర్తకు యతి రామకృష్ణుడు పరప్రతి హింసకు తల్లడిల్లియ
త్యకలుష వృత్తి ముగ్ధ హృదయంబున కెంతటి శాంతి ప్రభూరా"
(వేదనాశతకము–49)

శ్రీరామకృష్ణుడు తన అనుభవములను శిష్యులతో నిట్లు చెప్పెను. "అతడు కాళీఘట్టపు చంద్రహాల్దార్. తరచు మథురుని యింటికి వచ్చుచుండెడివాడు ఒకనాడు భగవదావేశస్థితిలో క్రిందపరుండి యుంటిని. అచట చీకటిగా నుండెను. మథుర బాబుకు ప్రీతిపాత్రుడనగుటకై నేను తన్మయ స్థితిని నటించుచుంటినని చంద్రహాల్దార్ తలచెను. గదిలో ప్రవేశించి తన కాలి జోళ్ళతో నన్ను తన్న నారంభించెను. శరీరమున నల్లని చారలు పడినవి. ప్రతి వారును ఈ సంగతి మథురబాబుకు చెప్పబూనిరి. నేను వలదంటిని."–11

ఈ సంఘటనము స్మరించుకొనుచు కవి అంతటి సహనశీలమునిమ్మని, ఆ సహనమువలననే ఆత్మకు శాంతి లభించునని విశ్వసించెను.

"ఆలయ భూమి దోచెడు ప్రయత్నము బూనిన చోరులన్ ధను
శ్శాలులు రామలక్ష్మణులు చక్కయ నిల్చినవారు తద్విభా
గోశము జూడలేక పడగూలిన వేకువ రాము గన్నులన్
గ్రోలిన భక్తులంచు పలుకున్ తులసీ ప్రభుడెంత ధన్యుడో"
వేదనా శతకము–48)

శ్రీరామచరిత మానస గ్రంధ ప్రతిష్ఠను జూచి సహింపలేని కాశీపండితులు కొందరు ఆ గ్రంథములు దొంగిలించుటకు ఇద్దరు దొంగలను రాత్రి సమయమున పంపిరి, దొంగలు వెళ్ళి చూచునప్పటికి తులసీదాసు కుటీరము ఇరువురు ధనుర్ధారులు కాపలా కాయుచుండిరి. ఒకడు శ్యామలాంగుడు. వేరొకడు గౌరవర్ణుడు ఈ ఉభయులు మహా తేజస్సుతో పహారా ఇచ్చుచుండగా దొంగలు చూచి చకితులైరి. తెల్లవారి తులసిపాదములపై బడి క్షమాపణ వేడి జరిగినదంతయు చెప్పిరి. తులసీదాసు వారిని భక్తులుగ సన్మానించి శ్రీరాముని దర్శించినవారి అదృష్టమును కొనియాడెను.12 శత్రువులను సహితము క్షమించగలిగిన హృదయ వైశాల్యముగల తులసీదాసును తలచుకొని కవి ప్రతిస్పందించెను.

తనవలెనే జాతియంతయు "*పరనిందా కరణంబె వాక్ప్రౌఢిగా*" "*మద్యాది పానరతుల్ సభ్యతగా*" *దుష్పథ పదన్యాసము*" *సంస్కారముగా* "*పరనారీ పరిరంభణాతురతమే రాసిక్యముగా*" జీవనము గడుపుచున్నదనియు వాపోయెను. తరతరములనుండి వచ్చుచున్న మేధా సంపత్తి నశించిపోయి క్షుద్రమయిన ప్రజ్ఞలు స్వప్రయోజనము కొరకు వాడుకొనుచున్నారని. "*అద్వైత భావాసక్తుల్*" మరణించి గర్వగ్రంధులు పేర్కొన్నవనియు "*సత్కార్యనిష్ఠా సౌజన్యము*" కూలిపోయిన ఈ దేశము ఏమి కానున్నదోయని ఆందోళనము ప్రకటించెను.

క్రమక్రమముగా ఆర్ష ధర్మములు అడుగంటిపోయి "*భౌతికమే మహార్థముగా*" సాగుచున్నది. భోగమునకు త్యాగము అంగముగా కల్పించి క్రమముగా భోగమును త్యజింపవలెనని ఋషులు చెప్పిన ధర్మసూత్రములు ప్రజలయందు అడుగంటిపోయి రాక్షస విలాసము అంతటను కన్పించుచున్నది.

"ఈ లయతాండవంబును సహింపగ వేయి మనంబులైననున్
జాలవు తండ్రి-ముష్కర విశంకట తాదవభీమ ధూమ ప్ర
జ్వలిత సంఘమున్గనగ జాలను జాలి తీర్పలేను ఆ
భీలము తండ్రి ఈ విధుర వీణకు జీవిక చేర్చి యేడ్చెదన్"

(వేదనా శతకము-73)

అని జాతి పతనావస్థను జూచి దుఃఖించెను.

ఈ శతకములో ఈ వేదనలో సహజమైన ప్రశ్నలు కొన్ని రేకెత్తినవి. సహజ స్వరూపము లోక స్వరూపముగా భావించి కవి భగవంతుని ప్రశ్నించెను. అహంకారాభిమానములు గల్గి కృత్రిమమైన బుద్ధిగల్గి పైకి మాత్రము సజ్జనునిగ నటించువానిని ఈ లోకమెందుకు నెత్తిపై పెట్టుకొనుచున్నది? (71) న్యాయమునకు కట్టుబడిన మానవుని జంకులేక అన్యాయము నెదిర్చు తనవంటి వానిని దూరముంచు కారణమేమి? లోకమెందుకు వెలివేయుచున్నది? (76) ఈ ప్రశ్నలకు సమాధానము దొరకలేదు. లోకపాలకుడైన దేవుని లీలలను కూడా ప్రశ్నించెను. దుష్టుడైన భర్తకు పతివ్రతయైన భార్యను ఇచ్చి ఆ పతివ్రతను తల్లడిల్ల పెట్టుదవు? (82) సాధువృత్తి నవలంబించి జీవించువానికి కష్టములేల కల్గించెదవు? (82) దుష్ప్రవర్తకులకు సుఖమయ జీవితమెందుకిచ్చెదవు? (82) భర్త దుష్టుడై స్త్రీ గృహస్థవము చేయుచుండగా అతని నేల శిక్షించవు? చూచువారలు మెచ్చువారిని గెలిపించుచు వారికి శిక్ష విధింతువు? (83) తన బాలునివలె అజ్ఞానివలె భగవంతునిపై ప్రశ్నల వర్షము కురిపించెను. ఈ విచిత్ర సృష్టిని జూచి ఆశ్చర్యపడి "నరుడున్న మునుపే లక్షణమగునా" అని ఆక్రోశించెను. (89) ఆకవులలో ప్రకృతి యొసగిన ఆహారమునుభుజించి, పడియల నీరు త్రాగి, మృగమువలె సాధువృత్తి గడిపిన బాగుండునని (89) మానవ జన్మనెత్తి ఈ సంఘపు టొత్తిడులు తట్టుకోలేనని తన అశక్తతను వెల్లడించెను.

ఈ విధముగా తన ఆర్తిని భగవంతునకు విన్నవించిన జీవునకు, ఆయనదప్ప శరణము అన్యమేదియు కనబడలేదు. కామక్రోధాది పాపకార్యములకు తానెకము "నేనేను" పదార్థముగా గుర్తించెను. అట్టి అహంకారమును వర్జించి హృదయములో "అణియము దివ్యోగవెల్గు" పరమాత్మను గుర్తించెను (93). ఆయనయే తన తలపుల నెరవేర్చునని, అతని నిగ్రహానుగ్రహములే పాపపుణ్యములనియు భావించెను. అఖండ రసాకృతియైన పరమాత్మ తన భావనాకాశమునందు "శివతాతి కాంతులను" ప్రసాదించునని, ప్రసాదింపవలెనని భావించెను. (94)

ఇట్లు జీవుని వేదన వ్యక్తిగతముగ, జాతిపరముగ, ఉల్లేఖింపబడి చివరకు భగవంతుని శరణు వేడిననే శాంతి-ఆనందము లభించునని ప్రకటించి ఈ గ్రంథము నకుగల "వేదనాశతకము" అను పేరు సార్థకము చేసినది.

## విభూతిశతకము :

విభూతియనగా ఐశ్వర్యమని అర్థము.13 సకల చేతనా చేతనముల ఉత్పత్తి స్థితి ప్రవృత్తులు భగవంతుని సంకల్పాధీనములై యుండును. ఇదియే ఆయన ఐశ్వర్యము ఇట్టి ఐశ్వర్యమును అది పరిణమించుటకు కారణమైన భగవంతుని కళ్యాణ గుణములను జ్ఞానులు తలచి భజింతురు. భగవంతునియందు లగ్నమైన మనస్సు కలిగిన భక్తులు అతని కళ్యాణ గుణములను అనుభవించి అతని అవతార దివ్యచేష్టితములను వర్ణించి తలంచెదరు. మరికొందరు భగవంతునితోడి నిత్య సంసర్గము కోరుకున్నవారై అతని అవ్యాజ కృపాకటాక్షము చేత తాము కోరుకున్న రూపములలో భగవంతుని అనుభవించెదరు. ఈ విభూతిశతకమునందు భగవంతుని కళ్యాణ గుణములు దివ్యావతారములు వర్ణించబడినవి.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు "నాతో నిత్య సంసర్గము కోరుచున్నవారై నన్ను భజించు జ్ఞానులకు వారుకోరిన విధమున విశదతమమగు నాసాక్షాత్కారమును ప్రేమతో నిచ్చుచున్నాను. దానిచేత వారునన్ను పొందగలరు"-14 అనిచెప్పెను. విభూతిశతకము ఈ మహార్థమును వర్ణించుచూ ప్రారంభమైనది.

" శ్రీ రమ్యంబగు రూపుతో పతిత హృత్పీమల్ గటాక్షించి సం
సారక్లేశ పరాఙ్ముఖత్వ సుఖసాక్షాత్కారతా సిద్ధిస
ద్వైరాగ్యంబు ఘటించి మోక్షపదవీ భద్రాత్ములంజేయుసా
కార బ్రహ్మము సద్గురున్ సకలలోక స్వామి నర్చించెదన్ "

(విభూతిశతకము-1)

ఈ పద్యమున " పతిత హృత్పీమల్ " అనిచెప్పుటచేత పతితులైననూ, పవిత్రులైననూ, ఎవరినైతే భగవంతుడు స్వీకరించాలను కుంటాడో ఆతనికి సుఖ సాక్షాత్కార సిద్ధి కలిగించునను భగవంతుని నిరంకుశ స్వాతంత్ర్యము చెప్పబడినది.

భగవంతుని విభూతులలో మొట్టమొదటిది ఆత్మ. ఇది సర్వజీవాంతర్గతమైనది. " లోపల వెల్గు వెల్గులకు " అని కవి సూచించెను. ఈ ఆత్మయే ప్రకృతి యందంతర్యామిగా వ్యాపించియుండెను. పరప్రకృతి నుండి జీవప్రకృతిలోనికి భగవంతుని ప్రతినిధిగా అవతరించిన ఈ ఆత్మ ఆది-మధ్య అంతములేనిది.15 రూపము లన్నియు భగవద్విభూతికి సంకేతములు. ఎందువలననగా ప్రతి రూపము నందును అంతర్గతమైన ఆత్మయున్నది. ఆత్మశక్తి దివ్యగుణముల ద్వారా

ఉత్కృష్టముగా నెచట ప్రకటింపబడునో అట్టి విభూతులను భగవద్గీతలో శ్రీకృష్ణుడు కొన్నిటిని చెప్పెను. " అదితి పుత్రులలో విష్ణువు, - రుద్రగణములలో శంకరుడను. " అనుగీతా విభూతిని,

" అక్షినిదాచికొన్న నిటలాక్షునిబోలి విభూతులెల్ల ప్ర
త్యక్షము చేయువాడు - కమలాక్షుని పోలిక లోకరక్షణా
దీక్షితుడైనవాడు"-

(విభూతిశతకము-8)

అని కావ్యమున వర్ణించబడెను.

పరమాత్మయొక్క విశిష్ట విభూతిని రంగనాథస్వామిగా కవి దర్శించి యిట్లు వర్ణించెను.

" తలగడ చేయిగా విదుర దాల్తువు పచ్చని వాడ వోలె నా
మెలకువ నిద్రలో సకలమేదిని జూచెదు, నమ్మికొన్న భ
క్తులకును బుణ్యరూపమయి దోచెదు నీ యతిదివినిద్రయన్న మా
మెలకువ వ్యర్థమై వెలు నిమీలిత నేత్రుల మోదుమో గురూ"

(విభూతిశతకము-13)

భగవంతుడు "ఎవరియందు నాశక్తులు మానవులందుకొనగల అత్యున్నత-శిఖరము లందుకొనునో వారు సదా స్వయముగా నేను. నా విశిష్టవిభూతులు" యోధులలో రాముడను, వృష్ణికులలో కృష్ణుడను" అని తెలిపియుండెను. "రాముడు తానమై విధికి రాముని గొల్చెడివాడు" అని కావ్యము వర్ణించెను. దక్షిణామూర్తి స్వరూపమును'

" చిరముగ మాకునై తపము చేసెడివాడు పవిత్ర పన్నగా
భరణము లేనివాడు"-

(విభూతిశతకము-7)

అని వర్ణించెను.

భగవంతుని దివ్యవిభూతులలో అవతారములలో కవి కృష్ణావతారమును అధికముగా ప్రేమించెను. బాలకృష్ణుని లీలలను తనివితీర వర్ణించెను. ఈ క్రమములో సాగిన వర్ణన దాస్య, సఖ్య, వాత్సల్య మధుర భావములను వెల్లడించెను.

కృష్ణభక్తిని వర్ణించిన వారిలో వల్లభాచార్యులు, చైతన్య మహాప్రభువు, సూరదాసు మొదలైనవారు కలరు. వల్లభ సంప్రదాయమున, వాత్సల్య, సఖ్య, దాస్య మధుర భక్తి భావనలు కన్పించును. చైతన్య మహాప్రభువు ప్రవచించిన గౌడీయ సంప్రదాయములో సఖ్య మాధుర్య భావమునకు ప్రాధాన్యము. ప్రేమలక్షణము కల్గిన భక్తి గౌడీయ సంప్రదాయ విశేషము, రాధా కృష్ణుల పరస్పర మహానురాగము ఈ సంప్రదాయమున అధికముగా కీర్తించబడినది 6

ఈ శతకమునకూడా కృష్ణభక్తి, మధురభక్తి మార్గముననే సాగినది. వాత్సల్య సఖ్య, దాస్యభావములు కొలదిగా కన్పించినా, రాధాదేవివలె, భాగవతములోని గోపికల వలె మధురభక్తి భావనలనే నధికముగా వర్ణించినది. వాత్సల్య భావమున మాతృ హృదయము ప్రతిబింబించును. యశోద కృష్ణునిపై వాత్సల్యము కురిపించినట్లుగా కవియు కృష్ణుని వర్ణించెను.

"కఠినమైన దారులలో తిరిగినచో కఠోరములైన కంటకములు కోమల పదాగ్రములకు గుచ్చుకొని బాధకల్గునని, సరియగు బాటలో నడచిరమ్మని(విజాతిశతకము-48) కంటకమొకటి పాదమున గుచ్చుకొనినచో తన హృదయమున నిశితశూలము గ్రుచ్చినట్లగునని, -48). మోవిపై చిరునవ్వు విరిసినచో తన హృదయమున వేయి వెన్నెలలు నాట్యమాడునని (49). కలువలతోడనే బొమిడికమురచించి, పెద్ద నెమ్మి ఈకలు సవరించి, మల్లెల మాలగట్టి కొండగోవులతో కడియాలదీర్చి మురిసి పోవుటకు ఎదిరిచూచెదనని (42) బాలకృష్ణుని గూర్చి మాతృహృదయమును ప్రకటించెను. ఇవన్నియు వాత్సల్య భక్తి భావనలు.

భగవంతుని సేవచేసి తరించవలెనను భావము దాస్యభక్తి లక్షణము. గోపికలు ఆళ్వారులు, తులసీ సూరదాసులు తమ కవితలలో దాస్యభావము ప్రకటించిరి. ఈ శతకమునందు బాలకృష్ణుని గోపికాభావమూలమున సేవ చేసినట్లు వర్ణింపబడెను. "*భక్తలోక పాపమును తొలగించెడి పవిత్రములైన పాదములందు సువాసనా భరితమైన గొజ్జగి నీరుపోసి తడిపోవగ కొంగుతో నొత్తినానులే దయసేయుమురా*" *(60)* అని ఆహ్వానించుటయు, '*నీకు రుచించునట్టి కమనీయ పదార్థము లెట్టి వట్టివో నారగింపు ముందుగనె ప్రాణములన్నైన నర్పణజేసి తెచ్చియిచ్చెదను*'(74) అనియు చిన్నికృష్ణునకు అలంకరణార్థమై "*తరుణ సరోజదామములు మేలో*"ఉరమున అలంకరించుకొనుటకు "*మనోహర తులసీవినీలదళహారము మేలో*" కొప్పున అలంకరించుకొనుటకు "*కల్హార దండలు కోరుకొందువో*"(75) అనియు, స్నానము

చేయుటకు "నల్గుపించి చెత్తగ హరుడునా' స్నానాంతరము "కనులలో కాటుక దీర్చెదునా, పసుల తడిమొత్తి నన్నని జరీవాటు నలంకరింతునా" అని సేవాభావములు ప్రకటింపబడినవి ఇది దాస్యభక్తి లక్షణము.

భగవంతునితో స్నేహపూర్వకముగ మాటలాడుట, వినయముగా తనకోరికలు వెల్లడి చేయుట, తనను తరింపజేయుటకు ఆతడే దిక్కని నమ్మియుండుట, సఖ్యభక్తి లక్షణము. భారతమున అర్జునాదులందట్టి లక్షణముకలదు. గోపాలకుడైన కృష్ణుడు గోవులతో కలసిమెలసి తిరిగి వాటిని గాచెను. ఆధేనువుల భంగి తనను కరుణించుమని "మేలము లాడి మేనిమెరి మెత్తని భాగ్యము దయచేయుమని'(31) నేనొక ధేనువైనచో ఆ రమణీయ శృంగములను తామర మొగ్గలందు - పట్టుకుచ్చులను పెట్టెదవు, కళలు పూనిన కన్నులందు తడిముద్దులు పెట్టెదవు" 32) అని బృందావనములో కృష్ణుని సహచరియైన ధేనుజన్మము కోరుటలో పరమాత్మతోడి సఖ్యము వ్యంజింపబడుచున్నది. ఇది సఖ్యభక్తిని అత్యంత మనోహరముగా వర్ణించిన విషయము.

మధురభక్తికి ఈ శతకములోని పద్యములు మూడువంతులు ఉదాహరణీయములే. "నేనిరీష కుసుమాంగిని గోపిక, నీవే ఈ జగన్నాటక సూత్రధారి యదునాథుడు" అని నాయికాభావము నవలంబించి నీవురానిచో సిద్ధము చేసిన పూల మాలలను, చందనమును ఏ వలరాజు దేహమున నలంకరింతును? నాజీవము లెట్లు నిలుపుదును. 50 అనియు, "నాపుణ్యఫలమై ఇంటికి వత్తువంచు నే ముచ్చట నెన్ని దుస్తులను మార్చితినో" అని అభిసారికాభినయమును (52) "అవునులే మహా బిరుదమందిర పెద్దవు-చిత్తమేచ్చ్రపోడవు, పిచిదాకులు గడిల్కొన బూచుట యేమి, దానిపై గవగవ నవ్వూపేమి - సవిలాస కటాక్ష సుందరా"(54) అని విరహోత్కంఠితా లక్షణమును, అలరులజోలు ప్రేపలయూను గుణంబుగ దిప్పిదిప్పి భావలతల పెంపుచేర్చెదవు - నీ జిలుగు విసాళి కన్నులరుచిన్ - కనుబొమ్మ చలించినంతనే నిలువున నీరుగాకరగి నిల్తును నేనొక ముగ్ధరాధనై" అని రాధగా తనను భావించుకొని విరహబాధలను ప్రకటించుచు మాధుర్య భావములు వర్ణింపబడెను.

"తొలితాకు చల్వలకు" మురియుచు బృందావనమున దాగిన నల్లనయ్యను వెదకి వెదకి వేసరిల్లి చివరకు ఆయననే శరణువేడినట్లు, "ఏగతి వత్తువోయి వచియుంపుము"? రథముపై రాజువై వత్తువా, విలాసము సందడింప బంగరు పల్లకిలో వత్తువా, నీవు ఏ విధముగ వచ్చిననూ "నీలకృష్ణ ఎలసే మధురాంగముతోడ' రమ్మని ప్రార్థించుట భాగవత లక్షణము.

విభూతిశతకమున వర్ణింపబడిన వాత్సల్య, దాస్య, మధుర, సఖ్య భక్తులు ఈ క్రింది పద్యములో పరాకాష్ఠ పొందినవి.

" ఈ నిను జూచునప్డు - నిలువెల్లను గన్నులు, సేవలోసుఖం
బానెడు నప్డు - నాదున్నిలువంతయు చేతులు పల్కపల్కి నీ
యాఖ్యాతి గోరునప్డు - నిలువంతయు నోరులు, నీస్తవంబు నం
దేనురమించు నప్డు - నిలువెల్లను కంఠములీయరా ప్రభూ॥

(విభూతిశతకము-80)

ఈ విధముగా భగవదవతారములోని దివ్యలీలలను అనుభవించి - ఈ సుఖమును యిట్లే శాశ్వతముగా కల్పించమని, 'స్వేచ్ఛా కలకోకిలవలె' చల్లగా భగవద్గుణాను కీర్తనము చేసికొందునని, భగవంతునితోడి అభేదము తనకు అవసరము లేదని (84) ప్రార్థించెను. అతని కరుణా కటాక్షము చేతనే, తనలోనున్న ఆ శని శక్తి చైతన్యము చేతనే తాను ద్వితీయశతకము చెప్పగల్గినట్లు కవి ప్రకటించి తన శేషత్వమును స్థిరీకరించెను.

## సాక్షాత్కారము :

తులసీదాసు జీవితములో వివాహానంతరము సంఘటించిన ముఖ్య సన్నివేశములను వర్ణించిన కావ్యము సాక్షాత్కారము. కవి "రామచరిత మానస్" గ్రంథమును నిత్య పారాయణముగా చేసికొనిన అనుభవము నుండి ఈ కావ్యము జనించెనని చెప్పవచ్చును. "రామచరితమానస్" లోని దోహాలను ఖండికల ముందు పేర్కొని, వాటికి వ్యాఖ్యాన రూపముగా ఖండికలను రచించినట్లు కనిపించును. దోహాలకు చిన్నచిన్న తెలుగు వ్యాఖ్యానములు గలవు. భగవద్గీత శ్లోకములు కొన్ని ఖండికల ముందును కొన్నిఖండికల చివరను కన్పించుచున్నవి. కొన్ని ఖండికలకు పేర్లు పెట్టబడినవి, కొన్నింటికి లేవు. మొత్తము పదునాలుగు ఖండికలుగా ఈ కావ్యము విభక్తమైయున్నది.

సాక్షాత్కారమున ప్రధానముగా కన్పించు పాత్రలు రెండు. ఒకటి మమతాదేవి రెండు తులసీదాసు, అగ్బరు, మీరా దొంగలు మొదలగునవి నేపథ్యములోనివి. వారి చర్యల వలన కలిగిన తులసీదాసు మానసిక పరిణామము కావ్యమున చిత్రింపబడినది.

మమతాదేవి తులసీదాసును కర్తవ్యోన్ముఖునిగా తీర్చిదిద్దిన గృహిణి. తులసీదాసు ఈమెను మరచునంతవరకు కావ్యమున ఈమె ప్రశంస కల్పించును. దాదాపు మూడు ఖండికలలో ఈమె వర్ణించబడినది. కామాసక్తుడైన భర్తయెడల మమత వైరాగ్య ప్రవర్తన మొదటి ఖండికలో చూడవచ్చును. రెండవ ఖండికలో భర్తకు హితోపదేశము. మూడవ ఖండికలో భర్తచే ప్రశంసింపబడుట వర్ణింపబడినది.

మొదటి ఖండిక చివర ఒక పద్యమున్నది, ఆ పద్య సారాంశము రెండవ ఖండికకు అన్వర్థమగుచున్నది. ఆ పద్యమిది :

> " విషయ సుఖంబులంబడి వివేకము వీడి నశింతురేమి మా
> నుషమని మేల మాడుటకు నోయన దూరపు కొండ కొమ్మలం
> దుష నడలెంచె పక్షులు సనూదితము న్బొనరించెఁ బూతమా
> నసములు నా ప్రభాతలలనా హితబోధలు రాగభంగులన్
>
> (సాక్షాత్కారము ఖండిక-1)

ఈ పద్యమునందు కవి ఉదయాత్పూర్వమున్న ఉషఃకాలమును వర్ణించెను. సంధ్యాసతి, వివేకము నశించి విషయ సుఖములలో కొట్టుమిట్టాడు మనుజత్వమును వెక్కిరించుటకు వచ్చినదట. ఆ ప్రభాతలలనాహిత బోధలను పవిత్ర హృదయములు గల్గిన పక్షులు తమరకరకముల కూజితములచేత '*అనూదితంబొనరించినవి.*' ఇచట "*రాగభంగులు*" అను పదము విలక్షణముగా ప్రయోగింపబడినది. ప్రభాతలలనాహిత బోధలు "*రాగభంగులు*" రెండవ ఖండికలో మమతాదేవి తులసీదాసునకు అనురాగముతో చేసిన ప్రబోధమును సూచించుచున్నది.

మమతమీది మోహముచే తులసీదాసు ఆమెను పొందుటకు సమీపించెను. ఆమె '*విరక్తత గట్టుదన్నెనో*' అనునట్లు అతని విరోధించెను. ఇది ప్రథమ ఖండికలోని విషయము. '*విషయ సుఖములను బడి వివేకము వీడి నశింతురేమిమానుషమని*' రెండవ ఖండికలో తులసీదాసు మోహము తొలగించుటకు మమత మేలములాడును. తనపై అనురాగాధిక్యముచే పరుగెత్తి వచ్చిన తులసిని,

> " ఎవరయ్య వీరు శాస్త్ర
> ప్రవణులౌ ఒక దినపు విరహ భరమునకే మే
> ర విడచి పరుగిడినారట
> శివ శివ అనుకున్న సిగ్గుచేటగు నాకున్"
>
> (ఖండిక-2)

ఊరి పొలిమేర విడచి వచ్చుటకంటె వ్యక్తిత్వపు మేర దాటి వచ్చుట మమత సహించలేకపోయెను. అందులకే,

' ....... .... వేద శిఖా పరినిష్ఠితుల్మహో
దారులు మీరలొక్క వనితామణి కింతగ దాల్మి వీడుచే '

(ఖండిక-2)

అని ప్రశ్నించెను. పురాణ పఠనము వేద వేదాంగాభ్యాసము నంతయు, "*అన్నుల కొంగుగాలి భరమై పయి సోకెడు నంత*" వరకే అను విషయము మీ ఎడల సత్యమైనది సుమా '*మహాసుధీ*' అని వెక్కిరించినది. పురుష జాతికి స్త్రీ యనిన దైవముతో సమానము. కాని స్త్రీల కడగంటి చూపుల నవ్వులకు ఉన్మాద బుద్ధులౌదురు. త్వదీయ జ్ఞానమును గ్రసించెడి దురంత రజనీతమములు, ఘనమోహ రూపములవియే. ఈవిధంగా జ్ఞానమును పోగొట్టుకొని క్రమ్మరపుట్టుచు చనిపోయెడి తీరికలేని ప్రయాణమును త్రెంపుము. '*రాముడు కానిదెల్ల మాయారచితంబటన్న పరమార్థము నెరుంగుము*' అని మమతాదేవి బోధించెను.

మనము భార్యాభర్తలమై ఐహిక జీవితము "*కామ సంధానములొల్లి వృధా చింతింపను కోర్కెలేదు.*" నీవు ప్రజ్ఞానిధివి. "*నా ప్రాణము తెల్ల వెచ్చమిడియై నను నిన్నాత్మ దేవుజేసి దేహమే కనులుగా తిలకింపదపంబు జేసెదను*" అని నిశ్చయాత్మకమైన తన ప్రతిజ్ఞ స్పష్టము చేసెను. చరిత్రలోని ఒకానొక సంఘటనమున కిట్టి కావ్యరూపమును పలిగించుటలో కవికి శ్రీరామకృష్ణుని జీవితము ప్రేరణ కల్గించెను. రామకృష్ణుడు వివాహానంతరము భార్యను మాతృమూర్తి వలె సంభావించెను. కామోప భోగము విడచి పరమాత్మభావమునందు లీనమై పొందెడు ఆనందము అన్ని సుఖములకన్న మిన్నయని రామకృష్ణుడు బోధించెను. శారదామాత శ్రీరామకృష్ణుల దివ్య జీవనము మమతా తులసీ దాసుల ప్రణయజీవనము వర్ణించుటలో కవికి మార్గదర్శకమై యుండవచ్చును. తులసీదాసు భార్యనువీడి వెళ్ళునపుడు ఆమెకునమస్కరించి ప్రదక్షిణముచేసి వెళ్లును. ఆమె తన చైతన్యమందలి శక్తియని, మాతృమూర్తియని సంభావించెను. ఈ సన్నివేశము రామకృష్ణ ప్రభావమునకు ప్రత్యక్ష నిదర్శనము.

మమతాదేవి భర్తను మేల్కొలుపుటకు ప్రోత్సాహ వాక్యములు పల్కినను, కర్తవ్యోన్ముఖుని చేయుటకు సానునయ బోధనలు చేసినది, రాముడు "*చిక్కనాయను*

తలంపు మనస్సున కల్గెను". కాని రామచంద్రుడు దయారాముడు. పిల్చినంతనే ఖరారుగ వచ్చును. నీ మనస్సులోని ప్రియములన్ని తన చరణపీఠిని అర్పణ చేసికొమ్ము" అని తులసికి సాధనా విధానమునుపదేశించెను.

తనపరువము తంగేడు పూలవంటిదని, ఎప్పటికైనను రాలిపోయే ఈ పరువముపై మోహమువీడి, ఎన్నటికి సురుగని, వాడని మనోహరశోభలు రూపుకొన్న రాముపద తామరసములను అతులగ్రోలమని శాశ్వతానంద సందర్శన మార్గము తులసికి తెలియజెప్పెను.

సాధనలో జాగరూకత వహించవలసిన విషయములు కూడ వివరించి మమత తులసికి ఆచార్యస్థానము వహించినది "వెనుకకు తగ్గరాదని" అనగా సంకల్పము చలింపకూడదని, "కనుపేమరు జెందగరాదని" - అనగా ఏమరుపాటు పనికి రాదని, "వేగిరపడి మనసును కృంగగరాదని," అభిమానము పూనగరాదని," ప్రేమలో "అలుపున తగ్గరాదని", అనగా సాధన దశలో పరీక్షలెన్నియైననూ స్వామిపై ప్రేమ అధికముగా పెరుగవలెనే కాని తరుగరాదని, "రాముని గనునంతవరకు మదికావల పట్టు చలింపరాదని" రాముని గనుటయే ప్రయత్న ఫలమని గుర్తుచేసినది

రామచంద్రుని సేవకొరకు తనభర్తతోడి సాన్నిధ్యమును విడిచిన ఊర్మిళవలె మమతాదేవి తులసీదాసుయొక్క ఉన్నతదశల కొరకు తన స్వార్థము విడచినది. తాను పూరెమ్మవోలె ఇచటనే నిలతునని పరిమళమువోలె భర్తను పయనకు కమ్మని చెప్పినది. తనలోని శక్తిని వాగ్రూపముగా వెలువరించి, భర్తలో చైతన్యము కల్గించిన శక్తి స్వరూపిణిగా మమతాదేవి కావ్యమున వర్ణింపబడినది. అందులకే మొదటనే కవి ఆమెను అన్యాపదేశముగా తులసీదాసులోని మోహతమస్సును తొలగించిన సంధ్యాసతిగా. ప్రభాతలలనగా ప్రతీకాత్మకముగ సంభావించెను.

తులసీదాసు వేదవేదాంగములు క్షుణ్ణముగా చదువుకొనెను అతనికి మాఘశుద్ధ పంచమి శుక్రవారము శ్రీనరహరి అనందులు ఉపనయము జరిపించిరి తులసిగాయత్రి మంత్రోపదేశము పొంది పూర్వపరిచయమున్నవానివలె సుస్వరముగనుచ్చరించి అందరిని ఆశ్చర్య చకితులను చేసినాడట [18] ఇట్టిగాయత్రి మంత్రోపాసనాపుణ్య ఫలమే మమతాదేవియనవచ్చును.

"వలపేయాయువుకైన లక్ష్యమను దుర్వాదంబుతో గుండెలో
తలలో ద్రోదుటుకొన్న చీకటుల యుక్తుల్వాన్ని ఖండించియా
విలముల్ గన్నులు విప్పినావు చెలి నీవే భార్యవో తల్లివో
ఫలితంబైన మదీయ పుణ్యమహా సంభావించి రూపించవే"
(ఖండిక-3)

అని భావించెను. తనకు ఉపదేశము చేయనంతవరకు తులసి ఆమెను భార్యవలె చూచెను, సుఖముల ననుభవించవలెనని కాంక్షించెను. ఆమె తన ప్రజ్ఞను మేలు కొలుపు మాటలు చెప్పినప్పటి నుండి దేవతగ తనపుణ్య ఫలమాత్మరూపిణిగ సంభావించెను. భార్యప్రబోధముతో తన కామాసక్తులను, భక్తిరాగా సక్తులుగా మార్చుకొన ప్రయత్నించెను. మమతను మరచిపోలేక, "నీవే నాకడకన్నుల నిల్తువు న్యాన్యలక్ష్యమై", "రాముడు నిల్చు చోటు ఇంకలేదు కదా"-అని వాపోయెను.

"పుష్పపుష్పమునందు నీ వలపు పూచునుపో! ప్రతి వేపమాన ప
ల్లవమున త్వత్సుధాధర విలాసము, కోయిల చిట్టిగొంతులో
కువకువ కూతనీ పలుకు-కోమలి! నీవిటరూపుగట్టుచున్
గవిసితివేమొ! యీ ప్రకృతిగా నడుగడ్గున నూరడింపగన్"
(ఖండిక-3)

ప్రకృతియందు ప్రతియంశము మమతానురూపముగ తులసికి దర్శనమిచ్చెను. తృతీయ ఖండికలో ప్రతి పద్యములోను ఈ భావము ప్రకటింపబడినది. అప్పుడే విడిచిపెట్టిన మమతను మరచిపోలేక ఆమెను గూర్చి విరహవేదన తులసి అనుభవించెను.

"ఎన్నియుగంబులయ్యె హృదయేశ్వరి వింతగ పల్కరించి నీ కన్నుల గాచి"
(ఖండిక-3) అని తపించిపోయెను.

చకిత రసార్ద్రదృష్టులు లసన్నవ నీరజమాలబోలినా
వికసిత వక్షమున్పెనచి ప్రేలిన నాటల గోటి చంద్ర చం
ద్రికలు విదిర్చివైచె దరిత్రీపుల నవ్వులు రామసేవలో
నొక యణువైన నయ్య మృత మారునో?
(ఖండిక-3)

అని సందేహపడెను "ఇకనేమి ఘటిల్లె విషాదము" అని విదారాశపడెను. ప్రకృతి యంతయు ఆమె సౌందర్య ప్రతిఫలనముగా భావించి "నీ ప్రేమ బలముచే భోగిని యోగినొనర్చితివి. అటులనే ఈ తపమున దీక్షను మేలుకొల్పి ఆ రాముని రామచంద్రుని విరక్తహృదిన్ వెలిగించి వేయవే" అని మమతను తన లక్ష్య సాధనలో ప్రోత్సహించుమని అర్థించును.

సత్యము తులసికి తెలుసు. ఆ సత్యము రామచంద్రుడని చదువులు చెప్పినవి. కాని విషయాసక్తమైన మనస్సు మమతను మరువకున్నది. తనను మమత దూరము చేసినదని తులసి కోపగించలేదు. ఆమె జీవితమును తనకొరకే త్యాగము చేసినదని తులసి భావించెను. "విరహవ్యథ గ్రమింగికొన్న నీ వొక త్యాగమూర్తివి." అని మమతను అగ్గించెను. ఆమెను వీడినపుడు రెండు చేతులెత్తి నమస్కరించెను. ప్రదక్షిణము చేసెను.

సాధనలో తులసికి ఏకాగ్రత కుదురుటలేదు. "చిరుగాలి వీచినపుడల్లా సుధాస్మృతులు తిరుగబెట్టెను". "నాతపంబె చలించునో" అని తులసికి సంశయము కల్గుచున్నది. క్రమముగా ఉద్వేగము తగ్గి మమతను మరచిపోవు స్థితికి వచ్చెను. రామునికి తనహృదయములో చోటెక్కడిది అనుకున్న తులసికి రాముడు "భాగ్యభాండము"గా కన్పించసాగెను భావనలోని మమత క్రమముగా ఆతని చైతన్యముగా గుర్తించెను. వాగర్థములవలె తమను సంభావించుకొనెను.

తనగానములోని నాదముగను, తన హృదములోని వాడని పారిజాతముగను,

> "నా తనువులోని చైతన్యమే నీవు
> పూతరామాయణంబుగ నిండు చదలెల్ల"

అని ఆమెను వాగీశ్వరిగా నుపాసించెను.

> "మద్భావాంబర దివ్యాప్సరసా
> వేదార్థములచిలుకు సాంతముగాగన్"

అని ప్రార్థించెను. ఈ విధముగ కవి తులసీ-మమతల చిత్రించుటలో శ్రీ రామకృష్ణుని జీవితము నుండియేగాక. భావకవిత్వములోని కుంచపాలికా ప్రణయము నుండి కూడ ప్రేరణపొందినట్లు కనిపించుచున్నది.

# సాక్షాత్కారములోని భక్తి మార్గము :-

తులసీదాసు ప్రదర్శించిన భక్తి మార్గము మూడుదశలలో సాగినది. తనభార్య మమతాదేవి యందున్న అపరిమితాను రాగమున క్రమముగా భగవంతునిపై మరలించే ప్రయత్నము తొలిదశ.

చిత్తము జవరాలిపైని మోహమువదిలి క్రమ క్రమముగా భగవంతుని అన్వేషణలో సాగుచూ భక్తి మార్గమున కొన్ని స్థితులను అనుభవించినదశ రెండవది. ఇష్టదైవము స్పష్టా స్పష్టముగ అగుపించగా వానియందు ప్రేమ మిక్కుటమై సంపూర్ణ దర్శనము కొఱకు ప్రేమ మూర్తిగా నుపాసించుట. తనలోని జాతిమత ద్వేషముల పరిహరించి సర్వమానవ సమానత్వ దృక్పథముతో భగవంతుని ప్రేమమయుడిగా సంభావించుట మూడవదశ.

ఈ మూడు దశలను సాధనభక్తి, స్నేహభావభక్తి, ప్రేమభక్తియని చెప్ప వచ్చును. ఈ మూడింటిని యింకను సూక్ష్మముగ ఇట్లు వివరించవచ్చును.

భక్తి

సాధన — భావ — ప్రేమ 19

వైధి, రాగానుగ — శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర, జ్ఞాన, స్నేహ

## సాధన భక్తి :

సాధన భక్తి వైధి రాగానుగ అనిరెండు విధములు. శాస్త్రాను గుణముగా వచ్చినది వైధి, రాగానుగ భక్తి రాగాత్మిక నుండి వచ్చినది. రాగాత్మిక యనగా ఇష్టమైన వస్తువునందలి అనురాగము. ఆ అనురాగము అధికమై భగవత్పరమైన భక్తియనబడును. రాగాత్మికనను సరించునదే రాగానుగ భక్తి.

తులసీదాసు తనభార్యపైని అనురాగమును భగవంతుని పైకి మరలించును. *"ఇంచర వలపున్ రఘూత్తమున కర్పణ జేసికొమ్ము."* ముందర నౌకకోటి

సూర్యుల విధమ్మున వైపము తాండవింపెడున్"-అన్ని ప్రబోధముచేసి తులసి మనసు ఆ అద్వితీయ సౌందర్యము వైపునకు మరలించెను. ఇదియే రాగాత్మిక భక్తి యని చెప్పవచ్చును.

ఇచట మరొక అంశమున్నది తులసీదాసు వివాహముకాక పూర్వము వైష్ణవ సంప్రదాయాను సారము పంచ సంస్కారములు పొంది రామ మంత్ర దీక్షను పొందెను. సూకరక్షేత్రమున శ్రీ నరహరిస్వామి తులసికి శ్రీరామచరిత మానసమును వినిపించిరి. కాశీక్షేత్రమున శేషసనాతన్ అనుపండితుని వద్ద వేద వేదాంగము లభ్యసించెను [20] ఇది శాస్త్రీయమైన వైధి భక్తి. వివాహమైన తర్వాత అతని అనురాగము మలినమై విషయ వాసనాలంపటమైనది. అందులకే సంధ్యా సతియగు మమత తన వాఙ్మయోపదేశ కిరణములచే విషయ వాసనామేఘములను తొలగించెను.

దీనినిబట్టి సాధనభక్తి శాస్త్రమైన వైధి, రాగాత్మిక రెంటిలో తులసి మొదటగ వైధీ భక్తిని కలిగినవాడు. మబ్బువిడచిన చంద్రుడు అధికముగా ప్రకాశించినట్లు మోహము విడచిన తులసి భక్తిభావనలు తరంగములవలె ఉబికివచ్చినవి. అందులకే మమత బోధానంతరము తులసి గమనమును కావ్యమిట్లు వర్ణించినది.

ఒక నిరాశ హృదంతర మొత్తినంచి
త్రోవజూపించె ప్రేమిక తులసికంత
ధ్వజా హనుమన్ మనోధామమునకు
ప్రణయమూర్తికి రాఘవ బ్రహ్మమునకు
(ద్వితీయఖండిక. )

తులసి ప్రేమికుడు, రాముడు ప్రణయమూర్తి. లౌకిక రాగవాంఛల నిరాశ శాశ్వతాను రాగమూర్తియైన రాఘవ బ్రహ్మమునకు త్రోవ జూపించినది. ఆ త్రోవలో ప్రయాణించి తులసి రెండవ దశలోనికి అడుగుపెట్టెను.

## భావభక్తి:

నెచ్చెలి స్నేహము వీడి అచ్చ వెలుగుతో స్నేహము చేయుటలో తులసి మనసు అనేక అనుభూతులకు లోనయినది. ఆ అనుభవములన్నియు దాస్య, వాత్సల్య, సఖ్య, మధుర భక్తుల రూపముతో ప్రకటించబడినవి.

"భావభక్తి అనుకూలా కాంక్ష. ప్రేమలోని తొలిదశ భావము అపరిపక్వము భావభేదముచే ఇది పంచ విధము, దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావములు" అని భక్తి వివేచన చేయబడినది. 21

తులసి భావ పరిణామాన్ని కవి స్వయంగా సాధన యను ఖండిక మొదట యిట్లు వివరించెను.

"ఏకాంతంలో తులసీదాసు సాధన దాస్య భావంతో మొదలౌతుంది. క్రమ క్రమముగా మిత్ర, వాత్సల్య, మధుర భావాలకు పరిణమించి ఒక ఉన్మాద స్థితికి మారుతుంది ఆ పరిణామంలోని క్రమాన్ని సహృదయులే ఊహించుకోవాలి"

తులసీదాసు చిత్రకూటమును చేరుకొనెను. తన హృదయమునకు శాంతి ప్రసాదింపమని వేడుకొనెను. రఘురామ దర్శనము పొంది, ఆయన పాద ముద్రలను శిరమున దాల్చిన నీకు నాటి ఎవరు లేరని చిత్రకూటమును ప్రశంసించెను. క్రమముగ భగవంతునితో అనుకూలమగు భావనలుద్భవించినవి.

"ఎన్నడు రాగదుష్ట జలమింకి విచేతనమైన యట్టి నా
కన్నుల ముందె మీగడలు గట్టిన నవ్వులతోడ పుణ్యమా
సన్నముగాక మీ మధుర శాంబర మూర్తి నటించు జీవితం
బన్నదె స్వప్నమై రసమహాబ్ధి తరంగములందు తేలగన్"
(ఖండిక-5)

తాను మరచిపోవుచున్న మమతాను రాగము పూర్తిగ యింకిపోయి, ఆ కన్నులలో భగవంతుని మధురమూర్తి నటించవలెనని తులసి కోరుకొనెను. "పుణ్యమా సన్నముగాగ" భగవద్దర్శనము తన పూర్వకృత సుకృత ఫలమని భావించెను. ఇచట భగవంతుని అవ్యాజ కటాక్షమును తులసి కారణముగా భావించలేదు. సాధనలో ప్రారంభదశ కావున మానసిక పరిపక్వత, భగవంతునిపై పరిపూర్ణ విశ్వాసము తులసికి ఏర్పడలేదు. "పులకలు బుట్టి గళము బొంగురువోయి ఒక తన్మయత్వము యెడంద నాచిరానగా, నీ పదముల నౌకరాయిగా నొరిగిపోదు ప్రభూ" యని ప్రార్థించెను ఇది దాస్యభావమేకాని ఇందు జీవుని స్వాతంత్ర్యము వ్యక్తమగుచున్నది. జీవేశ్వరుల సంబంధమును గూర్చి చెప్పునపుడు మర్కట కిసోర న్యాయమొకటి జీవుని స్వాతంత్ర్యమునకు ఉదాహరణముగాను చెప్పుదురు. చరణ కమలములకు ఉన్ముఖమైన దాస్య భావము, సదాశ్రవణము, కీర్తనము మొదలగునవి మర్కట

కిశోర న్యాయ లక్షణములుగా చెప్పబడినవి.[23] భగవదభిముఖమైన తులసి మనసులోని స్వతంత్ర భావనము కరిగిపోయి సమస్త చరాచర ప్రకృతిలో దేవుని మహచ్ఛక్తిని దర్శించెను. ఆయన మాహాత్మ్యమును కీర్తించెను.

"పిందెలకు నాకలికి పాలు పిండినావు
తొడిమెలకు వింత రవికలు తొడిగినావు
చిగురులకు నగిషీపని చేసినాడ
వెంత యుపకారపరుడ వసంత రూప" (ఖండిక-5)

సృష్టించుట, పోషించుట, స్థితిలోనికి అతని సౌందర్యము వ్యాపింపజేయుట ఉపకారమని, అతని లీలలే ఈ సృష్టియందు ప్రతిఫలించుచున్నవని గ్రహించెను. అట్టి భగవంతుని మనసార శరణువేడెను.

నా కంటి వెలుగువై నన్ను రక్షించిన
నిఖిల లోకాదరణీయ శరణు
నా నోము పంటవై నన్ను కాపాడిన
రఘురామ జానకీరామ శరణు (ఖండిక-6)

సమస్త కర్మలు భగవదర్పణము చేసి ఆయన కైంకర్యము చేయుటను దాస్యమందురు. ఇట్టి భావనగల దాసులు అధికృతదాసులు, ఆశ్రితదాసులు, పారిషదులు, అనుగులు అని నాల్గు విధముల నుందురు. ఆశ్రితదాసులలో శరణ్యులు, సేవానిష్ఠులు అని భావనా భేదమును బట్టి రెండు విధములగుదురు.[24] తులసీదాసు ఆశ్రితదాసులలో శరణ్యస్థితి పొందెను.

## వాత్సల్య భక్తి:

వత్సల భావము వాత్సల్యము. ఈ భావనయందు భగవంతుని పసిబిడ్డగా భావించి భగవంతుని లాలించుట, తినిపించుట మొదలగు పనులు చేయుటలో భక్తుడు ఆనందమును పొందును. విశాలమైన విశ్వమునంతను సృజించిన భగవంతుడు తులసికి బాలరాముని వలె కన్పించెను.

తల్లి కౌసల్య చనుబ్రాలు త్రావి పసిమి
జీరువారెడు నీచిరు చెక్కులంటి
ముద్దుగొందురా నవమోహనాంగ
రార నాతండ్రి రామయ్య రామచంద్ర

బాలరాముడు లోకముల రాయిడి తీర్చి అలసిపోయెనని, అతని రుచిమాసిన నాలుకను తీపిచేసెదనని తులసి ఆహ్వానించెను. వికసించిన కొండగోగు పూవులను శిరోజము లందు చెక్కవలెనని, కోనలయందు పండిన జీరుపండ్లను దెచ్చి ఆకలి దీర్చవలెనని, సెలయేటి నీటితోదాహము తీర్చవలెనని. విశ్రమించుటకు పాన్పు వేతునాయని, తనదు అలతిసేవలను కలికి నవ్వుల గైకొనవలెనని, ఆ ఆనంతరూపుని తులసీ అర్థించెను. ఈ సేవలన్నియు వాత్సల్య భావాంతర్గతములైనవి.

*"కాళ్ళ అందియలు మ్రోయగా నాయెదుట ఓ భక్తవత్సల రసముద్వేలంబై ప్రవహింపగ"* పరుగిడిరమ్మని బాలరాముని తులసి ప్రార్థించెను.

## మధుర భక్తి :

ఆరాధనా భావము అధికమగుకొలది తులసికి భగవంతుని దర్శనము కొరకు తల్లడపాటు ఎక్కువైనది. క్షణమొక యుగముగ గడువసాగినది *"నా నాథుగాక నన్నేల నేనేలటూతు"* ననుచు ఎదురు చూపులుజూచి *"ఈ ఎదలోనేల ఇంత తాపమ్ము, ఈ కన్నులంవేల ఇంత యుత్కలిక-"* అని ప్రశ్నించుకొని భగవంతుని పైగల *"ప్రమోదరాగము"* వలననే తనకు విరహము కలుగుచున్నదని తెలిసికొనెను శ్రీరామ దర్శనము ఆలస్యమగుచున్నందుకు అలుక వహించెను.

" పలుకునో ముత్యాల పలుకులుజార
పలికిన మాటకు ప్రతియివ్వలేను
నవ్వునోరతనాల నవ్వులుబూయ
వానినవ్వులజూచి ప్రతి నవ్వలేను" (ఖండిక-5)

కారణము రామునకై ఎదురు చూచిచూచి తనకు *"నిర్లిప్తానుభూతి"* నిండుకొన్నదట. వచ్చిననేమి రాకున్ననేమి అనిశ్చిత కాలము కినుక వహించెను. మరుక్షణములో తన అభిప్రాయము మార్చుకొని *"ఎంతకోరికలతో విరులదామము"* సిద్ధము చేసికొనెను. ఆకాశములోని మేఘమును జూచి *"నవజలధరమూర్తి నారామమూర్తి"* అని రాముని శరీరము నీలమేఘమని శరీరములోని నిగ్గునిగలు మెరుపులని భావించెను.

"ఈ రజనీకాంత కేల నాచింత
వగకూడును తుషార బాష్పములురాల్చ
ఈ పాలవెన్నెలకేల నావలపు
ఉల్లంబు కదిపి నన్ను వోదార్చుచున్నది"

అని ప్రకృతి తనకు సహానుభూతి ప్రకటించుచున్నదని భావించెను. తనవలె ప్రకృతి కూడ విరహవ్యథ ననుభవించుచున్నదని, బాష్పనీరములు ప్రవహింపజేయుచున్నదని, ప్రతిపూవులోని తుమ్మెద తనవలె విరహగానము చేయుచున్నదని తులసి ఉన్మత్తయై ప్రకృతి నోదార్చెను.

"ఊరుకోవే భ్రమరి — నారామచంద్రుండు
కదలి వస్తున్నాడు"

అని తన మనస్సునుగూడ ఆవేగము తగ్గించుకొనుమని అనునయించెను. జగము పూల రథముగ, మొగిలుపై పడగగా, సొగసు రూపుదాల్చినట్లు తనకు దర్శనమీయమని ప్రార్థించుట, వచ్చినచో ఏమని పల్కరించవలెనో అని సిగ్గిలిపోవుట మధురభక్తి భావనల ప్రకటించుచున్నది.

గోపికలు కృష్ణునికొరకు పడిన విరహవేదన వంటిదే తులసి మాధుర్య భావనా రూపముగా ననుభవించెను. సాధనదశలోని జీవ స్వాతంత్ర్యము మాధుర్యదశలో భగంతునికి పరతంత్రమైనది. ఈ దశలో భగవంతుని భర్తగను తనను ప్రేయసిగను భావించుకొని అతని విరహము సహించలేని స్థితిని తులసి అనుభవించెను.

## ప్రేమభక్తి :

రాగ భావము పరిపక్వమైన ప్రేమభక్తి యగును ఇది జ్ఞానయుక్తము, స్నేహ యుక్తము అని రెండు విధములు. తరంగముల వంటి భావ సంచలనముచే ఉప్పొంగిన తులసి మనసు మహమ్మదీయ వేషములో కన్పించిన రాముని గుర్తించలేక పోయెను. అనగా తులసి మనసులో కుల మత జాతి భేదములకు సంబంధించిన శిశ్మలము కొంత మిగిలి యున్నది. భగవంతుడు సర్వ జీవాంతర్యామిగా మన్నాడన్ని, తను సంకల్పించినప్పుడు తనకిష్టమైన రూపముద్వారా అభివ్యక్తమగునని గ్రహించకపోవుట అజ్ఞానము. ఈ అజ్ఞానము తొలగుటయే జ్ఞానయుక్త ప్రేమభక్తి యనవచ్చును.

దేవవాణి తులసీదాసునకు జ్ఞానమును బోధించినది. "ఈ సర్వ సృష్టి అపర మాతృనిచే సృష్టంబు —— నరులు నీచోచ్చవాదదృగస్తంగత బుద్ధులు —— సత్యంబైన ఆనంద సంపద చూరాదగరేరు" అనియు "ఈ మతభిన్నదృష్టి నశియించెది నంతకు ప్రేమధామమౌ రాముడు చిక్కడు" అని స్పష్ట పరచినది. ఈ ప్రబోధముతో నిష్కలుషమైన హృదయములో విశ్వమానవ ప్రేమ అవసర మనిగ్రహించెను. తానొక భక్తుడనను భావము కూడ విసర్జించెను. మమత చెప్పినట్లు భవమోహాములన్నియు జ్ఞానాగ్నిలో వ్రేల్చెను. రాముని మరియొక్కసారి సులతానుగ కనిపించి పొమ్మని ప్రార్థించెను "నాదొక భావమంచును మనంబున లేదు జగచ్ఛరణ్య నీవేది జనింపజేతువో అదే వెలుగొందు" నని తనవ్యక్తిత్వము నంతయు విస్మరించి భగవంతునికి సంపూర్ణ శరణాగతుడయ్యెను. రామదర్శనము లభించి ధన్యుడయ్యెను.

# జ్ఞాపికలు

1) "రక్తి-భక్తి-వారధి పుట్టపర్తి" జానుమద్ది హనుమచ్ఛాస్త్రి ఆంధ్రజ్యోతి దినపత్రిక తేది 29-6-1987

2) "ఎల్లెయిళఙ్కిళియే ఇన్నముఱఙ్గుదియో" తిరుప్పావు ఆంధ్రవివరణము శ్రీభాష్యం అప్పలాచార్యులు దుర్గాప్రెస్ కాకినాడ 1974

3) భక్తితత్త్వము పేజి - 52 "తిరునామములు - సమగ్ర పరిశీలనము" సిద్ధాంతవ్యాసము డా॥ కిడాంబి నరసింహాచార్య

4) నారద భక్తిసూత్రములు సాధన గ్రంథమండలి తెనాలి.

5) నాయమాత్మా ప్రవచనేన లభ్యః న మేధయా న బహునా శ్రుతేన
యమేవైష వృణుతే తేన లభ్యః తస్యైష ఆత్మా వివృణుతే తనూంస్వామ్
(మంత్రము-3)-ముండకోపనిషత్తు ఆంధ్రవివరణము న.చ.రఘునాథాచార్యులు

6) 'చతుర్విధాభజంతే మాంజనాస్సుకృతినోర్జున
ఆర్తోజిజ్ఞాసురర్థార్థీజ్ఞానీచ భరతర్షభ" 7-16 శ్రీమద్భగవద్గీత

7) శ్రీ భాష్యమ్ సవ్యాఖ్యానం, ఉభయవేదాన్త గ్రంథమాల మద్రాసు-1987

8) 'తేషా మేవాను కంపార్థ మహ మజ్ఞానజం తమః
నాశయా మ్యాత్మ భావస్థో జ్ఞాన దీపేన భాస్వతా' 10-11 శ్రీమద్భగవద్గీత

9) "పోతన భాగవతము-జీవుని వేదన" డా॥ తుమ్మపూడి కోటేశ్వరరావు
పోతన భాగవత నీరాజనము పంచశతి మహోత్సవ సంస్మారిక
తిరుమల తిరుపతి దేవస్థాన ప్రచురణము 1985

10) కఠోపనిషత్ వ్యాఖ్యానము-స్వామిచిన్మయానంద

11) శ్రీరామకృష్ణజీవితచరిత్ర పేజి 140 చిరంతనానందస్వామి

12) తులసీదాసు జీవితచరిత్ర-రామచరితమానస్ గోరఖ్‌పూర్

13) "విభూతిర్భూతిరైశ్వర్య మణిమాధికమష్టధా" ప్రథమకాండః స్వర్గ
వర్గః శ్లో॥ 35 అమరకోశః

14) "తేషాం సతత యుక్తానాం భజతాం ప్రీతిపూర్వకం
దదామి బుద్ధి యోగం తం యేనమాముప యాంతితే"
19-10 శ్రీమద్భగవద్గీత

15) "విభూతిరూప భగవంతుడు" పేజి-111 గీతావ్యాసములు - ద్వితీయ
సంపుటము- శ్రీఅరవిందులు తెలుగు అనువాదము చలసాని నాగేశ్వర్‌రావు

16) "శ్రీవల్లభ చైతన్య సంప్రదాయములు-పోతనభాగవతము" పేజి-122
డా॥ వారణాసి రామమూర్తిరేణు

17) శ్రీరామకృష్ణజీవితము - చిరంతనానందస్వామి శ్రీరామ మఠము మద్రాసు

18) తులసీదాసు జీవితపరిచయము-శ్రీరామచరితమానస్ గోరఖ్‌పూర్

19) భక్తితత్వము, తిరునామములు సమగ్రపరిశీలనము పేజి-3

20) తులసిదాసుజీవితచరిత్ర-రామచరితమానస్ గోరఖ్‌పూర్ ప్రతి

21) భక్తితత్వము-తిరునామములు సమగ్రపరిశీలనము

22) "సాధన" ఖండిక - సాక్షాత్కారము - పుట్టపర్తి

23) సూర్‌జార్ పోతనాకాభక్తితత్వ సిద్ధాంతవ్యాసము, డా॥ సిహెచ్ రాములు

24) నవవిధ భక్తులు-సవ్యాఖ్యానము సాధనగ్రంథమండలి-తెనాలి

# ప్రగతి భావకావ్యములు

తెలుగులో వచ్చిన అభ్యుదయ కవితా ప్రభావము, మార్క్సీయ తత్వశాస్త్రము, చిన్నప్పటినుండి అనుభవించిన దారిద్ర్యము పుట్టపర్తిలో ప్రగతి భావములను పలికించినవి. 1934 నుండి 1941 వరకు శ్రీశ్రీ రచించిన గేయములు 1950లో పుస్తక రూపమున వచ్చినవి. కాని మహాప్రస్థానాది గేయములు పత్రికలలో ప్రకటింపబడిన నాటినుండి కవులపై ప్రభావము ప్రసరింపజేసినవి. 1950 తరువాత వెలువడిన పుట్టపర్తి ప్రగతి భావ కావ్యములపై శ్రీశ్రీ కవితా ప్రభావమున్నది. దీని భావనలలో రచనా విధానములో గమనింపవచ్చును.

## పురోగమనము :

పురోగమనమున ఇరువది కవితలున్నవి అందు రెండు కవితలు కవుల గూర్చి రచింపబడినవి. తక్కినవి ప్రగతి భావకవితలు.

మొదటి కవిత "నడువమ్మా" అను పేరుతో నున్నది. వాల్మీకి రచించిన రామాయణము నుండి నేటివరకు కవిత యంతయు అభ్యుదయము ప్రకటించుచూ వచ్చినదని, మతప్రవక్తలు, సిద్ధాంతకర్తలు, రసవాదులు అందరును ప్రజా క్షేమము కొఱకు పాటుపడినారని కవి ప్రకటించెను. ఈ ఆధునిక యుగమున కూడ ప్రజల నిత్య జీవన సమస్యలైన, ఆకలి, దారిద్ర్యము, కన్నీరు వీటినే కవితా వస్తువులుగా చేసుకొని తన కవిత ముందుకు సాగవలెనని ఆకాంక్షించెను. 'పురోగమనము' అని ఈ కవితా సంకలనమునకు పెట్టిన పేరు, ఈ విధముగా సార్థకముగా నున్నది.

1936లో ప్రేమ్‌చంద్ అధ్యక్షతన ప్రథమ అభ్యుదయ రచయితల మహాసభ జరిగినది. ఈ సమావేశములో వారి ప్రణాళిక ప్రకటింపబడినది. ఆందు భారతీయ సంస్కృతిలోని ఉత్తమ సంప్రదాయాలను స్వీకరించి వినాశకర ధోరణులను వదిలి వేయవలెనని తీర్మానించిరి. ప్రజల నిత్య జీవన సమస్యలు, ఆకలి, దారిద్ర్యము, ఆర్థికముగా వెనుకబడిన తనము, రాజకీయమైన బానిసతనము మొదలగు సమస్యలను గుర్తించి కళలను వాటికి అనుగుణంగా తీర్చిదిద్దుమని ప్రబోధించిరి. మూఢ నమ్మకములను ఖండించు హేతువాద దృక్పథంతో మానవులను తీర్చిదిద్దగల్గు సృజనాత్మక సాహిత్యమును నిర్మించవలెనని, మహాసభ భావించెను. దేశమంతట నున్న అభ్యుదయ

సంఘములను సంఘటిత పరచి, అభ్యుదయ సాహిత్యము ద్వారా పురోగమించవలె నని పిలుపునిచ్చినది.

'పురోగమనము' నందు ప్రధానముగా ప్రతిఫలించు భావములివియే. భారతీయ మత సంప్రదాయములోని ఉత్తమ సంస్కృతిని స్వీకరించి అవియే అనాదిగా సాగి వచ్చిన ప్రగతి భావములుగా తన కవిత గర్భీకరించుకొనినదని కవి ప్రకటించెను. '*భగీరథుని గంగా నదిలా*' తన కవితను సాగుమని చెప్పుటలో అనాదిగా సాగివచ్చు కవితా ప్రవాహము ఒకటేనని అందులో కాలానుగుణముగా అనేక భావనా శరిత్తులు కలియుచుండునని వ్యంజింపబడినది. సర్వజనుల కళ్యాణమును గూర్చి పాడిన వాల్మీకి కవితను, సర్వజనుల శాంతిని ప్రకటించిన వ్యాసుని కవితను ఆవేదనాగ్నులను వ్యక్తీకరించిన భవభూతి కవితా భావములను తనలో లయించుకొని తన కవిత సాగునని, కవి ప్రకటించెను '*అన్నకోశములను పెంచుకొని అంతా తమదేనని వ్యాపారము సాగించే' వారిని ఎదిరించుటకు* పీడిత ప్రజలనుండి మహాజ్వాలగా అవతరించెనని బుద్ధుని సంభావించెను "*చండాలుని, శంకరుని, సమముగా భావించిన*" ఆది శంకరాచార్యులను, సర్వప్రాణుల దుఃఖమును పోగొట్టుటకు, రంగని గోపురమెక్కి రారండని పిలచిన రామానుజుని, '*కులమన్నది వర్జించి*' పండిన తన శివానుభవములను, '*మాలలకిచ్చిన*' పాలు కురికి సోమనాథుని సంభావించి వారి బోధనలలోని సమతా దర్మమును తన కవితలలోనికి స్వాగతించెను. "*పీడక జనలోహ చరణపీడితులగు*" జనులగోడు '*బ్రతుకు కోసం పదిమందిలో నాట్యమాడే పడుపుకత్తెల పరితాపం*' శ్రామిక కూలీల జీవితానుభవాలు, దారిద్ర్య బాధకు తల్లడిల్లే ప్రజా జీవితము, తన కవితా వస్తువులుగా '*నదువమ్మా*' అనెడి ప్రథమ కవితలో కవి ప్రకటించెను. పురోగమనములోని యితర కవితలయందును, గుడిగంటలు పేరుతో రచింపబడిన కవితా ముక్తకములలోను మేఘదూతమునను ఈ భావములే, విస్తరించి వర్ణింపబడినవి.

కవి పీఠికలో "*కాలానుగుణముగా, కవితా వస్తువులు, ఛందోరీతులు, మార్పు పొందుతవని, క్రొత్త తోవలు తొక్కుటకు కాలమునకు స్వభావమని* చెప్పెను[2]." ఈ విషయములనే తన కవితా దృక్పథముగా '*పొంతమీద జీవితమేనా*' అనెడి కవితలో సూటిగను, మార్మికముగను ప్రకటించెను.

వర్తమాన మానవ జీవితములోని ఆకలి, ప్రేమ, మనస్సు సంఘము, వీటిని గూర్చి వ్రాయు కవులను విమర్శించు వారినిట్లు ప్రశ్నించెను.

' కూటికేడ్వక కాటికేడ్వాలా ?
బ్రతుకు కేడ్వక బయలుకేడ్వాలా ?
మనసు కేడ్వక మ్రానికేడ్వాలా ?
ప్రాణయానికేడ్వక పాలకేడ్వాలా ?
సంఘానికి చెప్పక చాపరాతికి చెప్పాలా ?

( పొండి )

ఇందు 'కాడు' అనునది పలాయన వాదమును, 'బయలు' అనునది శూన్య వాదమును, 'మ్రాను' అనునది జడత్వమును, 'చాపరాతి' అనునది చైతన్య రహితమైన సమాజమును ప్రకటించుచున్నది.

'మీది జీవితమేనా' అనెడి కవితలో మార్పు అనివార్యమనియు 'ఋతువులు మారుతున్నై మనం మారక ఎట్లా' అని ప్రశ్నించెను. మార్పులేని జీవితమును 'మ్రానిబొమ్మ' అందురనీ, మనిషి మారితే 'ఫికిల్ మైండ్' అందురనీ సమాజ లక్షణమును వివరించెను. 'విజయము-పరాజయము' విప్లవము- అంతర్యుద్ధము -ఆవేదన ఆశ-నిరాశ అంతో యింతో లేని జీవితము జీవితమే కాదని వ్యాఖ్యానించెను. తాతల నాటి నుండి 'నవ్వేది- నాట్యమాడేది- ఏడ్చేది వేరే ఎవరి కోసమో మీది జీవిత-మేనా?' అని సమాజములోని వారందరిని ప్రశ్నించెను. అనగా సాహిత్య, నాట్య, సంగీత కళాకారులు తరతరములుగా అర్థవంతులైన వారికే తమ కళల నమ్ముకొన్నారని వారి జీవితమునే వర్ణించిరని, తమను గూర్చిగాని తమవంటి వారల గూర్చి గాని పట్టించుకొనలేదని కవి భావన.

1950 తరువాత కొరియా యుద్ధ సందర్భములో సోవియట్ రష్యా యుద్ధ విరమణను గూర్చిన ప్రతిపాదనలు చేసినది. మొదటి, రెండవ ప్రపంచ యుద్ధములతో అట్టుడికిపోయిన ఒక విధమైన ప్రపంచం ఈ ప్రతిపాదనలకు స్పందించినది. ఇట్టి స్పందన 'పురోగమనము'లోని కొన్ని కవితలలో కనిపించును. 'విలువు' అనే కవిత ఈ విషయము స్పష్టముగా పేర్కొనినది. సనాతన సంస్కృతి చెప్పిన శాంతి పాఠము, వర్తమాన యుగములోని యుద్ధ విరమణ ప్రతిపాదనలు పుట్టపర్తిలో

' కాలమో, కర్మమొ, యేదో
కారణమని విలపించే
కడగండ్లే జీవితమై

గడిపే ఓ వెర్రి తండ్రి
కార్మికుడా ధార్మికుడా
యుద్ధం కావలెనా ' (కావలెనా ఖండిక-2)

" వద్దోయి వద్దోయి
యుద్ధ మొద్దన్న " (వద్దోయి ఖండిక-3)

" ఓహో యుద్ధ పిశాచీ " (ఖండిక-8)

అనెడి కవితలను పలికించినది. యుద్ధము సంభవించినచో సర్వజనులు మ ర ణిం తురనియు, నదులు, సరస్సులు కలుషితములగునని, పుట్టెడి, పుట్టిన బిడ్డల భవిష్యత్తు నరక ప్రాయమగునని ఫలితములను ప్రకటించెను. నాగసాకి హిరోషిమా ఉదంతముల నుదాహరించెను. శ్రామికులు, స్త్రీలు, బాలలు యుద్ధము కోరెడివారు కారనియు, వలస దేశములు స్థాపించుటకు సముద్రముపై స్థావరములు ఏర్పాటు చేయుటకు ధనిక వర్గదేశీయులే యుద్ధ ప్రతిపాదనలు చేయుదురని, కారకులను కారణములను ప్రస్తావించెను. మానవుని - మానవునికి మధ్య తెరలు కల్పించి అనిశ్చిత వాతావరణము కల్పింతురని అణుబాంబును జూపి భయపెట్టుదురని విమర్శించెను. ప్రజలందరు శాంతిని కోరుచున్నారని,

" సర్వమానవశాంతి కోయిలై కూసింది
సుఖము లీరెండులై జగతిపై సాగాయి " (వద్దోయి-3)

అని విశ్వమానవ శాంతి గీతము నాలపించెను.

కాని పురోగమనములోని తదితర కవితలను, పరిశీలించిన కవి వర్గవిభేదము వర్గపోరాటము మొదలగు మార్క్సీయ సిద్ధాంతములకు స్పందించినట్లుతోచును. మేఘ దూతమున శ్రమశక్తి దోపిడిని విపులముగా వర్ణించెను. " *గుడిగంటలు* " అను పేరుతో రచించిన కవితా ముక్తకములలో

" ధనికులు పేదలు రెండే
ధరపై నిజమగు జాతులు "

అను అభిప్రాయము, పురోగమనములోని సామ్రాజ్య వాదుల యుద్ధదాహమును

వర్ణించిన తీరులో విస్తరించెను. "తమపొట్ట శ్రీరామరక్షయని కలికోటివారు, వననిధులుతమవంచు అదరగొట్టెవారు, దీన మానవరక్తమాని బలసినవారు, వేలాది ఏండ్ల నుండి కీర్తి, సుఖం ఆనందం, కృషి, వాణిజ్యం, సంస్కృతి అన్నితమవిగా ఆక్రమించుకొన్నవారు, శరీరములనేగాక బుద్ధులను కూడ ఖరీదు చేసి కావ్యములు వ్రాయించుకొన్నవారు, శిల్పులచే గాయకులచే కీర్తిని ప్రతిష్ఠించుకొన్నవారు."- ధనవంతులనియు, వారే దేవతలనియు, వారిసుఖముకొఱకే సామాన్యులున్నారని స్పష్టముగా ప్రకటించెను. రష్యాలో సంభవించిన రాజవ్యవస్థానాశనము భూస్వామ్య పతనము ప్రేరణగా ప్రకటించెను.

" కాలం వికసిస్తున్నది
కరుణాహీనుల మృత్యు ఘంటం శబ్దించింది
అదిగో యెర్ర పతాక
ఆకాశంలో పిలుస్తున్నది
విజయమ్ మీ ఆయుధమై
వినిపిస్తుంది జీవనగీతి " (లేవండి-18)

వర్గపోరాటము ద్వారానే శాంతి లభిస్తుంది,

"పగుల గొడతాం మిమ్ము
దిగుల గొడతాం మంట
రగుల పెడతాం నోట
మట్టి కొడతాం" (పడుతుంది-20)

అని ఈ పోరాటములో ధనవంతులు కట్టుకొన్న కోటగోడలు పడిపోతాయని చెప్పి, ఆ పోరాటమునకై అందరినీ సమాయత్తము కండని ప్రబోధించి

కుళ్ళిన చెడిపోయిన మతి
మళ్ళిన ఈ సాంఘిక వ్యవస్థ
యుగయుగాల వయసు క్రమింగి
యూర్పు జలమె గుర్రింగిన
పున్న కాలు - ధనికవాద
మస కాలు - మనలనింక

అడ్డలేవు - అవలేవు
వదండి ముందుకు
పిలుపు వచ్చింది
పిలుపు. (పిలుపు-19)

అని వర్గపోరాటమును ప్రబోధించి ప్రోత్సహించెను. "మేదిని మేల్కాంచుచున్నది"-ఇంకొక స్వర్గం వస్తున్నదని వామ పక్షీయులు కలలుగను వర్గరహిత సమాజమును కవి ఆకాంక్షించెను. ఈ కవితా సంపుటిలో మరొక ప్రముఖ సామ్యవాద కవి నాజిమ్‌హిక్మత్ గూర్చి, వల్లత్తోళ్ అను కేరళ జాతీయ కవిని గూర్చి ప్రశంసా కవితలు కూడ గలవు. ఈ కవితలలో కవిలోని జాతీయ సామ్యవాద భావమూలములు వారి కవితలవల్ల ఎట్లు ప్రతిస్పందించినవో తెలుపబడినది.

## గుడి గంటలు :

1970 ప్రాంతమున ప్రొద్దుటూరు నుండి వెలువడు తెలుగు సంక్రాంతి అనెడి పత్రికలో పుట్టపర్తి కొన్ని కవితా ముక్తకములను ప్రకటించెను. ఈ కవితలలో నాటి రాజకీయ వాతావరణము ముఖ్యముగ అధికార పార్టి విమర్శింపబడినది. స్త్రీ జీవితము గూర్చి కవులను గూర్చి వర్ణనా వ్యాఖ్యానము లిందుకలవు.

సమకాలీన రాజకీయ వాతావరణమును కవి ప్రతీకాత్మకముగనిట్లు వివరించెను.

"ప్రచ్ఛన్న జరా సంధులు
పాలించే దేశంలో
ధరణీతల మంతా ఒక
ధర్మచక్ర పరివర్తన"

పాలకులను ప్రచ్ఛన్న జరాసంధులని పౌరాణిక ప్రతీకద్వార నిశితముగ విమర్శించెను. ధర్మచక్ర పరివర్తన బుద్ధదేవుడు ప్రథమోపదేశము చేసిన సందర్భము గుర్తుగా వారణాసిలో శిల్పము నిల్పబడినది. దీనినే ఈనాడు భారత జాతి తన చిహ్నముగా స్వీకరించి, ప్రభుత్వ చిహ్నములో, పతాకలో నిక్షేపించినది. ఈ రెండు పౌరాణిక ప్రతీకల ద్వారా ఈ గీతములో పరిపాలించే వారిలోనున్న తృణచ్ఛన్న కూప లక్షణము వలన ధర్మచక్ర పరివర్తనమెట్లు జరుగగలదని కవి సందియము ప్రకటింపబడినది. అందులకే,

"లేపాక్షి బసవయ్య లేచి వచ్చిన గదా
కాంగ్రేసులో ధర్మకారుణ్యభావాలు"

అని నాటి పాలక ప్రభుత్వమైన కాంగ్రేసు పార్టీకి ధర్మము కారుణ్యము లేవని విమర్శించెను. లేపాక్షిలోని బసవని విగ్రహము ఒక కాలుమడచి వేరొకకాలు లేచుటకు ఉంకించినట్లుండును. చూపరులకు ఆ నంది లేచివచ్చుచున్నదా యనిపించును. కాని లేచిరాదు. ఈ విధముగా అధికార పక్షమున ధర్మము కారుణ్యాభావము లున్నట్లనిపించును గాని లేవని కవి భావన

ఒక్క అధికార పక్షమేగాక మిగిలిన పార్టీలుకూడ కులతత్వపు ప్రాతిపదికగా పనిచేయుచున్నవని తమ పెద్దల మాటలనే చిలుక పలుకులుగా వర్ణించుచుండిరని ఆక్షేపించెను. *"రాష్ట్రములో ఒకడే శని, భగోళమునకు ఒకడే శని కాని మతి తప్పిన దేశానికి ప్రతి నాయకుడు శనిలా దాపురించాడని"* పెండ్లము లేకున్న బ్రతుకుదురు కాని పదవి లేకుండ ఈ రోజున నాయకులు బ్రతుకలేరని నిందా పూర్వకముగ విమర్శించెను. నాటి రాజకీయ వాతావరణము ఒక్క మాటలో,

"చెప్పే కూతకు
చేసే చేతకు
రాజీ లేనివి
రాజకీయములు" అని నిగ్గు తేల్చెను.

మతమును గూర్చి వివరించుచు ఒకనాడు ధార్మిక మహోద్యోగముగానున్నది నేడు దేశమునకు రోగముగా పరిణమించినది, అన్నములేని అనాధలు ఈ లోకములో నున్నంతవరకు గుడులు, మసీదులు దయ్యాల కొంపలేనని తిరస్కరించెను.

సకల భూతములకు శాంతి కావలెనని ఋషులు చెప్పిన ధర్మవాక్యములకు పండితులు విపరీతార్థములు కల్పించినారని, అర్థములేని బాహ్యాచారము మతముగాదని, మతమనగా ధర్మమని వివరించెను.

మానవునకు ఇహపరములు రెండు ముఖ్యమేనని, రెండు ఆధారాధేయములేనని ఇహము విడిచి పరమును గూర్చి ఆలోచించిన అది నేల విడచి సాము చేయుట వంటిదని, పరము విడిచి కేవలము ఇహమును గూర్చియే చింతించిన అది పక్కిలో గల పామువలె పతనహేతువని వ్యాఖ్యానించెను.

ధనికులు-పేదలు ఈ ధరపైన రెండు జాతులని మిగిలిన వన్నియు వేదాంతులు కోసిన కోతలని మార్క్సియ వర్గభేదమును స్పష్టముగా పేర్కొనెను. నేటిరాజవ్యవస్థ ధనిక వాదవ్యవస్థయనియు, ప్రతి ఊరిలో అది ప్రభుత్వము చేయుచున్నదనియు. ఈ విధముగా సాగినచో స్వాతంత్ర్య దేవత బలియై పోవునని పాలనా వ్యవస్థను విమర్శించెను. అన్నమడిగితే రష్యా భక్తుడని ముద్రవేతురని, విజమునకు రైతులేనిదే రాచరిక మెక్కడున్నదని ప్రశ్నించెను. కూడు పుట్టనివానికి గాంధీటోపి కల్పవృక్షమువలె పనికి వచ్చుచున్నది. గాంధి పేరు చెప్పుకొని తదనుయాయులు తమ పబ్బములు గడుపుకొనుచుండిరని తన బాధను వ్యక్తీకరించెను.

ధనికులకు బాకాలూది ప్రతివారు కవులను ముద్రవేయించుకొంటున్నారు. కొన్ని చెట్టెక్కి దూకిన ప్రతికోతి హనుమంతుడు కాగలడాయని వెక్కిరించెను. కొందరు కవులకు గతముపై తప్ప వర్తమానముపై దృష్టిలేదు. అసమర్థుడైనవాడు కులమను భిక్షపాత్రతో యాచించి బ్రతుకును. సమర్థులు కాలయువతి తెరచిన నూత్న కవాటములను పరికించి కొంగజపము మానవలెనని ప్రబోధించెను.

కొన్నిరగడలలో రమణుల గూర్చి వర్ణించెను. అమృతాగ్నులకు స్వర్గ దుఃఖములకు ఆమె కూడలి. ఆమె హృదయమున కత్తుల బావులు ఉద్యానవనములున్నవి, అటువంటి స్త్రీ కోపించిన మగవాని జీవితమే చీకటియగును. అధిపత్యము కొఱకు "పాదసేవ" వంటి విధులను పురుషుడు విధించి తాను నీతి విహీనుడై "దున్నపోతు" వలెచరించును. తనజీవితములో నూతన అనుభవములకు తావుల నొసంగిన పడతిని ఏడిపించెడివాడు నీచాతినీచుడు. ఈ విధముగ పురుష దురహంకారములో ఏర్పాటు చేసిన పద్ధతిని 'సంస్కృతి' యనియు, 'నాగరికత' యని అనుచున్నారు కాని అది స్త్రీలపాలిటి 'సాలెగూడ' నివిమర్శించెను.

వాల్మీకి ఒక రావణున్ని గూర్చియే కావ్యము వ్రాసెను. కాని నేడు ప్రతి ఊరిలో ఎందరో రావణులుండిరని, ఆడపడుచుల జీవితములు సీతవలెశోకమయములగుచున్నవని, నేటి సమాజములోని స్త్రీ స్థితిని గూర్చి విచారించెను.

ఈ విధముగా 'గుడిగంటలు' అను పేరుతో వ్రాయబడిన కవితా ముక్తకములు సామాజిక వాతావరణమును ఒక దృష్టితో విమర్శించినవి.

## మేఘ దూతము :-

పుట్టపర్తి రచించిన ఒక విలక్షణమైన సందేశ కావ్యము మేఘ దూతము. ఈ కావ్య నామమే కాళిదాసు మేఘదూతమును చెప్పుచున్నది. కాళిదాసు మేఘదూతమును మందాక్రాంత వృత్తములలో రచించినట్లు దీనిని కవి షట్పదులలో రచించెను. తెలుగు దేశచరిత్ర, తీర్థ క్షేత్ర మాహాత్మ్యములు, చరిత్ర పురుషుల పౌరుష ప్రతాపాలు, వాటి విశ్లేషణ, వర్ణన, వివరణయున్నది. దేశీయతా స్ఫోరకమగు విషయ వివేచనముతో సాగినది కనుక యిందు దేశి కవితా వాహకమైన షట్పది ప్రయోగింపబడినది.

సందేశ కావ్యములన్నింటికి కాళిదాసు మేఘదూతము మార్గదర్శి. కాళిదాసు రామాయణము నుండి సందేశ కావ్య స్వరూపమును మార్గోపదేశమును, గ్రహించి విప్రలంభ శృంగారము విస్తరించి దూతకావ్యము నిర్మించెను.

ఆధునిక కాలమున వెలువడిన సందేశ కావ్యములలో విశ్వనాథ సత్యనారాయణ "శశిదూతము" జాషువా రచించిన "గబ్బిలము" ముఖ్యమైనవి శశిదూతములోనిది ప్రణయ సన్నివేశము అక్కడ చంద్రుడు సాక్షిమాత్రమే. ప్రణయ కోపముతో అలిగిన ప్రియురాలిని గూర్చి మృదు హితోక్తులతో నాయకుడు వర్ణన చేయును.

" వెలదికి క్రొత్తగా ప్రణయబీజము నాటుట అంతకష్టమా
వెలసిన తావెరుంగక గవేషణ సేయుట అంతక్లిష్టమా
గొలగొల కొండ గుర్తులిడి క్రొంచునుబోవుట అంతనిష్టమా
సులభము నాదు దౌత్యమిదె సుందరి నా కులపత్ని చంద్రమా"

(శశిదూతము)

ఈ పద్యమున కవి హంస దౌత్యమును మేఘ దౌత్యమును అన్యాప దేశముగా చెప్పి తనకు దౌత్యము చేయుట అంతకష్టముగాదనియు, ప్రియురాలు తన భార్యయనియు, ప్రక్కనే యున్నదనియు కావున-తనకు దౌత్యమ చేయుమని చంద్రుని ప్రార్థించెను. సాక్షిగా నున్నచంద్రునితో తన విరహ బాధామయగాథను విన్నవించగా నాయిక చివరకు అలుక తొలగి చిరునవ్వు నవ్వును. కావ్యము పూర్తియగును ఇందు ప్రధానముగా ప్రణయ భావమున్నది.

భాషనా రచించిన గబ్బిలము వర్ణవ్యవస్థా నిరసనము, దేశాభిమానము ప్రకటించినది. గబ్బిలమువెలివేయబడ్డ హరిజనునకు సంకేతముగ కవి ప్రయోగించెను. ఈ కావ్యము పూర్వోత్తర భాగములని ద్వివిధము. తంజ నగరమునుండి కైలాస పర్వతము వరకున్న దర్శనీయ స్థలములిందు వర్ణించబడెను. కులవ్యవస్థ వర్ణవ్యవస్థను గూర్చిన నిరాదరణ ప్రకటింప బడినప్పటికిని, దైవభక్తి భావన వర్ణింపబడినది.

ఈనాటివరకు వచ్చిన దూత కావ్యములను పరిశీలించిన ఈ స్వరూపముగోచరించును.

1. వక్త - విరహి
2. దూరస్థ ప్రియురాలు
3. దూత (సందేశవాహి) 1. అచేతనము - మబ్బు చంద్రుడు
   2. చేతనము - పక్షివిశేషము
   హంస, చిలుక, గబ్బిలము
4. దూతను ఎన్నుకొనుటలోని ఔచిత్య వర్ణనము
5. మార్గోపదేశము - విరహిస్థానము నుండి ప్రియురాలి నివాసమువరకు
   వర్ణనము - నదీనదములు పుణ్యస్థలములు
6. రసము - విప్రలంభము

పుట్టపర్తి మేఘదూతముపై సమకాలిక సందేశ కావ్యములకంటెను, కాళిదాసు కావ్య ప్రభావమధికముగనున్నది. సంస్కృత మేఘదూతములోని కొన్ని శ్లోకములు యథాతథముగా ననుకరింపబడినవి. విప్రలంభ శృంగారము - మార్గోపదేశమునకు ఆలంబమైన కథ నూతన దృక్పథముకల్గినది సంస్కృత మేఘ దూతేతి వృత్తము యాజమాని సేవకుని మధ్య జరిగిన విషయము. పుట్టపర్తి మేఘదూతమున రెండు వర్గముల మధ్య జరిగిన సంఘర్షణ. సంస్కృతమున విప్రలంభ శృంగారము కావ్యమునకు మూలము. యక్షుని పూజకు సమర్పించవలసిన పుష్పములను ప్రియురాలికి అలంకరింపతలచెను. అందువలన కుబేరునిచే శపింపబడి ప్రియురాలికి దూరమయ్యెను, పుట్టపర్తి మేఘదూతమున 'ధనికవాదము కాదటనగా తన్నిత్రోసిరి' కావున వర్గ సంఘర్షణయే ఈ సందేశ కావ్యమునకు మూలవస్తువుగా కవి నిబద్ధించెను. మార్గోపదేశమను వ్యాజముతో చరిత్రను విశ్లేషించెను. ప్రగతిభావనా దృక్పథము లేనిచో దేశము తిరోగమించునని హెచ్చరించెను.

ఈ దేశమున వనరులు పుష్కలముగ నున్నప్పటికి అందరికి ఉపయోగపడక పోవుట, సంపదలున్నను పేదరికము పెరిగిపోవుట ఆహారోత్పత్తి అధికముగా పెరిగినను అనేకమంది ప్రజలకు తినుటకు తిండిలేకపోవుట కవికి బాధను కల్గించెను.4

భూమి, నీరు, ఖనిజ సంపద, అడవులు, ఈ వనరులు పుష్కలముగానున్న ప్రకృతినుండి వస్తువులనుత్పత్తి చేసికొని అనుభవించుటకు మానవులకు ముఖ్య సాధనము శ్రమశక్తి. ఈ శ్రమశక్తి కల్గిన మానవుల సమష్టి ఫలితమును దోచుకొని కొందరు మాత్రమే సుఖపడుతున్నారని వారు మానవులు కారు రాక్షసులని కవి కావ్యము నారంభించెను.5

" తనవంటి మానవుల దైన్యమే సుఖశయ్యగా
వారి నిట్టూర్పు గాడ్పులే చామరులుగా
వారి కన్నీట కరగు దినముల పైన నిలచి
మేమూ మానవులమని గొంతెత్తు అర్చు
ధనికులను జూచి అసురులని అన్నాడు
వాడు మానవుడు"

శ్రమశక్తి దోచుకునే వర్గమునకు, దోపిడీకి గురియయ్యే వర్గమునకు, సంఘర్షణ నిత్యము. ఈ సంఘర్షణ ఫలితముగ కథానాయకుడు బంధింపబడెను.

" ధనిక వాదము కాదనటగా
తన్ని తోసిరి బ్రతుకు చనగా
కడుపుకాలిన బీదకన్నీటితో నేడు
జడధులె పొంగెత్తి జగతులింకకపోవు"

సంపద నుత్పత్తిచేయు సాధనముల కొన్నింటిని బలవంతులు-స్వాధీనము చేసుకొనుట లో వ్యక్తులమధ్య అంతరములు ఆరంభమగుచున్నవి. ఈ బలవంతులు తమ ఉత్పత్తి సాధనములద్వారా ఆస్తులు సంపాదించి యాజమాన్యము వహించి బలహీనులను బానిసలుగా, శ్రామికులుగా దిగజార్చి తాము అధిపత్యము వహించుచుండిరి. దీనివలన ధనవంతులు కోటీశ్వరులై బీదవాడు పేదవాడుగా తయారగుచుండెను. ఇటువంటి తీవ్ర అసమానతలవలననే వర్గ పోరాటము, తిరుగుబాటు ప్రారంభమగును. ఈ విషయమును పుట్టపర్తి,

" కడుపుకాలిన బీద కన్నీటితో నేడు
జడధులే పొంగెత్తి జగతులింకక పోవు"

అని వివరించెను. అనాదిగా సమాజమున సాగివస్తున్న ఆర్థిక అసమానతలకు మూల మైన దోపిడీ విధానమును గూర్చి

" పల్లె పట్టులయందు
పయనించు సమయాల
పాలేరువాడు కన్పించూ మిడియెండ
బద్ధలుగ గొట్టివండించూ వాడెంత
కష్టించినా మిరపకారమే సంగటికి
కలదోయి కామందు కలిమి వానికిచెందు"

కేవలము సామాన్య జనుల జీవనము నందేగాక ధార్మికమైన దేవాలయ నిర్వాహణము నందున దోపిడి యున్నదని వర్ణించెను.

" అచటచట గనుపించు
అభ్రంకషమ్ములగు
గోపురమ్ముల గుడులు నీకు — నేడచట
కాపురములు గబ్బిలములు — మూస్కములు
ధర్మకర్తలయిండ్ల ధాన్యంబులు గొల్చి
అలసినవి—దేవునకు వలుకు బలమేలేదు"

పెట్టుబడిపెట్టి అధికలాభములు ఆర్జించువారిని కవి కాపాలికులతో పోల్చెను. కాపాలికులు తమ అభీష్టముల కొఱకు మనుష్యులను దేవతలకు బలియిచ్చెదరు.

" వడ్డీరూకల గిడసు లడ్డంబు బెరుగగా
వడ్డికై కనుపింత్రుసీకు—ధనులు
తన్ముఖ దర్శనము సేయవాకూ—సరివారు
సౌఖ్యంపు పుర్రెలో జగతి సేమమ్ముద్రావు
గడుదుష్టులగు వింత కాపాలికులువారు"

పూర్వ కాలమున మనదేశములో సుసంపన్నమైన పల్లెటూళ్లుండెడివి. వస్తువుల పంపిణి విషయములో డబ్బుగాక వస్తువునకు వస్తువే ప్రతి ఫలముగా లభించెడిది. ఆంగ్లేయుల పరిపాలనములో గ్రామీణ ప్రాంతములోని కుటీర పరిశ్రమలు దెబ్బ తిన్నవి. కుటీర పరిశ్రమలద్వారా, చేతిపరిశ్రమలద్వారా రూపొందిన ఉత్పత్తి ప్రక్రియలలో యజమాని కార్మికుడు అను అంతరములు లేక తామే ఉత్పత్తి చేసుకొని తామే అనుభవించుటకు వీలుండెడిది. ఆతరువాత ఉత్పత్తి సాధనములు కొద్దిమంది చేతులలో కేంద్రీకరించబడినప్పుడు యజమానులు ఉత్పత్తిని మరింత పెంచి అంతకు ముందున్న బానిసలను వృత్తి కళాకారులుగా వేతన కార్మికులుగా మార్చివేసిరి. పారి శ్రామిక విప్లవము వలన ఉత్పత్తి సాధనములు పెరిగి నూతనముగా యంత్రములు వచ్చినవి. ఉత్పత్తి సాధనములకొరకు యజమానులు తమ పెట్టుబడులను పెంచి యంత్రములను స్వాధీనము చేసికొని పెద్దయెత్తున కార్మికులను నియమించి అధికో త్పత్తితో అధికలాభములను ఆర్జించుట మొదలుపెట్టిరి. ఈ విధముగ యజమానులు కార్మికులు అను రెండు వర్గములు ఏర్పడి పారిశ్రామిక విప్లవము తరువాత స్థిరపడినవి. యజమానులు మరింతగా పెరిగిపోవుట - కార్మికులు దిగజారిపోవుట జరిగినది. భారీ యంత్రములద్వారా ఉత్పత్తి - గనుల - అడవులనుండి ముడిసరుకు, అధికవ్యవసాయపు దిగుబడులు, మొదలగు వానివలన వర్తక వ్యాపారములు అభివృద్ధిపొంది దేశీ యాదాయము పెరిగినది.కాని అదాయము అందరికీ సమానముగా పంపిణీ జరుగుటలేదు. యాజమానులు లాభములు పొందుచు, కార్మికులు వారి దయా దాక్షిణ్యాలమీద బ్రతుక వలసి వచ్చినది. కూలికి పనిచేయు వారిసంఖ్య పెరిగి కూలిదొరికే పరిస్థితికూడ క్షీణించినది. ఎక్కువ కాలము పనిచేసి తక్కువ కూలీ పొందవలసిన స్థితి ఏర్పడినది. యజమానుల ఆదాయము ఎన్నోరెట్లు పెరుగుతూ వచ్చినది. అందుకు భిన్నముగా వేరొకవైపు కార్మికులకు కనీసాదాయము మాట అటుంచి సాంఘిక జీవనములో వివిధములగు దోపిడీలకు గురికావలసి వచ్చినది. సరియైన తిండి- బట్టలేకపోవుట నివసించుటకు యిల్లులేకపోవుట అనారోగ్యము,మురికివాడలు, నిరక్షరాస్యులు, పిల్లలను బడికి పంపలేక చిన్నతనముననే కూలికి పంపించుట సాధారణమైపోయినది. ఈ విషయములన్ని పుట్టపర్తి మేఘదూతమున వర్ణింపబడినవి.

" చదువు సంధ్యలు సుంతలేవు
శ్రమపడిన సౌఖ్యములు వారికేగావు
నాగరికతాజాతి వారి మేదో మాంసములపై
తాజాగ కట్టినది తమ సౌఖ్య సౌధాలు"

పిల్లలను బడికి పంపలేక, కూలీకి పంపించు దారిద్ర్యము వివరించుచూ,

"అటు చూడవోయి - య
క్కాటిక మూనగదోయి
కంకిరను కొట్టు చున్నాడూ పొట్టలో
డొక్క లేర్పడు పిల్లవాడూ - వానికను
గుడ్లలో నీరు కొంచెముగ దిగజారి
గాయగాచిన వాని కరమె కాల్చుచునుండె"

తిండి, బట్టకరువైన పేదవారినిగూర్చి

" వాడెకమ్మరి చూడు
దౌర్భాగ్యముల గూడు!
కొలిమి నూదుచునున్నవాడు - తనపొట్ట
కోసమై నవయుచున్నాడు - అల్లంత
దూరాన నడెవాని లొయ్యలివి కనుగొమ్ము
జీరాడు చనులతో చీరనోచనిదాన"

తిండి బట్ట గతిలేని ఈ పేదలకు పుట్టిన సంతానము పాలకై ఏడ్చినపుడు పాలు త్రాగింతురో లేక తమ యురముజీల్చి రక్తము త్రావింతురో కలవారికేమి తెలియునని కవి ఆవేద: పొందెను.

ఒకవైపు యజమానులు విలాస జీవితము గడుపుచూ పెరిగిన ఆదాయమును పెట్టుబడు:గా వినియోగించుచూ ఆస్తులను పెంచుకొనుచుండగా ఇంకొకవైపు కార్మికులు ఉత్పత్తి కారకులై కూడా తగిన ప్రతిఫలము పొందలేక, పొందిన ప్రతిఫలముతో జీవితము నీడ్వలేక యజమానులకు సంపద నందించుటయేగాక తమయౌవన సంపదలనుకూడా వారికి నైవేద్యము చేయుచున్నవారి నిస్సహాయస్థితిని వర్ణించుచు,

" స్తన గుళుచ్ఛాలపై
దట్టాడు చెమటంత
రాళ్ళుమోయుచునున్నవారి–యౌవనము
బీళ్ళ చంద్రికలైన వారి–కడుపునకు
గాయమమ్మిన యట్టి కనకాంగులకు
తోయ దానం బిమ్ము తోయదమ నీవైన"

ఈ దారిద్ర్య బాధ ఏ ఒక్క ప్రాంతానిదో కాదని, దేశ మందంతట యిట్టి పరిస్థితి యున్నదని వివరిస్తూ

" కట్టు బట్టయు తిండి గతిలేని దేశాన
పుట్టగొడుగులు గాక పురుషులెవ్వరున్నారు"

పురుషులనగా అన్యాయము నెదిరించగలవారు తిరుగుబాటు, చేయగలవారు.

చరిత్రను విశ్లేషించుటలో కవి "చరిత్రయొక్క ఉత్థాన పతనాలను ఏక కాలంలో వివరిస్తాడని" విమర్శకులు చెప్పిరి. మేఘదూతములో చారిత్రిక ప్రదేశములను వర్ణించుచూ అచట గొప్పతనమును, గొప్పవారిని, ఆ ఘనత ఏ విధముగా పతనమైనదీ వెంటవెంటనే వర్ణించును.7 మధ్యయుగములో వచ్చిన బహునాయకత్వం, మతదురభిమానము, రెండూ ఈ దేశమును పురోగమనము నుండి తిరోగమింప జేసెనని కవి తీర్మానించెను.

" తెనుగులకు బహునాయకత్వమ్ము
పట్టినది రోగమ్ము
నాడునేడుగా దనాదిగానున్నదో"

మతమునుగూర్చి కవియిట్లు వివరించెను మతము అమృతమైనదే, కాని దురభిమానం, ఆవేశము కలిస్తే, హాలాహలమవుతున్నది భారతము పాడయినదే పరస్పర శాత్రవములతో "వనచమా ఏ మనగవచ్చు మూర్ఖత్వము"- అని చింతించెను. హృదయములో కరుణ లేని ప్రజలకు మతములేనేలేదు. కరుణలేని ప్రజలు క్రోధావిష్టులగుదురు. స్వార్థము పెరిగి పరస్పర సంఘర్షణలు ప్రారంభమవుతవి.

" కుదిచి కూర్చొనలేక
కదు దుర్మదం బెనసి
యాదోతులై నిల్చినారూ-గ్రమ్ముకొన
నీప్రక్క నాప్రక్క వారూ-మతపిచ్చి
ఈదేశ చరితలో నెంత పనిచేసెరా
ప్రతిపదంబున వేయి పారెరక్తసదాలు'

అవివేకులైన రాజులకీర్తి క్రోధ దాహానికి మధ్య లేగదూడల వంటి ప్రజలు నశించి నారను భావము ధ్వనింపబడుచున్నది. ఈవిషయమును మరింత స్పష్టముగ మత దురభిమానము అనైక్యముకలిగిన రాజవర్గపు సంఘర్షణలో అమాయకసైన్యము హతమైనదని యిట్టిపరస్పర పీడనమే దేశచరిత్రకుమూలమని

'మతమంట' మతయొక్క
మారిదై పట్టినది
మతిలేని రాజవర్గంబూ — వారిన
మృతికిఁ బచ్చినది, సైన్యంబూ — హృదయాన
గరుణకరపైయున్న సెరుల, కెక్కుడి మతము
పరపీడనమె, దేశచరితలకు మూలంబు (మేఘదూతము-30)

అని శ్రీశ్రీవలె చరిత్రను వ్యాఖ్యానించెను. కాని కవి పేర్కొనిన సంఘర్షణ రాజ వర్గముల మధ్య అనునదిగమనింప వలసిన విషయము.

పుట్టపర్తి "రామకృష్ణుని రచనా వైఖరి" అను విమర్శనాత్మక పుస్తకము నందు చరిత్రను విశ్లేషించుచూ,

> "విలాస ప్రియులైన రాజులకు ప్రజలను పాలించుట కర్తవ్యము పోయి వారిని వంచించుట వీలులేకున్న హింసించుట నిత్యకృత్యములయ్యెను. నాటిరెడ్డిరాజులు ప్రసూతి పన్నును కూడ విధించినారట. నాటిరాజ దండన మెంత భీభత్సముగనున్నదో అనుటకిది ఉదాహరణ. నాటిరెడ్లు శైవులు, వెలమలు, వైష్ణవులు, విజయనగరరాజులద్వైతులు. నాటి కావ్యములు పరిశీలించినచో నామత సంస్థలలో ఎంతవంచన, ధూర్తత్వము తాండవించినదో తెలియును" (పుట-27)8

ఈ వివరణ గేయరూపమున మేఘదూతమున కన్పించును,

"ప్రతిపల్లెలో నీకు
పాళెగానిది కోట
పాళె గాడైనట్టి రెడ్డి — కనుపించు
ప్రజల బ్రతుకుల సౌఖ్యమడ్డి"

మార్క్సిజమ్ ప్రభావము పుట్టపర్తిపై లేనప్పటి నుండి కూడా "పేదలు కష్టపడు చున్నారనె ఆలోచన"9 యున్నది తరువాత కాలంలో 'మార్క్సిజమ్' ప్రభావ మునకు కవిలోనయ్యెను. శ్రీపాద అమృతడాంగే వంటి వ్యక్తుల పరిచయము

ఆయనకు ఈరకమైన ఆలోచనలను అభివృద్ధి చేసినది 'కూపు గుడ్డ పరిష్కారం కానిదే మానవుడు మహోన్నత శిఖరాలను అధిరోహించలేడు -జీవిత ప్రాథమిక అవసరాలను తీర్చుకొనడానికే తీరికలేని సమాజంలో మానవునిలో కళాతృష్ణ, సాహిత్యజిజ్ఞాస పెరగడం అంత సులభంకాదు, అందుకే సాహిత్యం వర్తమానంలో ఆదరణ పొందకపోయినా మానవుడి మనుగడ కవసరమైన ప్రాథమికావసరాలు పరిష్కరింపబడే రేపటి నూతన సమాజంలో ఆదరింపబడుతుందనీ, అధ్యయనం చేయబడుతుందని ఆశిస్తున్నాను'-10 అని ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయనతెలిపెను. దీనిని బట్టి మానవుడి ప్రాథమిక అవసరాలతీరే నవ్యసమాజము భవిష్యత్తులో వస్తుందని కవి ఆశించెను. ఆయభిప్రాయముతోనే మేఘదూతమున చరిత్రను వర్తమానమును ప్రగతిభావదృక్పథమున సమీక్షించెను.

"కాని మార్క్సిజం అనేది సర్వవిధ్వంసకవాదముకాదని గతంలోని మంచిని కూడా నిరాదరించే, నిరాకరించే, నిరసించేధోరణి ప్రదర్శించడం వల్ల వ్యవస్థ మార్పును అభిలషించే వ్యక్తులుకూడా మార్క్సిజం అంటే సర్వవిధ్వంసక వాదమనే దురభిప్రాయానికివచ్చేసారని" మార్క్సిజము పట్ల తన కున్నదృక్పథమును ఆయనప్రకటించెను. ఈభావమున కనుగుణముగానే మేఘదూతమున సనాతన కాలమునుండి మతసంస్కృత నాగరికతలనంటి పెట్టుకొని అభివృద్ధి చెందిన లలితకళారూపాలను కళాద్రష్టలను, కళాస్రష్టలను, కళాపోషకులను కళానిలయములను కీర్తించెను. సంస్కృతినాగరికతల చిహ్నములుగా మిగిలిన కళావృత్తులను నమ్ముకొని జీవించువారియెడ సానుభూతి ప్రకటించెను.

పులితోలు గట్టికొని
చెలువు ఛత్రిబట్టి
రంగురంగులగుడ్డలూనీ చేతక్క
జెంగలింపగ కొత్తబాణీ గన్పించు
బుడుబుడుక్కల వాడు నిడుద పాటలతోడ
కడలేని అవ్వాని కష్టంబు నడుగరా।

ఇట్టి బుడబుడిక్కలవానిరూపము,

తనదుపూలకు వింత
గాండవములు దిద్ది
వంకించి వంకించి శిరసూ శబ్దములు
జంకించి, చూపించి దురుసూసుద్దులను

పలుకు వారల స్వరూపము ఆదిభిక్షువను పనుల ముందుంచుతున్నది. ఇవిభా తీరు

మత సంస్కృతిరూపములు, అందువలననే కవి "తక్కవని ఎంచేవు జాతి విక్రయముచకు తేఁకువలు" గా అభివర్ణించెను. ఇట్టివిద్యలు అంతరించిపోవుటకు పైదేశికవిద్యావ్యామోహము కారణమనీ

"ఇంటింటిలో గూడ నింగ్లీషు చిలుకలై
నేడు మాచిమవ్వలో నేలపాలై పోయె"

అనివిచారము వ్యక్తీకరించెను. పల్లెటూళ్ళలో ప్రజలు 'మావయని, బావయని, వరుసలతో కలసి మెలసి యుందురు. నాగరికత పెరిగిన పట్టణములలో యిట్టి అనుబంధము కనిపించదని వాపోయెను పణ్యాంగనల జూచి వారికి వ్యభిచార దోషము నంటగట్ట వలెనని భావింతురుగాని వారికి ఈవాయకులు సహాయమెందుకు చేయరని సానుభూతిని ప్రకటించెను. ధర్మార్థములు శుష్కమై, స్వార్థము పెరిగి అర్థమే సర్వస్వముగా మారిన పరిస్థితి యిదియని సమాజమును విమర్శించెను. ఈ విధముగా జాతీయ భావమును విడిచిపెట్టక జాతిపతనావస్థను కవిచిత్రించిన వినూత్న పద్ధతి.

దూతకావ్యాంశమైన మార్గోపదేశము ఈ కావ్యమున కటకము నుండి శ్రీకాకుళము వరకు చేయబడినది. ఆయాప్రాంతములలోని పౌరాణిక, చారిత్రక జానపద విశేషములు వర్ణింపబడినవి. రాజులు, కవులు, శిల్పులు, సంగీతవేత్తలు స్మరింపబడిరి. ఈవివరణ మంతయు పట్టికరూపమున ప్రక్కన ఈయబడుచున్నది.

| చారిత్రిక ప్రదేశము | వ్యక్తులు | నదీనదములు | ప్రకృతి | దైవ సంబంధి | కావ్య సంబంధి |
|---|---|---|---|---|---|
| కుంతల దేశము | చిన్నాదేవి | | | | |
| | తిమ్మరుసు | తుంగభద్ర | వృక్ష-పక్షిజాతము | — | శ్రీనాథుడు |
| | కృష్ణరాయలు | — | — | | — |
| హంపి | — | — | — | హంపీ విరూపాక్షుడు | సర్వజ్ఞుడను కిన్నెరకవి |
| ఋష్యమూకము | — | తుంగభద్ర | కొండమల్లెవనము | — | — |
| పెనుగొండ | తిరుమలరాయలు | — | దాడిమ ద్రాక్షా లతాలయము | — | భట్టుమూర్తి |
| శేషాచలము | — | — | — | శ్రీ వేంకటేశ్వరుడు | — |
| జగతాపిదుర్గము (గుత్తి) | — | — | — | దక్షిణా వర్త శంఖము అనిపేరు | — |
| కళసాపురము | — | — | కదళీ వనములు<br>ద్రాక్షా వనములు | శ్రీధర నారాయణుడు | కుమార వ్యాసుడు |

| చారిత్రక ప్రదేశము | వ్యక్తులు | నదీనదములు | ప్రకృతి | దైవ సంబంధి | కావ్య సంబంధి |
|---|---|---|---|---|---|
| తళ్ళికోట | బహ్మనీసుల్తానుకు రామరాయలకుజరిగిన యుద్ధము | కృష్ణానది | — | — | — |
| | హరిహరబుక్కరాయలు | | — | — | — |
| రేనాడు | — | — | గరుడాద్రి | అహోబలము నవనారసింహులు | చెంచులక్ష్మి కథ వర్ణితము |
| మారికాపురము | సలకము తిమ్మవిస్మరణ పణ్యాంగనల వర్ణన | — | — | చెన్నకేశవస్వామి | రామరాయలు తిమ్మని వధించిన శాసనము |
| శ్రీశైలము | చెంచితల, రెడ్డిరాజులు కట్టించినశిల్ప సోపానములు | — | బిల్వవనము ఎ వట్టివేరులతో ప్రవహించు సెలయేళ్ళు నెమళ్ళు | భ్రమరాంబా మల్లికార్జునస్వామి శివ నృత్త వర్ణన | పాల్కురికి సోమనాధుని స్మరణ |
| నెల్లూరు ఉదయగిరి | మనుమసిద్ధి-ఖడ్గతిక్కన | పెన్నానది | — | శ్రీరంగనాధుడు | తిక్కన |
| | — | — | ఉదుంబరముల కాననము | — | — |

| చారిత్రిక ప్రదేశము | వ్యక్తులు | నదీనదములు | ప్రకృతి | దైవ సంబంధి | కావ్య సంబంధి |
|---|---|---|---|---|---|
| అద్దంకి సీమ (కోటప్పకొండ) | రెడ్డిరాజుల స్మరణ | — | వృక్ష-పక్షి | కోటప్పకొండ | శంభుదాసు కవితావర్ణన |
| తెనాలి | స్త్రీల వర్ణన | — | — | — | — |
| గుంటూరు | భాస్కరమంత్రి | గుండ్లకమ్మ ఏరు | — | — | భాస్కర మంత్రి కవితాస్మరణ |
| కొండవీడు | రెడ్డిరాజుల పరిపాలనా స్మరణము-వేమన లకుమకొమరగిరిరెడ్డి | — | — | — | — |
| పలనాడు | చాపకూటిఉదంతస్మరణము బాలచంద్రుడునాగమ్మ బ్రహ్మనాయుడు | — | — | చెన్నకేశవస్వామి | — |
| విజయవాడ | కృష్ణరాయల స్మరణ లకుమాదేవి స్మరణ | కృష్ణానది | వెగ్గురు పక్షులు | కనకదుర్గాదేవి | సంగీత ప్రశంస |
| కూచిపూడి | నారాయణ తీర్థులు | — | — | మువ్వగోపాలుడు | క్షేత్రయ్య పదకవితలు |
| చంద్రగిరి | — | — | — | — | — |

| చారిత్రక ప్రదేశము | వ్యక్తులు | నదీనదములు | ప్రకృతి | దైవ సంబంధి | కావ్య సంబంధి |
|---|---|---|---|---|---|
| ఓరుగల్లు | గణపతిదేవుడు<br>రాణి రుద్రమదేవి<br>ప్రతాపరుద్రుడు<br>యాదవరాజు మొ॥<br>కిమ్మపీరులు_పద్మ<br>నాయకులు_యుగంధరుడు<br>ఏకవీర_ముసానమ్మ<br>మాంచాలదేవి_కాపయ్య<br>మొ॥ | — | — | వేయిస్తంభముల<br>ఆలయము<br>స్వయంభూ<br>లింగము | విద్యానాథుని<br>ప్రతాపరుద్ర<br>యశోభూషణము<br>యచితేంద్రుని<br>శాసనము<br>శ్రీనాథుని క్రీడాభి<br>రామస్మరణము<br>పంచశివాచార్యుల<br>స్మరణము |
| భువనగిరి (కోట) | పద్మనాయక రాజుల<br>పరాక్రమ స్మరణము<br>గోపన్న | — | — | శ్రీరామస్మరణము | — |
| గోలుకొండ | తానీషా | మంజీరానది | — | — | — |
| వేగినాడు | చాళుక్యుల పౌరుష<br>ప్రతాప స్మరణము | — | నారికేళవనములు<br>ఆమ్రవనములు<br>మొగిలిపూల వనములు<br>చెఱకు తోటలు<br>సరస్సులు పద్మములు | — | — |

| చారిత్రక ప్రదేశము | వ్యక్తులు | నదీనదములు | ప్రకృతి | దైవ సంబంధి | కావ్య సంబంధి |
|---|---|---|---|---|---|
| హేలాపురి | — | — | అడవిదున్నలు-పందులు<br>సీరుకోళ్ళు-హరిణములు | — | — |
| రాజమండ్రి | రాజరాజనరేంద్రుడు | గోదావరి | పాపికొండలు | — | నన్నయకవిత్వము<br>భవభూతికవిత్వము |
| భద్రాచలము | రామదాసు చరితా<br>స్మరణము | శబరీ<br>కిన్నెరసాని | — | శ్రీరామచంద్రుడు | చింతాకుపతకము<br>మొదలగుకీర్తనలు<br>విశ్వనాథ సాహిత్య<br>స్మరణము |
| కోనసీమ | వేములవాడ భీమకవి | — | — | — | చాటుకవితా వర్ణన |
| దాక్షారామము | — | సప్తగోవరము | — | భీమేశ్వరస్వామి<br>గోగులమ్మ-నూకాలమ్మ<br>మాణిక్యాదేవి-శ్రమండదేవి<br>పరమశివ నాట్యవర్ణనము | శ్రీనాథ కవితా<br>స్మరణము |
| కోరుకొండ | — | — | — | — | ఏలేశ్వరాచార్యుడను<br>విద్వాంసుని ప్రసక్తి |
| పట్టిసము | సౌందర్యవతుల<br>వర్ణనము | — | — | — | — |
| అన్నవరము | | | — | సత్యనారాయణస్వామి | — |

| చారిత్రిక ప్రదేశము | వ్యక్తులు | నదీనదములు | ప్రకృతి | దైవ సంబంధి | కావ్య సంబంధి |
|---|---|---|---|---|---|
| సామర్లకోట | తాండ్ర పాపయ్య కధనము-మల్లమ్మ | — | తాళీవనమ్ములు | — | — |
| కాకినాడ | — | సింధూతీరము కొమరేడు | పులినములు | రాజ నారాయణస్వామి | — |
| సర్పపురము (ఆంధ్రిదేశపై కుంర మణిపేరు) | — | తుల్యభాగానది | — | భావ నారాయణస్వామి పరమశివుని వర్ణన | — |
| పిఠాపురము | హేలాసాని | ఏలేరు | పోకపూవులు పనసపండుల వనమును | పీఠాంబ కుంతీమాధవుల పార్వతీపరమేశ్వరుల కుక్కుటేశ్వరుల-వర్ణన | |
| తుని | తెగని ప్రణయకలహములకు ప్రసిద్ధమట | — | — | — | — |
| అనకాపల్లి | — | — | ఇక్షు వనములు-లవంగి లతా వనములు | — | — |
| సింహాచలము | సగర పుత్రులకీర్తి స్మరణ | — | నారికేళవనములు కదళీవనములు | వరాహనృసింహస్వామి | కృష్ణరాయల శాసనము |
| | తిమ్మరుసు | — | పనసపండ్ల వనములు | — | |

| చారిత్రిక ప్రదేశము | వ్యక్తులు | నదీనదములు | ప్రకృతి | శైవ సంబంధి | కావ్య సంబంధి |
|---|---|---|---|---|---|
| సింహాచలము | రామానుజులు | | మామిడితోంట వనములు | | — |
| విజయనగరము | ఆనందగజపతుల స్వీ-విజయరామరాజు దుష్ప్రవర్తన | | గంటకరణము | | — |
| బొబ్బిలి | బొబ్బిలి రాజుల ము తాండ్రపాపయ్య వీరత్వము | | | | — |
| శ్రీకాకుళము | గజపతుల స్మరణము | | | | — |

ఈ విధముగా సాగిన మార్గోపదేశమందు కొన్ని ప్రధాన క్షేత్రములు చెప్పబడలేదు. కరీంనగర్ - ఆదిలాబాద్ మండలముల ప్రసక్తి యుండుటలేదు. వేములవాడ, కాళేశ్వరము, త్రిలింగ సరస్వతీ క్షేత్రమగు బాసర, నరసింహ క్షేత్రములగు ధర్మపురి, అరదుండు ఇసుకస్తంభము గోదావరి ఉపనది యైన ప్రాణహిత మొదలగు వాటి ప్రసక్తి యిందు కన్పించదు. మరియు బళ్ళారి జిల్లా నుండి సాగివచ్చిన మార్గము ఒక క్రమముగా లేదు. ఓరుగంటిని గూర్చి చెప్పినపుడు శ్రీనాథుని స్మరించి పోతనను విస్మరించెను. చరిత్ర పరిశోధకుడై యుండి పరంపరగా జనశ్రుతిలో వచ్చు "కృష్ణదేవరాయల యెడ తిమ్మరుసు రాజద్రోహము" ను గూర్చి వర్ణించెను. ఓరుగంటి శిల్పములను గూర్చి చెప్పునపుడు రామప్పను స్మరించలేదు. కృష్ణాజిల్లాలోని అమరావతిని మరచెను. తెలుగుదేశమును వర్ణించవలెనను అభిలాషతో చేసిన మార్గోపదేశము కొంత అసంపూర్ణమనియే చెప్పవలెను.

# కరుణారస కావ్యము

కావ్యమున రసావిష్కరణము పాత్రల మూలమున కలుగును, ప్రధానరసము నాయికా నాయకుల నాశ్రయించి యుండును. ఇతర పాత్రములయందు లేదా ప్రకృతి గతమగు వస్తు వర్ణనమునందు అంగరస భావములు వర్ణింపబడును. మేఘదూతమున అద్యంతములయందు అనుభూయమానమగు రసము కరుణము. ఈ కరుణ రసమున కంగముగా విప్రలంభ శృంగారము పోషింపబడినది. చారిత్రిక వర్ణనము కూడ ప్రాచీనుల ఉన్నతస్థితినుండి పతనస్థితిని వర్ణించుటచేత వీరరస భావములు క్రమముగా శోకమునకు సన్నిహితమైనవి. అచ్చటచ్చట చెప్పబడిన భక్తి భావములు ప్రధాన రసభావమును తాత్కాలికముగా ఉపశమింపజేసి ఆయాప్రదేశములు వర్ణించుటలో ఉత్సాహము కల్గించినవి. చివరగా నాయికను వర్ణించు సందర్భమున శృంగార భావము ప్రసక్తమైననూ, సందేశము కరుణ రసాత్మకముగ చెప్పబడి కావ్యము ముగ్గించ బడినది. ఈ విధముగా ప్రధాన రసము కరుణముగా పోషింపబడి వీరశృంగారములు అంగరసములుగా ప్రవర్తించినవి.

కావ్యమున రసావిష్కరణకు నాయికా నాయకులాలంబనము. దూత కావ్యమున నాయకునకు అలంబనము నాయిక. కాని ఈ మెఘదూత కావ్యమున నాయకునికి ఒక్క నాయికయేగాక-అతని దారిద్ర్యము సామాజిక పరిస్థితులు - అనారోగ్యము ఇవన్నియు అతని మనోగత భావముల విశ్లేషించినవి. అలంబనమైన నాయిక తన కన్నుల యెదుటనే అధికారిచేత అవమానింపబడి బాధింపబడుటచేత నాయికను గూర్చిన అలంబన విభావము కారుణ్యమైనది. మార్గోపదేశ వర్ణనము ద్వారా అనుసరించివచ్చిన భావనులు నాయకుడు ప్రకటించిన ప్రధాన రసమునకు పరిపుష్టి కిలిగించినవి.

ఈ కావ్యమున నాయకుడు "*కుటిల కారాగార కఠిన దంష్ట్రా క్రకచ దళితుడై*," "*బాష్పసందళితుడై*" యుండెను. అట్టి నాయకునకు ఒక నాయిక యున్నది. ఆమె అభినవోద్భిన్నమగు యౌవనము గలది. హాసము లందు అనురాగము శైతల్యము కలది. హృదయము నందమృతము కలది. దుడుకు కుచము లందు కిడలేవి గరువమ్ము కలది. తుదిలేని ఆశయైన ఆమె నాయకుని యింటి దీపము. అట్టి నాయికను అతని ముందరే అధికారి రక్తము గ్రక్కుకొమనట్లుగా తన్నెను. ఆమెకు కనుల నీరు గ్రమ్మగా మాటాడ లేక పోయెను. అధికారులు వారిని వేరు చేసిరి.

ఈ విధముగా కరుణ రసాత్మకముగా కావ్యము ప్రారంభమైనది. చెఱసాలలో నాయకుని స్థితి మరింతగా దయనీయమైనది. భుజించుటకు అధికారులిచ్చిన సంగటిలో పురుగులున్నవి. ఆహారము లేనందున మూల్గువంటి ఆకారముతో నిశ్వాసములే పరిధానమై ఆయువుపట్టి బ్రతికియుండెను. దిక్కులేని ఆ ప్రదేశమున మంటి పాత్రయే చెలికాడు. ఆ జైలు గోడలలో జోరీగల ధ్వనులు, రక్తము త్రాగు చీకటీగలు, తల నిండ పేనులతో నాయకుడు నవయుచుండెను. పగలెల్ల పంచప్రాణములు ఆకలితో నకనకలాడుచుండెను. రాత్రియంతయు భార్య జ్ఞాపకమునకు వచ్చి దుఃఖించుచుండెను భార్యను గూర్చిన విరహము, తట్టుకొనలేక ఎపుడు తెల్లవారునా యని ఎదిరిజూచును. ఇట్టి దుస్థితిలోనున్న ఆతడు "*పదిలేని ఆశగా*" నున్న ప్రేయసి కొఱకు బ్రతుకు చుండెను.

> వెఱ్ఱి బాగుల చాన వెన్నవంటీ మనసు
> తిలకింప తోక జుక్కల వంటి కనులతో
> జూచెనా పదివేలు"

అది ఆమె వ్యక్తిత్వ సౌందర్యమును సంభావించెను. తనకు దూరముగానున్న ఆమె కవబాసిన జక్కవ వలె, యిట్టి విడిచిన హరిణము వలె, లయలేని గానము వలె, ఏకాంతము వలె, ఎట్లున్నదో యని దుఃఖించెను. ఇట్లు ప్రతిదినము కన్నీటితోనే ప్రేయసి రూపము చిత్రించుకొని నిట్టూర్పుల పూలతో పూజించుచుండెను. ఇట్టి అనుభవముతోనున్న ఆతడు ఒకనాటి రాత్రి చంద్రకిరణ స్పర్శకు ఇనుప కమ్మిపై తలవాల్చి నిదురపోయెను. తెలివి వచ్చుసరికి తన కన్నీటితో తడిసిన, ఆ యినుప కమ్మి ప్రేయసి చిక్కిపోయిన శరీరమువలె తాకెను. వెంటనే తలఎత్తి గగనమున కన్పించిన మేఘముతో ప్రియురాలికి సందేశము పంపించెను. మేఘమునకు మార్గోపదేశము చేసెను.

మార్గోపదేశమున శృంగార వీరభక్తి భావములు వర్ణింపబడినవి. అవి క్రమముగా కరుణరసమున లీనమైనవి. శృంగారమును వర్ణించుపట్ల ఈ కావ్యరచన ప్రాబంధిక ధోరణి ననుసరించినది. అచ్చటచట విసర్గరమ్య సౌందర్య వర్ణనలున్నవి. ఒక్కొక్కచో క్షీణ ప్రబంధముగ కవితా ఛాయలు కూడ కనిపించినవి.

" మదన రథ చక్రమ్ము
మరపించు కటితోడ
నీటు గుల్కుచు నున్నవారు
.... .... .... ....
స్తన గుచ్ఛాలపై
దట్టాడు చెమరింత

" ఆ పర్వతాన కవిపించెదరు నీకు ద్రావిడాంగనలు
తారుణ్య చాతుర్య పారమ్య తను హృద్యులు
కర్ణాట తరుణీ శ్రవో భాసితాటంక ధళధళల"

మొదలుగా స్త్రీల వర్ణన ప్రాచీన కావ్య ధోరణిలో నడచినది.

" మామయ్యా బావయవి
మనసు లోతుల తడవు
వావి వరుసల నెన్నుకొనుచూ
పురుషులును జవరాండ్రు గ్గూడికొనుచూ "

"చిగురు జొంపము లందు
మగలు మగువలు గూడి
మగసేత లాడి కొన్నారూ"

"తడబాటు నడలతో
నడుము కిటకిటలాడ
పేటలను నూడ్చు చుండెడి వారూ - మాలెతలు"

మొదలగు నిసర్గ రమ్య వర్ణనలున్నవి. కొన్ని చోట్ల కావ్య ఔచిత్యమునకు భంగకరములై యున్న వర్ణనలు కూడ కలవు. క్షీణ ప్రబంధ యుగ కవితా ప్రభావమున్నవి క్వాచిత్కముగా వచ్చిపడినవి.

" మా కుచము లింతింత యని
నీకు సూచించునటు
చేతులను చెంబులను ధరియించి-గొల్లెతలు"

" విరళి వీగెడి చనుల వెక్కిరించెడు కనుల "

" అంబళ్ళవడిపిట్టు దెబ్బ పొత్తుకల నాచీ
జాంగలా విషమైన అన్నంబు మెసవుచే తడవుగా
మిశ పెట్టి కుచభరము పిసుకు తోళివలయందు"

ఈ విధముగా అచ్చటచ్చట కావ్యస్థాయిని తగ్గించెడి వర్ణనలు కావ్యనాయకుని పాత్రౌచిత్యమునకు భంగకరమని కొందరు పరిశీలకులు పేర్కొనిరి.

చరిత్రను వర్ణించుపట్ల ఔన్నత్య పతనావస్థల వెనువెంటనే చెప్పుటచేత వీర రసభావము కారుణ్యమైనది.

" హరి హరుడు బుక్కడీ
ధరణిపై జన్మించి
ఆంధ్రరాజ్యము నిల్పినారూ
మౌని విద్యారణ్య మనసు గొన్నారూ
తరువాత ధరణి పాలురు భోగదాసులై
తపముచెడి—పరులచేతికి చిక్కి
పాలార్చిరీ చరిత—
గడచిపోయినదింక లాభంబులేదు"

కాకతీయుల పరాక్రమమునకు రుద్రమదేవిని ప్రతీకగా,

" ఒకనాడు తెనుగులో ఉవిద దృష్టికే కాదు
కరసాన బట్టినది ఖడ్గలతికకు కూడ"

అని వీరరస స్ఫోరకముగా వర్ణించి,

" కాలాన మాసి పోయిన-ఆంధ్రమండలీ విభవంబు
లే సోమశేఖరుడో ఏనాడో చెప్పవలె"

నని విషాదము ప్రకటించెను.

ఈవిధముగ మార్గోపదేశమునందలి శృంగార వీరభావములు ప్రధానరసమైన కరుణమునకు పరిపుష్టినిచ్చినవి.

చివరగా నాయకుడు నాయికను గుర్తించుట "శ్యామాంగి, మధురాక్షి, చక్కనగు తీరులది" అని ఆమె స్వరూప వర్ణనము_సౌకుమార్యముగా వర్ణించినను ఆమెను ప్రోషిత భర్తృకవలె చెప్పిన_తీరు కారుణ్యమైనది. "ఏకవేణీధరాదీనా, భర్తృ చింతా పరాయణా" అని రామాయణములో సీతను గూర్చి చెప్పినట్లు,

"ఏకవేణీ భరముతో సలిల నిభృతాక్షి ఈవైపె
చూపొసగె నిరతంబు చూచు నను కొందురా"

అని వర్ణించెను.

నాయికా నాయకుల పునస్సమాగమము వర్ణించిన విప్రలంభ శృంగారము పూర్వకావ్యములకు పరిపుష్టినిచ్చినది. సంస్కృత మేఘ దూతమున నాయకుడు ప్రవాసానంతరము నాయికను కలుసుకొని సుఖించినట్లు స్పష్టముగ వర్ణించబడినది. ఈ తెనుగు దూత కావ్యమున నాయికా నాయకుల పునస్సమాగమము వర్ణింపబడలేదు నాయకుడు నాయికకిచ్చు సందేశమున పునస్సమాగమము కలుగునని చెప్పబడినను, వర్ణింపబడిన పద్ధతి ననుసరించి నాయకుని జీవితము జైలునందే ముగిసిపోవునని ధ్వనించుచున్నది.

నీ మగని జూచితిని
విలిచి యున్నాడనుము
"వచ్చెద" ను వేగమే తిరిగి_దానిమరు
లెచ్చరింపగ మనసు కరిగి_తనమీది
"తలపెనాకిచ్చోట జెలికత్తె"_యనుమూ_నా
దినములిక దాపురించినవి తడలేదనుము
'ముద్దుగొన్నా' ననుము
నిద్దంపు దనప్రేమ
జీవితంబనుము కాలమ్ము_గడచినది
గడువవలయునది లెశమ్ము_లొంచరగ
తుదముట్టునను మోయుతోయదా_మన బ్రతుకు"

పై రెండు షట్పదులలోని నాయకుని సందేశమున, నాదినములింక దాపురించినవి తడలేదనుము' అనుటలోను, తుదముట్టునను మోయుతోయదామన బ్రతుకు" అనుటలోను పునస్స మాగమము జరుగదను నైరాశ్యము ప్రకటింపబడుచున్నది. మరియు

సంస్కృత మేఘదూతమున చిట్ట చివరి శ్లోకమున మేఘుడు పోయిచెప్పిన యక్షుని దీనాలాపములు కుబేరుడు దయతోవిని కోపము చల్లార్చుకొని శాపమూనాటితోనె తీర్చి నట్లును, ఆ దంపతులు కష్టములు తీరి అపరిమితానందముతో మరల సర్వభోగముల ననుభవించినట్లును వర్ణింపబడెను.[14] కాని ఈ తెలుగు దూతకావ్యమున

ఏ తెర్వు బట్టునో
యింతకును మేఘమ్ము
జవరాలి జూచునోలేదో-చూచినను
ఈమాట జెప్పునోలేదో-చెప్పినా
యా భాషలామగువ కర్థమౌనో! లేదో

అని సంశయాస్పదముగ, విషాదాంతముగ ముగించబడినది. ఇట్లు కరుణరసాను భూతిని ఈ కావ్యము కల్గించినది. అందులకే కవి "శోకాత్మకము కావ్యమ్ము" అని మొదటనే పేర్కొనెను.

## కాళిదాసు మేఘదూత ప్రభావము

"నీ వాలకము జూడగానే నాకేమొ
నీ వంగడము దోచెనోయీ
భువన విదితంబులగు పుష్కలావర్తముల
బుడు తండపంచు దలపోతునేనాత్మలో" నవి

సంస్కృత మేఘమునకు తెలుగుమేఘము సోదర ప్రాయమని ప్రకటింపబడెను. సంస్కృతమున వర్ణింపబడిన మేఘము కూడ భువనవిదితమగు పుష్కలావర్తక జాతిలో పుట్టినదేకదా.

-సంస్కృత మేఘదూత కావ్యలక్షణములు-

1) కుబేరునితో శపించబడిన యక్షుడు ప్రవాసము పొందుట
2) మార్గోపదేశము 3) విప్రలంభ శృంగారము

-తెలుగు మేఘదూతమున-

1) ధనికి వర్గముచే నిరసింపబడిన సామాన్యుడు చెరసాలపాలగుట
2) మార్గోపదేశము 3) కరుణరసావిష్కరణము

మరియు ఒకే ఛందము కావ్యములయందంతటను వాడబడినది. సంస్కృతమున మందా క్రాంతము, తెలుగునషట్పది. భావానుకరణమిట్లున్నది.

శ్లో॥ రత్నచ్ఛాయా వ్యతికరఇవ ప్రేక్ష్యమే తత్పురస్తాత్
వల్మీకాగ్రాత్ప్రభవతి ధనుఃఖండ మాఖండలస్య
యేన శ్యామం వపురతితరాం కాంతిమాపత్స్యతేతే
బర్హేణేవ స్ఫురితరచనా గోపవేషస్య విష్ణోః ॥ (శ్లో ॥ 15)

షట్పది ॥ "ఎన్నాళ్ళ కెన్నాళ్ళ
కీయిందుగ్రని ధనుస్సు
గనుపించినది మింటియందూ రతనాల
తనువు జిల్కంగా బసందూ ఒకసారి
దాని చెంగట విల్వరా! నీదు మెయిజూచి
బర్హంబుదాల్చు గోపాలునకు బోల్చెను

శ్లో॥ ప్రత్యాసన్నేనభసి దయితా జీవితాలమ్బ నార్థీ
జీమూతేన స్వకుశల మయీం హారయిష్యత్ప్రవృత్తిమ్
సప్రత్యగ్రైః కుటజకుసుమైః కల్పితార్ఘాయ తస్మై
ప్రీతః ప్రీతి ప్రముఖ వచనం స్వాగతం వ్యాజహార"
(శ్లో ॥ 4)

పైశ్లోకమున యక్షుడు తన ప్రియురాలికి తనక్షేమ వార్తను పంపకోరిక కలవాడై మేఘుని కొండమల్లెలతో పూజించి కుశలమడిగి నట్లుగా వర్ణింపబడినది. కాని తెలుగు దూత కావ్యనాయకుడు చెరసాలలో బంధితుడైనందున అడవిలోని కొండ మల్లెల నెట్లు తీసుకరాగలడు? అందువలనభావమును కొంతమార్చి,

"కుటజముల నెటుదెత్తునోయీ! పూజింప
గటకటా! యిదిచెఱగదోయీ!
ప్రత్యగ్ర కుటజములవంటి పల్కులతోనె
స్వాగతంబిచ్చేను సవరించుకోవోయీ!"

అని స్వాగతము తనకొండ మల్లెల వంటి పల్కులతోనే యక్షుడు మేఘమునకు చెప్పెను. విరహస్త్రీల వర్ణన సంస్కృతమున

'త్వా మారూఢం పవన పదవీ ముద్గృహీతాలకాన్తా
పేక్షిష్యన్తే పథిక వనితా ప్రత్యయాదాశ్వసత్యః
(శ్లో॥ 8)

"ప్రోషితభర్తృకలైన స్త్రీలు తమ ముంగురులనెత్తి నిన్ను జూతురు" అని మాత్రమే వర్ణింపబడగా, తెలుగున అలంకారికముగా విస్తరింపబడినది.

"చలువ నీడలతోడ
గులుకు నీ తెరువరసి
మగలపై హృదయములు భారీ సిగ్గుతెర
లగలివిన్ జూతురొకసారి అలకంబు
లెగజోపి-పింఛముల నిగనిగలు మఱపించు
తెగల కన్నుల చూపు మొగ్గలు నీపైబరపి"

ఇందు విరహిణుల చూపులు మొయిళ్ళగా వర్ణించుట అందమైనది, విప్రలంభ శృంగారమున విరహిణుల హృదయములనెడి సుమములు జారిపోకుండ ఆశా బంధములనెడి వృంతములు నిల్పియుంచునను సంస్కృత శ్లోక భావము యథాతథముగా తెలుగున వర్ణించబడినది.

శ్లో ॥ తాంచా వశ్యం దివస గణనా తత్పరామేకపత్నీ
మవ్యాపన్నా మవిహత గతి ర్ద్రక్ష్యసిభ్రాతృజాయామ్
ఆశాబంధః కుసుమసదృశం ప్రాయశో హ్యఙ్గనానాం
సద్యః పాతి ప్రణయ హృదయం విప్రయోగేరుణద్ధి
(శ్లో-10)

షట్పది : "దివసములు గణియించి
తీరులమ గుణియించి
తిరికెయె లేకునదాని మఱదలిని
దేర్పుమా। గారుణ్యమూనీ కుసుమంబు
పలెనె - యప్పుడెరాలు బలహీనమైన యెద
నిలుపు నాశా బంధములు వృంతసమములై"

సంస్కృత కావ్యమున కాళిదాసు శ్లేషనుపయోగించి తనకు ప్రత్యర్థియైన కవిని స్ఫురింపచేసెను. దిఙ్నాగానాం పథిపరిహరన్ స్థూల హస్తావలే పాన్ (శ్లో-14) అను చోట "దిఙ్నాగానాం" అను పదము దిక్కులలోనున్న ఏనుగుమ కాళిదాసు కవిత్వము విమర్శించు దిఙ్నాగుడను పండితుని చెప్పుచున్నది. అటులనే తెలుగున కూడ శ్లేషనుపయోగించి అన్యార్థము స్ఫురింపజేయబడెను.

"ఏచ టెచట నిల్పిరో
యెనో! జయస్తంభములు
రుద్రాణి తెన్గురుద్రమ్మ విక్రమం
బాపాద నఖము పసిగుర్తిమ్మా కాలాన
మాసిపోయిన యాంధ్రమండలీ విభవంబు
లేసోమశేఖరుడా యేనాడొ జెప్పవలె"

ఇందు "సోమశేఖర" పదము శివుని పరముగ - ప్రఖ్యాత చరిత్ర పరిశోధకులైన మల్లంపల్లి సోమశేఖర శర్మగారి పరముగ చెప్పబడినది మరొకచోట "విరూపాక్ష" శబ్దము నుపయోగించి, కన్నడమునగల సర్వజ్ఞుడను పండితుడు స్ఫురింపచేయబడెను.

మరియొక చోట విశ్వనాథ సాహిత్యమును ధ్వనింపజేసిన పద్ధతి విలక్షణమైనది.

"హృదయ మందొక ముదము
పదము లందొక మదము
వింత జిగ్గుల బాగులాడీ యెవ్వారి
కంతుజిక్కని చదురులాడీ స్వర్గంబు
నందుండి దిగివచ్చె నవని భాగ్యము వండి
వలపు నాగపసాని-తెలుగు కిన్నెరసాని"

భావ సారళ్యము, శైలీ ప్రౌఢిమ, విచిత్ర శిల్పము, లోతైన కవితాతత్త్వము అను అంశములుగల విశ్వనాథ కవిత్వము స్వర్గము నుండి భూమికి దిగివచ్చిన గంగానది వంటిదని అన్యాపదేశముగా ఈషట్పదిలో ప్రశంసింపబడినది, ఈ విధముగా స్వరూప స్వభావములందు సంస్కృత మేఘదూత ప్రభావము ఈ కావ్యముపై నున్నది.

# జ్ఞాపికలు :

1. 'అభ్యుదయ కవిత్వము'-కడియాల గోపాలరావు
'తెలుగు సాహిత్య వికాసము' (1900_1947 సంవత్సరము మధ్య పేజి_50)
సంపాదకుడు డా॥ కె కె, రంగనాధాచార్యులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు – తిలక్ రోడ్ – హైదరాబాదు.
2. 'పీఠిక' - పురోగమనము - పుట్టపర్తి.
3. 'నిర్వచనము' - గతితార్కిక భౌతిక వాదము - తత్వశాస్త్ర నిఘంటు సాహిత్య అకాడమీ ప్రచురణ.
4. A developing Country ........" is charactrised by the Co-existence, of in greater or less degree, of unutilised or under utilised man Power, on the one hand, and of unexploited natural resources on the other" - Indian Planning Commission.
5. The lubour - power is exploited by the capitalist by means of surplus-labour of the worker, over and above the time necessary to replace his wage, in the source of surplus-value, of profit of the continually growing accumulation of capital "On Marx's Capital" Engels - Page 15.
6. "The profits of stored-up, dead labour (Capital) become ever more massive, the Capital of the Capitalists becoms ever more colossal, while the wages of living labour constanlly decrease, and the mass of workers living solely on wages grows ever more numerous and powerty-stricken"
"ON MARX'S CAPITAL"-ENGELS-Page 13
7. సాహిత్య వివేచన డా॥ కోవెల సుప్రసన్నాచార్య
8. 'రామకృష్ణుని రచనా వైఖరి"-పుట్టపర్తి-పుట 27
9. సంఘర్షణ-పక్షపత్రిక-ఎడిటర్: గోవిందరాజులు
-15-01-1980-పుట: 7- -కమలానగర్-అనంతపూర్-
10. " " "
11. కావ్యాలంకార సంగ్రహము-పుట: 316
సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రి
12. 'పుట్టపర్తి కవితా విమర్శ'-వెంకటేశ్వరావు
13. రామాయణము, సుందరకాండ-శ్లో॥ 69 సర్గ 58 వాల్మీకి
14. మేఘదూతము-శ్లో॥ 57 ద్వితీయ సర్గః కాళిదాసు

# కావ్యస్వరూపవిశేషము

పుట్టపర్తి జీవనమెంత వైవిధ్య పూర్ణమో ఆయన సృజనాత్మక సాహిత్యము కూడ నంతవైవిధ్యముకలది. స్వరూప నిర్మాణమున, వస్తువిన్యాసమును బట్టి కావ్య విభజన చేయబడి పరిశీలింపనైనది. ప్రస్తుతము కావ్యస్వరూప విశేషము, ఛందో వైవిధ్యము వివరింపబడుచున్నవి.

## దృశ్యకావ్య లక్షణములు:

పుట్టపర్తి ఖండకావ్యములలో దృశ్యకావ్య లక్షణ సంయోజనము బహుధా కన్పించును. పెనుగొండ లక్ష్మిలోని మొదటి ఖండిక "ముదల". ఈ ఖండికలో భగవంతుని స్తుతించుట కావ్యరచనకు అనుజ్ఞవేడుట ఉన్నది ఇది నాటకములోని నాందీ లక్షణమును స్ఫురింపజేయును. షాజీ కావ్య ప్రారంభముకూడ నిట్లేయున్నది. కావ్యా రంభమున కవి, ఉద్బోధ, షాజీ కవి అని మూడు విభాగములున్నవి. కవి అను ఖండికలో భగవంతుని స్తుతి, ఉద్బోధలో "రండు రండోయి సోదరులారా" అనెడి ఆహ్వానము, షాజీకవి ఖండికలో కావ్యేతి వృత్త పరిచయము దృశ్యకావ్యమునందలి నాందీప్రస్తావనా లక్షణములను తెలుపుచున్నవి. షాజీ కావ్యమంతయు మూడు ఖండికలలో వర్ణింపబడినది. కావ్యములో వర్ణింపబడిన పాత్రలు మూడు. ఈవిధమైన త్రివిధ విభాగము కావ్యమునకు ఒక విలక్షణస్వరూపమును సంతరించినది. ఖండికలలోని ఆద్యంత పద్యములు కథను పాత్రలకును, రాబోవు ఖండికలలోని విషయమునకు అన్వయించునట్లు రచింపబడుట దృశ్యకావ్య లక్షణమే.

సాక్షాత్కారమున కూడ ఇట్టి లక్షణములేకలవు. నాటకమున ముందు, మధ్య మధ్య వ్యాఖ్యానము చేయబడునట్లు సాక్షాత్కారమున ప్రతిఖండికకు ముందు కొన్ని చోట్ల విపులముగను, కొన్నిచోట్ల సంక్షిప్తముగను వ్యాఖ్యానము చేయబడి కావ్య ఖండికల తాత్పర్యము సూచించినవి. నేపథ్యమునుండి పాటలు, పద్యములు, కీర్తనలు పాడబడునట్లు అదృశ్యముగ దేవవాణి రెండుమారులు పలుకుట కావ్యమున వర్ణింప బడినది. రామచంద్రుని పూజకై తులసీదాసు మొక్కలకడకేగి పుష్పములిమ్మని ప్రార్థించుటలో పద్యము పూర్తియై, పుష్పములు గిల్లుకొనుట కుండలీకరణమున సూచింపబడినది ఈ విధమంతయు నాటక లక్షణమే.

ఈ లక్షణము నాటి భావకవిత్వ ప్రభావమని కూడ చెప్పవచ్చును. ఖండ కావ్యమున వస్తువిన్యాసమును ఘట్టములు ఘట్టములుగా విభజించుట, నాటకీయమైన సన్నివేశమును సమకూర్చుట ఘట్టములను పడిమి కథాంశములను పాఠకుల భావమునకు వదలుట - ఇత్యాది అంశములు భావ కవిత్వమునాటి చిన్నచిన్న కథాకావ్యములయందు గోచరించు లక్షణము. ఈ విధమైన ధోరణి పుట్టపర్తి రచనలలో ప్రతిఫలించినది.

## శతక లక్షణములు :

పాద్యము, వేదనాము, విభూతిశతకములు శతకప్రక్రియా లక్షణము కల్గినవి. పాద్యము ఇరువదియేడు పద్యముల రచన. ఇట్టి సంఖ్యానియత కావ్యములను సంస్కృతలాక్షణికులు సంఘాతము, ఉపకావ్యము అని పిలిచిరి.[1] మూడు పద్యములున్న "త్రికము" అనియు, ఐదు పద్యములున్న "పంచరత్నము" అనియు, తొమ్మిది పద్యములతోనున్న "రత్నమాలిక" యనియు, ఇరువదియేడు పద్యములతోనున్న "తారావళి" లేక "నక్షత్రమాల" యనియు, నూరు పద్యములతోనున్న "శతకము" అని లక్షణకర్తలు పద్య సముదాయమునకు పేర్లు పెట్టిరి.[2] పాద్యము లాక్షణికులు చెప్పినదానిని బట్టి "తారావళి" అగుచున్నది.

పుట్టపర్తి శతకరచనా విధానమంతయు ఆత్మాశ్రయరీతిలో నడిచినది. దాదాపు తెలుగు సాహిత్యములోని భక్తిశతకములన్నియు ఈ కోవలోనికి చెందినవి. సాధారణముగ ఒక మకుటముకలిగిన శతకము కవి ఆత్మానుభవములను వెల్లడిచేయును. మకుట రహితముగా రచింపబడిన వేదనా, విభూతిశతకములు కవి ఆత్మానుభవములను ప్రకటించినవి.

నిర్మకుటత్వము పూర్వశతక సాహిత్యమందును కలదు. ఆధునిక కాలమున తేజశ్చక్రము వంటి రచనలిట్టివే. మరియు విభూతి, వేదనా శతకములందు ఛందో నియమ భంగమున్నది. ఉత్పల, చంపక, కందపద్యములు రచింపబడినవి. శతక లక్షణములలో ఛందోనియమమును కొందరు లాక్షణికులు గుర్తించిరి. కొందరు నియమముగా చెప్పలేదు. సంస్కృత ప్రాకృతములందు సంఖ్యానియమము ఒక్కటియే లక్షణము మకుటనియమములేదు.[3]

ఆలోచించిన నిర్మకుటత్వము భక్తి కావ్యములలో వర్ణింపబడిన విధానమును బట్టి ఒక విశేషమును వెల్లడిచేయును. మకుటమున్నచో ఆమకుటములో చెప్పబడిన దైవముపేర కవి తన అనుభవములను, వేదనలను, కోరికలను వెల్లడిచేయగలడు. నిర్మకుటముగానున్నచో ప్రత్యేకముగా నొక దైవముపేర చెప్పబడనందున సర్వత్ర వ్యాపించియుండు దివ్యచైతన్యమును కవిశతముఖముల దర్శించి వర్ణించగలడు. నామములు పెక్కులున్నను సర్వత్ర వ్యాపించియున్న దివ్యచైతన్యమొక్కటియే అను సమదర్శనము నిర్మకుటత్వము వెల్లడిచేయును. విభూతి, వేదనాశతకములిట్టి తత్త్వమును ప్రకటించినవి.

## దూతకావ్యస్వరూప విశేషము:-

పుట్టపర్తి రచించిన మేఘదూతకావ్యము కాళిదాసు మేఘదూతమునకు అనుకరణ ప్రాయమని నామసామ్యమును బట్టి తెలియుచున్నది. దూతకావ్యమునకు మార్గోపదేశము ప్రధానము. రామాయణములోని హనుమంతుని దౌత్యమును ఒరవడిగా పెట్టుకొని కాళిదాసు మేఘదూతమును వర్ణించినాడనుట ప్రసిద్ధమైనదే. కాని వాల్మీకి నుండి కాళిదాసు గ్రహించినది కేవలము సందేశమే కాదని మార్గోపదేశమును కూడా వాల్మీకి నుండియే కాళిదాసు గ్రహించియున్నాడన వచ్చును. కిష్కింధ కాండలో సీతాన్వేషణకు వానరులను నాలుగు దిక్కులకు పంపుచు, సుగ్రీవుడు ఆయా దిక్కులలోని విశేషములను, ఆటంకములను, గొప్పదనములను వివరించును.4 తరువాత సుందరకాండలో హనుమంతుని సందేశ సన్నివేశమున్నది. ఈ రెంటిని మేళవించి కాళిదాసు ప్రత్యేకముగ దూతకావ్యమును నిర్మించెను. ఇది తరువాతి సందేశ కావ్యకర్తలను మార్గదర్శమైనది. ఈ విషయము దృష్టియందుంచుకొనియే కాబోలు పుట్టపర్తి తనకావ్యములో హనుమత్సందేశమును స్మరించెను.

" హనుమంతుడొకనాడు
అర్థిహృదయుడు దూత
సీవొకడవేనేడు
నెనరు కల్గిన దూత "

## ఛందో వైవిధ్యము:-

పుట్టపర్తి రచించిన కావ్యములలో మార్గ సాహిత్యమునకు చెందిన వృత్తములేగాక దేశీయ కవితా వాహికములైన గేయములు చతుష్పదులు, షట్పదులు గీతి పద్యములు, వచన కవితలున్నవి. పెనుగొండలక్ష్మి, సిపాయి పితూరి కావ్యములలో వృత్త గీతములు వాడబడినవి. షాజీకావ్యమంతటను తేటగీతులు వాడబడినవి. అగ్నివీణ పురోగమనము గేయఖండికలు, మేఘదూతము ద్విరదగతి రగడలలోను చతుష్పదులలోను షట్పదులలోను రచింపబడినది. పాద్యమునందు ఒక సీసపద్యము తక్కినవి తేటగీతులు—అనగా జాతిచ్ఛందమే ఉపయోగించబడినది. పేదనా, విభూతి శతకములలో చంపకోత్పలమాలలు, విరళముగా కందపద్యము లున్నవి. సాక్షాత్కారము మార్గ—దేశి చ్ఛందోరూపముల సమాహారస్వరూపము పుట్టపర్తి సృజనాత్మక సాహిత్యమున ప్రయోగించిన ఛందములన్నియు నిందుపయోగింపబడినవి.

సాక్షాత్కారమున పదునాల్గు ఖండికలు, నూటఎనుబదిమూడు వృత్తములు మున్నూరు నాలుగు కందపద్యములు ఏబదియైదు తేటగీతులు ఏడు సీసములు, ద్విపదలు రగడలు అర్ధరగడలు. విషమ రగడలు, వచనము మొదలగునవి సందర్భాను గుణముగ నుపయోగింపబడినవి

సాక్షాత్కార ఖండమున శ్రీరామ దర్శనమునకై కరిగిన తులసి మనసు గేయమునకు సన్నిహితమైన ద్విపదలలో ప్రవహించినది తక్కిన సందర్భములందు వృత్త, గీత, సీస, కందములు వాడబడినవి ఉరవడిగానున్న ప్రవాహము ప్రవహించి చివరకు సరోవరమైనట్లుగా ద్విపదలనుండి రగడలు, అర్ధరగడలుగా భావము ప్రవహించి చివర వచన కవితగా రూపొందినది. తులసి మానసిక స్థితికి అనుగుణముగ సాక్షాత్కారమున ఛందము నడచినది. ఇచట రగడ విశేషములను గూర్చి వివరింపబడుచున్నది.

"నాగానమునపల్కు నాద లక్ష్మివి నీవు
మ్రోగెలే మేఘముల్ పురివిచ్చి యాడంగ"

(వెన్నెలరాత్రి)

ఇది ద్విరదగతిరగడ. ఇందు నాలుగు గణములుండి విరామము రెంటిపైనుండవలెను ఒక్కొక్క గణమునకు ఐదుమాత్రలుండను.5

వినయపత్రిక యను ఖండికలో తులసి చిత్రకూటమును స్తుతించును. ఇచట పద్యమంతయు వృత్తములలో నడచి చివరనొక మాత్రాఛందము రచింపబడినది. ఇందు మూడు పాదములలో పదునాల్గు మాత్రలు, నాల్గవ పాదమున ఎనిమిదిమాత్రలు కలవు. ఇది ముత్యాలసరము.

"వలపు రెసగెడు దీపెసల నా
తలను చిలుంర చిత్రకూటమ
కిలలు సిక్కముగాగ రాముని
కందు నామదిని.... .
(వినయపత్రిక)

ముత్యాల సరము యొక్క లక్షణమును అప్పారావుగారు ఈ క్రిందివిధముగ చెప్పిరి.

"ముత్యాలసరములో నేచేసికొన్న నియమమిది
మొదటి మూడు చరణములలోను సామాన్యముగ
పదునాలుగు మాత్రలుండును. నాల్గవ చరణమున
ఏడు మొదలు పదునాలుగు వరకుండును. విరామము
అర్థానుసారముగా చెవికింపగునట్లు మార్పయత్నించితిని"6

ఈ లక్షణముపై ఛందమునకు సరిపోవుచున్నది. కాని ముత్యాలసరము లక్షణమును వివేచన చేయుచు విమర్శకులు "ఎనిమిది, పదునొకండు, పన్నెండు, పదమూడు మాత్రలలో నాల్గవపాదముండుటకు వీలుకల్పించదు. ఉన్నచో సరియగు నడక యుండదు. మొత్తముమీద ముత్యాలసరమందు నాల్గవపాదమున తొమ్మిది మాత్ర లుండుటయే నియతమని చెప్పవచ్చును.", అని తెల్పిరి 7 వారే ఒకచోట తమ ఛందో విజ్ఞానములో చెప్పినట్లు సంస్కృత సంప్రదాయమును బట్టి గణాంతమందలి లఘువును గురువుగా పాటించినచో పైన పేర్కొనబడిన ముత్యాలసరము నాల్గవ పాదమునకు తొమ్మిది మాత్రలై లక్షణము సరిపోవును. ఇది దేశిచ్ఛందస్సులకు సహజమైన లక్షణము

"కందు నా మదిని-కందు నా మదినీ"

సాధన ఖండికలో తులసి హృదయము ద్రవించిన స్థితిలో ఒక పద్యము రచింప బడినది. అందుశబ్దములన్నియు సంబోధనలే. ఆ సంబోధనలలోని మాధుర్యము, సమాసక్రమము, ఉత్తరోత్తరమధికమై సౌందర్యము భావముతోను పద్యచ్ఛందము తోను కలసి వచ్చినది.

రార రామచంద్ర రాజీవ దళనేత్ర
రార నిగమభృంగ రమ్యగాన
రార శాంతినీడ రాజహంసమ-అయో
ధ్యా పతీ తపః ఫలావతార

ఈ పద్యమున మూడవ పాదము చివర విరువబడి నాల్గవపాదములోనికి అన్వ యించుటవలన ఛందమునకు వింత సొబగు కలిగినది

ఈ ఖండికలోనే వివిధములైన భక్తిభావనలు ఏబదిమూడు ద్విపదలలో వర్ణింపబడినవి. ద్విపదకు రెండుపాదములు. ప్రతిపాదమున మూడింద్ర గణములు రెండు సూర్యగణములుండుటలక్షణము, రెండుపాదములందీలక్షణమున్న ద్విపద యగును. ఒకే భావమును చెప్పుటకు ఎన్ని ద్విపదలనైనను వ్రాసెడి పద్ధతి పూర్వ ద్విపద సాహిత్యమునందున్నది. సాధన ఖండికలో ద్విపదరచనము పదివిభాగములు చేయబడినది. మొదటిభాగమున ఎనిమిది ద్విపదలు తక్కిన భాగములలో ఐదు ద్విపదల చొప్పున రచింపబడినవి, చెప్పిన పాదములే మరల చెప్పబడి గేయలక్ష ణమునమసరించినవి.

నాలోని చంద్రుడే నవ్వుచున్నాడు
నవ్వకురా చంద్ర నారామ చంద్ర (సాధన)

మధుర భక్తి పరాకాష్ఠదశగా తులసి ఉన్మాదియై భావగీతములుపాడెను. ఈ భావము లన్నియు రగడలలో రచింపబడినవి.

'విసరాని భావాలు
కనరాని దృశ్యాలు
వేదనా చంద్రికలు
విరిసికొన కళలందు
పాడవే హృదయమా'

"పాడవే హృదయమా" అనునది పల్లవియై ప్రతినాల్గు చరణముల తర్వాత అన్వ యించుచున్నది. ఐదుమాత్రల విరామముతో పదిమాత్రలకొక చరణమగుచున్నది. ఇది ఖండ గతిలో సాగిన అర్ధరగడ.

'పూర్వసాహిత్యమునందు పాదమునకు నాల్గేసి గణములుపయోగించుట నియ తము. ఈ లక్షణము అధునికరచనలయందు అనియతము. పాదమునకు రెండేసి నాల్గేసిగణములుండుటయే అధికముగా కనబడుచున్నది'.8

ఈకావ్యమున రెండు దేసిగణములుగల అర్ధరగడలే అధికముగా నుపయోగింప బడినవి. నాల్గుపాదముల మధ్యనొక అర్ధరగడ పల్లవిగానున్నది. కొన్నిపాదములలో ఐదు మాత్రల విరామము మరికొన్నిటిలో భావాను గుణముగ విరామము పాటింపబడినది. మిశ్రగతిలో సాగినదీ అర్ధరగడ.

'ఈ మనసులో పాట
ఎవ్వరికిగా నేస్తు
ఏ రాజునకు కను
నీరాజనం బిత్తు'

అర్ధరగడలు క్రమముగా మూడు పాదములకు కుదింపబడినవి.

'ఊరుకోవే భ్రమరి
నారాము చంద్రుడు
కదలివస్తున్నాడు'

అర్ధరగడ లక్షణము దాటి ఒండు రెండు మాత్రలధికమై కొన్నిఛందములు రచింప బడినవి,

'జగమెల్ల పూల రథమై
మొగ్గలెల్ల పై(వి) పడగై
సొగసెల్ల రూపుకట్టెయి'

ఈ ఛందము ద్విరద వృషభగతులను తలపించుచున్నది. కాని లక్షణము అసంపూర్ణమై ఒక పంచమాత్రాగణము, ఒకసప్తమాత్రాగణముల కూడిక ఒక పాదమైనది.

మరొక చోట,

"గంగా కౌతుక భరిత త
రంగా రఘువీరుండు ని
జంగా వస్తాడట వే"

ఈ విధముగ మూడు పాదములుగల్గి పన్నెండు మాత్రలుండి ప్రాసనియమముతో చతురస్రగతిలో సాగినది. తరువాత వరుసగా పదునాల్గు పాదములుగల గేయ మాలికయున్నది. ఇందలి కొన్ని పాదములు పదునారు పదునాలుగు మాత్రలు కల్గియున్నది.

"ఆకాశంలో ఆవిగోపే అతి
లోకములగు నాలోకమ్ములు"

ఈ విధముగా సాగి చివర

గంగా కౌతుక భరిత త
రంగా గంగా.

అని ముగించబడినది. పొంగిన భక్తి భావనా ప్రవాహము ఈ విధముగ రగడలలో ప్రవహించి చివరకు వచన సరోవరమైనది.

'ఓయి రామయ్యా అనంత సముద్రాల ఘోషలు
వినబడుతున్నై అన్నిపుష్పాలు వికసిత గండ
స్థలాలలో మధు స్విన్నములై నీ అర్చనకు
బుక్కాపొడి పట్టుకున్నై'

## అగ్నివీణలో :

అగ్నివీణలోని ఖండికలు, తేటగీతులలోను, రగడలలోను రచింపబడినవి. రెండు ఖండికలలో వృత్తములు వాడబడినవి. భావకవులు తేటగీతి పద్యమును భావానుగుణముగ అనేక విధముల మలచినట్లు, మార్చుకున్నట్లు ఈ కావ్యమున కూడ గీత పద్యములను కవి అనేక విధముల రచించెను. గీతపద్యమును మాలిక వలె రచించి, భావానుగుణముగ విరుచుచు, ముగించుచు, వదలివేయుచు, విభిన్నరీతులను ప్రదర్శించెను. పాదనియతిలేక గేయము వలె ఆరంభింపబడిన మొదటి పాదము చివరగా వచ్చి కవిత పూర్తియగుట ఒక విలక్షణరీతి.

ఏల పాడెదవే ప్రియురాల నన్ను
.... .... .... .... ....
.... .... .... ....మనసు
సైపగా లేదు విచికిలా సవములోని
తీయతేనియ బరువు
ఏల పాడదవే ప్రియురాల (అనురాగము)

ఈ విధముగా భావానుగుణముగా, గేయానుసరణిగా పాదములు కుదింపబడి చివరకు "ఏల పాడెదవే" అని ముగించబడినది.

నావకవులు పాద సంఖ్యా ఓంగమే గాక అసంపూర్ణ పాదముగా పద్యమును పూర్తి చేసిరి.

"ఉగ్రరాహు చంద్రార్థ బింబ గ్రసనము
పోలెనున్నది నాస్థితి

(గిరికుమారుని ప్రేమగీతాలు)

"మరల గుడ్డి రాతిరి వడు మరల నోరు
కావి శృతులు లేని చీకటులు మరల
మరల పాడిల్లు"

(కృష్ణపక్షము)

అగ్నివీణలో,

ఆశ కుసుమించు ఊర్పు ప్రేతాత్మకేల
గొంతు చీకటి తలపోసి కొసెడి నాకు
ఈ నవోద్దీతిక్తా మధురానుభూతి
తీవ్ర హాలాహలము

(అనుగ్రహము)

ఆవి చివర రెండున్నర గణములు వదిలివేయబడినవి. పాదమధ్యములో పద్యమును పూర్తి చేయుటయేగాక, పాదమధ్యము నుండి పద్యము నారంభించుటయు కలదు. ఇట్టి పద్ధతి విరళమని తెలియుచున్నది.

నేను నిదుర .... .. ...
వెన్నెలల దారి ఒకరేయి వెడలిపోతి
నొక విపంచీ కంఠ, మొరసిమొగసి

(కృష్ణపక్షము)

అగ్నివీణలో,

చిమ్మ చీకటులాడు నిశీథమందు
ఎవరు పిలిచెదరిటు నన్ను
అంతకంతకు సుఖకరమగుచు నార్ద్ర
భావముల నొల్కబోసెడి పలుకులోడ

(విభుకుడు)

పై పద్యమున రెండవ పాదములో రెండు సూర్యగణములు వదలివేయబడి, మూడవ పాదము ప్రారంభింపబడినది. భావము పూర్తియైనందున కవులీ విధముగా వ్యర్థ పదములుపయోగించక పద్యములు రచించియుందురని తెలియుచున్నది. యతిని పాటింపక పోవుటయు నాటి భావ కవుల స్వేచ్ఛా ప్రియత్వమునకు నిదర్శనము. పెనుగొండ లక్ష్మి-షాజీ, అగ్నివీణలలో యతిభంగములు చూడవచ్చును.

అగ్నివీణలో- ఒక్క తీయని కలనైన నోచుకొనదు. (ఏల)

## రగడ విశేషములు :

అగ్నివీణలోను, పురోగమనము నందును, గుడిగంటలు అను పేరుతో వ్రాసిన కవితా ముక్తకములతోను, అర్థరగడలు అధికముగా నుపయోగింపబడినవి. తక్కిన వన్నియు వచన కవితలు

## ఖండగతిలో సాగిన అర్ధ రగడలు :

అగ్ని వీణలో,

పన్నగి నిశ్వాస
పటల శీకరముగా
పాదకే నాసఖీ
ప్రిదిలి పోవును మనసు

( వేధ )

కొండలో కోనలో
క్రొందలిరు టాకులో
నీ నటన లే తోచు
నీ మాయ లే పూచు

( ఆనతి )

ఇటువంటి అర్ధ రగడలు అగ్నివీణలో బహుధా ప్రయుక్తమైనవి. పురోగమనమున,

ఈ అర్థ రాత్రిలో
ఈ పట్టి కడుపులో
కనుల సూదులు గుచ్చు
కారుచీకట్లలో (ఎవరిది)

మిశ్రగతిలో సాగిన అర్థ రగడలు,

వగుల గొడతాం - మిమ్మ
దిగుల గొడతాం - మంట
రగుల బెడతాం - నోట
మట్టి గొడతాం

(పడుతుంది)

అగ్ని వీణలో ప్రశ్నయమ ఖండికలోని రగడ రూపమున నున్న కవిత ద్విపద,

తెలిసికోలేనయ్య
మరచిపోలేను
ఆత్మవేదనతోడి
ఆల్లాడలేను          ( ప్రశ్న )

గుడి గంటలలో మాత్రా సంఖ్య పాటింపబడినది.

ప్రచ్ఛన్న జరా సంధులు
పాలించే దేశంలో
ధరణీ తలమంతా ఒక
ధర్మ చక్ర పరివర్తన

ఖండగతిలో సాగినవి చతురస్రగతిలో సాగిన రగడలు కూడ కలవు.

ఖండగతి :- లేపాక్షి బసవయ్య
లేచివచ్చిన గదా
కాంగ్రేసులో ధర్మ
కారుణ్య భావాలు,

చతురస్రగతి :- చెప్పే మాటకు
చేసే చేతకు
రాజీ లేనివి
రాజకీయములు,

నాల్గవ పాదమున గతి మారినది.

ఇట్లు భావాను గుణముగా గతిమార్చి మాత్రా సంఖ్యా నియతితో రచింపబడిన గేయములు పుట్టపర్తి కావ్యములలో నధికము. గీతపద్యములలో వృత్తములలోను ధారావేళముసయతులు పాటింపక పోవుట, గణభంగము లుండుటను కూడ గమనింప వచ్చును. ప్రాసయతులు పాటించుటలో కూడ శ్రద్ధవహించినట్లు కనబడదు. మొత్తము మీద ఆయన ఖండకావ్యములలో వృత్తములకంటె దేశీయ ఛందో రూపములనే అధికముగ నుపయోగించినట్లు స్పష్టము.

## జ్ఞాపికలు:-

1) ఆంధ్రశతక వాఙ్మయ వికాసము-పేజి 16 డా॥ కె. గోపాలకృష్ణారావు
2) అప్పకవీయము, పేజి 261, కాకునూరి అప్పకవి
3) తెలుగు ఛందోవికాసము పేజి. 228 డా॥ కోవెల సంపత్కుమారాచార్య
4) చూడుడు కిష్కింధకాండము 42వ సర్గ
5) నవవిధరగడ లక్షణము పేజి. 283 అప్పకవీయము
6) తెలుగు ఛందోవికాసము పుట 286
7) తెలుగు ఛందో వికాసము పుట 288
8) ,, ,, ,,

★★
★★

# శైవసంప్రదాయము :

సర్వసృష్టిలోని స్థితి స్పందనలు ఒక మహత్తర దివ్యశక్తి ద్వారా జరుగుచున్నవని భారతీయుల విశ్వాసము. విశ్వములోని ఆ మహత్తరాఖండ శక్తిని గుర్తించుటకు ప్రయత్నించిన భారతీయ జీవనవిధానమున లలితకళలు అంతర్భాగములై ఎదిగివచ్చినవి. లలితకళల ద్వారా ఏ మహత్తర శక్తిని గుర్తించుటకు ప్రయత్నించిరో ఆ శక్తిని ప్రకటించి ఉపాసించుట వలన అనేక రూపములు కల్పితములై విశ్వతత్వము ఆవిష్కారమైనది. సృష్టి అవ్యక్త తత్వము సాహిత్య సంగీత, శిల్ప, నృత్యకళా స్వరూపములుగ వారి తపస్సు వలన అనువర్తితమై అఖండ శక్తిని నటరాజమూర్తిగ ఆవిష్కరించినది. ప్రాచీనకాలమునుండి విశ్వసృష్టిని గూర్చిన ఆలోచనలోని క్రమానుగత వికాసము అనేక భావరూపములుగ మారి సాహిత్యమునందు రసముగను, సంగీతములోని నాదముగను, శిల్పములో రూపముగను, నృత్యకళలో అభినయముగను ప్రకటింపబడినది. నాట్యము ఏవిధముగ సర్వలలితకళల సమాహార స్వరూపమో నటరాజమూర్తి కూడ ఏతద్భావముల సమాహార స్వరూపముగ సృష్టి, స్థితి, లయ స్పందనల ప్రతీకగ భారతీయులు గవేషించి దర్శించిన విశ్వరహస్యముగ అవతరించినది.

" ఆంగికమ్ భువనం యస్య
వాచికమ్ సర్వవాఙ్మయమ్
ఆహార్యమ్ చంద్రతారాది
తం వందే సాత్వికం శివమ్" (అభినయదర్పణమ్॥ శ్లో॥-1)

ఎవని శరీరము ఈ ప్రపంచమో, ఎవని వాక్కు సమస్త వాఙ్మయమో ఎవని ఆభరణములు చంద్రనక్షత్రములో అట్టి సాత్వికుడగు శివునకు నమస్కారము, అను ఈశ్లోక తాత్పర్యము నిత్యపరిణామశీల సంపన్నమగు ఈ ప్రపంచము పరమ శివునిగ వ్యాఖ్యానించినది. ఆపరమ శివుని నటరాజమూర్తిగ నాట్యశాస్త్రము వర్ణించినది.

"కళ యనగా స్థితి శీలమగు భావమును, గతి శీలమగు భావముగ రూపొందించుటయే. గతి యనగా కదలిక, స్థితియనగా నిలుకడ, విశ్వసృష్టిలో ఏదియును స్థితి శీలముకాదు. వ్యక్తగతిని గతియనియు, అవ్యక్త గతిని స్థితియనియు వ్యవహారము కొరకు చెప్పుచున్నాము." అని కళను తాత్వికముగ నిర్వచించిరి.[2] అవ్యక్త తత్వము లేక అఖండశక్తి స్వరూపముగ భావింపబడిన నటరాజమూర్తి గతిశీల ప్రతీకమై

పైరీతా నిర్వచనమునకు ప్రత్యక్ష సంకేతమైనది. భారతీయ కళాద్రష్టలు స్థితిశీలమగు భావమును గూర్చిన పర్యాలోచనము చేయుచు, అనేక కళారూపములలో తమ అభిప్రాయములను ప్రకటించుచు వచ్చిరి. అవియే వేదపురాణేతి హాస కావ్యనాటక సాహిత్యముగను సంగీత నాట్యవాస్తు, శిల్ప శాస్త్రములుగను పరిణతి పొందినవి.

భారతీయ సాహిత్య సంపదకు వేదములు మూలధనము. అట్టి వేదములయందు నటరాజమూర్తియైన శివుడు రుద్రునిగ చెప్పబడియున్నాడు. అగ్ని, సూర్యుడు, మొదలగు దేవతలలోపాటు ఏకాదశరుద్రులు ఋగ్వేదమున స్తుతింపబడిరి. శివ పదముకన్న రుద్రపదమే వేదములయందు బహుధాప్రయుక్తమైనది. ఋగ్వేద మందు శివశబ్దమునకు మంగళమను అర్ధమేగాని శివుడు అనుప్రత్యేక అర్థములేదు. రుద్రుడు అథర్వణ వేదమున సర్వజీవాధిపతియగు పశుపతిగను, ప్రకృతి స్వరూపమైన ప్రాణముగను, కొనియాడబడినాడు. యజుర్వేదమున ఒక అధ్యాయమంతయు రుద్రస్తుతియున్నది.

బ్రాహ్మణములలోని కాషీతకీ బ్రాహ్మణమునందు శివ శబ్దము అనేకార్థములలో పేర్కొనబడినది. ప్రసిద్ధమైన దశోపనిషత్తులలోని తైత్తిరియోపనిషత్తునందు నారాయణ ప్రశ్నములోని ఏబది ఆరవ అనువాకమున త్ర్యంబకుని సంబోధన కలదు.

"త్ర్యంబకమ్ యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్"

ఈ మంత్రమున త్ర్యంబకుడు అనగా మూడు కన్నులు కలవాడు రుద్రుడని అర్ధము చెప్పబడినది. "మృత్యువునుండి వదిలిపెట్టబడి మోక్షము కోరెదముగాక" అని ఈ మంత్ర తాత్పర్యము. దీనినిబట్టి రుద్రుడు మృత్యుమోక్షముల కధికారి అని తెలియగలదు.

"ప్రాణానాంగంధిరసి రుద్రోమా విశాంతకః" హృదయాంతర్వర్తియగునో అహంకారమా నీవు వాయు రూపములను, ఇంద్రియ రూపములు అగు ప్రాణములు పరస్పరము విడిపోక యుండునటుల ధరించుటకు హేతువగుచున్నావు. అట్టి అహంకారాభిమాని దేవతయగు రుద్రుడా! దుఃఖమునకు వినాశకుడవై నాశరీరమున ప్రవేశింపుము. అని కలదు. దీనిని బట్టి రుద్రుడు జీవాధిపతిగ జీవస్థితికారకుడిగ చెప్పబడినాడు. ఈ విధముగ రుద్రుడు సృష్టి స్థితి లయములకు అధికారిగ తైత్తిరియోపనిషత్తునందు వర్ణింపబడెననుట స్పష్టము.4

శైవోపనిషత్తుల యందు రుద్రునకు శివునకు అభేదము చెప్పబడినది. శివుని పరతత్వముగ చేసి చెప్పునవి శైవోపనిషత్తులు పదిహేను అవి వరుసగా 1) అక్షర మాలిక 2) అధర్వశిరస్ 3) అధర్వశిఖ 4) కాలాగ్నిరుద్ర 5) గణపతి 6) కైవల్య 7) జాబాలి 8) దక్షిణామూర్తి 9) పంచ బ్రహ్మ 10 బృహజ్జాబాల 11) భస్మజాబాల 12) రుద్రహృదయ 13) రుద్రాక్ష 14) శరభ 15) శ్వేతాశ్వతర

శివ ఏకోధ్యేయ శ్శివశ్శంకర స్సర్వమన్యత్ పరిత్యజ్య

(అధర్వశిఖోపనిషత్)

ఏకోహి రుద్రో నద్వితీయాతస్థు5

(శ్వేతాశ్వతరోపనిషత్)

అథర్వ శిరోపనిషత్తు నందు దేవతలు "కోభగవాన్" అని ప్రశ్నింపగ రుద్రుడు "*అహమేకః ప్రథమ మాసమ్ వర్తామిచ భవిష్యామిచ*" "*నాన్యఃల్ కశ్చిత్ మత్తో వ్యతిరిక్తః*" అని సమాధాన మిచ్చినట్లున్నది. ఈ విధముగ శైవోపనిషత్తులందు శివునకు రుద్రునకు అభేదము పాటించుట, శివునకే సర్వజగన్నియామకత్వము ప్రతిపాదించుట కన్పించుచున్నది. అట్టి శైవ పరతత్వమును సాక్షాత్కరించుకొనుటకు దైవశక్తిని భావించి, రూపించి ఉపాసించుటకు కొన్ని శాస్త్రములు వెలసినవి. వీనికి అగమములు అని పేరు.

శివుని పంచ ముఖముల నుండి ఇరువది ఎనమిది అగమములు ఉత్పన్నమైనవని శైవాగమములందు చెప్పబడినది. వీనిలో పది శివ భేదములు, పద్దెనిమిది రుద్ర భేదములు, శైవాగమములందు, జ్ఞాన, క్రియా, యోగ, చర్యా, పాదములు అని నాలుగు కలవు. జ్ఞాన పాదమున పశుపతి, పాదముల స్వరూప లక్షణము శివశక్తి సదాశివాదుల ముప్పది అరు తత్వముల స్వరూపము, తత్వరూప దర్శన శుద్ధ్యాది దశకార్య లక్షణములు నిరూపింపబడి యుండును. క్రియా పాదమున ఆయా క్రియలకు ఉచ్చరింపవలసిన మంత్ర విభాగము మరియు పరిమాణ గర్భన్యాస శిలా సంగ్రహము లింగ మూర్తి ప్రతిష్ఠాదులును, రక్షాబంధన, కుంభస్థాపన, కళాకర్షణ, కుంభాభిషేక, మండలాభిషేకములను, ఉత్సవ, ప్రాయశ్చిత్త, నిత్య నైమిత్తిక కార్య పూజాదులను వివరింపబడినవి. యోగపాదమున షట్చక్రముల స్వరూపము, సహస్రార కుండలిన్యాదుల స్వరూపము తెలుపబడినది. చర్యా పాదమున పూజోపకరణము, ఉపచారములు, అరాధనా విధులు వివరింపబడియున్నవి.

లింగధారణములేని ప్రత్యభిజ్ఞాన శైవము స్పంద శైవమను పేరున కాశ్మీరమున కలదు. అభినవ గుప్తుడు దీనికి ఆచార్యుడు, వేదాంగములలోని వ్యాకరణమునకు శివుడే ఆచార్యుడనియు శివనాట్యావసాన సమయమున డమరుకము ప్రయోగించగ అందుండి వ్యాకరణ సూత్రములు ఉద్భవించి శబ్దశాస్త్రముగా రూపొందినవనియు, పాణినీయ వ్యాకరణమును బట్టి తెలియుచున్నది.6 సంగీతమునకు శివుడే మూల పురుషుడని సంగీత రత్నాకరాది గ్రంథములయందు చెప్పబడినది.

పురాణములలో వాయుపురాణము శివునిపరతత్త్వముగ అభివర్ణించినది. బ్రహ్మ విష్ణువులు శివుని అనుయాయులుగ నిరూపింపబడిరి. మహేశ్వర చరిత్రము, పాశుపతావతార యోగము, సమగ్రముగ వివరింపబడినది. నకులీశ పాశుపతమిందు కలదు. ఈశ్వరుని ఇరువది ఎనిమిది అవతారములిందు వర్ణింపబడినవి సృష్టికి శివుడు బీజియనియు, విష్ణువు బీజమనియు బ్రహ్మ క్షేత్రమనియు నిరూపింపబడినది. కృత యుగమునకు బ్రహ్మ, త్రేతాయుగమునకు యజ్ఞము, ద్వాపర యుగమునకు విష్ణువు అన్ని యుగములకు శివుడు పూజనీయుడని వివరింపబడినది.

లింగ పురాణమున హరుడే లింగమని అవ్యక్తమగు అశివలింగము ప్రధానము ప్రకృతి అని రెండు విధములై సృష్టికి కారణ భూతమైనదని వివరించబడినది. ఈశ్వరుడే కర్త, ఈశ్వర మహిమ అనంతము, ఈశ్వర భక్తులకు సాధ్యముకానిది లేదు-అని చెప్పబడినది. బ్రహ్మ విష్ణువులు శివలింగము యొక్క ఆద్యంతములు తెలిసికొనలేకపోయినారని. హిరణ్యాక్ష హిరణ్యకశిపులను సంహరించిన వరాహ నారసింహ మూర్తులను ఈశ్వరుడే శాంతింపజేసెనని వర్ణించబడి ఈశ్వర పరదైవత్వమును లింగపురాణము స్థాపించినది.

వరాహ పురాణమున శివస్తోత్రములు కలవు. స్కాంద పురాణము శివదేవతాకమే. ఈ పురాణమున రెండు భాగములు. స్కందుడు తాను విన్న శివ ధర్మములు భృగువునకు తెల్పుట, ద్వితీయ స్కాందమున శివుడే కుమారునకు, అతడు సనత్కుమారునకు, అతడు వ్యాసునకు, శివధర్మములు పరంపరగా చెప్పబడినట్లున్నది. ఈ పురాణము అనేక హరిహర కథలకు నిలయము.

వామన పురాణమున ఈశ్వర మహిమాను భావ ప్రదర్శకములగు, దక్షయజ్ఞము దారుకావన చరిత్రము, మొదలగు కథలు చెప్పబడినవి. మత్స్య పురాణము శివ మహిమాభి వ్యాప్తి కలది. ఇవిగాక ఇతర పురాణములందనేక సందర్భములలో శివ స్తోత్రములు వర్ణనలు కన్పించును.

ఆదికావ్యమైన రామాయణము, పంచమవేదమైన భారతములందు శివ ప్రసక్తి యున్నది. రావణుడు శివభక్తుడు. శివార్చనాతత్పరుడు. రావణుడు రచించెనని చెప్ప బడుచున్న శివతాండవ స్తోత్రము ప్రసిద్ధమైనది. భారతమున పాశుపతాస్త్ర సందర్భ మునను, అనేక యితర సందర్భములందును శివుడు వరప్రదాతగా వర్ణింపబడి యున్నాడు.

గృహ్యసూత్రములలో శివుడు ఈశానుడను పేరుతో పిలువబడెను. కౌటిల్యుని అర్థశాస్త్రములో శివాలయముల ప్రసక్తి యున్నది. పతంజలి భాష్యమున శివునకు రుద్రునకు జంతుబలులు సమర్పింతురని తెల్పబడినది.7

ఈ విధముగ చరిత్ర కందని కాలమునుండియు శివుని గూర్చిన దైవభావన వైదిక వాఙ్మయమున పురాణేతిహాస వాఙ్మయమున కనిపించుచున్నది.

పురావస్తుశాఖవారి త్రవ్వకములలో బయల్పడిన ముద్రికలయందు పశుపతియైన శివుని బొమ్మలు చెక్కబడి యున్నవి. బేస్‌నగర్, ఘోసాండి ప్రదేశములలో బయల్పడిన ప్రాచీన శాసనములందు శివునిగూర్చిన ప్రసక్తి కలదు. ఇవి క్రీ.శ. ఒకటవ, రెండవ శతాబ్దములకు చెందినవిగా పరిశోధకులు ప్రకటించిరి.8

కాలక్రమమున శైవమతమున దీక్షస్వీకరించు పద్ధతిలో, ఉపదేశమును పొందుటలో భిన్నమార్గములు అనుసరించుట వలన అనేక సంప్రదాయములు ఏర్పడినవి. ఘోరము-అఘోరము అను రెండుశాఖలు. వీటిలో కాపాలికులు, కాలాముఖులు, పాశుపతులు, ఘోరతత్త్వమునకు చెందినవారు, ఆగమాంత శైవులు, లింగాయతులు సౌమ్యతత్త్వమునకు చెందినవారు.

భారతదేశములో పాశుపత మతముతోపాటు లింగాయత శైవము కూడా వేద కాలమునుండి యున్నదని పండితుల అభిప్రాయము9

కవియుగమున పాశుపతశైవమును లకులీశ శివాచార్యుడు అతని శిష్యులు వ్యాపింపచేసిరి. ప్రాకృత శాసనములలో కనిపించు శివల, శివస్కంధ, శివశ్రీ, మొదలగు పేర్లను బట్టి శైవమతప్రాచుర్యమును గమనింపవచ్చును. గాథాసప్తశతి వంటి ప్రాకృత కావ్యము ఆధారముగా సాతవాహనుల కాలమునశైవము బహుళ వ్యాప్తియందున్నట్లు చెప్పవచ్చును. ఇక్ష్వాకు, శాలంకాయన, పల్లవ విష్ణుకుండిన రాజుల కాలమునశైవమతము ప్రాచుర్యము పొందినట్లు చెప్పుటకు చారిత్రక ఆధారములున్నవి10

దక్షిణదేశమున శివభక్తులు జన్మించి శివలీలలు పాడి, అభినయించి శైవ మతమును సామాన్య మానవుని అనుభవమునకు తీసుకొనివచ్చిరి. వీరిని నాయనారులు అందురు వీరికాలమున శైవారాధనా విశేషములు బహుళమై సంగీత, నాట్య, శిల్ప కళలకు దేవాలయములు నిలయములైనవి.

తెలుగుదేశమున పండితత్రయము పాల్కురికి సోమనాథుడు శైవమతమును బాగుగా ప్రచారము చేసినారు. సోమనాథునికృషివలన వర్ణభేదములకు అతీతముగా శైవమతము ప్రజలలో వ్యాప్తి పొందినది. సంస్కృత ప్రాకృత శాసనములు, కావ్యములు చరిత్రను పరిశీలించిన అనాదియైన శైవమతము అనేక సంప్రదాయ ములతో ఆచారములతో ఉపాసనా విధులతో ప్రజలకు సన్నిహితముగా సాగివచ్చినదని తెలియగలదు,

## శివార్చనము :

శివతత్వ స్వరూపమును సులభముగా నర్థము చేసికొనుటకు అద్వితీయుడగు పరశివునకు రెండు రూపములు చెప్పబడినవి. అందు పరరూపము మొదటిది. రెండవది అపరరూపము. పరరూపమును నిష్కల రూపమనియు, అపరరూపమును సకలమనియు పిలుతురు. నిత్యశుద్ధ బుద్ధలక్షణము కలిగి, ఉపాధిరహితమైన సచ్చిదానంద రూపము పరశివుని నిష్కల రూపము.

పరశివుని రెండవ రూపము సకలము. లీలను స్వీకరించి మాయోపాధికుడై, అ మాయకు వశీభూతుడు కాక సర్వస్వతంత్రుడై సర్వాంతర్యామిత్వ. జగన్ని యంతృత్వాది లక్షణ విలసితుడై యుండును. లోక వ్యవహారమున ప్రాకృతునివలె కన్పించినను పరమార్థమున అయనకు ఉపాధిగానున్న మాయతోగాని, తన్మాయా కార్యముతోగాని ఎట్టి సంబంధము స్పర్శయులేదు.

ఈ సకలరూపము జగదాత్మక రూపము, లీలావతార రూపము అని మరల రెండు విధములు. ఈ ఉభయరూపములు యజుర్వేద రుద్రాధ్యాయమున స్తుతింప బడినవి. నియంతృత్వముచేత నిమిత్తకారణత్వము జగదాత్మకారణత్వముచే ఉపాదాన

కారణత్వము పరశివునకు చెప్పబడినవి. కావున పరశివుడు సకల రూపముచే అకాశాది పంచభూతములు, సూర్యచంద్రులు, జీవుడిగ విరాజిల్లుచున్నాడు.

భక్తుడు తనయందలి వ్యష్టి పంచభూతములను బ్రహ్మాండమందలి పంచభూత ములతోను, తనలోని ప్రాణాపానములను సూర్యచంద్రులుగను తాను పశుపతి అగు శివునిగ సమన్వయించుకొని మాయను అధఃక్కరించి జ్ఞానమును బడయుటయే అనగా "తత్వమసి" అను మహావాక్యార్థ జ్ఞానమును బడయుటయే మోక్షము. ఇట్టి మోక్ష ప్రాప్తి కొరకు చేసెడి విచారణలో, ఆచరించెడి క్రియలలో సోపానములుగ విగ్రహా రాధనము, అర్చావిధానము, మూర్తి ప్రతిష్ఠాపనము, తంత్రములు ప్రవర్తించినవి.

శివ స్వరూపమును పూజించుటలో ప్రధానముగ రెండు పద్ధతులున్నవి. ఒకటి లింగార్చనము, ఈ పద్ధతి అనాదికాలము నుండి అనుస్యూతముగా సాగివచ్చుచున్నది. వేదములలో లింగాయత మతానుయాయులున్నట్లు సాక్ష్యములున్నవి. "*లింగపూజ సర్వశ్రేష్ఠమని, తన రూపము మరుగుపరచి తన చిహ్నములతో ఉండువాడు కనుక లింగరూపుడని* శివపురాణము పేర్కొనినది.12 లింగమనగా సకల జగత్తును లయముచేయునది అనియు నిర్వచనము కలదు. పానవట్టమును పరాశక్తిగను లింగమును పరమ శివునిగను భావించుట కలదు.

శివలింగ పూజ విశిష్టమని చెప్పుటకు మరియొక విశేషమున్నది. లింగము మూర్తిత్రయ స్వరూపమని భావన. లింగము యొక్క పొడవును మూడు భాగములు చేయగా మొదటి భాగము బ్రహ్మాంశమనియు, రెండవ భాగము విష్ణ్వంశమనియు, మూడవ భాగము శివాంశమనియు భావింతురు. భారతదేశమందంతట లింగపూజ అనాది నుండియున్నదని చెప్పుటకు ద్వాదశ జ్యోతిర్లింగ ప్రదేశములని ప్రసిద్ధి పొందిన పుణ్యక్షేత్రములే సాక్ష్యములు. త్రిలింగముల మధ్యనున్నది తెలుగుదేశముగ ప్రసిద్ధి వహించినదని విద్యానాథుడు చెప్పెను.

శివ స్వరూపమును లింగముగా భావించి పూజించునట్లే అన్యదేవతార్చనా సంప్రదాయములలో కూడ శిలాస్వరూప పూజా విధానమున్నది. గండగీనదిలో లభించు సాలగ్రామము విష్ణు దేవతా స్వరూపముగ, శోణభద్రలో లభించు ఎర్రని శిల గణపతి స్వరూపముగ, స్ఫటికశిల సూర్యరూపముగ, స్వర్ణముఖీ నదిలోన దొరకు శిలలు అంబికా స్వరూపముగ పూజించు పద్ధతియున్నది.

సహస్ర లింగార్చనమందు షోడశావరణములు ఏర్పాటుచేయుదురు. అందు చతుర్థావరణమున నాలుగు వందల లింగములు తాండవమూర్తులని ప్రతిష్ఠింతురు, శివావతారములను లింగము నందావాహన చేసి పూజించు పద్ధతి సహస్రలింగార్చన మందు కన్పించును. ఈ భావనకు ఉదాహరణప్రాయముగ గుడిమల్లములోని శివ లింగముపై శివమూర్తిని చెక్కిన శిల్పమున్నది.

శివమూర్తిని పూజించు పద్ధతిలో ప్రధానముగ నటరాజ పూజాక్రమము బహుళ వ్యాప్తియందున్నది సంగీత, నాట్య సంప్రదాయములకు శివుడే మూలకర్తయని తత్సంప్రదాయికుల విశ్వాసము. సంగీత రత్నాకరాది గ్రంధములయందు, భావ ప్రకాశాది నాట్యశాస్త్రములందు సంగీత నాట్యములకు శివుని మూలపురుషునిగ పేర్కొనుట కలదు. శివునికి అభిన్నుడైన రుద్రుని గూర్చి నిర్వచించుచు, "రుతౌ నాదాంతే ద్రవతి ద్రావయతీతి రుద్రః" నాదము యొక్క చివర ద్రవింపజేయు వాడు రుద్రుడని చెప్పిరి."

తంత్రశాస్త్రములాధారముగ అనేక శివమూర్తుల ఉపాసనా పద్ధతులు కలవు. శివ పురాణమున పార్వతిని వివాహమాడగోరి మేనకాహిమవంతుల వద్దకు నర్తకుండై అవతరించి కన్నెనిమ్మని అడుగుట వర్ణింపబడినది. ఇదియే నటరాజమూర్తి అవతార ముగ భావింపవచ్చును. ఇదిగాక శివునికి సంబంధించిన నూట ఎనమిది అవతారములు శివపురాణమున చెప్పబడినవి. శివుడు, భవుడు, ఉగ్రుడు, రుద్రుడు, భీముడు, పశుపతి, ఈశానుడు, మహాదేవుడు అని శివుని అష్టమూర్తులు ప్రసిద్ధములు.

ఏకాదశ రుద్రులలో ఏకపాదమూర్తి నటరాజ స్వరూపము కలిగినవాడు నటరాజమూర్తిని అర్చించిన వానికి పునర్జన్మలేదని స్కాందపురాణము పేర్కొనినది.

# అర్థసూచికలు :

1. మొదటి శ్లోకము - అభినయ దర్పణము - నందికేశ్వరుడు

2. కళాస్వరూపము - లలిత కళలు - సంజీవదేవ్ పేజి-1
విజ్ఞాన సర్వస్వం - 14వ సంపుటము

3. భారతీయ తత్వశాస్త్రము - ఉపనిషత్తులు పేజి 112. డా. రాధాకృష్ణ
మొదటి భాగము - తెలుగు అనువాదము - బులుసు వేంకటేశ్వర్లు

4. తైత్తిరీయోపనిషత్తు - సాయణ భాష్యమునకు ఆంధ్రటీక
కనుపర్తి మార్కండేయ శర్మ

5. శ్వేతాశ్వతరోపనిషత్తు - శ్రీ శర్వానందస్వామి

6. లఘు సిద్ధాంత కౌముదీ - తెలుగు వ్యాఖ్యానము (పేజి..)
పుల్లెల శ్రీరామ చంద్రుడు

7. ప్రతిమా లక్షణము విగ్రహము - ప్రాచీనత - తెలుగు అకాడమి

8. నాట్యకళ - విజ్ఞాన సర్వస్వము - 3వ సంపుటము పేజి 681
వి. రాఘవన్

9. శైవము - విజ్ఞాన సర్వస్వము - 6వ సంపుటము
డా. దివాకర్ల వేంకటావధాని

10. " " "

11. ఉపనిషత్తులు - డా॥ రాధాకృష్ణ భారతీయ తత్వశాస్త్రము
మొదటి భాగము పేజి-114

12. ఆంధ్ర వచన శివ మహాపురాణము - అధ్యాయము - 8
శ్రీమతి ఏలూరిపాటి లక్ష్మీసరస్వతి

13. రుద్రసూక్తము - తెలుగు అనువాదము
పాలావజ్జల శ్రీరామ శర్మ

# విగ్రహశిల్పము-నటరాజు :

విగ్రహము, మూర్తి, బింబము, ప్రతికృతి, ప్రతిరూపము శిల్పము మొదలగు పదములు విగ్రహమునకు పర్యాయపదములు వేదములలో విగ్రహము లేక శిల్పము ప్రతి మార్థమున ప్రయోగించిరి. ఐతరేయ బ్రాహ్మణాదివైదిక వాఙ్మయమున సూర్యప్రజాపతిని "ప్రతిమ" అని పిలుచుట యున్నది. పురాణములలో సూర్యుని జ్యోతిర్లింగమని పేర్కొనిరి.

తంత్రశాస్త్రమున బింబము, విగ్రహము ప్రతిమాపదములు పర్యాయవాచకములు. ఏపదార్థమునకైనను ప్రతి రూపము చెక్కిన "ప్రతిమ" అనిపిలుచుట కాలక్రమమున రూఢియైనది. ఇట్టి ప్రతిమల రూపొందించు సూత్రములను వివరించు శాస్త్రమును 'నిదానశాస్త్ర' మందురు, *గుణక్రియామసారేణ క్రియతే రూపకల్పనా"* అన్నట్లు భక్తుల ఉపాసనార్థము గుణక్రియాది విశేషణముల ననుసరించి దైవమునకు రూపకల్పన భారతదేశమున అనాది నుండియు చేయబడుచున్నది.

పురావస్తు వారి త్రవ్వకములలో లభ్యమైన శిల్పములందు శైవశిల్పము ప్రాచీనతమమైనది. శివప్రతిమలేగాక కాలక్రమమున విష్ణు, గణేశ, కార్తికేయ, పార్వతి, కృష్ణ, సరస్వతి, వరుణ మొదలగు పౌరాణిక దేవతల విగ్రహములు భారతదేశమందంతటను దేవాలయములందు, శిఖరములపైన చెక్కబడియున్నవి, కొన్ని శిల్పచిత్రాలయములలో భద్రపరుపబడియున్నవి. విగ్రహశిల్పములన్నింటిలోను శివుని విగ్రహములే అనేక భేదములతోడ కన్పించుచున్నవి.

శైవసంప్రదాయమున ఉపాసనాభేదము చేత ఘోరము - అఘోరము అను రెండు శాఖలు ఏర్పడినవి. ఈరెండుశాఖలకు సంబంధించిన సౌమ్య, రౌద్ర, శివ శిల్పములు గుణక్రియానుసారముగా రూపింపబడినవి. కాశ్యపశిల్పశాస్త్రమునందు శివమూర్తి అరువదినాలుగు భేదములతోడ నొప్పుచుండునని చెప్పబడినది. అందు పేర్కొనిన పద్దెనిమిది భేదములు ఈ క్రింద నీయబడుచున్నవి.

1) సుఖాసనమూర్తి 2) సోమస్కందేశ్వరమూర్తి 3) వృషవాహనమూర్తి 4) చంద్రశేఖరమూర్తి 5) నృత్యమూర్తి 6) గంగాధరమూర్తి 7) కళ్యాణ సుందర మూర్తి 8) కంకాళమూర్తి 9) దక్షిణా మూర్తి 10) అర్థనారీశ్వరమూర్తి 11) పాశుపత మూర్తి 12) హరిహర మూర్తి 13) కాలఘ్న మూర్తి 14) భిక్షాటన మూర్తి 15) చండీశానుగ్రహమూర్తి 16) లింగోద్భవమూర్తి 17) గజసంహారమూర్తి

శివుని మూర్తులు ప్రధానముగా నాలుగు ప్రసిద్ధమైనవి.

1) సంహారమూర్తి 2) దక్షిణామూర్తి 3) అనుగ్రహమూర్తి
4) నృత్యమూర్తి.

ఇంటువంటి దైవరూపములను శిల్పములుగా మలచుటలో రంగు, దృష్టి, వాహన, అవయవ భేదములను బట్టి రూపభేదములు ఏర్పడుచుండును. దేవతా విగ్రహములు తెలుపు, నీలము, పసుపుపచ్చ, ఎరుపు, నలుపు మొదలగు వర్ణభేదము చేత, సాత్విక, క్రూర భావముల ప్రదర్శించు దృష్టి భేదముచేత, ఏకముఖ, ద్విముఖ, త్రిముఖ, చతుర్ముఖ, పంచముఖ, షణ్ముఖాది ముఖభేదములచేత, ద్విభుజ, చతుర్భుజ, అష్టభుజాది భేదముచేత, ముక్తామాల, రుండమాల, సువర్ణకుండల, సర్పకుండల, మొదలగు ఆభూషణముల చేత, సువర్ణహంస, వృషభము, మృగము, అశ్వము, గజము, మూషికము, సర్పము మొదలగు వాహనభేదములచేత, ద్వినేత్ర త్రినేత్రాది నేత్రభేదములచేత, శంఖచక్ర గదాంకుశ పాశశూల కృపాణాది ఆయుధ భేదముల చేత మూర్తులను అనేకవిధముల నిర్మించి పూజించుట ఆరాధించుట శిల్ప, ఆగమ శాస్త్రములందు విశదముగా సారముగ చెప్పబడినది.

దైవమూర్తులను పంచవిధములుగా పరిగణింతురు. భగవంతుడు స్వయముగా వెలసినట్లు చెప్పబడు ప్రదేశమునందలి మూర్తిని స్వయం వ్యక్తమనియు, దేవతలు ప్రతిష్టించి వారిచే పూజించబడునని విశ్వసించు ప్రదేశమందలి మూర్తిని దివ్య మనియు, ఋషులచేత స్థాపింపబడిన ప్రదేశమందలి మూర్తిని ఆర్షమనియు, పురాణము లందు ప్రసిద్ధి పొందిన ప్రదేశమందలి మూర్తిని పౌరాణికమనియు, మనుష్యులచే ఆగమశాస్త్ర పూర్వకముగ ప్రతిష్టింపబడిన మూర్తిని మానుషమనియు వ్యవహరింతురు.

మనకు లభించిన దేవతా మూర్తుల భంగిమలనుబట్టి ప్రధానముగా పంచ విధముల విభజింపవచ్చును.

1) స్థానము - నిలబడియున్న మూర్తి, శ్రీ వేంకటేశ్వరస్వామి, బుద్ధజిన విగ్రహములు.

2) ఆసీనము - కూర్చొనియున్న మూర్తి, శ్రీరామ, నృసింహ, వినాయకాది

3) శయనము - పరుండియున్నమూర్తి, శ్రీరంగనాథస్వామి, గోవిందరాజ స్వామి, పెన్నరంగస్వామి విగ్రహములు.

4) యానము - నడచుచున్న మూర్తి గరుడారూఢ విష్ణువు, వృషభవాహన మూర్తి మొదలగునవి.

5) నృత్యము - నర్తించు మూర్తి. శివ, కృష్ణ, కాళి, మాతృకాది విగ్రహములు

దేవతా మూర్తులలో పంచముఖ దైవతములు కలవు. శివునకు పంచముఖుడని ప్రసిద్ధి. సద్యోజాతము, వామదేవము, తత్పురుషము, అఘోరము, ఈశానమని పంచముఖములకు పేర్లు. బ్రహ్మ, నృసింహ, హనుమంత, విశ్వకర్మాది దేవతలు కూడ పంచముఖులు. గాయత్రి పంచముఖి.

శివుని విగ్రహములు క్రీ.పూ. రెండవ శతాబ్ది నుండి కనిపించుచున్నవి. గుడిమల్లములోని శివలింగముపై శివుని మూర్తి చెక్కబడియున్నది. ఈ శివమూర్తి రుద్రాగ్నుల అంశల యొక్క ఐక్యభావమును సూచించుచున్నదని కళాభిజ్ఞులు పేర్కొనిరి. పల్లవరాజుల కాలమున కూడ శివునినాట్యశిల్పములు కన్పించుచున్నవి. శివుడు తండువునకు నాట్యము బోధించుచున్నట్లున్న శిల్పము, భరతునకు నాట్య సూత్రములు బోధించుచున్నట్లున్న శిల్పములు లభించినవి. గుప్తుల కాలమున వామదేవ శివనాట్య భంగిమను ప్రదర్శించు శిల్పము క్రీ శ అయిదవ శతాబ్ది కాలము నాటిది మధ్య భారతమున "నచ్‌నా ఫుధారా" అను ప్రదేశమున కన్పించుచున్నది. వీణను ధరించిన శివమూర్తి పల్లవరాజుల కాలమున అధికముగ చెక్కబడినది. క్రీ. శ. అయిదు, ఆరు శతాబ్దములనాటి విష్ణుకుండిన రాజవంశముల కాలమున మొఘల్‌రాజపురము గుహాలయములలో అష్టభుజ నటరాజ మూర్తి చెక్కబడియున్నది. పూర్వ చాళుక్యయుగము నాటిదైన శివమూర్తి రెండు చేతులుకలిగి ఒకచేత గొడ్డలి ధరించియున్నట్లు చెక్కబడిన శిల్పము విజయవాడ ప్రదర్శనవిలయమునందున్నది.

క్రీ పూ. నుండి కనిపించుచున్న శివుని శిల్పములు సంగీత నాట్యములకు ఆచార్యునిగా శివుని నిరూపించుచున్నవి. క్రీ.శ. అయిదు, ఆరు శతాబ్దముల కాలము నుండి శివుడు నటరాజుగా శిల్పములయందు చెక్కబడియున్నాడు.

## శివేతర నాట్య భంగిమలు :

శివుడేగాక పౌరాణిక దేవతలు కొందరు నృత్యము చేయుచున్నట్లు చెక్కబడిన శిల్పములు భారత దేశమంతటను ఆయా గృహాలయములందు కనిపించుచున్నవి.

పౌరాణిక స ప్రదాయమున నాట్యముచేయు దేవతలుగా కాళి గణపతి సప్తమాతృకలు శ్రీ కృష్ణుడు ప్రసిద్ధిపొందిరి. వీరేగాక విష్ణువు, సరస్వతి, వరుణుడు, ఇంద్రాణి మొదలగువారు నాట్యము చేయుచున్నట్లున్న శిల్పములున్నవి. వాటిలో కొన్ని ఈ క్రింద నీయబడుచున్నవి.

1) వినాయకుని నాట్యభంగిమ - క్రీ.శ. 12వ శతాబ్ది - హొయసలేశ్వర దేవాలయము హలేబిడ్

2) గణపతి మరియు బ్రాహ్మణి నాట్యముచేయుచున్న భంగిమ - క్రీ.శ. 17వ శతాబ్ది-మఠాంచేరి ప్యాలెస్ కేరళ

3) గణేశ నాట్యభంగిమ - క్రీ.శ. 10వ శతాబ్ది - లక్నో మ్యూజియం

4) విష్ణువు చక్రములో నాట్యభంగిమ- క్రీ.శ. 12వ శతాబ్ది-అస్తోష్ మ్యూజియం కలకత్తా

5) ఇంద్రాణి, సరస్వతి, కాళి నాట్య భంగిమలు - ఛామిమ్యూజియం

6) భద్రకాళి నృత్య భంగిమ- క్రీ శ. 8వ శతాబ్ది-సంగమేశ్వర దేవాలయము

7) మాతృకల నాట్యము - క్రీ.శ. 6వ శతాబ్ది - గుప్తులకాలము మండోల్ - రాజస్థాన్

8) సరస్వతి హంసపై నాట్యము చేయుట - క్రీ శ. 11వ శతాబ్ది - ఉదయేశ్వర దేవాలయము ఉదయపూర్.

9) కృష్ణుని రాసక్రీడా నృత్యము - క్రీ.శ. 17వ శతాబ్ది - వీరనారాయణ దేవాలయము చేల్వాడి మైసూర్

10) వరుణుని నాట్య భంగిమ - క్రీ.శ, 13వ శతాబ్ది - కాకతీయ శిల్పము - రామప్ప దేవాలయము

శిల్పములన్నింటిలోను నాట్యము చేయుచున్న శివుని శిల్పములే బహుళముగా చెక్కబడియున్నవి. శివనాట్య శిల్పములలో మూడు రకములు గలవు. శిలపై చెక్కిన శిల్పములు. చిత్రించిన చిత్తరువులు, దక్షిణభారత కాంస్య విగ్రహములు. కొన్ని ప్రసిద్ధమైన శివనాట్య భంగిమల శిల్పములు ఆయారాజుల కాలములలో చెక్కబడినవి, ఈ క్రింద నీయబడుచున్నవి.

1) నామదేవ శివనాట్య భంగిమ - గుప్తుల కాలము - క్రీ.శ. 5వ శతాబ్ది
శివదేవాలయము - సచ్నాపుధారా - మధ్యభారతము

2) వీణా దక్షిణామూర్తి - క్రీ.శ. 5వ శతాబ్ది

3) నటరాజ నాట్య భంగిమ - క్రీ.శ. 5వ శతాబ్ది

4) బహుబాహువులుగల శివనాట్య భంగిమ - గుప్తులకాలం - క్రీ.శ. 5వ శతాబ్ది

5) లలితా శివనాట్యము - ఎలిఫెంటాగుహ - క్రీ.శ. 5వ శతాబ్ది

6) సప్తస్వరమయ శివునిగా సంగీత మూర్తులుగల శిల్పము
- పరేల్ - క్రీ శ. 6వ శతాబ్ది

7) నటరాజ శిల్ప భంగిమ - బిక్కవోలు - క్రీ.శ 7వ శతాబ్ది

8) భుజంగత్రాసిత భంగిమ - పల్లవుల కాలము - క్రీ శ. 9వ శతాబ్ది

9) శివనాట్య ఊర్ధ్వ జాను భంగిమ - పల్లవుల కాలము క్రీ శ. 9వ శతాబ్ది

10) భద్రకాళితో శివ నృత్య భంగిమ - సంగమేశ్వర దేవాలయం
క్రీ శ. 8వ శతాబ్ది

11) గంగను ధరించబోవు శివ నృత్యము-గరుడ దేవాలయము
అలంపూర్ క్రీ.శ 8వ శతాబ్ది

12) చతుర్బాహు శివ నాట్య భంగిమ - పశ్చిమ చాళుక్య కాలము
- విరూపాక్షదేవాలయము - పత్తడకల్ - క్రీ.శ. 8వ శతాబ్ది

13) షడ్బాహు శివనాట్యభంగిమ-పశ్చిమచాళుక్య కాలము-ధార్వార్-
క్రీ.శ. 8వ శతాబ్ది

14) ఎనిమిది చేతులుగల శివుడు-పార్వతితో కలహంసనాట్య భంగిమ
క్రీ.శ. 8వ శతాబ్ది

15) రెండు పాదములు అపస్మారునిపై నున్న శివశిల్పము
- విరుపాక్షదేవాలయము క్రీ శ 8వ శతాబ్ది

16) అపస్మారుడు లేని శివచతురభంగిమ - చోళుల కాలము
కోయంబత్తూర్ జిల్లా బడుముడి

## దక్షిణ భారత కాంస్య విగ్రహములు

దక్షిణ భారత దేశములోని కంచు ప్రతిమలను తయారుచేయుట అతిప్రాచీన దశలో ప్రారంభమైనది గుప్తరాజుల కాలములోని బుద్ధుని కంచు విగ్రహములు లభ్యమైనవి మహాయాన మతమునకు చెందిన బుద్ధ విగ్రహములు లంకా అనురాధ పురములో లభ్యమైనవి ఈబౌద్ధ శిల్పములు ఉత్తర భారతములోని గుప్తుల కాలము నాటివి

భిశ్వతత్వమును ప్రదర్శించు అపూర్వ కాంస్య ప్రతిమలు ఉత్తర భారతమునకు చెందిన బుద్ధ విగ్రహము, దక్షిణ భారతమునకు చెందిన నటరాజ విగ్రహము భారతదేశము ప్రపంచమునకు కానుక పెట్టిన శిల్ప కళాఖండములు తొమ్మిది పది శతాబ్దుల కాలము నాటినుండి దక్షిణ భారత కాంస్యప్రతిమలు ఉత్తర భారత శిల్పవిశేషములకన్న సౌందర్యమును వృద్ధిచేసుకొనినవి

## కాంస్యప్రతిమల ఆవిర్భావమునకు కారణములు :

శివలింగము దేవాలయములోని గర్భగుడిలో నుండుటవలన ప్రజలందరి దర్శనమునకు వీలుగలేక పోవుటవలన ఉత్సవమూర్తులకు రూపొందించుట జరిగినది. మత సంబంధమైన, పర్వదినములందు, పండుగల యందును, వీడులవెంట నుత్సవ మూర్తుల నూరేగించు పద్ధతి ప్రారంభమైనది ఈమూర్తుల నిర్మాణము కొరకు రాగి, కంచు, వెండి, అరుదుగా బంగరములలో పోత పోసెడివారు, మరియు చోళరాజుల కాలములో భక్తులకు దైవ ప్రతిమల తయారుచేయించి దేవాలయములకు దానము చేసెడివారు. ఈ మూర్తిదానము పరమపుణ్యమని శిల్పశాస్త్ర గ్రంథములు పేర్కొననవి. విగ్రహములను తయారుచేయువారిని స్థపతులు అనిపిలుతురు. తంజావూరిలోని బృహదీశ్వరాలయములో రాజరాజ నరేంద్రుడు దైవబుద్ధిప్రతిమను దానముచేసినట్లు శాసనము కలదు కులోత్తుంగరాజు వేయించిన శాసనము నెమ్ పనాయ్ ఆలయమున నటరాజ విగ్రహము బహూకరించినట్లు చెప్పుచున్నది. నటరాజ దేవాలయము లందు మూలవరులుగ, ఉత్సవమూర్తులుగ నటరాజ విగ్రహములే యుండుటవిశేషము.

శివ, నటరాజ విగ్రహములు, దేవీప్రతిమలు తయారు చేయుటకు కొలతలను శిల్పశాస్త్రములు పేర్కొనినవి దశతాళ ప్రమాణము అష్టతాళ ప్రమాణము

పెద్దవిగ్రహములను చాలగణేశ, బాలశ్రీకృష్ణవగ్రిహములను పంచతాళ ప్రమాణము నిర్ణయించిరి. ఆధ్యాత్మిక విశేషమునుబట్టి భావ ప్రాముఖ్యమునుబట్టి అభంగ సమభంగ విగ్రహములు దివ్యతేజస్సుతోడ భావముప్రకాశించునట్లు రూపింపబడి సాత్విక ప్రతిమలుగా చెప్పబడినవి అతిభంగరీతిలో నున్న విగ్రహములు, అతివేగ చాలన ముద్రల్ని నృత్యమునాయుకున్నట్లు నటరాజ, శ్రీ కృష్ణ కాలసంహార కాళియదమన రూపములు తామస మూర్తులుగా చెప్పబడినవి.

## మధూచ్ఛిష విధానము :

విగ్రహములు తయారు చేయుటలో మధూచ్ఛిష్ట విధానము స్థపతులు అనుసరించెదరు మొదట మైనముతో విగ్రహమును తయారుచేసి, దానిచుట్టు ఇనుప తీగలను అమర్చి మట్టితో నింపెదరు మంట రగిల్చి లోపల మైనమును కరిగించగ మట్టితో తయారైన మూస మిగులును ఆ మూసయందు పంచలోహముల మిశ్రమమును కరిగించి పోయుదురు చల్లారిన తరువాత విగ్రహమునకు మెరుగులు అలంకరణలు చేసెదరు.

నటరాజ విగ్రహమున తాండవస్థితిలో జడలు గుండ్రని ఆకారములో నున్నట్లు చిత్రించెదరు తలవెనుక పద్మము మూవిరి తీర్చి దిద్దెదరు. కుడిచెవికి మకర కుండలము, దండలకు కేయూరములు, ఎడమచెవికి పత్రికుండలము, ముంజేతులకు వలయములు, నాగాభరణములు అలంకరించెదరు భుజాలంకరణమును బాహుమూలమనియు, నడుమునుండు అలంకరణమునకు ఉదరబంధ, లేక రత్నకోదర బంధ యని, కటిస్థలమున అలంకరణమునకు సింహముఖమని వ్యవహరింతురు.

చతుర్భుజములతో నటరాజు జ్వాలామాల ప్రభయందు వెలుగుచుండును రెండు చేతులలో అగ్ని-డమరుకము ధరించును తక్కిన రెండు ముద్రలనభినయించును. అగ్నిని పట్టిన అర్ధచంద్రహస్తము సంహార సూచకముగను, క్రింది ఎడమచేయి డోలాహస్తము అనుగ్రహభావమును కుడివైపు పైచేయి డమరుకము ధరించి సృష్టిభావమును, క్రింది కుడిచేయి అభయ హస్తమును కల్గియుండును నటరాజు పాదముల క్రింద మరుగుజ్జు త్రొక్కబడి యుండును అజ్ఞానము, జరా మరణము అనువానికి చిహ్నముగా ముయ్యకుడను వాడు మరుగుజ్జుగా త్రొక్కబడుట స్థితముగా నున్న పాదము జయ సూచకము. ఎడమ పాదము కుంచితముగ అనుగ్రహ చిహ్నమై యున్నది. నటరాజుచుట్టును ఆవరించిన జ్వాలా మాల ప్రభ

ఓంకారమును సూచించుచు ఇట్లు రూపింపబడిన నటరాజ కాంస్య విగ్రహములు ఒహు భేదములతో పల్లవుల కాలమునుండి అభివృద్ధి పొందినవి నటరాజ నాట్య భంగిమలు నూట ఎనిమిది కలవని కొందరు చెప్పుచున్నారు బహుశ నాట్య శాస్త్రములోని (108) నూట ఎనిమిది కరణములను బట్టి ఈ విధముగ భావించి యుండ వచ్చును.

## కొన్ని నటరాజ కాంస్య విగ్రహములు :

1) జ్వాలామాల ప్రభయందు నటరాజ విగ్రహము - బృహదీశ్వరాలయము - తంజావూరు క్రీ శ. 11వ శతాబ్ది.

2). నాటరాజ విగ్రహము - మెట్రోపాలిటన్ మ్యూజియం - న్యూయార్క్ - గుప్తుల కాలము నాటిది.

3) నటరాజ విగ్రహము - ప్యారిస్- క్రీ శ. 1000

4) వీణాధరవిగ్రహము - ప్యారిస్ - 11వ శతాబ్ది

5) నటరాజ విగ్రహము నెమలిఈకలు ధరించినది - క్రీ శ 11వ శతాబ్ది-కిలుపత్తూరు

6) నటరాజ భంగిమ - చోళుల కాలము - తరంగబాడి క్రీ శ 12వశతాబ్ది

7) నటరాజ ఊర్ధ్వతాండవము - తిరువలంగాడు - క్రీ శ. 11వ శతాబ్ది

8) నటరాజ మరియు శివకామేశ్వరి - సభేశ్వర దేవాలయము - చిదంబరము

9) నటరాజ విగ్రహము - తిరుప్పగలూరు.

10) నటరాజ విగ్రహము - తిరుక్కందేశ్వరము

11) నటరాజ విగ్రహము - దాక్షారామము క్రీ శ. 11 12వశతాబ్ది

12) నటరాజ విగ్రహము - పంచనంది కులము క్రీ శ. 12,13వశతాబ్ది

13) లలాటతిలక భంగిమగల నటరాజు - నాయిక రాజుల కాలము క్రీ శ 17వ శతాబ్ది

14) నందిపై నటరాజు - తంజావూరు విగ్రహము - కలకత్తా మ్యూజియం

## విదేశములలో దైవశిల్పములు :

విదేశములలో కూడ దేవతల విగ్రహములు నిర్మించి పూజించు సంప్రదాయి మున్నది. గ్రీకులు దైవముగా భావించు స్పింగ్స్ విగ్రహము మానవ శీర్షము, సింహశరీరము కల్గినది ఇది మనదేశములోని నరసింహదేవునిరూపమునకు వ్యతి రేకమైనరూపము ఆసేరియన్ శిల్పమునందు రెక్కలు గల వృషభము నరముఖ

వృషభ విగ్రహములున్నవి. ఇవిమన పౌరాణిక దేవతలగు నందీశ్వరుడు, కామధేనువులను తలపింపజేయును గ్రీకు సాహిత్యమునందు ప్రధానదైవతముగా పేర్కొనబడిన ''జూస్'', హెరక్లిస్ శిల్పములలో హెరక్లిస్ శిల్పమున ఒక వీరుడు అనేక సర్పములతో చుట్టుకొనబడి వాటిని మర్దించుచున్నట్లున్నది, ఇది శ్రీకృష్ణుని కాళియ మర్దనమును గుర్తుచేయుచున్నది గ్రీకు వారిదేవత (EROSE) ఎరోస్ శివుడని 'లూసియన్' అను విమర్శకుని భావన,

ఎథెన్స్ నగరములోని పార్థినాన్ దేవాలయ విగ్రహములు మనదేశములోని శక్తి స్వరూపమును పోలియున్నవి. ఎథెన్స్ నగరాధి దేవత అగు 'ఎతీనాదేవి' ఫీడియస్ అను శిల్పకారునిచే మూడురీతుల రూపొందింపబడినది. మొదటిది "లెజ్నియాన్ ఎతీనా" అను పేరున యదార్థ మానవ మూర్తికన్న కొంచెము ఎక్కుగ నిర్మింపబడినది రెండవది 'యలీనాపోగ్రిమోచెస్' దీని ఎత్తు దాదాపు డెబ్బది అడుగులు. ఏథెన్స్ దేవాలయ ప్రాంగణమున నెలకొల్ప బడిన ఈ విగ్రహము ఓడలలో పయనించువారికి కన్పించుచుండెడిదట విరత్వము మూర్తిగొన్నట్లున్న ఈ దేవత ఏథెన్స్ నగర వాసులకు అభయప్రదాయినిగా ఒప్పుచుండెడిది మనదేశములో సముద్రతీరముననున్న కన్యాకుమారి విగ్రహము ముక్కునకు న్న ముక్కెరలోని వజ్రపుకాంతులు నావికులకు తీరము సూచించునని చెప్పుదురు. గ్రీకు ఎతీనా విగ్రహము ఇట్టిదే.

ఫీడియస్ రచించిన మూడవ ఎతినా విగ్రహము పార్థినాస్ దేవాలయములో ప్రతిష్ఠింపబడి అర్చింపబడుచున్నది. దీని ఎత్తు (38) ముప్పది ఎనిమిది అడుగులు. ఒక చేతిలో విల్లు, రెండవ చేతిలో బాణము, మెడలో పుత్రేను కగ్గియుండి మన దేశములోని శక్తిమూర్తుల బోలియున్నది. ఈ మూడు విగ్రహములు వంచుత్రో పోత పోయబడిన వనుట గమనించతగినది.

## విదేశములలో నటరాజశిల్పము :

ఇండోనేషియా, బాలి, థాయిలాండ్, మధ్య ఆసియా, నేపాల్, సిలోన మొదలగు దేశములలో నటరాజ విగ్రహములున్నవి. ఇండోనేషియాలో బ్రహ్మ, శివ, విష్ణుపీఠములు ''పరంబనమ'' లోని గుడి గోపురముపైన కనిపించును. ఇచటి శిల్పము దక్షిణ భారతమున విలసిల్లిన శైవ శిల్ప లక్షణములు కల్గియున్నది. ఆదేవాలయ శిఖరము పైన శివనాట్య కరణములు అందముగా చెక్కబడియున్నవి. ఈ కరణములు దక్షిణ దేశములోని బృహదీశ్వరాలయము, చిదంబరము

అన్నామలై, వృద్ధాచల ప్రదేశములలోని ఇతర శిల్పముల కంటే ప్రాచీనమైనవని విమర్శకులు చెప్పుచున్నారు. ఇచటి నటరాజ విగ్రహము తలపై జడలు ముడువబడి మకుటమువలె నున్నది. నాగ యజ్ఞోపవీతము నెత్తిపై పుర్రె, అర్ధ చంద్రుడు పూగుత్తి అలంకరింపబడియున్నది. అర్ధనారీశ్వర మూర్తివలె ఈ శిల్పము గోచరించును. వ్యాఘ్ర చర్మము ధరించిన నటరాజు కుడిచేతిలో పతాక ముద్ర ఎడమ చేతిలో అర్ధచంద్ర ముద్ర కల్గియుండెను. మరియొక నటరాజు విగ్రహము నందు దక్షిణ హస్తము శిఖరముద్ర కలిగి శివలింగమును సూచించుచున్నది.

బాలిద్వీపము నందు లభించిన శివనాట్య చిత్రములు పశ్చిమ జర్మనీలోని బెరో మెనూబరస్ మ్యూజియం (Beromenuberse musiem) లో భద్రపరచబడియున్నవి. దేవతల కెదురుగ శివుడు గుండ్రని పద్మముపై నృత్యము చేయుచున్నట్లు చిత్రింపబడియున్నది. మూడు కన్నులు నాలుగు చేతులు కల్గి దట్టమైన జడలతో నటరాజు కనిపించును.

కంబోడియా దేశమున శివుని నటేశ్వరునిగ ఆరాధించు సాంప్రదాయ మున్నది. ఇచ్చటి శైవ విగ్రహములలో ఆలింగన చంద్రశేఖర, ఉమామహేశ్వర వృషభ వాహన, రావణానుగ్రహ, త్రిపురాంతక, మదనాంతక శిల్పములు కలవు. దశభుజుడైన నటేశ్వర ప్రతిమ బంగారముతో చేయబడినట్లు టాకియో (Takeo) శాసనములందు వర్ణింపబడినదట. ఇత్తడి కంచు విగ్రహములు అచటి ప్రదర్శన శాలలందు కలవు. శివ భక్తుడైన కరికాలమ్మయ్యార్ అనుశుష్కాకారము బహు బాహువులు గల శివనాట్యశిల్పములందు కనిపించును.

థాయిలాండ్ ప్రదేశమున బ్రహ్మవిష్ణువులతో కూడిన శివనాట్య శిల్పమున్నది. అగ్నిజ్వాలా మండల మధ్యభాగమున నృత్యము చేయుచున్నట్లున్న నటరాజశిల్ప భంగిమలిచ్చట కలవు. నటరాజు పాదముల క్రింద నుండు ముయ్యకుడను మరుగుజ్జు ఈ శిల్పమునందు కూడా కన్పించును. కాశ్మీరులోని ఉత్తర సరిహద్దు ప్రాంతములయందు జరిపిన త్రవ్వకములలో మూడు తలలు గల శివుని విగ్రహములు లభించినవి. తడికిస్తాన్‌లోని ఒక గోడ చిత్తరువునందు శివనాట్యము చిత్రింపబడియున్నది.

నేపాలులో చెప్పిన విగ్రహములు పది చేతులలోను, పదహారు చేతులతోను కనిపించుచున్నవి. శ్రీ లంకలో చోళ పాండ్య రాజులకాలంలోని శిల్ప సంస్కృతి వ్యాపించియున్నది. ఇటీవల కనుగొనబడిన శివనాట్య కాంస్య విగ్రహములు ప్రశస్తములైనవి. పదవ శతాబ్దికి చెందిన తాండవ భంగిమలో అభయహస్తము మీదుగ సర్పముండుట, జడలన్నియు దట్టముగా అల్లబడి ఇరువైపుల అందముగ విస్తరింపబడుట విశేషము. శివకామ సుందరి విగ్రహము మకర కుండలములు కలిగి అందముగా నున్నది.

1) శిఖర హస్త భంగిమ పరంబన దేవాలయము — ఇండోనేషియా

2) శివనాట్య చిత్రము బాలి — క్రీ.శ. 13 వ శతాబ్ది

3) బ్రహ్మ విష్ణుల మధ్య శివ నాట్య శిల్పము
— కంబోడియా — క్రీ.శ 9వ శతాబ్ది

4) ఇరువది చేతులు గల వీణ ధరించిన శివమూర్తి
నందిపై నాట్యమాడు శిల్పము — చామ్ మ్యూజియమ్ — డానాంచ్

5) ఇరువదినాలుగు చేతులుగల శివుడు నందిపై
నాట్యమాడు శిల్పము — చామ్ మ్యూజియమ్ — డానాంచ్

6) పది చేతులుగల శివనాట్య శిల్పము — చామ్ మ్యూజియమ్ — డానాంచ్

7) నటరాజ విగ్రహము — థాయిలాండ్

8) పద్దెనిమిది చేతులుగల అర్ధనారీశ్వర రూపము
ఒకకాలు నందిపై ఒకకాలు సింహముపై — మధ్య ఆసియా

9) నటరాజ విగ్రహము దట్టమైన జడలుకల్గినది — కొలంబో మ్యూజియమ్

ఈ విధముగ ప్రపంచముయొక్క సంచలనమే శివనృత్యమను తత్వార్థము ప్రకటితమగునట్లుగ శైవ సంప్రదాయము, నటరాజ శిల్పము దేశవిదేశములందు బహుళముగా వ్యాప్తమైయున్నది.

ఆలయములందు ఆరాధనా విశేషములతో నృత్యమొకటి. శైవాలయములలో నృత్యముచేయు దేవదాసిని బసవి, పార్వతి అని పిలిచెదరు. శివునికి ప్రీతికరమైన ఏకాంగి, భుజంగత్రాసిత, భుజంగాంచిత, ఊర్ధ్వపాద, సంధ్యానృత్తములను ప్రదర్శించెదరు. శివప్రీతికి తలపుష్పపుట కరణము, శివుని ప్రీతికి నికుంచిత కరణము ప్రదర్శింపవలెనని నాట్యాచార్యుల అభిప్రాయము.

భారత దేశమున నటరాజ ఆలయములుగల ప్రదేశములను సభలుగా పేర్కొనుట సంప్రదాయము. తిరువలంగాడు అను ప్రదేశమును రత్నసభ యనియు, మధురలోని నటరాజున్న ప్రదేశమును రజితసభ యనియు, తిరునల్వేలి ప్రదేశమును చిత్ర సభ యనియు, శ్రీ చిదంబర దేవాలయమును కనక సభయని చెప్పుదురు. అన్నిటిలోను. పరమేశ్వరుడు పరమేశ్వరితో కూడి నాట్యమొనర్చును. ఈ సభలలో ఆకాశ తత్వాత్మకమైన చిదంబరక్షేత్రము పరమ పవిత్రమైనదిగ స్కాందపురాణము పేర్కొనినది

## అధస్సూచికలు :

1) ప్రతిమా లక్షణము – "విగ్రహశిల్పము - ప్రాచీనత" - తెలుగు అకాడమి.

2) నాట్యకళ - వి. రాఘవన్ – విజ్ఞాన సర్వస్వము శివ సంపుటము.

3) శిల్ప దర్శనము – కొండూరి వీరరాఘవాచార్యులు. పేజీ – 397

4) విగ్రహ ప్రతిమా లక్షణము – రామసుబ్బారెడ్డి – సప్తగిరి మాస పత్రిక. తిరుమల తిరుపతి దేవస్థానం. మార్చి సంచిక 1986. పేజి – 16

5) నాట్యకళ – వి రాఘవన్ – విజ్ఞాన సర్వస్వం శివ సంపుటము

6) నటరాజా ది డాన్సింగ్ గాడ్. పేజి 94 ప్రొజెష్ బెనర్జీ

7) దక్షిణాది కంచు ప్రతిమల ప్రతిభ – వేటూరి రాధాకృష్ణ.

8) మూర్తి స్వరూపం – గణపతి స్థపతి విజ్ఞాన సర్వస్వం 14వ సంపుటము

9) కళా స్వరూపం – లలిత కళలు – సంజీవదేవ్ – విజ్ఞాన సర్వస్వం 14వ సంపుటము

10) " " "

11) ఓరియంటల్ థీరి పేజి–42 నటరాజా ది డాన్సింగ్ గాడ్. ప్రొజెష్ బెనర్జీ.

12) దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర – పేజి–18 డా॥ నటరాజ రామకృష్ణ.

శిల్పముల పట్టికలు డా॥ శివరామమూర్తిగారి, "**నటరాజ ఇన్ ఆర్ట్ థాట్, అండ్ లిటరేచర్**" అను ఆంగ్ల పుస్తకము గ్రహింపబడినవి

# తాండవము – పుట్టుపూర్వోత్తరములు

తాండవము తండు ప్రోక్తమని నాట్యశాస్త్రము పేర్కొనినది. నాట్యశాస్త్రమున బ్రహ్మతో శివుడు ఈ విధముగ చెప్పినట్లు కలదు. "ఓ మహామతీ యశస్సును శుభమును పుణ్యమును కల్గించునదియు, బుద్ధిని వృద్ధిపొందించు నదియు అగునాట్య శాస్త్రము నీవు చక్కగా రచించితివి సంధ్యాకాలముల యందు నృత్యము చేయుచున్నపుడు నేను కూడా ఈ విషయముల గూర్చి చింతించితిని. కరణాంగహార సంపన్నమగు నా నృత్తమును నీవు పూర్వరంగ విధులందు చక్కగా కూర్చుము దీనివలన వర్ధమానకము ననుసరించెడి ఆసారగీతము లందలి, మహాగీతములందలి అర్థములు చక్కగా అభినయింపబడగలవు. నీవు పూర్వరంగమును శుద్ధముగా నొనర్చితివి ఈ అంగహారములతో కూడిన అది చిత్రము కాగలదు" అంతట ***"ఆ అంగహారముల ప్రయోగము తెలుపుము."*** అని బ్రహ్మ ప్రార్థించగా శివుడు తండువును పిలిచి ఈ భరతునకు అంగహారముల ప్రయోగము తెలుపుము అని ఆజ్ఞాపించెను. (నాట్యశాస్త్రము-పేజి-17) ఇట్లు భరతునకు అంగహారముల ప్రయోగము చెప్పుట చేత నృత్తమునకు, "**తాండవము**" అని పేరు వచ్చినట్లు తెలియుచున్నది. తండువు అనగా నందీశ్వరుడు.[2] నాట్యశాస్త్ర ప్రవర్తకులలో నందికేశ్వరుడు ఒకడు ఆయన రచించినదిగా చెప్పబడుచున్న నాట్యశాస్త్రమునకు అభినయదర్పణమని పేరు [3]

అభినయదర్పణమున ఇంద్రుడు "***అసురనాట్యశాలయందు నటశేఖరుడవు నటుడుకలవు. నాట్యక్రమముల తోడ పరమ వినోదముల వానిని జయించుటకు మీచే రచింపబడిన భరతార్ణవము గ్రంథమును అపేక్షించుచున్నాను.***" అని అర్థించినట్లు కలదు.[4] నందికేశ్వరుడు ఇంద్రుని కోరికపై నాల్గువేల శ్లోకములు గల భరతార్ణవమనెడి నాట్యశాస్త్రమును సంక్షిప్తముగా చెప్పినట్లు అభినయ దర్పణమున తెలుపబడినది

పై కథనము ద్వారా కేవలము తాండవమే గాక (నృత్తమేగాక) నాట్యశాస్త్రము కూడ నందికేశ్వరుని ద్వారా (తండువు) తెలుపబడినట్లు విశదమగుచున్నది. శారదాతనయుడు రచించిన భావప్రకాశమునందు నాట్యోత్పత్తిని గూర్చి ఈ విధముగ చెప్పబడియున్నది.

"ప్రళయాంతమైన మహాశివుడు సర్వలోకములను దహించి ఆనంద తాండవము సేయ నెంచినపుడే బ్రహ్మ విష్ణువులను సృజించెను అప్పుడా శివుని వామ భాగమున మాయామయి వైష్ణవీశక్తి అంబికా రూపమవలంబించియుండెను. శివుని అజ్ఞానుసారము బ్రహ్మ లోకముల సృజించెను పిదప ప్రియమగు పరమేశ్వర నృత్తము నా కెట్లు సాక్షాత్కరించు నో యని వ్యాకుల పడుచుండగా నందికేశ్వరుడు విచ్చేసి ఆ చతుర్ముఖ బ్రహ్మకు సప్రయోగముగా నాట్య శాస్త్రమును ఉపదేశించెను "5 అనికలదు

ఈ కథనము బట్టియు నందికేశ్వరుని నృత్త (తాండవ) కర్తృత్వము తెలియు చున్నది, కమ్ముడను అలంకారికుడు తాండవమును నిర్వచించుచు **"తాండవం తండునా ప్రోక్తం నృత్తమ్ నృత్త విదో విదుః"** అని తాండవము తండుప్రోక్త మనియే ప్రకటించెను 6 శివుడు తండువునకు నృత్తము బోధించు చున్నట్లు చెక్కబడిన శిల్పము పల్లవరాజుల కాలమునాటిది మహాబలిపురమున చెక్కబడి యున్నది 7 కావున శివునిచే బోధింపబడిన నృత్తము తండువు ద్వారా లోకమున తాండవముగా ప్రసిద్ధి పొందినట్లు గ్రహించవచ్చు.

నాట్యశాస్త్రములోని నిర్వచనముల ప్రకారము నృత్తము పూర్వ రూపమనియు, తరువాత నృత్యనాట్యములుగా పర్యవసించిన దనియు తెలియవచ్చును తాండవమును నృత్తముగా పరిగణించిన భరత నాట్యశాస్త్రము-తరువాతి నాట్య గ్రంధములు నృత్త, నృత్య, నాట్యశాస్త్రముల కిచ్చిన నిర్వచనములు పరిశీలించిన నర్తన కళకు ప్రథమ రూపము నృత్తమనియే చెప్పవచ్చును

ఈనాటి పరిశోధకుల ఆలోచనల ప్రకారము మానవుడు లలితకళలను తన చుట్టుగల ప్రకృతి నుండియే గ్రహించెనని, ప్రకృతిలోని జీవరాసుల జీవన విధానము నుండి తనజీవనమును కూడ ఒక క్రమ పద్ధతిగా నేర్పరచుకొనెనని తెలియుచున్నది. మగనెమలి నాట్యమున, పుంస్కోకిల కుహూకారమున, తేనె టీగ తేనపెరయందు గిజిగాడి గూటిలోన, క్రమముగ నాట్య, సంగీత, శిల్ప, వాస్తుశిల్ప నిర్మాణములు గ్రహించెనని లలిత కళా పరిశోధకులు తెలుపుచున్నారు 8

మానవజాతి అస్తిత్వము ఎంత ప్రాచీనమో నర్తన కళయు అంత ప్రాచీనము. ఉల్లాసము వచ్చిన దుఃఖముకల్గిన, మానవుడు ఏదియో ఒకగతిలో చిందులు త్రొక్కును. ఈ విధముగ సహజముగ రూపొందిన నర్తనము ఆదిమజాతుల యందు దేవతలను సంతృప్తి పరచుటకు, ప్రకృతి శక్తుల ప్రశాంతపరచుటకు

చేసెడివారు. ఆనాటి మానవుని సాధారణ నర్తనము సాధారణ కథలను మాత్రమే కలిగియుండెడిది సూర్యునిపైపునకు, ఆకాశముపైపునకు, చేతులను పైకెత్తి గుండ్రముగా తిరుగుచూ నర్తించెడివారు చంద్రుని వృద్ధిక్షయములను అనుకరించు భంగిమలను చూప ప్రయత్నించెడివారు. చెట్లకొమ్మలపైపునకు తలలను, చేతులను ఎత్తి నర్తించుట యుండెడిది. ఇటు వంటి నర్తనము వలన సూర్యచంద్ర గుణములు చెట్ల లక్షణములు తమలో ప్రవేశింపగలవని ఆనాటి ప్రజల ఆశయమని విమర్శకులు చెప్పుచున్నారు. మతప్రవృత్తి పెరిగినకొలది నర్తనరీతియు మార్పుచెంది క్లిష్టములగు హస్తపాదవిన్యాసము చేయుట అంగప్రత్యంగముల కదలికతో పాటలు పాడుచు ముఖమున హావ భావములను ప్రకటించుట వ్యాప్తిలోనికి వచ్చినవి. ఇట్టి నృత్యములు నేటికిని ఆఫ్రికా, దక్షిణ అమెరికా, ఆసియాలలో అచ్చటచ్చట, కొన్ని అపరిచితజాతులయందు వాడుకలో నున్నవి ప్రాచీనకాలమున ఈజిప్టునందును. ఇట్టి నృత్యములు వాడుకయందున్నట్లు అచ్చట ప్రాచీనకాలపు చిత్రముల వలన తెలియుచున్నది ఇట్టినర్తనములను తాంత్రిక నర్తనములని కళాభిజ్ఞులు వ్యవహరించుచున్నారు ప్రాచీనయుగమున గ్రీకుదేశమున భారతదేశమునను ఇట్టి తాంత్రిక నృత్యములు వాడుకలో నున్నట్లు చారిత్రికులు చెప్పు చున్నారు 9

ఈ తాంత్రిక నర్తనము మనదేశమున మత సంప్రదాయముల నంటి పెట్టుకొని అనేక విధములనభివృద్ధి చెందినది. నర్తనకళలోని శైలీ విన్యాసము బట్టి, ఆరాధనాశైలి, కచ్చేరిశైలి, జానపదశైలిగా ఆధునికులు విభజించిరి 10

భారతదేశములో శివుడు ప్రాగార్య గిరిదేవతగా గౌరవింపబడిన, కాలక్రమమున అతనిని పరదేవతయగు శివునిగా భావించిరని ఆనందకుమార స్వామి వ్రాసియున్నాడు.11 ప్రాచీనులు భగవంతుని కొరకు చేయుకలాపమే శివతాండవ ప్రతిపత్తియని, అది కళలద్వారా, మతాను సరణమున ఎదుగుతూవచ్చి ఈనాడు భక్తుల, కళాభిమానుల హృదయములలో చెక్కు చెదరక నిలచి యున్నదని పేర్కొనెను. వేదపురాణ కావ్యేతి హాస సాహిత్యము నందు శివుడు ఆటవికునిగా అవతరించినట్లు కథలున్నవి వర్ణనమున్నది.

భారతీయ నాట్యశాస్త్రము నర్తనకళలో నృత్తము అనగా అభినయ శూన్యమై హస్తపాద విన్యాసమే ప్రథమ రూపమని చెప్పుట చేతనూ, భారతదేశములోని మత సంప్రదాయములలో శైవసంప్రదాయము ప్రాచీనతమమని తెలియుట చేతను,

దైవములలో అగ్ని స్వరూపుడగు శివుడు వేదములందుస్తుతింపబడుట చేతనూ, తాండవ కళ నర్తన కళలో ఆదిరూపమై శివతాండవము భారతీయులు భావించిన సృష్ట్యాది క్రియా కలాపమని విదితమగుచున్నది.

భరత ఖండమున నర్తన కళను గూర్చి సమగ్రమైన విశేషములను తెల్పునది భరత నాట్యశాస్త్రము. నాట్యశాస్త్రము ఉపవేదములలో నొకటిగ ప్రసిద్ధి చెందినది. భరతునికి పూర్వము నాట్యశాస్త్ర గ్రంథములుండెడివి. శిలాలి కృశాశ్వులు నట సూత్రములు రచించిరి వేదములు, ధర్మశాస్త్రములు, దర్శనములు సూత్రరూపమున వెలువడినట్లు నాట్యశాస్త్రము కూడ మొదట సూత్రములలోనే వెలువడినది. ప్రాచీన నాట్య సూత్రములిపుడలభ్యము. పద్మభువుడు, వాసుకి, నారదుడు మొదలగువారు రసోత్పత్తిని వివరించిరని భావ ప్రకాశము పేర్కొనినది భావప్రకాశమున, నంది, బ్రహ్మ, వాసుకి నారదుడు, అంజనేయుడు, అను ఆరుగురు నాట్య ప్రవర్తకులు భరతునికన్న ముందుకలరని చెప్పబడినది పాణిన్యాచార్యుని మాహేశ్వర సూత్రములు శివతాండవమున ఉత్పన్నమైనవని వ్యాకరణ సంప్రదాయము *"ప్రోక్తః సదాశివేనాస్మిం స్వరూపాశ్రయ నిర్ణయః"* అని సదాశివమతమును శారదా తనయుడు ప్రస్తుతించెను 12

ఈ విధముగ భరతునికన్న ముందును నాట్యశాస్త్ర ప్రవర్తకులు కలరుగాని వారి నాట్య గ్రంథములు లభ్యమగుటలేదు. నాట్యశాస్త్రమును గూర్చిన సమగ్రమైన విషయముల వివరించుటలో భరత నాట్యశాస్త్రము ప్రథమ ప్రమాణ గ్రంథముగ కన్పించుచున్నది లభ్యమగు కొన్ని నాట్యశాస్త్ర గ్రంథముల నుండి నృత్త, నృత్య నాట్య లక్షణములను సమీకరించి శివతాండవ కావ్యలక్ష్య సమన్వయముకై వివేచింపవలసియున్నది.

భరత నాట్యశాస్త్రమున నృత్యమని వేరుగా చెప్పబడలేదు తాండవమనగా నృత్తమనియే అర్థము. శివుడు చేసినది నృత్తము. భరతముని ప్రయుక్తము నాట్యము. ఈ నృత్త నాట్యములను సమ్మిశ్రణము చేసిన బాగుండునని శివునకు తోచెను అనగా తన నృత్తమునకు నాట్యమందలి అభినయమును జోడింప వలయునని శివుడభిప్రాయపడెను అట్లు ఏర్పడినదే నృత్యమని భరత నాట్యశాస్త్రము పేర్కొనినది 13 తాత్పర్యముగ అభినయ రహితమైన హస్తపాద విన్యాసము నృత్తమని, అభినయ సహితమైన అంగికాభినయము నృత్యమనియు నిష్కర్షింపవచ్చును

కుంభకుడను ఆలంకారికుడు భరతునివలె తాండవమే నృత్తమనెను. ఆసారితాది గీతములలో కరణాంగహారములతో ఉద్ధతమైన తాండవము నృత్తమందురని వివరించెను.

శివతాండవ కావ్యములోని నాందీ గీతములలో ఇట్టి నృత్త లక్షణము స్ఫుటముగ కనిపించుచున్నది.

'' కాష్ఠా ఆస్ఫోటయంతం కహకహ నినదైర్భీషణై రట్టహాసైః
హస్త వ్యాక్షేప భంగైః ప్రసభ మపదుశ్రితం వ్యోమ కుర్వంతముచ్చైః
పాదా ఘాతై రధోగాం సవనగిరి గుహాకోటి ముత్కంప యంతం
ధిం ధిం ధిం శబ్ద ఘోరం హృది వికట మహాకాల మాలోక యామః

ఛట చ్ఛట నదచ్ఛిఖా పటల పోషణం భీషణం
బహిర్జ్వల వహం సృజన్విషమ లోచనా ధ్యంతరాత్
ప్రమత్త ఇవ నృత్యతి ప్రచలితాఽఖిలాంఽగస్సయ
స్సమాఽపతతు మానసే రుహినశైల కూటోచ్ఛ్రితః

నందికేశ్వరుడు ఇట్టి నృత్తమును '*రసభావ విహీనంతు నృత్తమిత్యభిధీయతే*' రసభావములు లేనిది నృత్తము— అని నిర్వచించెను. "*రసభావ వ్యంజనాదికమ్ నృత్తమితీర్యతే*" *రసభావము మొదలగు వానితో నుండునది నృత్యము*" ఈ నిర్వచనము ద్వార నృత్యము వలన రసావిష్కరణము ఉండునని ఆతడు పేర్కొనెను 14 మరియు నాట్య, నృత్త, నృత్యములను మూడింటిని లాస్య తాండవ భేదములచే ఒక్కొక్కటి రెండు విధములుగ విభజించెను. అనగా నాట్యమందు లాస్య తాండవములు, నృత్తమందు లాస్య తాండవములు, నృత్యమందు లాస్య తాండవములు

| నాట్య | నృత్త | నృత్య |
|---|---|---|
| లాస్య— తాండవ | లాస్య— తాండవ | లాస్య— తాండవ |

భరతుడు నృత్తమునకు తాండవమునకు అభేదము చెప్పగా నందికేశ్వరుడు చెప్పిన నృత్తమునందు లాస్యము, తాండవము అను భేదము కలదని చెప్పెను. సుకుమారమైన లాస్యము, ఉద్ధతమైన తాండవము అని వాని లక్షణములు [illegible]

భావ ప్రకాశము నృత్తమునకన్న నృత్యమునకు అధిక ప్రాధాన్యమిచ్చినది నృత్యమును – నర్తనమును అభేదముగ పేర్కొనినది. "*నృత్త సహితమగు గీత ముండుట, వాద్యాదులతో కూడి యుండుట, గాత్రవిక్షేప ముండుట, నర్తనమని బుధులందురు*" అని నర్తనమే నృత్యమని వివరించెను.

"*నృత్ గాత్ర విక్షేపే*" అనుధాతువునుండి నిష్పన్నమైది నృత్యము. ఈ నృత్యమను నర్తనము – నాట్యమునందును నృత్తమునందును, లాస్య తాండవము లందును, కుండల్యాది విధానముల యందును సర్వసాధారణముగా. ఉపయోగించునది అగును 16 'అని చెప్పబడుచేనే నృత్యము నాట్య, నృత్త, లాస్య తాండవములయందు సామాన్య వాచకము అయినది

| నాట్యము | నృత్తము | లాస్యము | తాండవము |
|---|---|---|---|
| నృత్య | నృత్య | నృత్య | నృత్య |

తాండవ లక్షణ మిందు ప్రత్యేకముగ చెప్పబడినది లక్షణమును బట్టి చెప్పబడిన నృత్త లక్షణముతో ఏకీభవించుచున్నది. అయినను కొన్ని ప్రత్యేక భేదములు చెప్పబడినవి.

> " *తాండవ లక్షణ మిట్లుండును. ఇందు కరణములు, అంగ-హారములు ఉద్ధతముగ నుండును. గీత కాలమున ఆరభటీ వృత్తి యుండును. ఇట్టిది తాండవము. ఈ తాండవము చండ- తాండవమనీ,- ఉచ్చండ తాండవమని, ప్రచండ- తాండవమని మూడు విధములు. అనుద్ధతము చండము. ఉద్ధతముచ్చండము అత్యుద్ధతము ప్రచండము*" 17

తాండవము

| చండము | ఉచ్చండము | ప్రచండము |
|---|---|---|

లాస్యమును గూర్చియు కొన్ని విశేషములు తెలుపబడినవి లా ం డ వా నంతరము లాస్యము ప్రయుక్తము కావలెను లాస్యమునకు మంచలి అను వ్యవహారము కలదు. లలితాంగహారములు, లలితములగు, లయరీతులు ఇందుండును. గీతమునందు వృత్తి యుండును. అయా ప్రాంతముల గుణములను పలన సముప్ప

న్నమైన విశేషము లిందుండును నానా విధములగు లీలా విలాసాదులు, భావ దృష్టులు, మృదువులుగా నుండు చారీగతి విశేషములతో అరువది నాలుగు అంగ ముల కూడినయే లాస్యము — ఇది మన్మథ భావాశ్రియమని చెప్పబడినది 18

భావ ప్రకాశమున చెప్పినట్లు ఈ శివతాండవ కావ్యమున నృత్త, సహితగీతములు, మృదంగజతుల ప్రస్తారము, నాట్యశాస్త్రాంశముల విక్షేపము నున్నవి. కావున నృత్య లక్షణము కలిగినదీకావ్యము అని చెప్పవచ్చును నాట్యము అనగా అభినయము నందు, నృత్తము అనగా గాత్రవిక్షేపమునందు లాస్యమును సుకుమార కరణముల యందు, తాండవమును ఉద్ధత కరణముల యందు, నృత్యము ప్రయుక్తమై ఈ కావ్యమున అన్వయించినది. కావున భావప్రకాశకారుని నృత్యలక్షణమునకు లక్ష్య ముగ నున్న శివ తాండవ కావ్యమును శివనర్తన కావ్యమనవలెను.


కాని నృత్యము భావ ప్రధానమని దశరూపక కర్త చెప్పియున్నాడు అవస్థాను కృతి నాట్యమని, నృత్తము తాలలయాశ్రితమని, అతడు నిర్వచించెను 19 అనగా కేవలము తాళము ద్వారా పుట్టిన గతులకు అనుగుణముగ చలించెడి శరీరపు కదలి కలను నృత్తముగా దశరూపకకర్త పేర్కొనెను. మరియు **"ఇది నాట్యము కన్న అన్యమే"** అని వివరించెను. అనగా అభినయము కాదన్నమాట. ఇట్టి నృత్తములో నృత్యము అంతర్భవించునని భావప్రకాశమతము ఈ విరోధమునిట్లు పరిహరింప వచ్చును. భావప్రకాశ కారుడు మనసులో పుట్టిన వికారము భావమని నిర్వచించు కొని అట్టి భావమున కాశ్రయమైనది నృత్యమని భావించుకొని నృత్తమున అంత ర్భవించునని చెప్పియున్నాడనవచ్చును 20 ఎటువంటి వికారములేక తాళలయలకు శరీరము చలింపదు కదా.

కావున నృత్తమునందు నృత్యము, నృత్యమునందు నృత్తము, ఉండవచ్చును. అందులకే పుట్టపర్తి శివతాండవ కావ్యమున

"నృత్యంబు వెలయించి, నృత్తంబు ఝళిపించి
నృత్తనృత్యములను కలితముగ జూపించి''

అనిపలికించెను ధనంజయుడు నృత్యమును మార్గమనియు, నృత్తమును దేశి అనియు వింగడించెను. మధుర—ఉద్ధత భేదములచే నృత్త నృత్యములను రెండు

విధములుగ విభజించెను. ధనంజయుని నాట్య, నృత్య, నృత్త విభజన పట్టిక యిది.




అభినవగుప్తుడు ఈశ్వర ప్రవృత్తములగు ఏడు విధములగు నృత్తములను పేర్కొనెను.

1) **శుద్ధ నృత్తము:-** ఇది కేవలము రేచక అంగహారాత్మకమైనది
2) **గానక్రియామాత్ర అనుసారియగు నృత్తము :-** ఇందు గీతికి ప్రాధాన్యము ఆంగికాభినయము తదంగము మాత్రమే.
3) **వాద్యతాళాను సారియగు నృత్తము:-** ఇందు వాద్యతాళములకు అనుగుణముగ బహుళముగా చేయబడు ఆంగికాభినయముండును.
4) ఉద్ధత నృత్తము
5) సుకుమార నృత్తము
6) సుకుమార మిశ్రమగు నృత్తము
7) ఉద్ధత మిశ్రమగు నృత్తము [21]

నాట్యశాస్త్రముగుప్త భావప్రకాశిక సహితమగు తెనుగు అనువాదముల చివరి నాలుగు నృత్తభేదములలో అభినయముండునని చెప్పబడినది.[22] అభినయమున్నచో నృత్యముగాని, నాట్యముగాని, కావలసి వచ్చును. పూర్వలాక్షణికులు చెప్పిన నిర్వచనముల ప్రకారము ఉద్ధత నృత్తము అంగ విక్షేపాత్మకమేగాని అభినయ శూన్యము తరువాతి భేదములును అంతే. అభినవగుప్తుని విభజనలో నృత్తము సప్త విధముల వ్యవహారము కొరకు వింగడింపబడినది, స్థూలముగ నృత్తము అంగికాభినయము మాత్రమే.

అమరకోశమునందు తాండవము, నటనము, నాట్యము, లాస్యము, నృత్యము, నర్తనము, అని నర్తనభేదములన్నియు పర్యాయ పదములుగానే చెప్పబడినవి 23

అర్వాచీన శాస్త్రమయిన నృత్తరత్నావళి యందు *"భావముల నాశ్రయించినది, పదార్థముల నభినయించు స్వరూపము కలది నృత్యము"* 24 అని చెప్పబడినది ఈ లక్షణము దశరూపక నృత్యలక్షణమునకు సరిపోవుచున్నది నృత్తమును జాయపఇట్లు నిర్వచించెను.

> "పాట వాద్యములు మొదలగు వానితో కలసి, లయను మాత్ర
> మాశ్రయించి అభినయములేక అంగముల నాడించుట నృత్తము
> ఇది అభినయమునందలి కొరతను పరిపూర్చుటకు ప్రయుక్త
> మగునని ఆయాదేశీయుల ఇష్టానుసారముగ నడుచున్నది కనుక
> దేశి అని ప్రసిద్ధమైనది నృత్యనృత్తములు రెండును లాస్యతాండవ
> భేదముచే మరల రెండు విధములగును 25

| | |
|---|---|
| నృత్తము-(దేశి) | నృత్యము (మార్గ) |
| లాస్య-తాండవ | లాస్య-తాండవ |

కొందరు నాట్యశాస్త్రకర్తలు నృత్తములోని సుకుమార కరణములను లాస్యమని, ఉద్ధత కరణములను తాండవమని, వింగడించిరి లాస్యమునకు పార్వతియు, తాండవమునకు పరమశివుడును కర్తలని ప్రథమ ప్రదర్శకులు అనియు చెప్పుదురు. తెలుగుదేశమున నట్టువ మేళనర్తకులు నాట్యమేళ నర్తకులు కలరు వీరు లాస్య తాండవములకు వేరువిధముగ వ్యాఖ్యానము చేయుచున్నారు ***"కూర్చొని పదములు శ్లోకములు, పద్యములు, జావళీలు మొదలగు సంగీత రచనలకు ఆంగికాభినయము, సాత్వికాభినయము ప్రదర్శించుట లాస్యమనియు, నిలబడి తాళ లయలననుసరించి నృత్తమాడుట తాండవమనియు అందురు"*** 26 నట్టువ మేళములలో స్త్రీలు మాత్రమే యుందురు వీరే లాస్యతాండవములను ప్రదర్శింతురు.

నాట్యమేళ నర్తలు పురుషులు వీరిలాస్యమునందు కోమలములగు కరణములు, తాండవమునందు ఉద్ధత కరణములుండును. తాండవములోని ఒక పద్ధతికి చెందిన "పేరిణి" అను దేశి స్వరూపము గర్ఘర, విషము, భావాంశము, కవివారక, గీతాది అంగములతో కూడియుండును. లాస్యము సప్తవిధములని ప్రదర్శకులు చెప్పుచున్నారు. 1) శుద్ధ, 2) దేశి, 3) పేరిణి 4) ప్రేంఖణ, 5) దండలాస్య, 6) కుండలి, 7) కలశాదులు 27

భరతుని నుండి జాయప వరకు లక్షణకర్తలిచ్చిన నిర్వచనములు, ప్రచారకుల పద్ధతిని పరిశీలింపగా స్థూలముగ నృత్తనృత్యములలో భేదమున్నదికాని ప్రదర్శనము నందు ఏకత్వమును పొందుచున్నది. ఆధునిక కాలమున నృత్త నృత్యములలో నృత్యమనుపదమే బహుళ ప్రచారమందున్నది.

భావప్రకాశకారులు ఈనృత్యము సర్వరస సాధారణమని, తాండవ, లాస్య, నృత్త, నాట్యములందు సామాన్యవాచకమని చెప్పియుండిరి. కాని తాండవమునందు నృత్త, నృత్యాదులు అంగములుగా నుండు నట్లు ఎచ్చటను వివరింపబడలేదు. పుట్టపర్తి రచించిన ఈ కావ్యమునకు "**శివతాండవము**" అని పేరు పెట్టి అందు నృత్త, నృత్య, లాస్యాదులను వర్ణించెను శివుడనేకానేక భావములను, భంగిమలను కరణములను ఉద్ధతముగ, సుకుమారముగ ప్రదర్శించినట్లు వివరించెను

విశ్వస్వరూపమునకు సంకేతమైన శివుడు గతిరూపమున నటరాజుగా తాను నిరాలంబనమైన ఆకాశమునందు నాట్యమును ప్రదర్శించినపుడు నందీశ్వరుడు పీఠముగ ఆలంబనముగ రంగస్థలముగ నిలచెను

"నందీవృషో వృషాఙ్కస్య జగదాదే జగత్పతేః
నృత్యత కల్పనా యోగా జ్జగామాఖిల రంగతామ్
తస్యతద్భావ సమ్బద్ధా పూజా నాందీతి కథ్యతే"

అని మృచ్ఛకటిక నాటక వ్యాఖ్యానమున నాందిని గూర్చి వివరింపబడెను 28 తండు శబ్దమునుండి ఉత్పన్నమైన తాండవము ఈ అర్థమునే సమర్థించును. నాట్యశాస్త్రము అభినయదర్పణము నృత్త, నృత్య, నాట్యములలో తాండవ లాస్యము లంతర్భవించునని చెప్పినది, భావప్రకాశమననుసరించి, తాండవలాస్యములేగాక నాట్యము నృత్తముకూడా నృత్యము నుండియే ఉత్పన్నములైనవి, నాట్యోత్పత్తిని గూర్చి భరత నాట్యశాస్త్రము నృత్యభేదములకు శివుని తాండవమే ఉత్పత్తి స్థానముగా చెప్పియున్నది, ఈవిధముగా తాండవము-నృత్త నృత్య, నాట్యములకు హేతువు అగుటయేగాక వాని నుండి మరల ఉత్పన్నమైనదని చెప్పవచ్చును. ఇట్లు ఈ అభినయ విద్యకు మూలమైనది తాండవము దాని పరిపాకము కూడ తాండవమేనని చెప్పవచ్చును.

లాస్యతాండవములకు వస్తుత భేదములేకున్నను దానిలో ఉద్ధత సుకుమార లక్షణములే వానినివేరువేరుగా చూపుచున్నవి. ప్రవృత్తిచేత ఒకటియైన బ్రహ్మ తత్వము శివాశివులుగ ప్రకటితమైనట్లు లాస్యతాండవములు ఔద్ధత్య, సౌకుమార్య భేదమువలన రెండుగా దర్శింపబడుచున్నవి

కవిపుట్టపర్తి నారాయణాచార్యులు శాస్త్రార్ధమునధిగమించి తాండవమును ఈ విస్తృతార్ధముతోదనే తన శివ తాండవమున వర్ణించెను.

"సకల భువనంబు లాంగికముగాగ శంకరుడు
సకల వాఙ్మయము వాచికముగాగ మృడుండు
సకల నక్షత్రములు కలాపములుగాగ
సకలంబు తనచెదర సాత్వికంబునుగాగ
గణనచతుర్విధాభి నయమూర్తిరతిదేర్చి
తననాట్య గరిమంబు దనలోనే తావలచి
నృత్యంబు వెలయించి, నృత్తంబు ఝళిపించి
నృత్త నృత్యములు శబలితముగా జూపించి
లాస్య తాండవ భేద రచనాగతులు మీరి
వశ్యులై సర్వదిక్పాలకులు దరిజేర
ఆడెనమ్మా శివుడు
పాడెనమ్మా భవుడు"

## అధస్సూచికలు :

1) నాట్యశాస్త్రము 4వ అధ్యాయము-పేజి-17 డా॥ పోణంగి శ్రీరామ అప్పారావు
2) తండువు-నందికేశ్వరుడు ఒకడేయని మానవల్లి రామకృష్ణ కవి అభిప్రాయము
3) *"శంభుర్గౌరీ తథాబ్రహ్మ మాధవో నందికేశ్వరః"* అభినయ దర్పణము నందికేశ్వరుడు.
4) దైతేయం నాట్యశాలాయాం నర్తకో నటశేఖరః
తం విజేతుమయం నాట్యవినోదైః క్రమవేదిభిః
భవద్విరచితం గ్రంథం భరతార్ణవ మిచ్ఛతి — శ్లో॥ 6
— అభినయదర్పణము.

5) భావ ప్రకాశము - తృతీయాధ్యాయము - 19 నుండి 27 శ్లోకముల భావము.
శారదాతనయుడు-తెలుగు అనువాదం జమ్మల మడక మాధవరాయశర్మ

6) తాండవ లక్షణము-కుంభుడు—భరతకోశము—సంకలన కర్త
మానవల్లి రామకృష్ణ కవి.

7) చూడుడు—శిల్ప చిత్రముల పట్టిక
నటరాజ—ఇన్ ఆర్ట్, థాట్, అండ్ లిటరేచర్ —శివరామమూర్తి.

8) విజ్ఞాన సర్వస్వము—14వ సంపుటము—పేజి—14

9) విజ్ఞాన సర్వస్వము 14వ సంపుటము-"**తాంత్రిక మూర్తులు**"

10) దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర—పేజి 15 నటరాజ రామకృష్ణ.

11) "*డాన్స్ ఆఫ్ శివా*" ఆనందకుమారస్వామి

12) భావ ప్రకాశము—శ్లో॥ 78

13) నాట్యశాస్త్రము—పేజి 113

14) అభినయ దర్పణము—11, 12, 13 శ్లోకములు

15) భావప్రకాశము—నర్తన లక్షణము

16) భావ ప్రకాశము— ,,

17) భావ ప్రకాశము—తాండవ లక్షణము

18) భావ ప్రకాశము—లాస్యలక్షణము

19) దశరూపకము—ధనంజయుడు-తెలుగు అనువాదం సరిపెల్లి విశ్వనాథశాస్త్రి

20) "**వికారో మానసో భావః**" భావ ప్రకాశము

21) నాట్యశాస్త్రము—పేజి 77

22) నాట్యశాస్త్రము-పేజి 79

23) తాండవం, నటనం, నాట్యం, లాస్యం, నృత్యంచ, నర్తనే-అమరకోశము

24) నృత్తరత్నావళి-లాస్యతాండవ లక్షణము-పేజి 19
జాయప సేనాపతి—తెలుగు అనువాదం రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ

25) నృత్తరత్నావళి—లాస్యతాండవ లక్షణము—పేజి 19

26) దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర-పేజి 306 నటరాజ రామకృష్ణ

27) దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర పేజి-306 నటరాజ రామకృష్ణ

28) నాందీ వ్యాఖ్యానము—[illegible] [illegible]

# పూర్వసాహిత్యమున శివతాండవ ప్రసక్తి-ప్రశస్తి-వర్ణన

శివతాండవమును వర్ణించిన ఘట్టములు పూర్వసాహిత్యము నందు అచ్చట-చ్చట గలవు తాండవప్రసక్తి పురాణములందు కొన్నిచోట్ల కన్పించుచున్నది. శివుని నటరాజుగా స్తుతించిన ఘట్టములలో తాండవ వర్ణనమున్నది సంస్కృత సాహిత్యములో కావ్యారంభములయందు నటరాజు వర్ణన స్తుతిరూపములో కన్పించును తెలుగు సాహిత్యమున శివకవియుగములోని కవులు ప్రత్యేకముగా తాండవమును వర్ణించిరి యక్షగానములయందు నటరాజ వర్ణన శివపరమైన వాటిలో కన్పించును. ఆధునిక కాలమున నటరాజును తాత్త్వికముగా దర్శించిన కవులు గలరు

బృహత్‌స్తోత్ర రత్నాకరము నందు తాండవమును వర్ణించు రచనలు రెండు కలవు, అందు మొదటిది రావణుడు రచించినదని చెప్పబడుచున్న "*శివతాండవ స్తోత్రము*" ఇదియే తాండవ రచనలలోకెల్ల మొదటిదియని కొందరు చెప్పుచున్నారు ఆ ఐబటీ వృత్యను సారముగ సాగిన ఈరచన నటరాజనాట్య స్వరూపమును కన్నులకు కట్టినట్లు వర్ణించినది నాట్యభంగిమల విన్యాసముకన్న ఈరచనలో శివునియొక్క భక్తి పూర్వకమైనస్తుతియే అధికముగా చెప్పబడినది.

> జటా కటాహసంభ్రమ భ్రమన్నిలింప నిర్ఝరీ
> విలోల వీచి వల్లరీ విరాజమాన మూర్ధని
> ధగ ద్ధగ ద్ధగ జ్జ్వలల్లలాట పట్ట పావకే
> కిశోర చంద్రశేఖరే రతి ప్రతిక్షణం మమ

(బృహత్స్తోత్రరత్నాకరము—105)

జటాకటాహమున సంభ్రమముగా తిరుగాడుచున్న గంగయొక్క చంచలమగు వీచికలనెడి లతలతో విరాజిల్లుచున్న శిరము కలవాడు, లలాట పట్టమున ధగద్ధగితముగా ప్రజ్వరిల్లుచున్న అగ్నికలవాడు బాలచంద్రుని ధరించినవాడు అట్టి శివునియందు అనుక్షణము భక్తి వర్ధిల్లుచున్నదని పంచచామర వృత్తములలో తాండవ స్వరూపము స్తుతించబడినది రచనా విధానములో ఒక ప్రత్యేకమైన శైలి కల్గిన దశకంఠరావణ విరచితమైన ఈస్తోత్రము తరువాతి తాండవ రచనలకు ఒక విధముగ మార్గదర్శకముగా నున్నదనవచ్చును.

బృహస్తోత్ర రత్నాకరమునందు కన్పించు తాండవాష్టకము పతంజలి కృతము. ఈ రచన యంతయు నటరాజ స్వరూప వర్ణనమేగాని తాండవ భంగిమల వర్ణనముకాదు. కైశికీ వృత్తిలో సరళముగా సాగిన ఈ రచనలో త్రిపురాసుర సంహారము నాటి శివస్వరూపము విశేషముగా వర్ణింపబడినది. శివనాట్యమునకు విష్ణువు మద్దెల వాయించినట్లు తెలుపబడినది.

"అనంత నవరత్న విలసత్కటక కింకిణిఝులం, ఝులఝులం
ఝులరవం, ముకుంద విధిహస్తగత మద్దెల లయధ్వని
ధిమిద్ధిమిత నర్తన పదమ్ శకుంత రథ బర్హి రథనంది
ముఖ, దంతిముఖ బృంగిరిటి సంఘనికటం సునందసనక
ప్రముఖ వందిత పదం పరచిదంబర నటం హృదిభజ" 2

సాయం సంధ్యా తాండవమున నటక వర్గముతోకూడిన నటరాజు చిదంబరమున నృత్యము చేయువాని తన హృదయముతో భజించుచున్నానని వర్ణింపబడినది. ఈ తాండవాష్టకము నందన్నిటియందు *"పరచిదంబర నటం హృదిభజ"* అను మకుటముండుట విశేషము. రావణస్తోత్రమునందువలె శబ్దాడంబరముగాక మాధుర్య గుణముండుట ఈ స్తోత్రము నందలి రచనా విశేషముగా చెప్పవచ్చును.

స్కాంద పురాణమున కాంచీపుర మాహాత్మ్యము వర్ణించు సందర్భమున తాండవ ప్రసక్తి యున్నది. విష్ణువు శివతాండవమును దర్శించి ఆనంద పరవశత్వమున కంపింపగ, లక్ష్మి, శేషుడు, గరుడుడు కారణమేమని ప్రశ్నించిరి. విష్ణువు శివతాండవము దర్శించుట వలన శరీరము హర్షపులకాంకురమై కంపించెననియు, యోగులగు గూడ ఈ తాండవ దర్శనము దుర్లభమనియు చెప్పెను వారు తమను గూడ తాండవ దర్శనేచ్ఛకలదని తాండవదర్శనము చేయించుమని విష్ణుమూర్తిని ప్రార్థించిరి. వారి కోర్కెను దీర్చుటకై విష్ణువు చిదంబరమునందు నిత్యము ఆనంద తాండవముచేయు శివునిసన్నిధికి వారిని తీసుకొనివెళ్ళి ధ్యానయోగముకల్గి శంకరుని ప్రార్థింపగ ఆతడు ప్రత్యక్షమయ్యెను. వారు భక్తితో *"దేవ దేవః జగన్నాథ శంభూ తాండవ పండిత మీ నృత్తము మాడవలెనని మాకు కోరికకలదు"* అని తెలిపిరి. వారి ప్రార్థన విని శివుడు సర్వ్వదు కాంచన లింగమును ప్రతిష్ఠించి నన్ను అర్చించినచో నా ఆనంద తాండవము దర్శింపగల్గుదురని చెప్పెను అపుడు విష్ణువు ఏకామ్రనాథుని దక్షిణ భాగమున బంగారు లింగమును ప్రతిష్ఠించి వారితో పనిసి

పూజించెను శివుడు సంప్రీతుడై సపరివారముగా ఆనందతాండవము ప్రదర్శించెను. తాండవము దర్శించిన విష్ణువు సంతోషమున పటహ వాద్యము ప్రయోగించ మొదలు పెట్టెను. శివుడు సంతసించి ప్రతిదినము నృత్యకాలమున తమ సన్నిధిలో విష్ణువును పటహ వాద్యము ప్రయోగించవలసినదిగా ఆజ్ఞయిచ్చెను.

ఈ పురాణమునందే తృతీయోధ్యాయమున పార్వతీ పరమేశ్వర సంవాదము కలదు, పార్వతి జగత్పితవైన నీ గొప్ప క్షేత్రము తెలుపుమని ప్రార్థింపగా శివుడు చిదంబరము తన క్షేత్రములలో గొప్పదనియు నిత్యము తాను అచట నృత్యము చేయుటవలననే ఆ క్షేత్రమునకు గొప్పదనము కల్గెననియు వివరించెను. మరియు కాంచీపురమున వేశ్యలు దేవదాసీలు, చేటినటులు మొదలగు వారితో కలసి తాను వీధి ప్రదర్శనలు నిర్వహించుననియు తెలిపెను.

కాంచీ మహాత్మ్యమునందే శివుడు వీరాట్టహాసేశ్వరుడిగా చెప్పబడినాడు. ప్రళయకాలమున బ్రహ్మాండమంతయు తనలో లయము చేసికొని అమితమైన తేజస్సుతో శివుడు పరార్థ ద్వితీయ రాత్రులు నృత్యము సల్పి వెంటవెంట వీరాట్ట హాసము చేయునట. అందువలన శివునకు వీరాట్టహాసేశ్వరుడని పేరు కల్గినది. ఈ విధముగా స్కాంద పురాణమున కాంచీ మహాత్మ్యమునందు శివతాండవ ప్రసక్తి వర్ణనము కన్పించుచున్నది.[3]

శ్రీ శంకరాచార్యులు రచించిన **"శివానందలహరి"** స్తోత్రకావ్యమున 50వ శ్లోకమునుండి తాండవ వర్ణనమున్నది. సంధ్యాకాలమున శివుడు అతిశయించి తాండవము చేయునని (50 శ్లో) తనభక్తుడైన బృంగీశ్వరుని తాండవము చూడకోరిక కలదని(51 శ్లో) తాండవకర్తగా తాండవ ప్రియునిగా చెప్పబడినాడు.

నీలమేఘమును జూచి నెమళ్ళు నృత్యమాడినట్లు నీలకంధరునియెదుట ఆతని భక్తులు తన్మయత్వముతో నృత్యము చేయుదురట (52 శ్లో) తాత్పర్య ముగా శివుడు మేఘముగను, భక్తులు మయూరములుగను వర్ణింపబడిరి. తరువాత శ్లోకమున శివుడే మయూరములుగ వర్ణింపబడెను. తాండవ సమయమున నటరాజ స్వరూప వర్ణనముతో పోలియున్నట్లు యిచ్చట వర్ణింపబడినది. ఆకాశమును శిఖగా కల్గి శివుడు శిఖియైనాడు. పించము కల్గినెమలి కలాపియైనట్లు సర్పముల నా భూష ణములుగా కల్గిన శివుడు కలాపియైనాడు. వంగినవారికి నెమలి చిక్కినట్లు,మ్రొక్కిన వారికి శివుడనుగ్రహించును. క్రేంకార ధ్వనిచేయు నెమలి వలె ఓంకారము నుపదే శించు శివుని కేకియన వచ్చును. మయూరము పర్వతము మీది నల్లని కాంతి జూచి నాట్య మాడినట్లు, పర్వతరాజ పుత్రిక పార్వతిని జూచి శివుడు నాట్యమాడును. సంధ్యాసమయములలో దేవియెదుట నటరాజు అతిశయించి నాట్యము చేయునను విషయము ఇచ్చట అలంకారికముగా కవి వర్ణించెను (53 శ్లో)

ఇంతవరకు వర్ణింపబడిన శ్లోకములలో శివుడు తాండవమునకు తాండవ ప్రియునిగ తాండవ నటుడిగ వర్ణింపబడినాడు. పార్వతీ పరమేశ్వరులిద్దరు సంధ్యా సమయమున ఉజ్వలతాండవము చేయునట్లు తరువాతి శ్లోకమున వర్ణింపబడినది(54 శ్లో) మయూరములతో శివాశివులకు రూపకము కూర్చబడినది శివుడంబికతో కలిసి తాండవము చేయునపుడు విష్ణువు తనచేతిలో "తారక"మను దివ్య మృదంగము వాయించును దేవతలు మహా సంతోషముతో తాండవము దర్శించి ఆనంద బాష్పములు రాల్తురు. ఇట్టి నటరాజును నా హృదయములో వసింపుమని కవిప్రార్థించుట తరువాతి శ్లోకములలో చూడవచ్చును 4

వ్యాకరణ సూత్రములు నటరాజు ప్రయోగించిన ఢమరుక నాదము నుండి పుట్టినవని వ్యాకరణ సంప్రదాయము అవియే మాహేశ్వర సూత్రములని వ్యవహరింపబడుచున్నవి పాణినీయ వ్యాకరణ గ్రంధ వ్యాఖ్యానమున ఈ వివరణకలదు 5

భరత నాట్యశాస్త్రమున "*మహాచారి*" లక్షణమును వివరించు సందర్భమున తాండవము వర్ణింప బడినది, ప్రళయాంతమున హరుడుచేసిన తాండవనృత్యమునకు పర్వతములు పడిపోయినవి, సమస్తభూతములకు ఆవాసమైన సముద్రమంతయు క్షుభితమైనది ఇట్టి భయంకర నృత్యము జగత్తును రక్షించుగాక యని ఆశీస్సు ప్రకటింపబడినది 6

ఈ భావమునే విపులముగా వర్ణించి ఆతాండవమునకు "*దుఃఖతాండవమని*" విశాఖదత్తుడు పేరుపెట్టెను ముద్రారాక్షస నాటకమున మంగళశ్లోకములలో హరుని దుఃఖతాండవము వర్ణించెను అతికష్టముగ నృత్యము చేయుటయే దుఃఖతాండవము సాయం సంధ్యాకాలమున నృత్యము చేసెడి నటరాజునకు వేయి చేతులుండునట వేగముగ నృత్యము చేయుటలో, తన చేతులను వేగముగా కదిలించుటలో ఈ భూమి కృంగి పోవునేమోయని, ముల్లోకములు చెదిరిపోవునేమో యని, మూడవ కంటిని తెరిచినచో దానికి గురియైన దంతయు మాడి పోవునేమో యని హరుడు తన అవయవములను విస్తరింపజేయక, నృత్యమున అట్టుముకులించు కొని యుండలేక బాధపడినట్లు వర్ణింపబడినది. అట్టి హర తాండవము సామాజికులను రక్షించునని కవి ఆశించెను 7

కాళిదాసు రచించిన కావ్యములలో తాండవ ప్రసక్తియున్నది కుమార సంభవమున పార్వతి కపట బ్రహ్మచారితో "*దివసావసాన కాలమున నృత్యము*

చేసెడి పరమశివుని మేని నుండి జారిపడిన భస్మరేణువులను దేవతలు తలపై దాల్చుటకు అహమహమికతో పరుగులిడుదురు." అని సమాధానము చెప్పినది. ఈ ప్రత్యుత్తరమున శివుని సంధ్యాతాండవము సూచింపబడినది 8 మేఘదూతమున కవి నటరాజ తాండవమును స్పష్టముగా పేర్కొనెను సాయంకాలపూజానంతరము శివుడు తాండవమాడును ఆ శివుని చేతులపై సంధ్యారాగముగల మేఘము వ్రాలిన గజ చర్మమువలె అందముగా నుండునని ఉత్ప్రేక్షించెను రక్తాంకిత గజాసుర చర్మముజూచి భయపడిన అంబిక సంధ్యారాగముగల మేఘమును వేడుకగా జూచుననియు, ఆ విధముగ పార్వతీ పరమేశ్వరుల అనుగ్రహమునకు పాత్రుడవు కమ్మని మేఘమును సంబోధించెను.9

శివానందలహరిలో శివుడు మయూరముగ వర్ణింపబడినట్లు దశరూపక లక్షణ శాస్త్రమున మంగళ శ్లోకములలో శివతాండవము మయూరనృత్తముతో పోల్చబడెను మయూర నృత్యమునకు మేఘధ్వని మద్దెలయైనట్లు, శివ నృత్యమునకు వినాయక బృంహితము మద్దెల ధ్వనిగా చెప్పబడినది 10

తెలుగు కావ్యములలో నన్నెచోడ కవి రచించిన కుమార సంభవ కావ్యమున ద్వితీయాశ్వాసము చివర శివతాండవస్తుతి కలదు. ఈ శివస్తవమున ఐదు వృత్తములున్నవి వాటిలో మూడు లయగ్రాహులు, రెండు లయ విహారిణులు. మొదటి పద్యమునందు తాండవమిట్లు వర్ణింపబడినది "నృత్యలోలుడైన శివుడు కంఠాభరణము ధరించి, చేత శూలము పట్టి ఉజ్వల కపాల మాల ధరించి, అసురులకు భయానకమగు ఫాలనయనాగ్ని జ్వాలలు వ్యాపించునట్లు పింగళ జటావళులు తిరుగాడునట్లు దీర్ఘములైన వ్యాళ సమూహములు ఆకాశమున వెలి దిరిగినట్లు, విశాల బాహువులు సాచి నృత్యమొనర్చెను." ఈ పద్యమున నటరాజ ఉచ్చండ తాండవము వర్ణింపబడెను ఇది లయభావమును సూచించునని వ్యాఖ్యాతలనిరి

రెండవ పద్యమున నటరాజు ప్రచండ తాండవ వర్ణనమున్నది భూమి కంపించునట్లు, కులపర్వతసమూహములు అదరునట్లు, సముద్రములోని బడబాగ్ని పైకెగయునట్లు, సురలు, నాగులు, అష్టదిక్పాలకులు, యమ వరుణ, కుబేరుల గర్వము అణగునట్లు శివుడు నృత్యమొనర్చెను ఈ నృత్యమును జూచి సర్వగుణ ముల్లోకములు, భూతములు, పెద్దగా ధ్వనిచేసిరి. సర్పభూషణములు తనువునుండి

జారిపడినవి. దిశలలో వేంచేసియున్న గంధర్వుల మొగములు వాడినవి. ఇట్టి అపూర్వనటనమును ప్రదర్శించిన ఆదిగురువైన, సర్వగతుడైన, సర్వమయుడైన, శంభుడు రెండవ పద్యమున నుతించబడెను.

మొదటి రెండు పద్యములలో ప్రచండ తాండవము వర్ణించి మూడవ పద్యమున సుఖశ్రీల సంధ్యా తాండవముచేయుచు తన్మయత్వము పొందిన నటరాజును కవి చిత్రించెను. తాళగీత వాద్యములు రసవంతమై కలిసిన శ్రావ్య నాదమునకను గుణముగ, ఎత్తుగ నెగురుచు, చేతితో జరులిచ్చుచు, దయానురాగముల నభినయించుచు, తన్మయత్వమున మునుగుచు, మేనుమరచి పరుగెత్తుచు నేత్ర భ్రూచాలనములు ప్రదర్శించు నటరాజు స్మశానమున సంధ్యాదేవితో కలసి అనుకూలముగ నాట్యము చేసినట్లు వర్ణింపబడినది.

తొలకరి వర్షముతో శివనృత్యమును పోల్చుట నాల్గవ పద్యమందున్నది నల్లని కంఠము మేఘమువలె, తాళగతితో కలసి చెంగుచెంగున ఎగురుచున్న అడుగులు ఉరుములై అర్ధ చంద్రునితో కూడిన శరీరకాంతులు మెరుపులై, తలపైనున్న సురనది చినుకులను రాల్చగా శివుడు తొలకరిజల్లువలె నృత్యమాడెను. ఇట్టిలాలిత్య నృత్యము చేసిన నటరాజు కోరినకోర్కెలు తీర్చునని కవి ఆశించెను. చివరిపద్యమున నటరాజు కల్పవృక్షముతో పోల్చబడెను. వృక్షశాఖలవంటి విశాలమైన బాహువులు, చిగురు టాకులవంటి అరచేతులు, పుష్పసమూహమువంటి వ్రేళ్ళుకలిగి కల్పవృక్ష సదృశుడైన శివుడు బ్రహ్మాది దేవతలకు వరఫలంబుల నొసంగునని కవిస్తుతించెను.

దక్షుడు పునర్జీవితుడై చేసిన ఈ స్తోత్రముతో నటరాజ ప్రచండ తాండవము తొలకరిజల్లుతో పోల్చబడిన నటరాజ నృత్యము, కల్పవృక్ష సాదృశ్యము అపూర్వముగ నున్నది. 11

శివకవి యుగములో విఖ్యాతుడైన పాల్కురికి సోమనాథుడు రచించిన బసవపురాణ, పండితారాధ్య చరిత్రలలో శివతాండవ విన్యాసము వర్ణింపబడి యున్నది శైవమతప్రాశస్త్యము నుగ్గడించు ఈద్విపద గ్రంథములలో శివతాండవ మొక ప్రత్యేక పద్ధతిలో రచింపబడినది బసవపురాణము నందున్నది తాండవమని పండితారాధ్య చరిత్రములోనిది మహాతాండవమని పేర్కొనబడెను బసవపురాణమున తనభక్తుడైన నాట్యనమిత్తండికి శివుడే స్వయముగా తాండవరూపమును వివరించుట విశేషము.

శివభక్తుడైన నాట్యమిత్తండి నటరాజమూర్తి నిజూచి,

'తనువువేరొండు చందంబైనది
వెండివంకలు బోయి వెడరూపుగాగ
నొండేమి? ఇదిరోగమా, సహజమా!'

అని సందేహపడినాడు. శివుడు **"ఇది తాండవాకారము ఎట్టులంటేని"** అని తాండవ స్వరూపమును వివరించెను

" నేను ప్రమథులు సూడగా తాండవ మాడుదును. సంతోషముతో తాండవాభిముఖుడనై హోయని డమరుకము ప్రయోగింపగా స్వరములన్నియు ఆడమరుక స్థలముసందేలయించును నాచరణ విన్యాసమున నక్షత్ర పంక్తులుడుల్లును మహోద్రేకమైన వీక్షణమువలన అజాదిముఖ్యులు అణగిపోదురు. నాకాలిమువ్వల గంటల మ్రోతలకు భయపడి తేలియున్న నగముకూడ నాలోకలసిపోవును. ఉద్ధతమైన సంతాపసమువలన విస్తరి ఆపలకు జనును వేగముగావచ్చు ఉచ్ఛ్వాస నిశ్వాసల వలన బడబానలము ఆరిపోవును. జలనిధులింకిపోవును. పాదఘట్టనలచేత ధాత్రీతలం చూర్ణమగును వేగముగా తిరుగుటచేత దిగ్గజములు వణకిపోవును కులగిరుల్పొడి పొడి యగును పాదాగ్రములచే నటించుచుండగా క్రిందికూర్మము గజిబిజియగును. గొప్పవైన జడవిసురులచే బ్రహ్మాండము పగిలిపోవును. ఉద్ధతమైన తాండవము సహింపలేక ఫణీంద్రుడు పూత్కరించును. ఫణీంద్రుని ఊర్పులకు ఫాలనేత్రాగ్ని ప్రజ్వరిల్లును వేగముగ ఎగసిపడు కంటిమంటలకు చంద్రుడు కరిగి అమృతము వర్షించును ఆధారము కపాలమాలపై ప్రవహించగా జీవమ్ము పొంది అచ్యుతాది దేవతలు బొబ్బలుపెట్టుచు రాగతాళధ్వనులతోనన్ను శరణువేడుదురు''12

ఈ విధముగా బసవపురాణమున వర్ణింపబడిన శివతాండవమున ఒకక్రమము పాటించినట్లు కన్పించుచున్నది మొదటగాస్థితి, స్థితినుండి లయము, లయమునుండి మరల సృష్టి—ఈ విధముగా సృష్టి, స్థితి, లయములను ఈ తాండవ విన్యాసమున సంక్షేపించెను.

పండితారాధ్య చరిత్రయందు వర్ణింపబడినది **"మహాతాండవలీల"** ఈ వర్ణనలో ప్రసిద్ధమైన సప్తతాండవములగూర్చిగాక, ఆయా సందర్భములయందు శివుడు ఆనందోద్రేకములతో చేసిన తాండవములను కవి పేర్కొనెను అవి

1) గజాసుర సంహార తాండవము
2) అంధకాసుర సంహార తాండవము
3) మునులు సృష్టించిన సర్పమును బట్టిననాటి తాండవము
4) వ్యాఘ్రపాదుని కరుణించిన నాటి తాండవము
5) భక్తుడైన గుండయ్య కుంభవాద్యజతులకు నాదిననాటి తాండవము
6) చేమ చక్రవర్తి వాద్యమునకు పూజావేళయందాడిన తాండవము

ఇవియేగాక బూడిదయైన బ్రహ్మాండపు భస్మమును సర్వాంగములయందు పూసికొని భరతోక్తి ప్రకారముగ మహాతాండవలీల ప్రదర్శించెను వసుధలో వర్ణింపని అనేక వర్ణన్లు ప్రదర్శించుచు రసికులు సంతృప్తిపొందు అనేకరసభావమ్ము లూరించుచు, కవులూహింపని అనేకాలంకారముల జూపుచు, సంగీతకర్తలకు తెలియని అనేక రాగములపాడుచు, నవ్యమైన అనేక నటనల ప్రదర్శించుచు, అంతకంతకు శివుడు విజృంభించియాడెను మహావేగవంతమైన ఆతాండవ విన్యాసమున పాదఘట్టనలు తప్పచరణములు కానరాకుండెను కరతల గతుల ధ్వనులు తప్ప కరములు కానరాలేదు. జటాసముద్భటారావములు తప్ప జడలు కన్పించుటలేదు మకుట కోటీర కాంతులు తప్ప మకుట శిఖరము అప్రమాణమై కానరాకుండెను.13

పై విధముగా వర్ణింపబడిన మహాతాండవలీలలో నటరాజు సగుణస్వరూపము- చరాచర విశ్వముతో తాదాత్మ్యము పొంది సృష్టి, స్థితి, లయములతో నిరంతర స్పందన పొందుచున్న ఈ బ్రహ్మాండముతోడి అభేదము తెలుపుచున్నది. పాల్కురికి సోమనాధుడు వర్ణించిన మహాతాండవములద్వారా నటరాజ తత్వమును ఆవిష్కరించినాడనవచ్చును.

ప్రబంధపూర్వయుగమున ప్రసిద్ధుడైన శ్రీనాధుడు పెక్కుపురాణములకు కావ్యత్వము కల్పించెను. ఆయన రచనలు శివపరమైనవి. అందువలన ...రా. తాండవ ప్రసక్తి తప్పక కనిపించుచున్నది.

హరవిలాసమున షష్ఠాశ్వాసములో బ్రహ్మవిష్ణువులు శివునిట్లుస్తుతించిరి.

" దివసావసాన సంధ్యా
నవపరమానంద నందినాందీ నాధ
వ్యవహార ఝుంక్రియావధి
వివిధ మహాతాండవైక విద్యాధిరతా "_35

ఈస్తుతిలో సంధ్యాతాండవము పేర్కొనబడినది తాండవమున నంది నాందీగీతము నాలపించుటకూడా చెప్పబడినది

సప్తమాశ్వాసమున అర్జునుని తపస్సు వర్ణించబడెను అర్జునుడు పాశుపతాస్త్రము కొరకు శివుని గూర్చి త్రిసంధ్యలనుపాసించెను సాయంసంధ్యాసమయమున పరమేశ్వరోపాసనను వర్ణించుచు *"సాయంకాలము పూజసేయు నభవున్ సంధ్యానటుం ధూర్జటిన్"*(34) అని కవి పరమేశ్వరుని సంధ్యానటునిగ చెప్పినాడు.14

భీమేశ్వరపురాణమున ద్వితీయాశ్వాసమున సంధ్యాకాలమును శివ స్వరూపముతో ఉపమించిన వర్ణనమున్నది ఆకాశమున వ్యాపించిన సంధ్యారాగ రేఖలు నటరాజ ఉద్ధత నాట్యమున వ్యాపించిన దీర్ఘ జడలవలె నున్నవట తృతీయాశ్వాసమున భీమేశ్వరము నాట్యశాలయని *"మధ్యాహ్న భోగవేళ నృత్యజగఝుంకృత మృదంగ స్వనము"* వినిపించుననని తెలుపబడినది. ఈ వివరణలో నటరాజు మధ్యాహ్నము కూడా నృత్యముచేయునని చెప్పుట విశేషము వ్యాసమహర్షి శివునినుతించుచు తానే అపర శివునివలె నర్తించెనని కలదు చతుర్థాశ్వాసమున త్రిపురాసుర సంహార సమయమున శివుడు కటకాముఖ హస్తముతో కొండవిల్లు పట్టెనట హస్తభేదములలో అసంయుత హస్తములందు కటకాముఖము నాట్య శాస్త్రమునందున్నది చూపుడు వేలును అనామికనువంచి మొగ్గవలె పట్టుట కాటకాముఖ లక్షణము శివుడు కొండవిల్లును కటకాముఖ హస్తముతో పట్టి త్రిపురసంహారము గావించెను అనంతరము ప్రమోదాతిశయంబున తాండవము చేసెను ఈ తాండవమూర్తి బ్రహ్మ విష్ణు మహేంద్రాదులచే నమస్కరింప బడినాదని భీమేశ్వరపురాణమున వర్ణింప బడియున్నది తాండవమూర్తి స్వరూపమిది,

> ''ఆడెం తాండవ మూర్జటి పటహ కోలాటోప విస్ఫూర్జిత
> క్రీడాదంబర ముల్లసిల్ల గరళ గ్రీవుండు జూటాటవీ
> క్రోడా ఘూట కరోట కోటర కుటీ కోటీ లురద్బిందువీ
> చీదోలా పటలీ పరిస్ఫుట తరస్ఫీత ధ్వని ప్రౌఢిమన్''15

పోతన కూడా భాగవత పురాణ ప్రారంభమునందు,

*''వాలిన భక్తి మ్రొక్కెద న వారిత తాండవకేళికిన్-దయాశాలికి శూలికిన్"* (ఆంధ్ర భాగవతము 2) అని శివుని తాండవకేళిలోలునిగా స్మరించెను.

జాయపసేనాని రచించిన "నృత్తరత్నావళి" అను నృత్త శాస్త్రములో అర్ధనారీశ్వర నాట్యమూర్తిని వర్ణించెను వామభాగము లాస్యము, కుడి భాగము తాండవము ప్రదర్శించెడి ఆ నాట్య శివమూర్తియొక్క ఏకాగ్రదృష్టి సామాజికులను దీవించవలెనని కవి ఆశీస్సు ప్రకటించెను. కుడి ఎడమ భాగముల ఐక్యతయే స్థితిహేతువని కవిభావన.16

శతక వాఙ్మయమున శివస్తుతులనేకములు కలవు. కుక్కుటేశ్వర శతకములోని ఒక పద్యమున సంధ్యా తాండవ పరివారమును కవి వర్ణించెను.

పలుకు కొమ్రొన్నన బోడి కులుకు వీణియ మీటి
వేయి కన్నుల వేల్పు వేణువూద
గలుకుల తొగకంటి చెలగి గానము సేయ
నలువ కైతాః మింపలర వేయ
మధు దైత్యమదనుండు మద్దెల వాయింప
సకల పారిషదు లెచ్చరిక సేయ
నంది భృంగీశులందంద సందడి దీర్ప
మొనసి దేవతలెల్ల మ్రొక్కి కొలువ
సంతసము మీరకేరి సాయంతనమును
తాండవం బాడు నీ హొయల్ దలప వశమె
భూసుత వికాస పీఠికాపుర నివాస
కుముద హితకోటి సంకాశ కుక్కుటేశ (11)

ఇందు తాండవ హొయలు వర్ణింపబడకున్నను, తత్ పరివార క్రియాకలాపము వివరింపబడినది. ఈ పరివార సమేతమైన తాండవము సంధ్యాతాండవముగ కవి వర్ణించెను.17

ఉదాహరణ వాఙ్మయముకూడ స్తుతి రూపకమే సర్వలక్షణ సంపూర్ణమైన త్రిపురాంతకోదాహరణమున ఒక ఉత్కళికలో శివనటనము వర్ణింప బడెను ***"ఆది నాథుడైన శివుడు బాలుని వలె క్రీడలాడగ శిరము నందలి*** సెలయేరు ***జడలనుండి పారి ఒడలు తడిపినదట"*** శివోదాహరణమునందు షష్ఠీ విభక్తిని గూర్చి చెప్పెడి పద్యమున సంధ్యాతాండవమునకు సహాయపమైన నృత్య పరివారము వర్ణింపబడెను 18

ఉదాహరణములందు కొంతగానాను కూలత యున్ననూ, యక్షగానము లందున్న వైపుల్యముకన్న తక్కువ. గానమునకు, నటనమునకు యక్ష గానములందవకాశమెక్కువ. నాయక రాజుల కాలమున యక్షగానములు అధికముగా రచింపబడినవి. వీనిలో శివకథా పరములైన యక్షగానములయందు నటరాజు వర్ణింపబడెను తెలుగు సాహిత్యమున శివకవుల తరువాత నటరాజ నృత్యమును విశేషముగా వర్ణించినది యక్షగానకవులె. సంగీత నాట్య సమ్మేళనంతో కూడిన ప్రక్రియ యక్షగానము కనుక శివనృత్యమున అభినయముకందె తాళలయాను కూలమైన గతులుదరువులతో వివరింపబడినవి. శివుడు రంగస్థలమున ప్రవేశించు-టకు ముందు పరాకు గీతములు ఆలపించబడి తరువాత నృత్యాభినయము వర్ణించ బడినది.

శివకాను సుందరీ పరిణయమను యక్షగానమున, బాలచంద్రుడు శిరమున పదలుచుండగా శరీరమున విభూతిపూత మెరయుచుండగా హొయలు జూపుచు నటరాజు వెడలి ***" తకిట ధికిటం తోం, గిణాంగిణ "*** అనుచు మద్దెల వరుసల కనుకూలముగా నృత్యము చేసినట్లున్నది.

అన్నపూర్ణా పరిణయమున ఋషులు బ్రహ్మకుబేరాది దేవతలు శివుని నటేశునిగా స్తుతించిరి, చంద్రశేఖర విలాసమున నటరాజు కిన్నెరలు మీటుచు, పాటపాడుచు నృత్యము చేసినట్లున్నది. షాహజీ రచించిన యక్షగానములలో సంస్కృత భాషలో వృత్తములలో ఉచ్చండమైన శివనాట్యము ప్రస్తుతింపబడినది. అవే వృత్తములు షాహజీ నాటకములలో అనేక ఇతర సందర్భములలో కన్పించుచున్నవి గంగా పార్వతీ సంవాదమున శివుడు అర్ధనారీశ్వర వేషముతో కుడి భాగము తాండవము వామ భాగము లాస్యము చేసినట్లు వర్ణించబడినది. పంచరత్న ప్రబంధమున నటరాజైన శివుని ముందు నటవరులు నృత్యము చేసి ఆయనమెప్పును పొందినట్లు చెప్పబడినది. ఈ విధముగ యక్షగానములలో శివుడు నటరాజుగా వర్ణింపబడి స్తుతించబడినాడు.19

ఆధునిక కాలమున కృష్ణశాస్త్రి రచించిన కృష్ణపక్షము అనుఖండ కావ్యమ చివర గీత పద్యములు నటరాజు దర్శనమునకు సంబంధించినవి కవి ప్రతిదివ సాంత మందు నటరాజు చేయు నృత్యకేళిని స్మరించెను. ఊహాంచలమున్న అతి రంజింపి పొరలు అమృత రసమాధురులలో మునిగిపోయి నటరాజు సాక్షాత్కరించి

నాట్య మొనర్చెను. తన జీవన శుష్కమార్గమున నటరాజ పాద మంజీరధ్వనులు రసావిష్కరణ మొనరింపగని ప్రశస్తగించెను. నటరాజ దర్శనమగునంతవరకు అతని పరిజీవనటనము సాగింపనని వంగ్యంగముగ నటరాజ తత్వము వ్యాఖ్యానించెను 20 ఆధునిక సంస్కృత రచనలలో శివతాండవమును రమ్యముగా శ్రీ భాష్యం విజయసారధి రచించిరి 21 శివతాండవము ననుసరించి కృష్ణతాండవం, మదన తాండవము, నరసింహ తాండవము మొదలైన రచనలనేకములు వచ్చినవి.

## శివతాండవమును వర్ణించిన గ్రంథములు

1) *శివతాండవస్తోత్రమ్* — దశకంఠ రావణకృతము
బృహస్తోత్ర రత్నాకరము, పేజీ—105

2) *తాండవాష్టకము* — పతంజలి కృతము

3) *కాంచీపురమాహాత్మ్యము*— స్కాంద పురాణము

4) *శివానందలహరి* — 50 నుండి 54 శ్లోకములలో,
— శ్రీ శంకరాచార్యులు

5) *లఘుసిద్ధాంతకౌముదీ* — తెలుగు వ్యాఖ్యానము—పేజీ—1
పుల్లెల శ్రీరామచంద్రుడు

6) *నాట్యశాస్త్రము* — వ్యాఖ్యానము మహాచారీ లక్షణము.
డా॥ పోణంగి శ్రీరామఅప్పారావు

7) *ముద్రారాక్షసమ్* — (నాటకమ్) నాందీ శ్లోకములు.
విశాఖదత్తుడు.

8) *కుమార సంభవము* — తెలుగు అనువాదము—మల్లంపల్లి శరభయ్య.
మూలము—కాళిదాసు.

9) *మేఘదూతము* శ్లోకము 40, కాళిదాసు.

10) *దశరూపకము*— ధనంజయుడు, మంగళ శ్లోకము.
తెలుగు అనువాదము— సరిపెల్ల విశ్వనాథశాస్త్రి

11) కుమార సంభవము — ద్వితీయాశ్వాసము చివరి పద్యములు,
నన్నెచోడ కవి.

12) బసవపురాణము — పేజి— 174
పాల్కురికి సోమనాథుడు

13) పండితారాధ్య చరిత్ర- " మహా శాంభవలీల "
పాల్కురికి సోమనాదుడు

14) హర విలాసము— షష్ఠ, సప్తమాశ్వాసములు
శ్రీనాధుడు

15) భీమేశ్వర పురాణము- ద్వితీయ, తృతీయ, చతుర్థా శ్వాసములు
శ్రీనాధుడు

16) నృత్త రత్నావళి— జాయపసేనాని — నాందీ శ్లోకము

17) కుక్కుటేశ్వర శతకము- 11వ పద్యము
త్రిపురాంత కోదాహరణము, శివోదాహరణము,

18) ఉదాహరణ వాఙ్మయ చరిత్ర— నిడదవోలు వెంకటరావు.

19) శివకామ సుందరీ పరిణయము,
అన్నపూర్ణా పరిణయము,
చంద్రశేఖర విలాసము,
గంగా పార్వతీ సంవాదము

తంజాపూరి యక్షగానము— సంపుటములు— 8,9,10,
ఆంధ్ర విశ్వవిద్యాలయ — ప్రకటనము

20) కృష్ణ పక్షము— కృష్ణశాస్త్రి

21) శివతాండవమ్— (సంస్కృతము) శ్రీ భాష్యం విజయసారధి.

# కావ్యస్వరూపము-నిర్వహణము

కావ్యము శ్రవ్యకావ్యమనియు, దృశ్యకావ్యమనియు రెండు విధములు శ్రవ్య కావ్యమునందు దృశ్యకావ్య లక్షణములు, దృశ్యకావ్యము నందు శ్రవ్యకావ్య లక్షణ ములు సాధారణముగా సంయోజనము పొందుచుండును. ఈ శివతాండవ కావ్యము శ్రవ్యదృశ్య కావ్యలక్షణములు సంయోజింపబడి రచింపబడినది. స్వరప్రధానమైన సంగీతము ప్రాణముగ, అక్షర ప్రధానమైన సాహిత్యము రూపముగ అభినయమును ఈకావ్యము అనేక విధముల ఉల్లేఖించినది

ఆధునిక కాలమున నవ్యకవిత్వమునందు ఖండకావ్యములు వివిధభావ కథాంశ ములతో, విచిత్ర సంవిధానముతో అనేకములు వచ్చినవి. దైవపరముగ భక్తి మార్గ మున వర్ణనాత్మకముగ సాగివచ్చిన రచనలలో వేంకట పార్వతీశ్వరులు రచించిన "*ఏకాంత సేవ*" మొదటగా చెప్పవచ్చును "*ఏకాంత సేవలో*" మధుర భక్తి భావనలు నవ్యముగా చెప్పబడినవి. భక్తుడు ప్రియురాలుగను భగవంతుడు ప్రియు డుగను భావింపబడి ఆత్మ పరమాత్మ తత్వములు వ్యాఖ్యానించబడినవి. భావకవి తాయుగములో పుట్టిన ఏకాంత సేవ భావనలో రచనలో ప్రత్యేకత ప్రదర్శించినది.

భావకవితాయుగము తరువాత శివతాండవము రచింపబడినను ఈ కావ్యముపై భావకవిత్వ ప్రభావము లేకపోలేదు. రచనావిధానమున, నవ్యభావనా విన్యాసమున ఈ ప్రభావము స్పష్టముగా గమనింపవచ్చు, శివతాండవము కూడా పరమాత్మ తత్వ మును వ్యాఖ్యానించిన లఘు కావ్యము భక్తి మార్గమున సాగివచ్చిన భావధార. ఏకాంతసేవ-శివతాండవము రెండును తాల్వీర కావ్యములే. స్వరూప స్వభావములలో ఈరెండు కావ్యములకు కొంత సామ్యము కలదు.

| ***ఏకాంత సేవ*** | | ***శివతాండవము*** |
|---|---|---|
| నాంది | | నాంది |
| దేశిచ్ఛందము-గీతపద్యములు | — | దేశిచ్ఛందము-రగడలు |
| భావవిన్యాసము | — | భావవిన్యాసము |
| నిరూప వర్ణనము | — | రూపవర్ణనము |
| భక్తి-సమర్పణ | — | భక్తి-అద్భుతభావము |

ప్రకృతిలో పరమాత్మను దర్శించుట — ప్రకృతి పరమాత్మ దర్శనమునకు
ఉన్ముఖముగుట-ప్రకృతిలోని
పరమాత్మ తాండవమును దర్శించుట

ఏకాంకాంత సేవను గూర్చి నూతన ఆంధ్ర సారస్వతమున యిటువంటి గేయకృతి మరియొకటిలేదని కృష్ణశాస్త్రి అభిప్రాయము 1 ఆధునిక సారస్వతమున శివతాండవమువంటి గేయకృతిమరియొకటిలేదని స్వామి శివశంకరశాస్త్రి అభిప్రాయము.2 ఇట్లీరెండు కావ్యములు తెనుగు సాహిత్యమున విశిష్టతను సంతరించుకొన్నవి.

నవ్యసాహిత్యమున వస్త్వాశ్రియమైన వర్ణనాత్మక కావ్యములలో విశ్వనాథ కిన్నెరసాని పాటలు సంగీత లక్షణము కలవి. కిన్నెరసాని పాటల సంస్కారము కవి అవచేతనలో గూఢముగా నుండి శివతాండవకావ్య రచనమునకు ప్రేరణనిచ్చి యుండవచ్చును.3 కిన్నెరసాని పాటలకు స్వరూప స్వభావముల యందు కొంత సారూప్యముకలదు.

| *కిన్నెరసాని పాటలు* | *శివతాండవము* |
|---|---|
| దేశిచ్ఛందము-ఖండగతిలో సాగినవి | దేశిచ్ఛందము-ఖండగతిలోసాగినది. |
| కావ్యవస్తువునకు వర్ణన అంగము | వర్ణనా బాహుళ్యమున్నను వస్తువునకు కూడ ప్రాధాన్యమున్నది. |
| లయబద్ధమైన రచనముద్వార ప్రకృతి మానవీకరించబడినది | విశ్వచైతన్యము దివ్యరూపమున ప్రకటింపబడినది. |
| సంగీత నాట్యాంశములు అప్రధానములు | సంగీతనాట్యాంశములు ప్రధానములై విస్తరింపబడినవి. |

ఈవిధముగా నవ్యసాహిత్యములో వచ్చిన వర్ణనాత్మక కావ్యముల ప్రేరణయేగాక, తాళలయలు-అభినయము ప్రధానముగాగల ఉదాహరణ యక్షగాన లక్షణములు ఈకావ్యమునందు అంతర్భవించినవి. భావకవిత్వరచనా పద్ధతియేగాక, ప్రాబంధిక రచనా ధోరణి కూడ శివతాండవకావ్యమున కన్పించుచున్నది.

స్వరప్రాధాన్యము కలిగిన తాళలయాన్వితములగు సూక్తములు వేదముల యందున్నవి. విభక్త్యాశ్రయములైన ఈసూక్తములకు కుంతాప సూక్తములని పేరు. ఇవియే ఉదాహరణ-యక్షగాన సాహితీ ప్రక్రియలకు మూలములని విమర్శకుల

అభిప్రాయము 4 ఈసూక్తముల మార్గమున వర్థిల్లిన పదకవితలను తాళగతికి అనుకూలముగ విభజించగ త్ర్యశ్రి, చతురస్రి, ఖండ, మిశ్రి, సంకీర్ణగతులు పంచ విధముల్లుగా నేర్పడినవి. వీనిలో మాత్రాప్రధానములైనవి రగడల్లుగ, విభక్త్యాశ్రియములైన వానిని కళికోత్కళికలుగ ఛందఃకర్తలు వ్యవహరించిరి. మాత్రాగణ బద్ధములైన రగడలకు తాళము లేర్పరచిరి. ఈవిధముగ ఉదాహరణ, యక్షగాన సాహితీ ప్రక్రియలేర్పడినవి.

శివతాండవ కావ్యము ఐదుఖండికలుగా రచింపబడినది. ఇందుప్రధానమైన ఖండిక శివతాండము. తాండవారంభమునందు రెండు పద్యములున్నవి. ఒకటి విష్ణుపరము వేరొకటి శివపరము. తరువాత కళికా ప్రాయముగ ద్విరగతి రగడ, ఉత్కళికా ప్రాయముగ ***"ఆడెనమ్మా శివుడు, పాడెనమ్మా భవుడు"*** అను అను పల్లవి. కావ్యమంతయు ద్విరదగతి రగడలో అను పల్లవి నంటిపెట్టుకొని సాగినది కళిక తరువాత ఉత్కళికవలె సాగిన ఈకావ్యఖండికారచనము చివరకు శివకృత విష్ణుస్తోత్రముతో ముగిసినది ఇట్లు ప్రథమా విభక్తితో ప్రారంభింపబడి మధ్య కళికోత్కళికల వంటి రగడలతో సంబోధనతో ముగించబడిన శివతాండవఖండిక ఉదాహరణ ప్రాయమైయున్నది.5 ఉదాహరణములలో అనేకము భగవత్‌స్తుతి పరమైనవే ఈ కావ్యము భగవత్ తత్వమును వ్యక్తీకరించునది క్రియాశీలమైన జగత్తంతయు పరమేశ్వరుని యందే పర్యవసించునట్లు, సప్తవిభక్తులు సంబోధనల తోడి కృతి భర్త పరముగ చెప్పెడి ఈకావ్యరహస్యమునకు శివతాండవ కావ్యము లక్షణముకంటెను తత్వమునకు ఉదాహరణీయమైన యున్నది 6 మరియు ఉదాహరణములతోని విలక్షణలత్వము వృత్తము—రగడల కలయిక. అనగా మార్గదేశిచ్ఛందములకూడిక ఈలక్షణము ఈకావ్యమందున్నది.

యక్షగానములలో అభినయమంతయు ముందు వర్ణింపబడిన తరువాత అభినయించబడును శ్రివ్యకావ్యము కనుక అభినయమంతయు ఇందు వర్ణింప బడినది. తంజాపూరు యక్షగానముల ప్రభావము ఈ కావ్యముపై నున్నట్లు గమనింపవచ్చును.

శివపరమగు తంజాపూరి యక్షగానములలో శివుడు రంగస్థలమున ప్రవేశించుటకు ముందు నందిపరాకు గీతములను ఆలపించును. కొన్ని యక్షగానము లందు ఈ గీతములు సంస్కృత భాషలోనున్నవి.7 యక్షగానములందు శివపరమైన వాటిలో తాండవమూర్తి అద్భుతముగ వర్ణింపబడినది.8 ఈ లక్షణమంతయు ఈ

కావ్యములోని నందినాంది యందు గమనింపవచ్చును. నాందిలోని పద్యములు సంస్కృత రచనలు. చివరనొంత తెలుగు రచనమున్నది నృత్యమునకు పూర్వ రంగమువలె నాంది వర్ణింపబడినది. తండువుచేపగ్రియుక్తమైనది తాండవము కనుక నందినాంది నాలపించుట సముచితముగానేయున్నది.

తంజావూరు యక్షగానములలో శివుడు రంగస్థలమునకు ప్రవేశించుటకు ముందు చేసిన స్తోత్రములు, శివతాండవ నాందీ గీతములకు మార్గదర్శకముగా నున్నవి.

"వెడలె హాయలుగా నభేశుండు,
వెడలె హాయలుగా వెడలె బుడుతచంద్రశేఖర (రు)
శిరము నందుగదల"

(శివకామ సుందరీ పరిణయము)

"శంకర పరమేశ చందగ్రికలాప
పంకజోదర మిత్ర పగ్రిణవస్వరూప
గౌరీమనోల్లాస కైలాసవాస
నయముగా గావించు నటనవైఖరిని"

(పంచరత్న ప్రబంధము)

"సంగీతలోలునకు నృత్య సంశీలునకు
భృంగేశు తాండవ ప్రియునకు"9

ఈ విధముగా యక్షగానములలోని నటరాజ స్తోత్రములు ఆహ్వాన గీతములవలె నున్నవి. శివతాండవమునకూడ నాందీగీతములచివర నటరాజస్తుతి, తాండవము చేయుటకై ఆహ్వానము కలవు.

"తాండవింపగా తరుణంబైనది
ఖండేందుధరా కదలుమునెమ్మది

జయజయ నాద లయా సాదిత మూర్తి
జయజయ తాండవ సంభృత కీర్తి
జయగగనాంబర శాతత్రిశూలా
జయశుభంకరా జయమహాకాలా" (నాంది)

శివపరమగు యక్షగానములలో నటరాజ తాండవమును దర్శించుటకు విష్ణువరుదెంచి నట్లున్నది. శివకేశవులు పరస్పరము సంభాషించుకొనుట, సంభావించుకొనుట శివపరమగు యక్షగానములలోని విశేషము. ఈ ప్రధానముచేకాబోలు శివతాండవ కావ్యమున విష్ణుకృత శివస్తుతి, శివకృత విష్ణుస్తుపులు కలవు.

పార్వతి లాస్యముచేయుటకు ముందు విజయా ప్రార్ధనముతరువాత రంగ స్థలమున ప్రవేశించుటకూడ యక్షగాన ప్రభావమే.

ఈ విధముగా దృశ్య, శ్రవ్య కావ్య లక్షణము సంయోజించబడిన శివతాండవ కావ్యము ద్విరదగతి రగడలో ఝంపెతాళమునకు అనుగుణముగా నడచినది.

## పంచాక్షర స్వరూపము :-

శివతాండవ కావ్యము ఐదు విభాగములుగా రచింపబడినది. 1) శివపూజకై లేక శివనాట్యమును తిలకించుటకై ప్రకృతి వర్యుత్సుకత ప్రదర్శించుట 2) నందినాంది 3) శివుని తాండవము 4) విజయాప్రార్ధనము 5) శివాలాస్యము ఈ పంచ సంఖ్యావిభాగము ఈ క్రింది విషయమును సూచించుచున్నది.

శివపంచాక్షరీ మంత్రము శివోపాసకులకు ఆశ్రయణీయమైనది. ఈ మంత్రమునందు ఐదక్షరములు కలవు. నమశ్శబ్దము నందినాంది విజయాప్రార్ధనము అనురెండు ఖండికలకు అన్వయించును జీవులందరి పక్షమున నంది విజయలు జీవగతమైన వేదనను వెల్లడించి, శివపార్వతుల అనుగ్రహమును కోరిరి. తరువాతి మూడక్షరములు మిగిలిన మూడు ఖండికల కన్వయించును. ఈ మంత్రములోని చతుర్థ్యంతర్గన యకారము ప్రకృతికి ప్రతీక ఈశ్వరప్రతీకమైన అకారమును తాలవ్యీకరించిన యకారమగును. ఈశ్వరుడే సకలరూప ప్రకృతిగ నవతరించిన తత్వమును తెలుపును. మిగిలిన శివశబ్దము శివాశివులకు సంకేతము దీనియందే శివతాండవము, శివాలాస్యము అంతర్భవించును ***శం—సుఖం పరమానందమికారః పురుషస్మృతః"*** శం అను అక్షరము సుఖమును పరమానందమును కలిగించునది ఇకారము పురుషుని ఉద్దేశించినది. ***"వకారశ్శక్తిరమృతం"*** వ కారము శక్తి 10 ఒట్లు శివాభిధానములోనే శక్తి స్వరూపమైన అమ్మవారు నుతింపబడినది. కావున శివ శబ్దము శివాశివులనిద్దరిని తెలుపుచున్నది. ఈ విధముగా పంచాక్షరీ మహామంత్రము లోని అక్షరములు ఈ కావ్యములోని ఖండికలకు అన్వయింపగా శి వ తా ం డ వ కావ్యము పంచాక్షరీ మహామంత్ర స్వరూపముగా కన్పించుచున్నది

ఈ విషయమునింకను ఇట్లు చెప్పవచ్చును శివాయ అనుపదములో వ్యాకరణరీత్యా శివశబ్దము ప్రకృతిని యకారము ప్రత్యయమును చెప్పును వ్యాకరణ శాస్త్ర ప్రకారము ప్రకృతి ప్రత్యయము కలసినగాని పదము సిద్ధించదు. శివాయ అను పదము శివశక్తులులేక ప్రకృతి పురుషుల సమ్మేళనము శివశక్తులు—ప్రకృతి పురుషుల సమ్మేళనమే సృష్టి. శివాయ అనుపదము విశ్వస్వరూపమును విశ్వేశ్వర స్వరూపమును చెప్పుచున్నది ఈ విధముగ ఈ కావ్యములోని ఐదు ఖండికలు సృష్టి తత్వమును ప్రతిపాదించుచున్నవి.

ఇందను పంచ సంఖ్యావైశిష్ట్యము మరికొన్ని విశేషములు తెలుపుచున్నది. శివుని ముఖములు ఐదు శివుని కృత్యములు ఐదు పంచభూతములు శివుని ముఖ పంచకముగా చెప్పబడినవి పంచశక్తులవల్ల పంచకృత్యములు నిర్వహింపబడునను సంప్రదాయ మొకటి ఈ కావ్యమున ఉపయోగింపబడిన ద్విరదగతి రగడకుకూడ పంచమాత్రా గణములుండుట విశేషము.

| మంత్రాక్షరములు | పంచమూర్తులు | పంచశక్తులు | పంచకృత్యములు | పంచభూతములు |
|---|---|---|---|---|
| న | సద్యోజాతము | జ్ఞానశక్తి | సృష్టి | పృథివి |
| మః | వామదేవము | ఇచ్ఛాశక్తి | స్థితి | జలము |
| శి | తత్పురుషము | క్రియాశక్తి | లయము | అగ్ని |
| వా | అఘోరము | ఆదిశక్తి | తిరోధానము | వాయువు |
| య | ఈశానము | పరాశక్తి | అనుగ్రహము | ఆకాశము |

## నిర్వాహణము :

"**తలపైని చదలేటి అలలు తాండవమాడ**" అని శివతాండవ మారంభమైనది, తలశబ్దముచేత తాండవవర్ణన మారంభముగుట ఔచిత్యవంతము. సంగీత రత్నాకరమునందు తలశబ్ద ప్రాధాన్యమిట్లు వివరింపబడినది

" తాలస్తల ప్రతిష్ఠాయామితి ధాతోర్ఘఞి స్మృతః
గీతం వాద్యం తథా నృత్యం యతిస్తాలే ప్రతిష్ఠితమ్ "

గీత, వాద్య, నృత్యములు నిలచియున్నదే తాళము అట్టి తాళశబ్దము "**తలప్రతిష్ఠాయామ్**" అను ధాతువుచేత ఘఞ్ ప్రత్యయము చేర్చగా కలిగినది. తల శబ్దము తాళముగా మారినదని భావము గాను భాస్కరమున,

"తకార శ్శంకర ప్రోక్తో లకార శ్శక్తిరుచ్యతే
శివశక్తి సమాయోగాత్తాల నామాభిధీయతే"

తాలశబ్దములోని (తలశబ్దము) తకారమునకు శంకరుడనియు, లకారమునకు శక్తి యనియు అర్థము. ఈ శివశక్తి సమాగమమే తాలమని చెప్పుదురు" తాలము తల శబ్ద భవమగుట తల శబ్దముతోడి తాండవ మారంభమగుట శక్తిమంతుడగు శివుని ప్రకటింపజేయుచున్నది. అర్థనారీశ్వర తత్వమును ప్రతిపాదించుచున్నది. ఈకావ్య మున అర్థనారీశ్వర రూప సంకేతములైన లాస్యౌద్ధత్య కరణములు వర్ణింపబడినవి. సంధ్యా తాండవము స్థితి హేతువు కనుక శివశక్తుల కలయిక కావ్యాంతమున స్పష్టముగా వర్ణింపబడినట్లు, తాండవ ప్రారంభము ప్రకృతి పురుషుల ఐక్యతను గూఢముగ ప్రకటించినది.

దృశ్యకావ్య లక్షణములతో రచింపబడిన ఈ కావ్యమున నటీనటులు పార్వతీ పరమేశ్వరులు. లాస్యతాండవ ప్రవర్తకులు సృష్టి తత్వమును వ్యాఖ్యానించుచు, సౌందర్యములోని వివిధ భంగిమలను ప్రదర్శించుచు, అనుభవములోని నవరస భావములు అభినయించుచు నటించిరి. ఈ నటనము రెండు ఖండికలలో రచింపబడి నది. మూడవ ఖండికయగు శివతాండవమున శివనటనము. ఐదవ ఖండిక శివా లాస్యమునందు శివానటనము.

ఈ కావ్యమున వర్ణింపబడినది, సంధ్యా తాండవము. శివుడు మహానటుడుగ- నటరాజుగా వర్ణింపబడెను. కేవలము అభినయమేకాక సంగీత కళావేతృత్వము, స్వరమేళన కర్తృత్వము, మృదంగాది వాద్యనిపుణత్వము నటరాజునకు చెప్పబడినవి

ఈ దృశ్య కావ్యమునకు రంగస్థలము కైలాస పర్వతము

"కైలాస పర్వతము గడపి ఫక్కున నవ్వ
నీలిమాకాశంబు నిటలంబుపై నవ్వ"

సంధ్యాతాండవమునకు ప్రఖ్యిగా పార్వతి శివ ప్రదోష స్తోత్రమున చెప్పబడినది. కనకమయ సింహాసనాధిష్ఠితయగు గౌరిముందు శివుడు నృత్యమొనరించును. దాక్షి ణాత్య చిత్రముల యందిట్టి సంధ్యాతాండవ చిత్రములను చూడవచ్చును. ఈ నృత్య ములో సహాయముగ సరస్వతి వల్లకిమీటును. బ్రహ్మ తాళము వేయును, ఇంద్రుడు మురళియూదును. ఇందిర పాటపాడును. విషువు మృదంగము మోగించునని చెప్ప బడినది.

ఈ కావ్యమున విష్ణువు మృదంగ వాద్యకునిగా వర్ణింపబడలేదు పరదైవముగా స్తుతించబడినాడు. తాండవాంతమున నటరాజుచే నమస్కరింపబడినాడు. కవి శ్రీ వైష్ణవ మతావలంబి కనుక సహజముగా తాండవారంభమున పరదైవమైన విష్ణువును స్తుతించెను.

కాని దృశ్య కావ్యలక్షణాను సారము విష్ణువును ప్రయోక్తగాకొందరు పేర్కొనిరి 13 ప్రయోక్త దర్శకుని వంటివాడు. ఆయన దర్శకత్వములోనే నటరాజు తాండవమును ప్రదర్శించెను ఈ విషయము ***"శౌరినీ తేజమే సంక్రమించెను నన్ను పూరించె తాండవము పూర్ణ చిత్కళతో"*** అని తాండవాంతమున శివుడు విష్ణువునుస్తుతించుటలో ప్రకటింపబడినది. మరియు శివపరమైన తంజావూరి యక్షగానములందు "*శివ కామసుందరీ పరిణయము*" న

> " శశిభూషణా మీరు కుశలమా
> మీఘన నటనలకు కుశలమా "

అని విష్ణువు శివుని కుశలము నడిగినట్లు, శివుడు విష్ణువును స్వాగతించినట్లు వర్ణింప బడినది. ఇట్టి యక్షగాన దృశ్య కావ్య ప్రభావమే ఈ కావ్యమునందు ప్రతిఫలించినది.

శివ ప్రదోషస్తోత్రమున దేవతలందరు వాద్య కారులుగ శివ నాట్యమునకు సహాయకమగు నటవర్గముగ వర్ణింపబడిరి కాని ఈ కావ్యమున వారందరు ప్రేక్షకులుగ నాట్యమును తీర్చుటలో పరోక్ష సహాయకులుగ వర్ణింపబడిరి. విష్ణువు దర్శకుగని, బ్రహ్మ సరస్వతులు అలంకారము తీర్చెడివారుగ చెప్పబడిరి

> " చతురాననుడే సవదరించుచట
> శర్వున కుత్తమ సర్వవిభూషలు
> భారతి యట- పార్వతికి అలం
> కారము తీర్చెడునది "

భరతముని సృష్టించిన నాట్యములోని తాండవమును శివుడు, లాస్యమును పార్వతి మొదటగా అభినయించిరని నాట్యశాస్త్ర ప్రవర్తకులు పేర్కొందురు. ఈ విషయముగానే కావ్యమున శివుడు తాండవము ప్రదర్శించిన నటునిగ, పార్వతి లాస్యము నభినయించిన నటిగా వర్ణింపబడిరి. ప్రకృతిలోని జీవ జడ జాలమంతయు, సంధ్యాసతియు, ఈనటీ నటుల నాట్యమును అవలోకించుటకు సన్నద్ధమైనట్లు చిత్రింప బడినది.

శివా లాస్యమును జూచుటకు ఆకాశమున అప్సరలు జలదాంగనలై విచ్చేసిరి. మునులు, ఋషులు, గంధర్వులు, కిన్నరులు, కింపురుషులు, విద్యాధరులు, భరతముని అష్ట దిక్పాలకులు, గణేశుడు, స్కందుడు, మొదలగు వారందరు ప్రేక్షకులుగ వర్ణింపబడిరి.

సకలలోకములను ఆనందింపజేయు నృత్యమును ప్రదర్శించిన నటరాజు నటలక్షణములకు ఉదాహరణీయుడిగ వర్ణింపబడెను. అభినయ దర్పణమున నట లక్షణమిట్లున్నది.

> " చక్కని వాడును, ఇంపుగ మాటలాడు వాడును,
> పండితుడును, మాటకారియు, సమర్థుడును,
> కులాంగనా సుతుడును, భరతశాస్త్ర పరిజ్ఞానము
> కలవాడును, గాన, వాద్య, నృత్యాదులలో పరి
> జ్ఞానము కలవాడును, పట్టు గల్గినవాడును, కల్పనా
> శక్తి గలవాడును, నటుడని పెద్దలు చెప్పుదురు "14

నటరాజు చక్కని రూపమిట్లు వర్ణింపబడినది

> " మొలక మీసపు కట్టు— ముద్దు చందురు బొట్టు
> పులితోలు హొంబట్టు— జిలుగు వెన్నెల పట్టు
> నెన్నడుమునకు చుట్టు— కొత్రిన్నాగు మొలకట్టు
> .... . . . . . .. ..
> సిగపైననల్పకల్పక పుష్పజాతి "

ఇంపుగ మాటలాడువాడు— అను లక్షణ మిట్లున్నది.

> " అరపల్కు వచియించి యక్షులను పూరించు
> పూరించు నర్థమును పొందించు హస్తముల
> మొదల కన్నులకొంత ముచ్చటించును మిగుల
> నదియించు వాఙ్మయా ఖండ పుణ్యము పంత
> .. ... .. .. ....... . . ..
> పలుకుపలుకున నమృత భరము తుంపసలాడ
> నిలువెల్లగానమే నిండుకొని వెలికూర "

నటనలో సమర్ధుడనుటకు కావ్యమంతయు నుదాహరించవచ్చును భరత శాస్త్ర పరిజ్ఞానము కలవాడనుటకు నటరాజు ప్రదర్శించిన పతాక, అర్ధపతాక, త్రిపతాక, సూచీ, అపవిద్ధ, అరాళ, ముష్ఠి, శుకతుండ, అర్థచంద్ర, కటకాముఖ, భ్రమరీ త్యాది హస్తాభినయములే సాక్ష్యములు.

సంగీత పరిజ్ఞానము కలవాడనుటకు,

" మేళ కర్తల నెత్తి యాలాపముల దీర్చి
ఆలాపనమ్ములో నఖులను సరమోడ్చి
సంవాది వాదులను స్వరములను జూపించి
క్రొవ్విరుల గుచ్ఛములు గునిసి పోయినయట్లు
గమకముల వెలయించి కడగి జారులు చుట్టి
ప్రమదమ్ముతోడ మూర్ఛనల నెల్ల రాబట్టి
మంద్ర మధ్యమతార మధురిమలు జూపించి
సాంద్రమ్ముగా గాన సాగరమ్మును రేపి
ఆడెనమ్మా శివుడు
పాడెనమ్మా భవుడు "

తాండవ మంతయు గాన యుక్తమైన అభినయము తోడ ప్రదర్శించెనని వర్ణింప బడినది. పాండిత్యము కలవాడనుటకు,

" వక్రరాగము నెత్తి పాండిత్య ధీరతతో
పక్రమణమును బూని ప్రక్క వాద్యముజూచి
కనకాంగియేయంచు కనుగోనలనె నవ్వి
వినిపించి శుద్ధస్వర నిచయంబునె ద్రవ్వి
కాలువిడు ముక్కాలు చోటుల నెత్తి
కోలు జూపించి నిక్కగ బల్లవుల పాడి
కాల భేదములతో గలితనం బెలయించి
సోలు నిర్జర మనస్సుల నెల్ల వంచించి "

నటరాజు గానము చేసినట్లు వర్ణించబడినది. రాగ సామ్రాజ్యాధి దైవతమైన మధ్యమరాగమును శుద్ధముగా జూపించి, వాద్యములు తమకు తామే పులకించి "ఔరా" యని ఎలుగిచ్చినట్లు చటులగాన మొనరించెను. షడ్జమ స్వరము పట్టగ శరజన్మని

తేజి పింఛము విప్పియాడినది ఋషభస్వరము నాలపించగ నంది చెలరేగి లంఘించె నది. ధైవతమును ఆలాపనము సేయగా గంధర్వలోకము కన్నులు వెల్గినవి. నిషాద స్వరము పల్కిన వెనుకయ్య బృంహితము ప్రతిధ్వనించినది. ఈ రీతిలో ఉజ్జీవములైన పాటలను వెన్నుగా బలికి కిన్నెరులను, అప్సరలను సంతోషింప చేయగా తాళమువేయు అమరులు హెచ్చిన శ్రుతిలయమునకు తాళము తప్పినారట. సరస్వతి గుండె కంపించి జలజలా పారినది.

కల్పనా శక్తి కలవాడనుటకు నటరాజు శాస్త్రముల దాటి తనదైన స్వాతం త్ర్యమును సాహిత్య, సంగీతాభినయములందు ప్రదర్శించెను శాస్త్రమును మరచి సర్వులు ఆతనిగాన, వాద్య, నృత్యములందు లీనమైరి.

అభినయ చతురుడని చెప్పుటకు నటరాజు అనేకానేక భావములను హస్త, పాద, కటి, నయన విన్యాసముల ద్వార ప్రకటించెను, నటరాజు ప్రదర్శనము తిలకించి ఇంద్రుడు తన వేయికన్నులు చాలవనుకొనెను. భరతముని తన శాస్త్రము సఫలమైనదను సంతోషములో నటరాజు పాదపద్మములను పట్టెను. బ్రహ్మ యొక్క సృష్టిగర్వము తొలగిపోయెను, అష్టదిక్పాలకులు కేవలము రసమూర్తులై నిలచిరి. ఈవిధముగ నటలక్షణమును నటరాజు రసవంతముగ ప్రదర్శించెను,

శివాలాస్యమునందు నటీలక్షణములు చక్కగా విన్యసింపబడినవి. నటీ లక్షణమిది.

"రూపవతియు, యౌవనమధ్యయు, బలిసిన నిక్కిన పాలిండ్లు గలదియు ప్రౌఢయు, రసికురాలును, పట్టువిడుపులందు సమర్థురాలును, తాళగతులు తెలిసినది యు, మండలస్థాన నృత్యమందు పండితురాలును, హస్త, అంగ విన్యాసములందు నేర్పరురాలును, కరణములయందు చాకచక్యము కలదియు, విశాలమగు కన్నులు కలదియు. ప్రసన్న ముఖము కలదియు, మిగుల లావుగాక, సన్నముగాక పొట్టిగాక, పొడవుగాక, చక్కగానున్నది నటియై యుండవలెను," 16

విజయా ప్రార్థనమునందు పార్వతి కోమలాంగియని నుతించబడెను. యౌవనమధ్య యు, బలిసిన నిక్కిన పాలిండ్లు గలదని లాస్య ప్రారంభమునందు వర్ణించ బడినది.

"పక్కుమని నవ్వినది జక్కువల పెక్కువల
జక్కడుచు చనుదోయి నిక్క పార్వతి యపుడు
నిక్కు చనుదోయిలో నిబిడరో మోద్గమము
దిక్కు దిక్కుల నెల్ల దివ్య నేత్రోత్సవము"

లాస్యము సుకుమారమై శృంగారాభి నయాత్మకమగుటచేత లాస్యారంభమిట్లున్నది. లాస్యమున పార్వతి నవశిరోభేదములు, గ్రీవాభేదములు చూపెనని వర్ణింపబడెను, నటి అంగ విన్యాసమునకిది గుర్తు. అష్టగుణ భావదృష్టుల ప్రదర్శనము — అభి నయమును తెల్పుచున్నది. సమపాదమునయుండి సుమాంజలి పట్టుట కరణ విన్యాసము. తొమ్మిది విధములైన భూచారి నాట్యములను, పదహారు విధములైన ఖచారి నాట్యములను పార్వతి ప్రదర్శించెను ఈ విధముగ నటీలక్షణముల సమ్యక్ స్వరూపము పార్వతిగా వర్ణింపబడి లాస్య ప్రవర్తినియన్న నాట్య సంప్రదాయమున కన్వర్థముగ నిరూపింప బడినది.

మొదట నృత్యమొనరించిన శివుడు శివాలాస్యము పూర్తియగునంతలో తాను కూడ వచ్చి చేతులు కలిపి యాడెను నర్తన సభలో వేరువేరుగా నృత్యమొనరించిన నటులు చివరకు ఆందరు కలసి మంగళము పాడుట దృశ్యకావ్య సంప్రదాయము. సమర్థులగు నటక వర్గముతో, మురజములు, ఝల్లరులు మృదంగ వాద్యములతో పార్వతీపరమేశ్వరులుతాండవలాస్యములను నిర్వహించిరి. ఈ విధముగ ఈకావ్యము నాట్య సంగీత రూపమగు దృశ్య కావ్యముగా రచింపబడినది.

## విష్ణుస్తుతి రహస్యము :-

ఈ కావ్యము సృష్టి తత్వమును వ్యాఖ్యానించినది. సృష్టిక్రియా కలాపమున పరమేశ్వరునకు శక్తి సహాయకము. ఈశక్తి పౌరాణిక సంప్రదాయమున పార్వతిగా రూపింపబడినది. అర్థనారీశ్వర మూర్తిలోని స్త్రీ-పుం-భావములు సృష్ట్యావిర్భావమును సూచించుచున్నవి. అందుకే ఈ కావ్యమున, శివతాండవము—శివాలాస్యము విడి విడిగా వర్ణించబడిననూ - శివతాండవమున లాస్య-ఔద్ధత్య కరణాభినయము, శివ లాస్యమున శివాశివుల ఐక్యము సృష్టితత్వమునే ప్రకటించినవి.

శివతాండవ ఖండికలో ఒక ప్రత్యేకతయున్నది. అది ఆద్యంతములలదున్న విష్ణుస్తుతి. దృశ్యకావ్యపరముగా విష్ణువును తాండవమునకు ప్రయోక్తగ భావింప వచ్చును. శ్రవ్యకావ్యపరముగా ఈ విషయమునాలోచింపవలెను.

స్కాందపురాణమున విష్ణుమూర్తి శివుని వామభాగమున జన్మించినట్లు చెప్ప బడినది వామభాగము పార్వతి స్థానము. పార్వతి లాస్యమునకు ప్రవర్తకురాలు. పార్వతిని వేదాశక్తిని జగచ్ఛక్తిగా రూపించు లలితా సహస్రనామ స్తోత్రమునందు,

***"విశ్వగ్రాసా, విద్రుమాభా వైష్ణవీ విష్ణురూపిణీ"*** అని వర్ణింపబడినది 16 శివతాండవము ప్రథమ ఖండికలో పార్వతిని గూర్చి ***లలితామృదు మంజుల కాయము—"*** అని పార్వతి లలితాంబగా చెప్పబడెనది (విష్ణుస్తుతిలో శ్రీరమణీ లలిత కటాక్షారోహణ చంపక ప్రసవమాలా శృంగారితవక్షుడు— అని లలితశబ్దము ప్రయోగించ బడినది)

తాత్పర్యముగ శివుని వామభాగము శక్తిస్థానమనియు, ఆశక్తియే విష్ణురూపిణి యనియు-కావున పార్వతికి విష్ణువునకు అభేదము పాటింపబడెననియు తెలియు చున్నది. అందులకే ప్రసిద్ధమైన సంధ్యా తాండవమున ప్రథ్విగా నున్న పార్వతి స్థానమున ఈ కావ్యము విష్ణువును వర్ణించినది పార్వతివలెనే విష్ణువు కూడ లాస్య ప్రవర్తకుడని చెప్పవచ్చును. శృంగార రసావిష్కరణము లాస్యాభినయము ద్వారా జరుగును. శృంగారమునకు అధి దేవత విష్ణువు శృంగారమునకు వర్ణము శ్యామ లము.17 విష్ణువు శరీరము శ్యామలము విజయా ప్రార్థనము నందు పార్వతి ''*శ్యామాంగి*'' గా నుతించబడినది. శివతాండవమున

హరుజూచిహరినవ్వె—హరియెహరుడై నవ్వె
విరిసికొనె నొక వింత—వెన్నెలలు లోకమున
శ్యామ సాంధ్యస్ఫూర్తి—చంద్రికలలోడాగె''

శ్యామ స్ఫూర్తి—సాంధ్యస్ఫూర్తి—లాస్యతాండవ భావ సమ్మేళనము, చంద్రికలలో డాగినవి అనగా తెలుపు దనములో లీనమైనవి. తెలుపుదనము నుండియే వర్ణము లన్నియు ఉత్పన్నములయినవి. కావున పార్వతి స్థానమున విష్ణువు శక్తి స్వరూ పముగా వర్ణింపబడినాడు శక్తి సహాయములేనిదే శివుడు సృష్టి కలాపమున క్రియా శీలుడు కాలేడు అందులకే '' ***నారాయణి నమోస్తుతే*** '' అన్నట్లు

'' శౌరి నీ తేజమే సంక్రమించెను నన్ను
పూరించె తాండవము పూర్ణ చిత్కళతోడ '' అని

తాండవ వాంతమున శివుడు విష్ణువును నుతించెను

**హరిహరా భేదములోని అద్వైతము:** భాగవతమునందొక పద్యమున్నది.

> " హరిభగవంతుడనంతుడు, గరుణాంబుధి సృష్టి కార్యకారణహేతు
> స్ఫురణుండవ్విభుకంటెం బరుడెవ్వడులేడు తం[డ్రివరికింపంగన్"

" కార్యము కారణము అతడే. సృష్టి యుండవలెనని జీవులు జీవించవలెనని అతని యుత్సాహము దీనినే కరుణయందురు అతడు కరుణతో నిండిన సముద్రమువంటి వాడు. సముద్రమున తరంగములు వచ్చుచు, పోవుచునుండును అట్లే భగవంతుని యెడ సృష్టియును"18 అని భాగవత పద్యమునకు వ్యాఖ్యానము చేయబడినది. ఉత్సాహమును ఆలంకారిక శాస్త్రమున వీరరసమునకు స్థాయిభావముగా చెప్పుదురు. ఆలంకారికులు వీరమును నాల్గు విధములుగ విభజించిరి దానవీరము, దయా వీరము, ధర్మవీరము, యుద్ధవీరము 19

శివతాండవ ఖండికలోని మొదటిపద్యమున విష్ణువు **"పరదైవముగా"** స్తుతించబడినాడు ఆపరదైవమునకు విశేషణము *"దయావీరుడు"* అనునది సృష్టి కర్తృత్వమునకు పరదైవమైన విష్ణువు కారణముగా చెప్పబడినాడు

భాగవతమున శుకయోగి దేవగురు ప్రశంసచేయుచు

> " పరుడై ఈశ్వరుడై మహామహితుడై ప్రాదుర్భవస్థాన సం
> హరణ క్రీడనుడై త్రిశక్తియుతుడై యంతర్గతజ్యోతియై
> పరమేష్ఠి ప్రముఖామరాధిపులకుం బ్రాపింపరాకుండ దు
> స్తర మార్గంబున తేజరిల్లు హరికిన్ తత్త్వార్థినై మొక్కెదన్"20

అని భగవంతుని పరుడని–ఈశ్వరుడని సృష్టి, స్థితి, సంహరణములు అతని క్రీడయని ప్రవచించెను. ఈ క్రీడయే నాట్యముగా భావించవచ్చును. శివతాండవ ఖండికలోని రెండవ పద్యమున,

> "సాంధ్యల తాండవమాడు దుఃఖితాపన్న శరణ్యుడీశ్వరుడు"

అని శివుడు నుతించబడెను అనగా భాగవతమున భగవంతునిగా చెప్పబడిన పరుడు ఈశ్వరుడు శివతాండవమున రెండు పద్యములలో విడివిడిగ వర్ణింపబడిరి. భగవంతుని క్రీడయే తాండవముగానిందు వర్ణింపబడినది.

అంతట వ్యాపించియున్న పరమాత్మకు విష్ణువు అనిపేరు. సకలజీవులలోని అంతర్యామికి శివుడనిపేరు, చిదంబరము నందు నృత్యముచేయు నటరాజు యితడే భాగవత రహస్యప్రకాశమిట్లు పేర్కొనినది. "**విష్ణువు సృష్టికర్తయై నను సృష్టి యందు ఈశ్వరుడై నటించు చున్నాడు**" ఇట్లు అంతర్యామిగానున్న ఆత్మకు, సర్వేసర్వత్ర వ్యాపించియున్న పరమాత్మకు అభేదము చెప్పుటకే శివతాండవ ఖండిక చివర విష్ణుకృత శివస్తుతి, శివకృత విష్ణుస్తుతి చేయబడినది. కావ్యమున కూడ "**హరుడౌచి హరినవ్వో హరుడె హరియైనవ్వో**" అని హరిహరా భేదము వర్ణింపబడినది.

సృష్టి వ్యాపార నిమిత్తము పరమాత్మ జీవునిగా దిగివచ్చినృత్త వినోదములు సలుపు చుండును. భాగవతము ఈభావమును స్పష్టముగా పేర్కొనినది.

"పూర్ణుడయ్యును మహాభూత పంచకయోగ
మున మేనులను పురములు సృజించి
పురములలో నుండి పురుష భావంబున
దీపించునెపుడును దీరవృత్తి
పంచభూతములును బదునొకొండిం(ది)య
ముల ప్రకాశింపించుభూరిమహిమ
షోడశాత్మకుడన శోభిల్లి జీవత్వ
నృత్త వినోదంబు నెరపుచుండు
నట్టి భగవంతుడవ్యయుండచ్యుతుండు[21]."

ఈ పద్యమున షోడశాత్మకుడే శివుడు. జీవత్వ నృత్త వినోదంబులు సలుపువాడు త్రిపురములను భేదించి త్రిపుర తాండవము చేసెడివాడు. జీవ విన్యాసమునే భాగవతము నృత్తమని పేర్కొనినది. నృత్తమే తాండవముగా నాట్య శాస్త్రము చెప్పినది. తాండవాంతమున శివుడు విష్ణువును నుతించుచు,

"శౌరి నీతేజమే సంక్రమించెనునన్ను
పూరించె తాండవము పూర్ణచిత్కళతోడ"

అని భాగవతము చెప్పిన షోడశాత్మక భావమును—పూర్ణచిత్కళగా పేర్కొనినాడు. అఖండ సచ్చిదానంద పరమాత్మ జీవత్వ నృత్త వినోదములుసల్పి తిరిగి ఆ అఖండాత్మలో లీనమగుటనే శివుడు విష్ణువును నుతించుటలో వర్ణింపబడి జీవబ్రహ్మ అభేదముగ అద్వైత భావము ఈ కావ్యమున ప్రపంచింపబడి, స్థూల దృష్టికి హరిహరాభేదమును సూక్ష్మవిచారణలో అద్వైత సిద్ధాంతమును కలిగియున్నది.

## ఆధసూచికలు

1) “ఏకాంత సేవ” పీఠిక —కృష్ణశాస్త్రి

2) “శివతాండవము” అభిప్రాయము —స్వామి శివశంకరశాస్త్రి

3) శివతాండవమునకు తొలిపలుకు, “విశ్వనాథవారు ఎక్కడ పోయినా కిన్నెరసాని పాటల్ని పాడమనేవారు” పుట్టపర్తి మరియు మేఘదూతమున కిన్నెరసాని నదిని వర్ణించుచు, అన్యాపదేశముగా విశ్వనాధ కవిత్వమును ప్రశంసించుట గమనింపదగినది

4) ఉదాహరణ వాఙ్మయ చరిత్ర —నిడదవోలు వెంకటరావు

5) చూడుడు — ఉదాహరణ కావ్యలక్షణము — అప్పకవీయము

6) “ఉదాహరణ కావ్యరహస్యము” —విశ్వనాధ
ఉదాహరణ వాఙ్మయ చరిత్ర —నిడదవోలు వెంకటరావు

7) చూడుడు — తంజావూరి యక్షగానములు. 8—9—10 సంపుటములు
ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణలు-వాల్తేరు

8) “ఘటిత స్తాండవ కాండ కాండ మహిమా
ఖండాల ఖండోన్నదు
చ్ఛుండా చండ విచండ ఖాండ విహార
తాండవల్పం ఖండల ప్రియైః
తండూద్దండిత చండ డిండిమ ముఖో
డిండీర షండోద్వయ
తాండైర్మండిత గండ మండల
జటాఖండోస్తు ఛందీపతిః”
రతి కళ్యాణము - శాహజీ — 8వ సంపుటము

9) శివకామసుందరీ పరిణయము —తుళజ మహారాజు
సంపుటము 11
పంచరత్న ప్రబంధము —శాహజీ మహారాజు
సంపుటము 8
తంజావూరి యక్షగానములు—ఆంధ్ర విశ్వవిద్యాలయా ప్రచురణ

**10** కాళహస్తీశ్వర శతనామాబ్జ మాలిక —వి.యస్. వెంకటనారాయణ
శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం — కాళహస్తి

**11** తాళశబ్ద వివరణము — మృదంగ తత్వము —ధర్మాలరామమూర్తి

**12** శివప్రదోష స్తోత్రము — బృహస్తోత్ర రత్నాకరము
వాగ్దేవీధృత వల్లకీ శతమఖో వేణుం ధధత్యజ
స్తాలో న్నిద్రకరో రమాభగవతీ గేయ ప్రయోగాన్వితా
విష్ణుస్సాంద్ర మృదంగ వాదన, పటుర్దేవా స్సమంతాత్ స్థితా
స్సేవంతే తమను ప్రదోష సమయే దేవం మృడానీపతిమ్

**13** “తాండవ ప్రశస్తి” —నేదునూరి శ్రీ కృష్ణమూర్తి

**14** నటలక్షణము — అభినయ దర్పణము — నందికేశ్వరుడు

**15** నటీ లక్షణము — అభినయదర్పణము — నందికేశ్వరుడు

**16** శ్రీ లలితా సహస్రనామ స్తోత్రము 166 శ్లో॥
సంపాదకులు — హరిరాధా కృష్ణమూర్తి

**17** “రసాధి దేవతలు” — వర్ణములు — 149-151 పేజీ
భావ ప్రకాశము, తృతీయాధికారము, శారదా తనయుడు
తెలుగు అనువాదము — జమ్మల మడక మాధవరాయశర్మ

**18** భాగవత రహస్య ప్రకాశము — ప్రథమ సంపుటము పేజీ 96
—డా॥ ఎక్కిరాల కృష్ణమాచార్య

**19** తృతీయాశ్వాసము — పేజీ —316 కావ్యాలంకారసంగ్రహము
తెలుగు వివరణ — సన్నిధానం సూర్యనారాయణశాస్త్రి

**20** భాగవతము — ద్వితీయాశ్వాసము — 58వ పద్యము

**21** భాగవతము —పోతన

# శివతాండవమున సృష్టి తత్వము

సృష్టిని గూర్చి సృష్టితత్వమును గూర్చి వేదకాలము నుండియు ఆలోచనము కలదు. ఈ పరావర విశ్వము సంతయు ఏదో ఒక మహత్తరశక్తి నడిపించు చున్నదని భారతీయుల విశ్వాసము. వైదిక మహర్షులు విశ్వముయొక్క ఉనికికి మూలభూతమగు శక్తిని గూర్చి ఆలోచించినపుడు మూడు ప్రమాణములు స్వీకరించిరి 1) ప్రత్యక్షము, 2) అనుమానము, 3) శబ్దము

ఇంద్రియ గోచరమగు స్థూల జగత్తంతయు ప్రత్యక్షముగ కనిపించు. చున్నదే ప్రకృతి శక్తులనుపాసించి ప్రత్యక్ష జగత్తులోని మూలభూతమగు శక్తి దర్శించు మహనీయులు కొద్దిమంది మాత్రమే వారి వ్యక్తిగత జీవనముతోడి అతి సన్నిహితత్వము కలిగిన అందేవాసులకు తప్ప మూలశక్తిని గూర్చిన ప్రత్యక్షానుభవము సామాజికముకాదు.

వైయక్తికానుభూతి ప్రకటనము, తన్నిరూపణముచేయవలసివచ్చినపుడు అనుమాన ప్రమాణము నాశ్రయించవలసినదే సుదూర వస్తువిషయ పరిజ్ఞానమునకు అదృశ్యవస్తువిషయ పరిజ్ఞానమునకు, కాలాంతర దేశాంతర, వస్తువిషయ పరిజ్ఞానమునకు అనుమానమావశ్యకము, పొగను జూచి అగ్నిని ఊహించినట్లు దృశ్యమాన కార్యజగత్తును జూచి కారణ జగత్తు నూహించుట అనుమానము. ఈ అనుమాన ప్రమాణము తర్కము, హేతువునాశ్రయించివుండును.

విశ్వ చైతన్యమునకు మూలమేది? అను ప్రశ్నకు వైదిక మహర్షులు అనుమానాది ప్రమాణముల వలన, సమాధి దర్శనముల వలన వేదవేదాంతములందు బ్రహ్మతత్వమునుపాపించిరి. దేవతా రూపములను స్తుతించిరి.

శబ్దములనగా వేదోక్తములగు మంత్రసముదాయము దాని శృతి వాక్యముల ననుసరించి సృష్టికి అతీతమగు దివ్య శక్తి పరబ్రహ్మముగా విశ్వసించుట, ఆ పరబ్రహ్మంనుండియే సకల జగత్తు వ్యక్తమైనదని భావించుటయే శబ్ద ప్రమాణము.

ఈ విధమగు త్రివిధ ప్రమాణములలలో శబ్ద ప్రామాణ్యము. వైయక్తిక విశ్వాసముపై, సామూహిక విశ్వాస పరంపరమై నాధారపడియున్నది. ప్రత్యక్షము కూడ వైయక్తికానుభూతియే. కావున అనుమాన ప్రమాణము తర్క సహితమై హేతువులాధారముగ ప్రకటింపబడిన విషయమునందు పరమ విశ్వాసమేర్పరచును.

పాశ్చాత్యులుకూడా సృష్టికి మూలమగు విషయమును గూర్చి అనుమానించి తమ అభిప్రాయములను సిద్ధాంతముగ ప్రకటించిరి.

వారిలో *"రెనీడేస్కార్ట్స్"* అను ఫ్రెంచి గణిత శాస్త్రవేత్త (1596-1650) గణిత శాస్త్రము ద్వారా దివ్య శక్తి యొక్క ఉనికిని గుర్తించు ప్రయత్నము చేసెను *"నేను ఆలోచిస్తున్నాను గనుక నేనున్నాను."* **(Iam thinking there fore Iam)** ఈ తత్వవేత్త వ్యక్తి యొక్క ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, తాత్త్విక శక్తి, దేవుని ఉనికిని నిరూపించునని భావించెను ప్రకృతి, ప్రకృతిలోని మానవుని ఆధారముగ దివ్య శక్తి ఉనికిని గుర్తించు ప్రయత్నము చేసెను. డెస్కార్ట్స్ తరువాత వచ్చిన తాత్వికులు ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతమును విమర్శించి విస్తృతముగ ప్రచారము చేసిరి. వారు కూడ అతడు చెప్పిన అంశముల నాధారముచేసుకుని ఆలోచించిరి ఆత్మసంబంధమైన పరిధిని దాని ఆధారముతో తీసుకుని వచ్చి దానిని స్థిరీకరించి మానవుడు (జీవాత్మ) ప్రకృతి గాక మూడవ శక్తి యున్నదని, అది మానవుల బుద్ధికి అందకపోవచ్చునని, దానిని నిరూపించు ప్రయత్నమే డెస్కార్ట్స్ చేసెనని చెప్పిరి ఈ సిద్ధాంత మంతయు ఆలోచనా శక్తిపై నాధారపడియున్నది శునకము తనకు ఆహారము కావలసి వచ్చినపుడు తోక **నా**డించుటయు, భయప్రమాదములకు లోనైనపుడు పాము పడగ విప్పుటయు వాని ఆలోచనా శక్తిని ప్రకటించుచున్నదని ఈ ఆలోచనా శక్తికి మూలమైనది దివ్య శక్తి యని ఆ దివ్య శక్తిద్వారా విశ్వశక్తి ఉనికిని గుర్తింపవచ్చునని, నాటి తాత్విక సిద్ధాంత సారము ఈ సిద్ధాంతము *"సర్వాత్రి ప్రసిద్ధోపదేశాత్"* అని ప్రత్యక్షముగా కనిపించుచున్న ప్రపంచం ద్వారా సృష్టితత్వము నూహించిన బ్రహ్మ సూత్రముల వలె, సాగినది. పై పాశ్చాత్యతత్వవేత్తలు మానవాతీత శక్తిని *"పరమ ప్రామాణ్యము"* **(Ultimate Authority)** అని పేర్కొనిరి.

స్పినోజా అనుతాత్వికుడు భగవంతుడు విశ్వవ్యాప్తుడై యున్నాడనియు, పదార్థములన్నియు తానై–తనలో పదార్థములన్నియు ఇముడ్చుకొని–తానే ఒక మహా పదార్థముగ నున్నాడని తెలిపెను *(GOD IS EVERY THING - EVERY THING IS GOD)* ఇతడు డచ్ దేశస్థుడు ఒక ఆత్మ బ్రహ్మ పదార్థముగ విస్తృతిపొంది మానవుని మనోవిశ్లేషణ ద్వార భిన్న భిన్న రూపములు దాల్చినట్లు కన్పించుచున్నదని స్పినోజా వివరించెను **2** ఈ సిద్ధాంతము భారతీయులచే ఆనాదిగ ప్రతిపాదింపబడుచున్న అద్వైత సిద్ధాంతమునకు సన్నిహితముగనున్నది.

విశ్వస్థితి హేతువును గూర్చి *(BARON VON LEZBNITZ)* బారోన్ వాన్ లెబినిజ్ అను శాస్త్రవేత్త (1646-1716) **"మొనడాలజీ"** అను సిద్ధాంతమును ప్రతి పాదించెను. విశ్వము స్వతంత్రముగ పనిచేయుటలేదని భగవన్నిర్మితమైన ఒక మధురశావ్య నాదము ననుసరించి విశ్వము ప్రవర్తించుచున్నదని చెప్పెను. ప్రపంచములోని ఉత్తమ రూపములను పరిశీలించి మూడు తత్వములను ప్రధానాంశము లుగ నిర్ణయించెను. 1) భగవంతుడు 2) ఈశ్వర నిలయమైన ప్రకృతి 3) అజ రామరమైన జీవాత్మ 3 ఈతని సిద్ధాంతములోని మూడు విషయములు భారతీయులు వివరించిన తత్వత్రయమునకు అనగా ప్రకృతి—జీవాత్మ—పరమాత్మలకు సరిపోవు చున్నది,

ఈ విధముగ పాశ్చాత్య తాత్వికులలో కొందరు విశ్వసృష్టి సిద్ధాంతములను ప్రతిపాదించిరి. ప్రాచ్య తత్వవేత్తల ప్రధాన సిద్ధాంతములన్నియు సృష్టి అఖండ శక్తి స్వరూపమను అభిప్రాయమును క్రీస్తు పూర్వమే ప్రకటించినవి అఖండశక్తి స్వరూపమైన సృష్టి పరిణామము వ్యాఖ్యానించుటలో, లయమును గూర్చిన విచారణ లో భేదములుకల్గి అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత మార్గములుగా ప్రతిపాదింపబడినవి.

సృష్టి మూల స్వరూపమును గూర్చి భౌతిక శాస్త్రవేత్తలు ప్రత్యక్షమునే ఆధారము చేసికొని పరిశోధనలు గావింతురు. వారు పదార్ధమును అతి సూక్ష్మముగ వింగడించి పరమాణు పర్యంతము దర్శించిరి అణువునందు ద్రవ్యరాశిగల మూడు పరమాణువులు ప్రధానమైనవని అవి న్యూట్రాన్, ప్రోటాన్, ఎలక్ట్రాన్ కణములని **(PARTICALS)** గుర్తించిరి. విశ్వ పదార్థమునిండ దాదాపు నూరు పరమాణువులు స్థిరత్వము లేనివున్నవని అందుపైన పేర్కొనబడిన మూడు పరమాణువులు ముఖ్యమైనవని, సకల పదార్ధము ఈ పరమాణు సంయోగ జనితమేనని వారు నిరూపించిరి పదార్ధ మేర్పడకముందు ఈ కణములు సామ్యావస్థను పొందియుండును. ఈ పరమాణు కణములుసామ్యావస్థను తొలగించుకొని తిరిగి సంయోగము పొందినచో అనగా ఆకర్షణ వికర్షణలకు లోనైనచో పదార్థ సృష్టి జరుగును. కాని సామ్యావస్థను పొందిన పరమాణు కణములు ఏ చైతన్యమువలన తిరిగి శక్తిని పొంది ఆకర్షణ వికర్షణకు లోనగునో చెప్పలేక పోయిరి

వైదిక మహర్షులు శృతులాధారముగ ఈ విషయమును గూర్చి ఆలోచించి అగ్ని స్వరూపమైన ఆపరమాత్మయే తన తేజముతో ఆవిర్భంచి, పరమాణు కణము

లకు తన తేజమును అధిష్టింపజేసి వాటి గమనమును నిర్దేశించెనని నిర్ణయించుకొనిరి. ఋగ్వేద మంత్రము ఈ అర్థమునే ప్రతిపాదించుచున్నది.

"అసియమో అస్యావిత్యో ఒర్వన్నసి త్రితో గుహ్యేన వ్రతేన
అసిసోయేన సమయా విపృక్త ఆహూస్తే త్రిణి దివిబంధనాని
త్రీణీత ఆహుర్దివి బంధనాని త్రీణ్యప్సుత్రీణ్యంతః సముద్రే
ఉతేవ మే వరుణశ్ఛన్త్స్యర్వన్యత్రాచ ఆహూఃపరమంజనిత్రమ్"

(1-163-3-4)

## తాత్పర్యము :

అన్నిటికంటెను మొదలు మహావేగవంతమై, అగ్నిస్వరూపమై అర్వాన్ అను పేరుతో ఉద్భవించి ఆ పరమాత్మ త్రితముపై అధిష్ఠితుడాయెను. అధిష్ఠితుడైన ఆ పరమాత్మ ఒకే దిశలో పయనించుచు సబ్ధములైయున్న త్రితములను నియంత్రించి నిలిపి ఉన్ముఖులుగా చేసెను.

## వాక్యార్థము :

అర్వాన్ అను పేరుతో నియంత్రించు యమరాజా నీవు ప్రకాశయుక్తుడవు. అప్రత్యక్షములై ఒకటికొకటి కలిసియుండు త్రితముల సామ్యావస్థను వేరుచేసి దానికి మూడు సంయోగ బంధములను ఉత్పన్నము చేయుచుంటివి. ఆ మూడు దివ్య బంధములు మహదాకాశముగా మారి ప్రవాహ రూపమున (ఆపః) జగత్తుగా మారి అనేకానేక పదార్థ స్వరూపమును సంతరించుకొనినావు.

ప్రకాశవంతమైన తేజము పరమాణువులపై ప్రసరించేవాటిని పరస్పరము ఉన్ముఖీకరణము చేయగా మహత్పదార్థము ఏర్పడినదని ఈ మంత్రము ప్రతిపాదించినది. పురాణములు సృష్టిక్రమమును చెప్పుచు తొలుత మహత్పదార్థమును పేర్కొనినవి.

భౌతిక ఆధ్యాత్మిక తత్వములను తులనాత్మకముగ పరిశీలించిన పాశ్చాత్య విద్వాంసులిట్లు చెప్పిరి.

*" A continual flow of energy going through a great variety of particle patterns in rhytemic dance of creation and destruction "*[5]

క్రమానుగతమైన సృష్టి పరిణామమునందు నిరంతరముగ పరమాణువులలో శక్తి ప్రవహింపబడుచున్నదని పాశ్చాత్య తత్వవేత్తలు చెప్పిన విషయమునకు భారతీయులు **"అర్వాన్"** అను అగ్నితేజమును నిమిత్త ఉపాదానములుగా చెప్పిరని భావించవచ్చును.

భౌతిక శాస్త్రము కూడ ఈ విషయమును బలపరచుచున్నది. ***"ఒక వస్తువు మీద బాహ్యబలం ఏదీ ప్రయోగించబడకపోతే అది విరామస్థితిలో ఉండడంగాని ఋజుమార్గము వెంబడి ప్రయాణించడముగానీ జరుగుతుంది"*** అని వస్తుగమన నియమాల్లో మొదటి నియమము తెల్పుచున్నది [6] పరమాణుకణములు ఒకే దిశలో పయనించుచున్నపుడు తిరిగి అవి ఉన్ముఖీకరణము చెందుటకు బాహ్యబలము కావలెను గదా! ఆ బాహ్యబలమునే వైదిక శాస్త్రజ్ఞులు **"అర్వాన్"** అను పరమాత్మగా గుర్తించిరి.

మరియు ***ఒకే దిశలో ఒకే వేగంతో పయనిస్తున్న వస్తు ధర్మాన్ని-నిశ్చల స్థితిలో ఉండే వస్తు ధర్మాన్ని-జడత్వం-అంటారు'*** వస్తువును సూక్ష్మంగా విభజించగా ఏర్పడిన పరమాణువు కణములు ఒకే దిశలో ఒకే స్థితిలో నున్నవని భౌతిక శాస్త్రజ్ఞులు తెలిపిరి.[7] అది వస్తుధర్మరీత్యా జడత్వ స్థితి. అట్టి జడత్వ స్థితిలోని పరమాణు కణములను *"ఏకోऽహం బహుస్యాం ప్రజాయేయేతి"* అని తలచుకొనిన పరమాత్మ తనతేజముతో వానిని ఆవరించి చైతన్యము కల్గించి ఉన్ముఖీకరణము చేసెను ఈ విధముగ భౌతిక శాస్త్రజ్ఞులు చెప్పిన వస్తుధర్మమును వేదఋషులు దర్శించిన పరమాత్మ భావనకు సమన్వయింపవచ్చును.

శివుడగ్ని స్వరూపునిగ వేదములందు స్తుతించబడెను. చంద్రసూర్యాగ్నులు నేత్రములుగ త్ర్యంబకునిగ వర్ణింపబడెను. నిష్కలమైన పరబ్రహ్మ సృష్టి చేయనెంచి సకలముగా మారిన రూపమిది. అగ్ని స్వరూపముగా ఉద్భవించిన సకల శివతేజము పరమాణు కణముల నధిష్ఠించి, ఇంతకు సూక్ష్మముగా చెప్పిన తనలోని శక్తిని పరమాణు కణములందు ప్రసరింపజేసి తన ఈక్షణముచే వాటిలో పరస్పర ఆకర్షణము కలుగజేసెను. దీనినే ఈశావాస్యోపనిషత్తు *"ఈశావాస్యమిదగుమ్ సర్వమ్"*[8] అని చెప్పినది ఇదియే శివతాండవము అని ప్రతీకాత్మకముగా పురాణములందు, నాట్యశాస్త్రములందు, కావ్యములలో వర్ణింపబడినది. సృష్టిపూర్వము శివుడు తాండ

వము చేయుట అనగా "అర్వాన్"అను శివపరమాత్మ తేజము పరమాణు కణము లలో సంచలనము ఉన్ముఖీకరణము చేయుట. ఈ క్రియాకలాపమున పరమాణు స్ఫోటనము జరుగును. అపుడు పెద్ద ధ్వనిపుట్టును. దీనినే పురాణములు శివుని వీరాట్టహాసముగా వర్ణించినవి. వైయాకరణులు స్ఫోటమనిరి.

భౌతిక శాస్త్రజ్ఞులు విశ్వసృష్టినిగూర్చి చెప్పిన మూడు సిద్ధాంతములలో మహావిస్ఫోటక వాదమొకటి (Big Bang theory) విశ్వపదార్థ పరిణామమునకు సంభవించెడి విస్ఫోటము కారణమని ఈ వాదము పేర్కొంటున్నది. పై తాత్విక సిద్ధాంతమునకు ఈ వాదము ప్రోద్బలకముగనున్నది.

పరమాణువుల పరస్పరతాడనమువలన కలిగిన తేజస్సహితమైనధ్వనిని పాశ్చాత్య తత్వవేత్తలలో కొందరు నాదమని భావించిరి. భారతీయ వైయాకరణులు శబ్దబ్రహ్మమనిరి.

స్ఫుటధాతువునకు పగిలి తటాలున బయటపడుట, వికసించుట, బహిర్గత మగుట అను అర్థములున్నవి. ఈ స్ఫోటనక్రియకు మూలము బ్రహ్మమనియు అది అనిర్వచనీయమనియు, వైయాకరణులు చెప్పిరి. స్ఫోటనక్రియకు కారణమైన బ్రహ్మమునకు స్ఫోటమునకు అభేదముచెప్పి స్ఫోటమును శబ్దబ్రహ్మముగా పిలిచిరి.

" నృత్తావసానే నటరాజరాజః
నవాద ఢక్కాం నవ పంచవారమ్'' 10

అని వర్ణింపబడిన శబ్దావిర్భావము శివుని పరబ్రహ్మముగా చెప్పుచున్నది. ఆయన కల్పించిన వాక్కు-ధ్వని రూపమైపరా, పశ్యంతి, మధ్యమా వైఖరీ భేదములతో సృష్టి చైతన్యముగా విన్యసింపబడినది.

పరబ్రహ్మరూపమగు పరావాక్కు మానవునిలో మూలతత్వముగ నిక్షిప్తమై యున్నది. దీనినుండియే పశ్యంతి, మధ్యమ, వైఖరీవాక్కులు వెలువడుచున్నవి. వైఖరీ వాగ్విశేషము సృష్టియని వాక్యపదీయ సిద్ధాంతము.11 శివతాండవ కావ్యము నందంతటను అనుపల్లవిగా చెప్పబడిన

'' ఆడెనమ్మా శివుడు
పాడెనమ్మా భవుడు ''

అనెడి చరణములలో పరమాణు పరంపరాప్రవాహ సంయోగ విలాసము శివుని ఆటగను, తన్నిర్గతమైన మహాస్ఫోటరూపమగు పదార్థవాగ్విన్యాసము పాటగను వర్ణింపబడినది. అందులకే మంగళకరుడైన శివుడు భవునిగ అనగా భవమును కల్గించిన వాడుగ చెప్పబడినాడు.

భౌతిక శాస్త్రజ్ఞులు పరమాణు సంయోగ విన్యాసమును నాట్యముగ పేర్కొనుట గమనింపదగినది. పదార్థములోని పరమాణువులు లయబద్ధమైన ఒకానొక ప్రమ గమనము కల్గియున్నవని ప్రకటించిరి.

*" Ford is not the only physicist to have used prases like, dance of creation and destruction and '' energy dance" The ideas of rhythm and dance naturally come into mind when one tries to imagine the flow of energy going through the patterns that make up the particle world modern physics has shoun us that movement and rhythm are essential properties of matter that all matter whether here on Earth or in outer space is involved in a continual cosmic dance, (The Toy of physics page No 269)* **12**

భౌతిక శాస్త్రజ్ఞులు అంతరిక్షమునకు ఈవల ఆవలనున్న సకల పదార్థజాత మంతయు లయబద్ధమై కదలికలుగల్గి విశ్వచైతన్య నాట్యవిన్యాసము చేయుచున్నదని పేర్కొనిరి.

ఈ సత్యమును ఆలంకారికముగ అభినయదర్పణమిట్లు వర్ణించినది

'' ఆంగికమ్ భువనం యస్య
వాచికమ్ సర్వవాఙ్మయమ్
ఆహార్యమ్ చంద్రతారాది
తమ్వందే సాత్వికం శివమ్'' **13**

ఈ భావార్థమును పుట్టపర్తి శివతాండవమున

'' సకల భువనంబులాంగికముగాగ శంకరుడు
సకల వాఙ్మయము వాచికముగాగ మృడుండు
సకల నక్షత్రంబులు కలాపములుగాగ
సకలంబు తనయెడద సాత్వికంబుసుగాగ

ఆడెనమ్మా శివుడు
పాడెనమ్మా భవుడు అని వర్ణించెను

శ్రీ అరవిందులు ఈ సృష్టియావత్తు పరమశివుని ఆనందనృత్యం. ఈ ఆనంద నృత్యములో సృష్టి స్థితిలయములు జరిగిపోతున్నవి. భగవంతుని నుండి నవ్య రూపములు ఆవిర్భవిస్తుంటవి. ఈ శివనృత్యం నిర్విరామం చిరంతనం. దీని మహాలక్ష్యం ఆనందం 14 అని చెప్పినట్లు "ఆడెనమ్మా శివుడు పాడెనమ్మాభవుడు" అను అనుపల్లవి శివతత్వార్థమును, శివనృత్తార్థమును ధ్వనింపజేయుచున్నది.

సృష్టికి పూర్వము శివుడు తాండవము చేయుటయే పరమాణు స్ఫోటము. ఈస్ఫోటము శివుని వికటాట్టహాసముగ—పాద తాడనముచేత కలిగిన ధ్వనులని కావ్యము వర్ణించినది. మహాకాలస్వరూపముగ, మహాశ్వేత స్వరూపముగ, నటరాజు నభివర్ణించినది.

"కాష్ఠాఆస్ఫోటయంతం కహకహనినదైర్భీషణైరట్టహాసై
హస్తవ్యాక్షేప భంగైః ప్రసభమపదుత్రితం వ్యోమ కుర్వంతముచ్చైః
పాదా ఘాతైరధోగాం సవనగిరిగుహాకోటి ముత్కంపయంతం
ధిం ధిం ధిం శబ్దఘోరం హృదివికట మహాకాల మాలోకయామః

ఛటచ్ఛట నదచ్ఛిఖా పటల పోషణం భీషణం
బహిర్గత వహం సృజన్విషమలోచనాభ్యంతరాత్
ప్రమత్త ఇవ నృత్యతి ప్రచలితాఖిలాంగ స్స్వయ
స్సమా పతతు మానసే తుహినశైల కూటోచ్ఛ్రితః

బధ్నన్ సృత్తాంతరాంతః ప్రగళితమహిపా కల్పితం పట్టబంధం
సంబందోద్భిన్న ఘోర శ్వసిత హుతవహోదీప్త దంష్ట్రా వికటంకం
ప్రోత్తాల స్త్వైరధీరైః పదయుగళ మహా స్ఫోటనైః కల్పయంతం
నానాభంగాన్ లయబ్ధో భ్రుకుటిత నిటలం శూలినం సంస్మరామః"

కల్పాంతమున అయిన మహాకాలుడు భౌతిక శాస్త్రము చెప్పెడి "Black Hole" నకు అయిన సంకేతము విపరీతమగు వేడిమిచేత నక్షత్ర మండలములోని ఒక్కొక్క నక్షత్రము "నోవా, సూపర్ నోవా" గా మారిపోయి "Black Hole"గా మారును. కాంతిగూడ అందుండి పారదర్శకము పొందలేదు. అనగా సమస్త

పదార్థ జాతము అందేలయించునని భావించవచ్చును. ఇదియే పాక్షికలయము ఇదియే కల్పాంతమునాటి అంధకారముగ పురాణములు పేర్కొనినవి తిరిగి ఇందుండియే మహాస్ఫోటము సంభవించి పునఃసృష్టి ఏర్పడునని భౌతికతత్వవేత్తలు చెప్పుచున్నారు.

*The primal matter which Fuses in "Block Hole" will again explode and restart the whole cycle. In other words the universe has no end bu' an infinite rnmber* ***of*** *endings aud biginnings This* ***means that there*** *is* ***degradation*** *and* ***destruction*** *and then creation and evolu tion"*[15] *(Nataraja the dancing god pg -30)*

కల్పాంతమున ఏర్పడు లయమునే ప్రళయ తాండవముగా లేక సంహార తాండవముగా పేర్కొనిరి కల్పాంతము తరువాత పునఃసృష్టి స్థితి, తిరోధాన అనుగ్రహలయాదులు నిర్విరామముగ జరుగుచునేయుండును. ఇది ఒక చక్రనేమి క్రమము. విశ్వ స్పందనవాదము *(OSCILLATING THEORY)* ఈవిషయమునే చెప్పుచున్నది. డాక్టర్ ఆర్ సి. టాల్మన్ వంటివారి ప్రతిపాదన ప్రకారము విశ్వ విస్తరణము అనంతముగా జరగదు అది తాత్కాలికము కొంతకాలమునకు విస్తరణ ఆగిపోయి ముకుళించుట ప్రారంభమగును. చివరకు మరల బ్రహ్మాండమగు పేలుడు సంభవించి తిరిగి విస్తరణ ప్రారంభమగును అనంతకాలము ఇది ఇట్లు జరుగుచునే యుండునని విశ్వస్పందన వాదము పేర్కొంటున్నది [16]

మహాశ్వేత రూపముగల శివుడు "**అర్వాన్**" అను అగ్నితేజము సృష్టిచేయ నెంచి ఆయన త్రిశూలము ధరించి ప్రమత్తునివలె నృత్యము చేసెను. త్రిశూలమున కున్న మూడు కొనలు త్రితములను చెప్పుచున్నవి ప్రమత్తునివలె నృత్యము చేయు టయే పరమాణుస్ఫోటము ఇట్టి కావ్యములోని నటరాజ వర్ణనము లయకాలమును సృష్టి ఆవిర్భావమును చెప్పుచున్నది.

భౌతిక శాస్త్రజ్ఞులు ఇట్టి సృష్టి, స్థితి, లయాత్మకమగు శివనృత్యమును విశ్వ పరిణామమునకు సమాధానముగ గుర్తించిరి. డా॥ సాగన్ *(Sagan)* అను ఖగోళ శాస్త్రవేత్త తాను రచించిన కాస్మిక్ కనెక్షన్, *(Cosmic connection)* అను పుస్తక మునందు మరియు తాను నిర్మించిన కాస్మోస్ ఎ పర్సనల్ వాయేజ్ *(Cosmos a personal voyage)* అను *TV* చిత్రమునందు ఈ విషయమును ప్రతిపాదించెను. నటరాజ విగ్రహముపైనున్న జ్వాలాతోరణమును ఆయన విశ్వసృష్టికి, లయమునకు సంకేతముగ భావించెను.

Dr Sagan further Says,

"The answers ıu Hindu Cosmology" He pointed to the couch held by shiva and said, this Symbolises creation of the universe, stars, galaxies and humun beings. Showing the fire on the other hand, he added, this symbolises destruction of what has been created. This is the cycle of birth and death as dipicted by Shiva which holds true for the universe where stars take birth and die in a cycle of there own" (Nataraja the dancing god – 31)[17]

పరమాత్మ యొక్క అఖండ తేజమునుండి వెలువడు శక్తియే పౌరాణిక సంప్రదాయమున పార్వతిగ రూపింపబడినది శాక్తేయ సంప్రదాయము ఈ శక్తినే జగన్నియామక శక్తిగా అభివర్ణించినది. ఆదిశంకరులు ఈశక్తి కలిగిన పరమేశ్వరుని పరబ్రహ్మముగా నుతించిరి. శివతాండవ కావ్య ప్రారంభమున శివశక్తి యుతమైన పరమాత్మ సృష్టిని శృంగార భావ ప్రదీపకముగ ప్రతీకాత్మకముగ ఇట్లు వర్ణింపబడెను

కనుపాపలో గౌరి కసినవ్వు బింబింప
కనుచూపులను తరుణ కౌతుకము చుంబింప
కదగి మూడవ కంట కటిక నిప్పులు రాల
కడుబేర్చి పెదవిపై కటిక నవ్వులు వ్రేల
ధిమిధిమిధ్వని సరిద్గిరి గర్భములు తూగ
నమిత సంరంభంబు హాహాకారము రేగ

ఆడెనమ్మా శివుడు
పాడెనమ్మా భవుడు"

పురాణములలో కథారచనము ద్వారా సృష్టి స్థితి లయములను అందముగ ప్రతీకాత్మకముగ చెప్పిరి. శక్తియుతమగు పరమేశ్వర తేజమును అర్ధనారీశ్వరమూర్తిగ వర్ణించుట ఈ దృష్టితోనే.

పరమేశ్వరుని అఖండ తేజము యొక్క ఈక్షణము వలన శక్తి ప్రసరించి పదార్థములు రూపొందుటయే సృష్టి. పదార్థములో శక్తి గతిహీనమై మరల పరమాణువులు సామ్యావస్థను పొందుటయే లయము ఈ రెండు క్రియలు పరమేశ్వరుని యిచ్ఛను బట్టియే అనువర్తితములగు చున్నవి పరమేశ్వరుడు శక్తితో కూడినవాడు గనుక అర్ధనారీశ్వర రూపములోని కుడియెడను భాగములు లయమునకు-సృష్టికిని ప్రతీకలు. ఈ భావము కావ్యమిట్లు వర్ణించినది.

"ఒక భాగమున సృష్టి—ఒకవైపు ప్రళయంబు
ఒక యడుగు జననంబు—ఒక యడుగు మరణంబు"

లయమునుండియే సృష్టి ఏర్పడును. సృష్టి కల్పాంతమువరకు పరిణామము పొంది తిరిగి లయగును. ఈ మధ్యలో సాక్షికముగా సృష్టి స్థితి లయ, తిరోధాన అనుగ్రహ కృత్యములు నిర్విరామముగా జరుగుచునేయుండును. ఈ నిర్విరామ సృష్టి క్రియా కలాపమే శివనృత్తముగ కళాభిజ్ఞులు దర్శించిరి. కవులు వర్ణించిరి ఆనందకుమారస్వామి ఇట్టి తాండవమును నాదాంత నాట్యముగ పేర్కొనెను 18

ఈ సృష్టి బ్రహ్మాండము పిండాండము అని రెండు విధములు. బ్రహ్మాండమ్ము నందు చైతన్యరూపమున పరమేశ్వరుడు సర్వత్రవ్యాపించి యుండును. పిండాండము అనగా మానవుని శరీరము. అందు హృదయమున చిన్మయరూపమున పరమేశ్వరుడు వెలుగుచునుండును, బ్రహ్మాండమున పంచభూతములు సూర్య—చంద్రులు, నక్షత్రాది రూపముల వెలుగు పరశివుడు మానవునిలోను పంచ భూతములుగ సూర్యచంద్రుల వంటి నేత్రములుగ, జీవుడిగా విరాజిల్లుచున్నాడు, ఇట్టి జీవుని హృదయాకాశములో పరశివుడు నృత్తముచేసి జ్ఞానము కల్గించును. అదియే మోక్షము. జీవుడు అధోముఖుడై తానధిష్ఠించిన శరీరములోని హృదయా కాశమున నర్తించు పరమ శివుని దర్శించిన అజ్ఞానము తొలగిపోవును. అజ్ఞానము తొలగి పోవుటయే మోక్షము. మనలోని అజ్ఞానము, తామసము అనునవి నాట్య విగ్రహములో శివుని పాదముల క్రింద త్రొక్కబడిన ముయ్యకునిగా శిల్పులు రూపించిరి. ఆనందకుమారస్వామి ఇట్టి నృత్యమును ఆభ్యంతర నృత్యమని పేర్కొనెను.19 శివతాండవ కావ్యమున నటరాజు ప్రదర్శించిన హస్తాభినయము ద్వారా ఈ విషయము ప్రకటింపబడినది.

"హస్తాంబుకనుదోయి కద్దంబుగా నిలిపి
శస్త్రంబరాళంపు సంజ్ఞయెదురుగ మలపి
భూతంబు శిరము-సాకూతంబుగను చూపు
ప్రీతిగావింప నిర్విస దేవతల కెల్ల
నాభికెదురుగ దక్షిణమ్మయిన హస్తమ్ము
శోభలను జల్లింప సోలపద్మపు ముద్ర"

ప్రాకృతికమైన తెరవెనుక దివ్యజ్యోతి కలదనియు, అది నాభిపైభాగమున అధోముఖముగానున్న పద్మకోశాంతర్గతమైనదనియు, ఈ భంగిమ సారాంశము, నటరాజ చిదంబర స్థానమును తెలియజేయుచున్నది.

సంధ్య రెండవస్థలకు నిలయము. ప్రాతఃసంధ్యలో జాగృతమైన కాల చైతన్యము సాయం సంధ్యాసమయమున సామ్యావస్థను పొందును. సాయం సంధ్యా కాలమున జాగృతమగుటయే సంధ్యాతాండవము. పగటివేళ కాలచైతన్యము సూర్యుని అంటిపెట్టుకుని ప్రయాణించును. రాత్రికాలమున చంద్రుని అంటిపట్టుకొని ప్రయాణించును. కృష్ణపక్షమున నక్షత్రగణములు. శివుని నేత్రములే సూర్య చంద్రులు—అతని ఆభూషణములే నక్షత్రగణములుగ వర్ణింపబడిన రహస్యమిదియే. ఈ సంధ్యాకాలమున పాక్షికముగ సుప్తత పొందబోవు కాలచైతన్యము తిరిగి జాగృతమై సృష్టిక్రియాకలాపమును నిర్వహించుటకు పూనుకొనుటయే సంధ్యా తాండవము. సంధ్యాకాలమిట్లు పరమేశ్వరేచ్ఛకు సాక్షీభూతముగ నున్నందున పరమపవిత్రమై పూజార్హమైనది. వ్యక్తమగు పరమేశ్వర శక్తినుపాసించుటయే సంధ్యావందనము. ఈ కావ్యమున వర్ణింపబడినది సంధ్యాతాండవము.

*"సాంధ్యలతాండవమాడు దుఃఖితాపన్న శరణ్యుండీశ్వరుడు-*
*భావమునన్ విగురించుగావుతన్"* —

అని తాండవారంభమున కవి ప్రార్థించెను. 'సాంధ్యల' అని బహువచనమునుప- యోగించుటచేత ప్రాతస్సంధ్య, సాయం సంధ్యలుగ భావించవచ్చును. జీవుడు అజ్ఞానమునకు లోనగు కాలమునకు సంకేతము సాయం సంధ్యాకాలము. జీవుడు అజ్ఞానమునుండి జ్ఞాన మార్గమునకు పయనించు కాలము ప్రాతస్సంధ్యకు సంకేతము. సాధారణమానవులు తమతమపూర్వోత్తర కర్మఫలములు కామాదికములననుభవించుట సాయం సంధ్యాకాలమున ప్రవర్తిల్లును. అప్పుడే అంధకారము ప్రవేశించును. ఇది జీవుల అజ్ఞానమును సూచించుచున్నది. అందులకే వారినుద్ధరించుటకు శివుడు సంధ్యాతాండవము చేయుట. ఇదిస్థితిస్వరూపమైనది కాని సంయమనముగల— యోగులు అజ్ఞాన విషయావరణమునందు చిక్కువడక జాగృతి కలిగియుందురు. అట్టివారి అజ్ఞానమును స్థిరముగ ప్రతిష్ఠించి తనయందైక్యము చెసుకొనుటకు ప్రాత— స్సంధ్యాకాలమున శివుడు నృత్తము చేయును. ఇది ముముక్షువులకు, భక్తులకు, భాగవతులకు ఉద్దేశింపబడినది. భగవద్గీత 'యానిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి

సంయమీ' అని పేర్కొనినది 20 ఈ విధముగ సంధ్యాకాలము జ్ఞానాజ్ఞానముల కలయిక, వెలుగుచీకటుల కూడలి ఈ కావ్యమున

''తొలుసంధ్యలో తెల్వి దూకి వచ్చినయట్లు
మలిసంధ్యలో కాంతి మరలిపోయినయట్లు''

అని 'తెల్వి' జ్ఞానమును — లయమును సూచించునటుల, **"కాంతి మరలిపోవుట'** అజ్ఞానమును స్థితిస్వరూపమును సూచించునటుల వర్ణింపబడినది. ఈ విదముగ ప్రాతస్సంధ్యాకాలము లయహేతువనియు, సాయంసంధ్యాతాండవము స్థితిరూపమనియు భావింపవచ్చును ఈవిషయము పాశ్చాత్య తత్త్వవేత్తలు కూడ భావించిరి.

*" The dance of Shiva symbalizes not only the cosmic cycles of creation and destruction, but also the daily rhytham of birth and death which is seen in Indian mysticism as the basis of all existence,"* 21

సాయం సంధ్యా నృత్తము లాస్యతాండవమనియు, ప్రాతస్సంధ్యానృత్తము ఉద్ధత తాండవమనియు చెప్పవచ్చును నటరాజు సౌకుమార్య ఔద్ధత్య కరణములను తాండవమున అభినయించెను శృంగారభావయుతమగు సుకుమార లాస్యతాండవము స్థితిరూపమును, ఉద్ధత తాండవము లయభావమును ప్రకటించును. లాస్యప్రవర్తకురాలు పార్వతి. ఆమెయే శివునిశక్తి శక్తి సృష్టి సంజనకమని వెనుక తెలుపబడినది కనుక సాయంసంధ్యాకాలము శివశక్తుల కలయిక ఇట్టి సంధ్యను కేవలము శక్తిగనే దర్శించిన గాయుత్రిగను, శివశక్తుల కలయికగా దర్శించిన అర్ధనారీశ్వర తత్త్వముగ గోచరించును. శివుని సంధ్యాతాండవము — సౌకుమార్య — ఔద్ధత్య కరణములతో, అర్ధనారీశ్వర భావయుక్తముగ కావ్యమున వర్ణింపబడినది

''ఒకవైపు తాండవం — ఒకవైపు లాస్యమ్ము
ఒకవైపు గాంభీర్యం — మొకవైపు శృంగార
మొకవైపు భస్మంబు — యొకవైపు చిత్రకం
బొకవైపు భేదదృక్ — ఒకవైపు అభేదముగ
ఆడెనమ్మా శివుడు
పాడెనమ్మా భవుడు.''

౧౮౦

అధస్సూచికలు :-


1) " సుప్రీమ్ ఎనర్జీ " - పేజి-6, నాటరాజ ది డాన్సింగ్ గాడ్,
ప్రొజెష్ జెసర్జీ

2) " పేజి- 7,

3) " పేజి- 8, "

4) సృష్టి రచనా- గురుదత్- పేజి- 25

5) ది, టాయ్ ఆఫ్ ఫిజిక్స్- చాప్టర్- 15. పేజి-261
ఫ్రిట్ జోఫ్ క్యాప్రా.

6) న్యూటన్ గమన నియమాలు- పేజి- 75
భౌతిక శాస్త్రము-

7) " " "

8) ఈశావాస్యోపనిషత్- మొదటి మంత్రము

9) "ది, యూనివర్స్ & మాన్-" సైన్స్ & టెక్నాలజీ ఫౌండేషన్ కోర్స్.
ఓపెన్ యూనివర్సిటి- పేజి- 5.

10) పీఠిక- వాక్యపదీయము భర్తృహరి.

11) " "

12) "ది కాస్మిక్ డాన్స్" పేజి- 269-. ది టాయ్ ఆఫ్ ఫిజిక్స్-
ఫ్రిట్ జోఫ్ క్యాప్రా

13) మొదటి శ్లోకము- అభినయ దర్పణము నందికేశ్వరుడు

14) ది ఫౌండేషన్స్ ఆఫ్ ది ఇండియన్ ఆర్ట్ అండ్ కల్చర్. పేజి- 222.
శ్రీ అరవిందులు

15) "సైంటిఫిక్ థీరి" నటరాజా ది డాన్సింగ్ గాడ్. పేజి- 30
ప్రొజెష్ జెసర్జీ.

16) - " సైంటిఫిక్ థీరి " " పేజి- 31

17) సైంటిఫిక్ థీరి "

18) "డాన్స్ ఆఫ్ శివా " ఆనందకుమారస్వామి

19) " ఆనందకుమారస్వామి

20) భగవద్గీత - సాంఖ్యయోగము- 69 శ్లో॥

21) "ది కాస్మిక్ డాన్స్" పేజి- 270- "ది టాయ్ ఆఫ్ ఫిజిక్స్"
ఫ్రిట్ జోఫ్ క్యాప్రా.

# తాండవము – తద్భేదములు

శివుని పంచవిధ కృత్యములే తాండవ భేదములుగా అభినయింపబడెనని నాట్యశాస్త్రము పేర్కొనినది. శివతాండవము పంచ కృత్యముల సమాహార స్వరూపమని ఆనందకుమారస్వామి వ్రాసెను 2 తాండవము సప్తవిధములని ప్రసిద్ధము. అష్టవిధములని కొందరు పేర్కొనిరి.3 శిల్ప శాస్త్రములందు నవవిధములుగ చెప్పబడినది.4 పాల్కురికి సోమనాథుడు శివుడు భక్తుల కొరకు చేసిన కొన్ని ప్రత్యేక తాండవములను చెప్పెను.5 భావప్రకాశము తాండవమును చండ, ఉచ్చండ ప్రచండ భేదములని ముప్విధముగా విభాగించెను 6 ఇవి తాండవ భేదములేకాని శివుడు చేసిన తాండవములు కావు. నాట్యశాస్త్రమున పేర్కొనబడిన సప్త తాండవములివి.

1) కలికితాండవము 2) ఉమాతాండవము 3) సంధ్యాతాండవము
4) త్రిపురతాండవము 5) సంహారతాండవము 6) ఊర్ధ్వ తాండవము
7) ఆనందతాండవము

కొందరు ఉమాతాండవమును గౌరీ తాండవముగా పిలిచిరి. సంహార తాండవమును విజయ తాండవముగా కొందరు విజయమును విశ్లేషించు గజాసుర, అంధకాసుర సంహార తాండవములుగా చెప్పిరి. నాట్యశాస్త్రము త్రిపుర తాండవమును విజయ తాండవముగా చెప్పను కలికి తాండవమును కాళికా తాండవముగా నటరాజ రామకృష్ణ పేర్కొనెను. సంఖ్యాపదకర్తలు తాండవములు అష్టవిధములని పేర్కొనిన వాటిలో సంధ్యా, త్రిపుర: గజసంహార తాండవములు ఇతరులు చెప్పినవే. కాని నటరాజ, సతీశివపరిణయ, అర్ధనారీశ్వర, శక్తి, ప్రళయ తాండవములు నామభేదములు కలిగియున్నవి. నటరాజు చేయు నృత్తమే తాండవమైనపుడు ప్రత్యేకముగ నటరాజ తాండవమేమి? ఇది ఆనంద తాండవము కావచ్చును. వీరు ఆనంద తాండవమును చెప్పలేదు. సతీశివ పరిణయ తాండవము ఊర్ధ్వ తాండవముగ, అర్ధనారీశ్వర తాండవము ఉమా లేక గౌరీ తాండవముగ శక్తి తాండవమును కలికి తాండవముగ భావించవచ్చును. ప్రళయ తాండవమును కలుపుకొని ఎనమిది. శిల్పశాస్త్రములలో "**శ్రీతత్వనిధి**" యందు తాండవము సప్తవిధములనీ "**శిల్పరత్నము**" నందు నవవిధములని పేర్కొనిరి. ఆయా శాస్త్రములందు పేర్కొనబడిన తాండవ భేదములివి

నాట్యశాస్త్రము - శిల్పరత్న - భావప్రకాశము—సోమనాథ—నటరాజ—సంఖ్యా-ప్రొజెష్
రామకృష్ణ-పదకర్తలు బెనర్జి

| (7) | (9) | (3) | (5) | (7) | (8) | (7) |
|---|---|---|---|---|---|---|
| కలికి తాండవము | కలికితాండవ | — | — | కలికి | — | కలికి |
| ఉమా తాండవము (గౌరీ) | ఉమా ,, | — | — | ఉమా | — | ఉమా |
| సంధ్యాతాండవము | సంధ్యా ,, | — | — | సంధ్యా | సంధ్యా | సంధ్యా |
| సంహార తాండవము | సంహార ,, | — | — | సంహార | — | సంహార |
| త్రిపుర తాండవము | త్రిపుర ,, | — | — | — | త్రిపుర | త్రిపుర |
| ఊర్ధ్వ తాండవము | — | — | — | ఊర్ధ్వ | — | — |
| ఆనందతాండవము | ఆనంద ,, | — | — | ఆనంద | — | ఆనంద |
| | గౌరీ ,, | — | — | — | — | గౌరీ |
| | షడ్భుజ ,, | — | — | — | — | |
| | చతుర ,, | — | — | — | — | |
| | | చండ | — | — | — | |
| | | ఉచ్చండ | — | — | — | |
| | | ప్రచండ | — | — | — | |
| | | | గజాసుర సంహార | — | గజ సంహార | |
| | | | అంధకాసుర సంహార | — | — | |
| | | | చేమచక్రవర్తిని | - | — | |
| | | | అనుగ్రహ | — | — | |
| | | | | విజయ | | |
| | | | | | నటరాజ | |
| | | | | | సతీశివప్రణయ | |
| | | | | | అర్ధనారీశ్వర | |
| | | | | | ప్రళయతాండవ | |

ఈ తాండవ భేదములన్నియు శివతాండవ కావ్యమున ప్రత్యేకముగ వర్ణింపబడలేదు. నటరాజు ప్రదర్శించిన అభినయ భావములను బట్టి సప్త తాండవ స్ఫురణము నూహించవచ్చును. నాట్యశాస్త్రమునందు చెప్పబడిన తత్వము లాధారముగ ఈ

కావ్యమున సప్తతాండవ భేదములను గమనింప వచ్చును. అట్లే శిల్పశాస్త్రములందు సప్తతాండవములకు చెప్పబడిన రూపలక్షణము లన్నియు ఈ కావ్యమున నటరాజు నందు వర్ణింపబడలేదు. అలంకరణము, ముఖవర్చస్సు, త్రినేత్రముల గూర్చి చెప్పబడిన విషయములలో కొంతసామ్యమున్నది బహుబాహువులు కల్గియుండుట, అపస్మారుడిపై పాదము మోపుట, అనేక ఆయుధములు ధరించుట అనువిషయములు వర్ణింపబడలేదు. నటరాజ రూపవర్ణనము ఈ కావ్యమునందిట్లున్నది.

> " మొలక మీసపుకట్టు—ముద్దుచందురు బొట్టు
> పులితోలు హొంబట్టు— జిలుగు వెన్నెల పట్టు
> నెన్నడుమునకు చుట్టు- క్రొన్నాగు మొలకట్టు
> క్రొన్నాగు మొలకట్టు— కురియు మంటల రట్టు
> సికపైననల్ప కల్పక పుష్పజాతి—క
> ల్పక పుష్పజాతి జెర్గాడు మధుర వాసనలు
> బింబారుణము కదంబించు తాంబూలంబు "

ఈ కావ్యము శ్రీవ్య కావ్యము కనుక మొలక మీసపు కట్టు, బింబారుణము కదంబించు తాంబూలము వర్ణింపబడినవి శిల్పశాస్త్రములందిట్టి రూపములేదు. రెండు చేతులు, మూడు కన్నులు, కలిగియున్న నటరాజు మహానటునిగ, గాయకునిగ వాద్యకారునిగ వర్ణింపబడెను. శిల్పశాస్త్రములలో చెప్పబడిన నాగాభరణములు, కాలిఅందెలు, మెడలోఎముక పేరులు, రుండమాల, చెవులకు మకర కుండలములు, జటాజూటమునందు చంద్రరేఖ, దత్తూరపుష్పములు మొదలగునవి వర్ణింపబడినవి. నర్తనము సేయు నటరాజు శరీరముపై స్వేదము, స్వేదజలముచే తెట్టెలుకట్టిన విభూతి, తాంబూలవాసనలకు తగులుకొను భృంగగణము, దంతకాంతులు మొదలగు శిల్పరూపమున కంపని దృశ్యములు శ్రీవ్య కావ్యానుగుణముగ వర్ణింప బడినవి.

# శిల్పశాస్త్రములలో సప్తతాండవ రూపలక్షణము

## ఆనందతాండవము :

1) హస్తములు నాలుగు. కుడిచేయి అభయముద్ర, ఎడమచేయి గజహస్తముద్ర కుడిపైచేయిలో డమరుకము, ఎడమపైచేయిలో అగ్ని.

2) పాదములలో ఎడమపాదము కుంచితము, కుడిపాదము అపస్మారుడిపై.

3) కన్నులు మూడు.

4) యజ్ఞోపవీతము, గజచర్మము, కాలి అందెలు, మకర కుండలము, కుడి, ఎడమ చేవులందు కమ్మలు, శిరమున గంగదత్తుర పుష్పములు.

5) ముఖవర్చస్సు తెలుపు.

## సంధ్యాతాండవము

1) హస్తములు నాలుగు. కుడిచేతులలో డమరుకము, అభయముద్ర, ఎడమపై చేయి నెమలి ఈక, అలపాలహస్తాభినయము.

2) కుడిపాదం అపస్మారుడిపై, ఎడమపాదము కుంచితము.

3) మూడు కన్నులు.

4) జటామకుటము, శిరముపై కపాలము, దత్తుర అర్కపుష్పములు, చంద్రుడు.

5) ముఖవర్చస్సు తెలుపు

## ఉమాతాండవము

1) హస్తములు ఆరు. కుడిచేతులలో అభయహస్తముద్ర, డమరుకము త్రిశూలము, ఎడమ చేతులలో కరిహస్తముద్ర, అలపాల హస్తముద్ర పుఱ్ఱె.

2) ఎడమపాదము అపస్మారుడిపై, కుడిపాదము కుంచితము.

3) మూడు కన్నులు.

4) జటామండలం శిరముపైగంగ, పులిచర్మము, ప్రక్కన ఉమాదేవిని ధరించుట.

*గౌరీతాండవము*

1) హస్తములు నాలుగు. కుడిచేతులలో డమరుకము; అభయముద్ర, ఎడమచేతిలో సర్పము-అగ్ని.

2) ఎడమపాదము కుంచితము, కుడిపాదము అపస్మారుడిపై.

3) మూడు కన్నులు.

4) శిరముపై కపాలం దత్తుర-అర్క-పుష్పములు, చంద్రుడు-కంకణములయందు సర్పములు, వామ భాగమున రుద్రగణములు, కుడివైపు నంది.

5) ముఖవర్చస్సు ఎరుపు

*కాళికాతాండవము*

1) హస్తములు ఎనిమిది. కుడిచేతులలో అభయముద్ర - త్రిశూల, పాశ, ఢమరుకములు, ఎడమ చేతులలో కరిహస్తముద్ర, పుఱ్ఱె-గంట-నిప్పు.

2) పాదములలో కుడిపాదము పైకెత్తబడి, ఎడమపాదము కుంచితమై అపస్మారుడిపై నుండును.

3) కన్నులు రెండు.

4) జడలు బంధింపబడి యుండును.

5) ముఖవర్చస్సు నిర్మలము

*త్రిపుర తాండవము*

1) పదహారు చేతులు. కుడిచేతులలో, అభయముద్ర-డమరుకము, ఇనుపశీల-త్రిశూలము, పాశము-గొడ్డలి-దండము, పాము, ఎడమ చేతులలో కరిహస్త-వరద ముద్రలు, నిప్పు, పుస్తకము వృషభపటము, డాలు, గంట, కపాలపాత్ర.

2) ఎడమవైపు ప్రీతిపూర్వకముగ గౌరీ-కుడివైపు.

3) ముఖవర్చస్సు నిర్మలము

*సంహార తాండవము*

1) ఎనిమిది చేతులు, కుడిచేతులలో అభయముద్ర, త్రిశూల-పాశ-డమరుకములు ఎడమచేతులలో, అలపాల-కరిహస్తముద్రలు, పుఱ్ఱె-నిప్పు.

2) పాదములలో కుంచితమైన ఎడమ పాదము అపస్మారునిపై, కుడిపాదము ఎత్తబడి-యుండును

3) జడలువిడివడియుండును అలంకారము-లన్నియు ధరించియుండును, కుడివైపు నంది ఎడమవైపు గౌరీ.

శిల్పరత్నమునందు తొమ్మిదవ భంగిమగా చెప్పబడిన నటరాజమూర్తి అపస్మారుని పైగాక భూమిపైననే నృత్యముచేయుట విశేషము 7 ఈ శివతాండవ కావ్యమున కూడ అపస్మారునిపైనగాక నటరాజు—నేలపైననే నాట్యము చేసెను

## సప్త తాండవ తత్త్వములు:

సప్తతాండవములలో కలికి తాండవము సృష్టికిని, ఉమాసంధ్యాతాండవములు స్థిరత్వపరిరక్షణకు, సంహారతాండవము ప్రపంచలయమునకు, త్రిపురతాండవము తిరోభావమునకు ఊర్ధ్వ తాండవము అనుగ్రహమునకు చిహ్నములు. ఆనద తాండవము పంచకృత్యముల సమాహారస్వరూపము.8

సృష్టి చేయనెంచిన సకలశివమూర్తియొక్క పంచకృత్య క్రియా కలాపము సప్తతాండవములుగ నటరాజ రామకృష్ణ పేర్కొనెను. సప్తతాండవములోని ఒక్కొక్క తాండవ తాత్పర్యమును ఆయన ఈ క్రింది విధముగ విశ్లేషించెను.

## ఆనంద తాండవము:

''తానుసృష్టించిన సృష్టినిజూచి ఆనందంతో పరమ శివుడు చేయునృత్యమే ఆనందతాండవము కుడిచేతులలో డమడమమోగే డమరుకం సృష్టికి కారణమైన నాదాన్ని ధ్వనింపజేయును వామహస్తంలో ప్రజ్వరిల్లే అగ్ని ప్రపంచ నిరోధక శక్తులను భస్మమొనరించు క్రియను నిర్వహించును. అభయహస్తము ప్రపంచ శ్రేయస్సుకుతమ జీవితమును ధారపోయు త్యాగజీవులకు అభయ ప్రదానం చేస్తుంది. నాల్గవచేయిపతాకహస్త విన్యాసంలో విజయానికి సంకేతంగా ఉన్నది.

సృష్టిలోని జీవకోటి సంచలనమే ఆతని ఆంగికాభినయము ప్రపంచంలోని వివిధ వాదములే ఆతని వాచికము చంద్రతారకలు ఆహార్యకము మానవుల చిత్త ప్రవృత్తియే సాత్వికాభినయము ''9

శిల్పశాస్త్రముకూడ ఆనందతాండవ భంగిమయందు అభయముద్ర-డమరుక ధారణమును చెప్పినవి ఆనందతాండవము ఈకావ్యముననిట్లు వర్ణింపబడినది.

''సకలభువనంబు లాంగికముగాగ శంకరుడు
సకలవాఙ్మయము వాచికముగాగ మృడుండు
సకల నక్షత్రములు కలాపములుగాగ
సకలంబు తన ఎడద సాత్వికంబునుగాగ
తన నాట్య గరిమంబు దనలోనెతావలచి
నృత్యంబు వెలలుంచి నృత్తంబురుఘుశిపించి
నృత్త నృత్యములు శబలితముగ జూపించి''

**"సకలంబు"** అనుచోట నిష్కలమైన పరబ్రహ్మ సృష్టిలోనికి కళాయుక్తుడై అవతరించుట స్పష్టముచేయబడినది. ఇదియే తిరోధానము నృత్యనృత్తములను శబలితముగ జూపించుట భావాంగి కాభినయముల అవినాభావ సంబంధమును అనందాతిరేకమును సూచించుచున్నది. సృష్టికి మూలమగు నాదమును వ్యక్తీకరించు డమరుధ్వనిని,

'' కోనలును కొండలును కోల్మొసగి తలలూప
కొనగోలుపలికి సాకూతంబుగాజూచి
ఢక్కచెక్కను గీటిడంబుగా పలికించి
యెక్కడను తననాట్యమే మార్మ్రోయంగ
తానె తాండవమౌనా — తాండవమె తానౌనా
యేనిర్ణయము తనకె బూనిచేయగరాక
దామరచి పురపించి తన్నుజేసినవారి
గామునిని తనమూడు గన్నులను సృష్టించి''

ఢక్కచెక్కను మీటుటచేత సృష్టికి మూలమైన నాదము పుట్టుచున్నది. ఆ నాదము అంతటను వ్యాపించి అనేకధ్వని తరంగములను సృష్టించుచున్నది. ఆ తరంగముల లోని అనేకవిధములగు లయవిన్యాసములే నాట్యమగుచున్నవి. ఆనాట్యమేతాండవము ఆ తాండవమునకు నటరాజునకు అభేదము. తనసృష్టినిజూచి తానే ఆనందముతో

మైమరచి ఆడిన ఆనందతాండవ లక్షణమిచట వర్ణింపబడినది. ''**తామరచి**'' అనుటలో పరమాత్మ జీవాత్మగా అవతరించిన తిరోధానకృత్యము, ''**మరపించి**'' అనుటలో తన సృష్టిరచనా చమత్కృతితో ప్రాకృతులను మోహింపజేయు స్థితిలక్షణము ''**తన్నుజేరినవారి కాముని దనమూడు కన్నులను సృష్టించి**'' అనగా తనను శరణుపొందినవారి ఐహిక కామ భావనల హరించెననుట ప్రకటితమయ్యెను. ఇది పంచకృత్యములలోని అనుగ్రహమును వెల్లడించును

సృష్టిలోని ఆరాచక శక్తులను అణచి విజయమును సూచించెడి పతాక హస్త విన్యాసము ఇట్లు వర్ణింపబడినది.

" సమశీర్షకముతోడ సమదృష్టి ఘటియించి
సమపాద విన్యాస చాతుర్యము లగించి
పరపతాకమ్ము దాపటికేల నెసకొల్పి
వామహస్తంబు అధోవక్త్రముగ సంధించి "

శిల్ప భంగిమలలో కన్పించు అజ్ఞాన సూచకముగు ముయ్యకుడను మరుగుజ్జు శివుని పాదముల క్రింద త్రొక్కబడు వర్ణనమిందులేదు. కాని విజయ సూచకమగు పతాకహస్త వర్ణన మున్న స్థితి లక్షణమిట్లు స్పష్టముగ వర్ణింపబడినది.

" కైలాస శిఖరంబు గడగి ఫక్కున నవ్వ
నీలిమాకాశంబు నిటలంబుపై నిల్వ
నందికేశ్వరమృదంగ ధ్వానములు బొదల
దుందిలా కూపారతోయపూరముతెరల
జడలెల్ల కనువిచ్చి సంభ్రమత దిలకింప
నదులెల్ల మదిపొంగి నాట్యములు వెలయింప
వనకన్యకలు సుమాభరణములు ధరియింప
వసుధ యెల్లను జీవవంతమై పులకింప "

వసుధ యంతయు జీవవంతమై పులకించుటయే స్థితిస్వరూపము.

లయలక్షణమిందు మనోహరముగ వర్ణింపబడినది. స్వయంవ్యక్తిత్వము కోలుపోయి భగవంతుని చైతన్యమునందు లీనమైపోవుటమే లయము. జ్ఞానులు అజ్ఞానులు కూడ లయకాలము నందు విశ్వచైతన్యమున లీనమయిపోవుదురు. విశ్వమంతయు తనరూపమును కోల్పోయి ఆనటరాజు సందే లీనమగుటలో ద్వయమునకు స్థానములేక పరమశివ చైతన్యమొక్కటియే నిలచిన స్థితి అద్వైతము.

"శోకమ్ము, సంతోషక మేకమ్ము నరకంబు
నాకంబనేక మ్మనంత మాకాశమ్ము
పరిగతంబగు భూమి, నవ నిధులు బల్వములు
తరులు—బీజములు—గొబ్బిర్వీరులు—కసిమొగ్గలును
జరరాంధ కారంబు పరిణాహి చంద్రికలు
పరమ ఋషులు అజ్ఞాన భరితులందరకునే
డద్వైత — మద్వైతమని మాటి మాటి
కద్వయముగా నాత్మ యఖిలలోకము లార్వ"

ఈ విధముగ సృష్టి, స్థితి, తిరోధాన, అనుగ్రహ లయాత్మకమైన పంచకృత్యరూప మగు నది నటరాజ ఆనంద తాండవము.

"ప్రతి తారకయు విచ్చి—ప్రత్యణువు పులకించి
శితి కంఠునికి అపుడు సెల్లించినది సేవ
ఆనంద సాగరం బంతటను కలసికొన
మీనములు తిమిఘటలు మేదినీ జీవములు
ప్రతి ప్రాణి హృదయమ్ము వల్లకీ వల్లరిగ
మతి మరచి పాడినది మధుర సంగీతమ్ము
జగమెల్ల భావంబె — నడి యెల్ల రాగంబె
జగతియే ఒకనాట్య సంరంభమును గాగ
ఆడెనమ్మా భవుడు
పాడెనమ్మా శివుడు

## సంధ్యాతాండవము :

ఈ కావ్యమున వర్ణింపబడినదంతయు సంధ్యాతాండవమని కవి పేర్కొనెను *"సాంధ్యాల తాండవమాడు దుఃఖితా పన్నశరణ్యుండీశ్వరుడు భావమునన్ చిగురించుగాతన్"* అని తాండవారంభమున కవిప్రార్థించెను. శివప్రదోష స్తోత్రమున సంధ్యాతాండవ వర్ణనము కలదు. అందు విష్ణువు మృదంగము వాయించునట్లు పేర్కొనబడినది. ఈ కావ్యమున నంది మృదంగ వాద్యకునిగ వర్ణింపబడెను దేవతలందరు ప్రేక్షకులుగ నుండిరి. బ్రహ్మ సరస్వతి శివ—పార్వతులకు అలంకరణము చేసిరి. భరతముని—బ్రహ్మ ఇంద్రుడు మొదలగు వారు శివతాండవమును తిలకించి తమ సృష్టి గర్వమును తొలగించుకొనిరి. నటకవర్ణ

సహాయముతో శివుడు సంధ్యాతాండవమును నిర్వహించెను. విష్ణువు సభా నాయకుడిగా వర్ణింపబడెను. తాండవాంతమున శివుడు విష్ణువునకు ప్రణమిల్లును.

సృష్టిలోని స్థిరత్వ పరిరక్షణమునకై శివుడు సంధ్యాతాండవము చేయునవి నాట్యశాస్త్రము పేర్కొనినది. *"సృష్టి నిరాటంకముగ నభివృద్ధి చెందుట జూచి సంతసమున శివుడు చేయు నృత్యమే సంధ్యాతాండవము"* అని నటరాజ రామకృష్ణ తెలిపిరి.10

ప్రాతస్సంధ్యలో వెలుగురేఖలు వికసించుట, సాయం సంధ్యలో వెలుగు రేఖలు అస్తమించుటను

"తొలు సంజలో తెల్విదూకి వచ్చినయట్లు
మలి సంజలో కాంతి మరలి పోయినయట్లు"

నటరాజు తన దృక్-విన్యాసమును అభినయించెను. సంధ్యా కాలమందలి కాంతులు ఆయన శరీరముపై ప్రసరించి చిత్రవర్ణములు వెలిగించినవని "*వరసాంద్రశిమ్మిర ప్రభలు తనువున గూడగా*" ఒడలు పులకరింపగా సంధ్యా నృత్తము శివుడు చేసినట్లుగ వర్ణింపబడెను. తానుసృష్టించిన సృష్టి నిరాటంకముగ సాగిపోగా నటరాజునకు ఒడలు పులకరించినదని, ఆపులకరింపులో, శంఖావదాత రోచన దీప్తితో, ఎముక పేరులు మర్మరము సేయగ, తర్శ తందమ్ము మధ్యమ్ము కిటకిట లాడగా కిణుకిణు మటంచు పద కింకిణులు బిరుదాడగా, నగు మొగమ్ముతో ఉరమ్మున వగలు ప్రదర్శించుచు సంధ్యాతాండవము ప్రదర్శించెను.

కావ్యప్రారంభమునందే ప్రకృతియంతయు శివ పూజకు సమాయత్తమైనది. సంధ్యాసతినవకుసుంభరాగవసనమై, సంభ్రమముతో, లజ్జా మధుర కటాక్ష పాతముతో శివపూజకు సిద్ధమైనది.
కవి సూర్యుని సంబోధించుచు

"ఆడెడు నట నార్యా ప్రాణేశ్వరుడో
దినమణి నిలురా దినమంతయు"

అని నటరాజు తాండవము సంధ్యాతాండవముగా ప్రకటించెను. ఇట్టి సంధ్యా తాండవమునందు ప్రదర్శించిన భావాభినయ, అంగికాభినయములలో సప్తతాండవ తత్వములు గర్భీకరింపబడినవి.

## కలికితాండవము :

దీనినే కాళికా తాండవమని పిలుస్తారు. ప్రపంచఅభివృద్ధి నిరోధకములగు అజ్ఞానము, అవినీతి, మొదలైన దుష్టభావములను హతమార్చు అంగ చాలనమే కపాలేశుని కలికి తాండవము అని నటరాజ రామకష్ణ అభిప్రాయము శివనాట్య శిల్పములలో భద్రకాళితో నాట్యము చేయుచున్న శిల్పము సంగమేశ్వర దేవాలయము నందున్నది. శివతాండవ కావ్యమునందు.

భుగభుగ మటంచు నిప్పులు గ్రిమ్మనూరుపులు
ధగ ధగిత కాంతి తంద్రములుగా కకుభములు
దంత కాంతులు దిశాంతమున రింగులు వార
కాంత వాసుకి హస్త కటకంబు డిగజార
భావోన్నతికి దాపటి మేను వలపూర
భాషా వృతంబు వల్పలి మేను గరుపార

అని వర్ణింపబడియున్నది. కలికితాండవము సృష్టికి ప్రతీకమని శైవాగమములు పేర్కొనినవి. నటరాజ రామకృష్ణ పేర్కొనిన దుష్టశక్తి దమనము,— అగమములు పేర్కొనిన సృష్టి ప్రతీకముపై వర్ణనయందు స్ఫురించుచున్నది. ***"భుగ భుగ మటంచు నిప్పులు గ్రుమ్మ నూరుపులు"*** దుష్ట శక్తి దమనమును ***"మేనులు వలపూరుట"*** సృష్టి క్రియా కలాపమును తెలుపుచున్నది ***"కాంత"*** అని పేర్కొనుట చేత అర్ధనారీశ్వర రూపము స్ఫుటమై కలికి తాండవాధినయముగా ఈ వర్ణనము కనిపించుచున్నది.

## విజయతాండవము :

శివుడు దుష్టశక్తుల నణచి వాటిని తన ఆభూషణములుగా చేసికొనినట్లు స్కాంద పురాణకథనము, ఆనంద కుమారస్వామి, శివరామమూర్తి, నటరాజరామకృష్ణ, ప్రొఫెసర్ బెనర్జీ మొదలగునాట్య విమర్శకులు ఈవిషయము పేర్కొనిరి అర్ధనారీశ్వర రూపముతో శివుడు ఋష్యాశ్రమమునకు వెళ్ళగా వారు శివుని పరీక్షించుటకు దుష్ట శక్తులను సృష్టించి పంపిరి శివుడు తనచిటికెన వ్రేలుగోటితో క్రూరవ్యాఘ్రచర్మ మును ఒలిచినడుముకు చుట్టుకొనెను. సర్పమును మెడలో ధరించెను. హోమ

గుండము నుండి వెలువడిన ముయ్యకుడను రాక్షసుని వెన్నెముక విరచి పాదముల క్రింద బడవేసి త్రొక్కి నాట్యము చేసెను. విజయమును ప్రకటించు ఈ నాట్యమే విజయతాండవము కొందరు త్రిపుర తాండవమును విజయతాండవమని పిలిచిరి. ఈ కావ్యమున ముయ్యకుడను రాక్షసుని దమనము వర్ణింపబడలేదు. కాని విజయ సూచకమగు ***"వర పతాకమ్ము దావటి కేలనెనర్పి"*** అని పతాకహస్తము ***"పులితోలు హొంబట్టు"*** అని వ్యాఘ్రచర్మవర్ణనము ***"బుసలుగొని తలమట్టు భుజగములు పారాడ"*** అని నాగాభరణము వర్ణింపబడుటచే విజయతాండవము స్ఫురించుచున్నది.

## ఊర్ధ్వతాండవము :

పార్వతీ పరమేశ్వరుల నాట్య కలహమే ఊర్ధ్వ తాండవమునకు కారణము. శివ శక్తులు స్పర్ధవహించి నృత్తాభినయమును ప్రదర్శించుచుండిరి శంకరుడు తనతో సమానముగ నృత్తము చేయు పార్వతిని గెలుచుట కంత వరకు చేయుచున్న నృత్తభంగిమ మార్చి ఆశ్చర్యముగ ఒక పాదము నెత్తిపై నుంచుకొని లయ మార్చి వికటముగ తాండవ మాడుట మొదలు పెట్టెను పార్వతి అట్లు చేయక తన నాట్యము నిలిపివేసెను. ఇదియే ఊర్ధ్వతాండవ విశేషము. తాత్వికముగ ఊర్ధ్వ తాండవ విశేషభంగిమ లయమును సూచించును.

ఈ క్రిందిభంగిమలో శివాశివుల ఊర్ధ్వ తాండవ విశేషము ప్రకటింపబడినది.

" హంసాస్యమును రెండు హస్తముల నించి
అంస భాగంబులకు నానించి చూపించి
కలికి చూపుల చంపకములపై జల్లించి
కెలకులకు కంఠమ్ము మెలపుతో నాడించి
కనుగ్రుడ్లు కనుల చక్రము జుట్టిచుట్టరా
ధనువులై బొమలు తద్దయు కాంతి నిల్పరా
నొకకాలు దివిగొల్ప నొక కాలు భువి నిల్ప

హస్తముద్రలు, కన్నులు, కనుబొమ్మలు ఒకే విధముగ ప్రదర్శించి, పాదములలో నొకకాలు భువి నిల్పియుండగ, నొక కాలు దివి కొల్పినదని చెప్పుట చేత ఈ భంగిమ నటరాజ ఊర్ధ్వ తాండవ విశేషము

## ఉమా తాండవము :

ఉమా తాండవమునే గౌరీ తాండవముగ చెప్పుదురు. నాట్యశాస్త్రమున ఉమా తాండవము సృష్టికి ప్రతీకమని చెప్పబడినది.

“ తలపైన చదలేటి ఆలలు తాండవమాడ
అలల త్రోపుడుల కొన్నెల పూవు కదలాడ
మొనసి ఫాలము పైన ముంగురులు చెరలాడ
కనుబొమ్మలో మధుర గమనములు నదయాడ
కనుపాపలో గౌరి కసినవ్వు బింబింప
కనుచూపులను తరుణ కౌతుకము చుంబింప
కడగి మూడవ కంటకటిక నిప్పులు రాల
కడుబెచ్చి పెదవిపై కటిక నవ్వులు వ్రేల
ధిమిధిమి ధ్వని సరిద్గిరి గర్భములు తూగ
నమిత సంరంభంబు హాహాకారము రేగ”

శివశక్తుల సమ్మేళనమే సృష్టి. కనుపాపలో గౌరి కసినవ్వు బింబించుట, కనుచూపులను తరుణ కౌతుకము చుంబించుట, శృంగార భావమును చెప్పుచున్నవి. మూడవ కంటిలోని కటికనిప్పులు తేజోవంతములగు ఆగ్నికణములు, గౌరియని పేర్కొనబడుటచేత, సృష్టి కార్యము ప్రతీయమానమగుట చేత ఈ వర్ణనము **“గౌరీ తాండవము”** అన వచ్చును

## సంహార తాండవము :

ఈ తాండవము ప్రపంచ లయమును సూచించునని నాట్యశాస్త్రము పేర్కొనినది మాయా వ్యామోహములనుండి జీవకోటిని విముక్తము చేసి తనలో ఐక్యము చేసుకొను తత్వము కల్గినది నటరాజు ప్రదర్శించిన సంహార తాండవము.

“ శోకమ్ము సంతోషమేకమ్ము నరకంబు
నాకంబ నేకమ్మనంత మాకాశమ్ము
వరిగతంబగు భూమి నవనిదులు బిల్వములు
తరుణ బీజములు గ్రొవిత్తురులు, గసి మొగ్గలును

జరరాంధకారంబు పరిణాహి చంద్రికలు
పరమ ఋషుల జ్ఞాన భరితులందరుకునే
దద్వైత పద్వైతమని: మాటి మాటి
కద్వయముగా నొత్తి, యఖిల లోకము లార్వ ''

సర్వ ప్రపంచము పరమాత్మయందు లీనమై అద్వైత స్థితి ననుభవించినట్లు చెప్ప బడుట చేత నిది సంహార తాండవము. ఇది పంచకృత్యములలోని లయభావమును సూచించును

ఈ విధముగ ఈ శివతాండవ కావ్యము. తలపైని చదలేటి అలలు తాండవ మాడ - అని సృష్టి భావము ప్రకటించు వర్ణనముతో ప్రారంభింపబడి - సంహార తాండవముతో ముగించబడినది. సృష్టి స్థితి, తిరోధాన అను గ్రహ లయాత్మక మైన పంచకృత్యములు ప్రకటించు సప్త తాండవములు ఈ కావ్యమునందు వర్ణింపబడినవి. సంధ్యాసమయమున నటరాజు నృత్తము చేసినట్లు చెప్పబడి సంధ్యాతాండవముగ కన్పించు నీ కావ్యము సప్తతాండవ వర్ణనము కలిగి **"శివతాండవము"** అను కావ్య నామమునకు విస్తృతార్థము స్థిరపరచినది.

## అధస్సూచికలు :

1) నాట్యశాస్త్రము పేజి-80
2) డాన్స్ ఆఫ్ శివా ఆనందకుమారస్వామి
3) అష్టవిధ తాండవములు - సంఖ్యావద కోశము
సంపాదకులు డా॥ బి అనంతరావు
4) చూడుడు "*వెరైటీస్ ఆఫ్ నటరాజా యాజ్ డిస్క్రైబ్డ్ ఇన్ శిల్ప టెక్ట్స్*" చాప్టర్-II. నటరాజా ఇన్ ఆర్ట్, థాట్, అండ్ లిటరేచర్.
— సి. శివరామమూర్తి.
5) "***మహాతాండవలీల***" పండితారాధ్య చరిత్ర పాల్కురికి సోమనాథుడు.
6) తాండవ లక్షణము—భావ ప్రకాశము శారదాతనయుడు తెలుగు అనువాదము.
జమ్మల మడక మాధవరాయశర్మ
7) వెరైటీస్ ఆఫ్ నటరాజా యాజ్ డిస్క్రైబ్డ్ ఇన్ శిల్ప టెక్ట్స్ చాప్టర్-II నటరాజా ఇన్ ఆర్ట్, థాట్, అండ్ లిటరేచర్ —సి. శివరామమూర్తి
8) నాట్యశాస్త్రము-
9) '*సప్త తాండవము*''-నృత్య రేఖ—నటరాజ రామకృష్ణ
10) ,, ,, ,,
11) ,, ,, ,,

# ముద్రాతత్వము-నటరాజ భంగిమలు

శివతాండవమున నటరాజు హస్తాభినయములను, పాదముల ద్వారా భూచారి, ఆకాశచారి విన్యాసములను ప్రదర్శించెను. ఈ హస్తపాద విన్యాసములు విడివిడిగాను, కలిసియు ప్రదర్శింపబడెను హస్తపాద సమాయోగమునకు నాట్యశాస్త్రమున ''కరణమని'' పేరు కరణములు నూట ఎనిమిదిగా చెప్పబడినవి. రెండు కరణములు కలసిన ''మాతృక''యని మూడు కరణములకు ''కలాపమని'' నాల్గు కరణములకు ''మండక' మని అయిదింటికి ''సంఘాతక''మని ఆరు నుండి తొమ్మిది అంతకుమించిన కరణముల కలయిక వలస అంగహారములేర్పడును ఈ కరణములు నృత్తమునందు ప్రయుక్తమగును వీటికి అభినయము జోడించిన భరతమతాను సారము నృత్యమగును

హస్తముల అభినయమును ''హస్తాభినయము'' లేక ''అభినయ హస్తము'' అని భరతాదులు చెప్పిరి అభినయ హస్తములు మూడు విధములు సంయుత్త హస్తములు పదమూడు భేదములు కలవి, అసంయుత హస్తములు– ఇరువదినాలుగు భేదములు కలవి (24) నృత్త హస్తములు కలవి (30) మొత్తము అరువదిఏడు భేదములుగా హస్తాభినయము వింగడింపబడినది 2

నాట్యశాస్త్రమునందేగాక ఈ హస్తాభినయము అర్చనాదికములందు, యజ్ఞ యాగాది కర్మలయందు, ప్రయుక్తమగుచున్నది అర్చాదికములందు ప్రయుక్తమగు హస్తాభినయములకు ముద్రలుఅని వ్యవహారము ముద్రలనుగూర్చి తంత్రములు విశేషముగ పేర్కొనినవి దేవతలకు ఆనందము కలుగజేయునవి. దైవసాన్నిధ్యము కల్గించునవి, ముద్రలనియు, దేవతలకు ఇతర ఉపచారములకన్న ముద్రాప్రదర్శనమే అధిక ప్రీతి కల్గించునని, శైవ, శాక్త, వైష్ణవాగమములు పేర్కొనినవి. శైవ శాక్త వైష్ణవ సంప్రదాయములలో పూజాదికములందు ప్రదర్శింపబడు ముద్రలు కొన్ని సామ్యమును కల్గియున్నవి సంప్రదాయమును బట్టి విభేదములుగ కొన్ని ఆచరింపబడుచున్నవి

నిత్యకర్మానుష్ఠానమగు సంధ్యావందనమునందు ముప్పదిరెండు ముద్రలు కలవు(32) గాయత్రీ మంత్రానుష్ఠానమునకు ముందు ఇరువదినాలుగు (24) అనంతరముఎనిమిది(8) ప్రదర్శింపవలెననియున్నది.

దేవాలయములందు దేవతార్చనా విధానమున ముద్రాప్రదర్శన ముండును. వైష్ణవాలయములలో పాంచరాత్రాగమ సిద్ధాంతానుసారముగ పూజాదికములు నిర్వహింపబడును మంత్ర, ధ్యాన, ముద్ర, యోగ, జ్ఞాన కాండములను పంచ రూపములతో కూడుకొనియున్నందున పాంచరాత్రాగమమని ఒక సిద్ధాంతము 4 ఇట్లేశాక్త సంప్రదాయమునందు పంచ మకారములలో ముద్ర యొకటి. లలితా సహస్ర నామములలో *"దశముద్రాసమారాధ్యా"* అనియు *"యోనిముద్ర"* అనియు దేవిపేర్కొనబడినది దేవ్యర్చనలో దశముద్రలు ప్రాధాన్యము వహించును. యోని ముద్ర దేవి తత్వమును వ్యక్తీకరించును

ఉపాసనలయందు దైవ సాన్నిహిత్యమునకు నాట్యమున భావ ప్రకటనము నకు హేతువుగ రసోన్మీలనమునకు ఈ హస్తముద్రలు అత్యంత ఉపయోగార్థమై యున్నవి అందులకే శాస్త్రములందు హస్తము సర్వదేవతాత్మకముగ చెప్పబడినది. అందులకే ప్రభాతమున కరదర్శనము చేయవలెనని

*" కరాగ్రే వసతే లక్ష్మీ కరమధ్యే సరస్వతీ*
*కరమూలేతు గోవిందః ప్రభాతే కరదర్శనమ్ "*

అని వర్ణింపబడినది మణిబంధమునకు పైభాగము ఆత్మ తీర్థమనియు, కనిష్ఠిక వైపుగల కరతల బహిః ప్రదేశము దేవతీర్థమనియు, తర్జని అంగుష్ఠమున మధ్య ప్రదేశము పితృతీర్థమనియు, అంగుళులపైని ఊర్ధ్వ ప్రదేశము పరమార్థ తీర్థమనియు పేర్కొనబడినది. కనిష్ఠికనుండి అంగుష్ఠము వరకు గల వేళ్ళు వరుసగ పృధ్వి, జల తేజో, వాయు, ఆకాశతత్వముల నభివర్ణించునవిగ చెప్పవచ్చును.6

ఇట్టి ఆధ్యాత్మిక భావ సంబంధముగల హస్తముద్వారా ప్రయుక్త ముద్రా విశేషములు దివ్యమైన ప్రయోజనములు చేకూర్చుననుటలో ఆశ్చర్యములేదు జల శోధనకు మత్స్య, ధేను, అంకుశ ముద్రల ప్రయోగము కలదు. ధేనుముద్రవలన జలము నందలి దోషము తొలగును ధేనుముద్రవలన వానిలోనికి సుధాంశుతత్వము ప్రవేశించి అవి అమృతమయమగు అంకుశముద్రవలన పవిత్రతా లక్షణము ప్రవేశించి ఆజలము తీర్థమగును.

ఈ విధముగ ముద్రలు ప్రయోజనము కలవిగా ఉండి దైవసాన్నిహిత్యమును కలిగించుచున్నవి. మంత్ర భాషఎట్లు బీజాక్షర సంకేతముగ, గూఢముగ తంత్రము లందు ప్రవర్తించునో ముద్రలుకూడ సాధనకు దైవమునకు నడుమ గూఢార్థాభి

వ్యంజకముగ పరివర్తించుచున్నవని చెప్పవచ్చును. భావ ప్రకటనకు అధికముగ తోడ్పడు హస్త ముద్రలు, అర్చా విధానము నుండి, తంత్రశాస్త్రములనుండి, శాస్త్ర సిద్ధతను పొందినపుడు నాట్యశాస్త్రములోనికి ప్రవేశించెనని విమర్శకుల యూహ[7] అందులకే నాట్యము సర్వశాస్త్ర సమాహారమని చెప్పబడినది కాళిదాసు నాట్యమును చాక్షుషక్రతువని పేర్కొనెను.

పాంచరాత్రాగమములో చెప్పబడిన ముద్రలకు శాక్తేయ సంప్రదాయమున చెప్పబడిన ముద్రలకు నాట్య శాస్త్రములో చెప్పబడిన ముద్రలకును కొన్నిటిలో అత్యంత సామీప్యము, ఏకరూపతకలదు

| పాంచరాత్రాగమము | శాక్తము | నాట్యశాస్త్రము |
|---|---|---|
| పద్మ ముద్ర | పద్మముద్ర | ముకుల ముద్ర మరియు సోల పద్మపు ముద్ర |
| సంయుత హస్తములందు — | | |
| ఆవాహన ముద్ర | ఆవాహనముద్ర అంగుష్ఠము అనామిక- మూలమునుండును | పుష్పపుట హస్తము |
| నమస్కార ముద్ర | — | కపోత ముద్ర |
| తత్వ ముద్ర అంగుష్ఠము తర్జని కొనల కలయిక | జ్ఞాన ముద్ర అంగుష్ఠ–అనామికల కొనల కలయిక | అరాల హస్తము అంగుష్ఠము తర్జని అభిముఖముగ నుండును |
| సృష్టి ముద్ర | — | సూచీహస్తము. |

## నటరాజ భంగిమలలోని ముద్రాతత్వము:

" సమశీర్షకముతోడ సమదృష్టి ఘటియించి
సమపాద విన్యాస చాతుర్యము లగించి
వరపతాకమ్ము దాపటికేల నెసకొల్పి
వామ హస్తంబదో పత్రముగ సంధించి
త్రిపతాకమూని యర్ధ పతాకమును బట్టి
చపల దృష్టులు దిశాంచలమును మోపెట్టి
దూతమస్తకము చెల్వ దోబూచు లాడంగ
వీతరాగులు ఋషులు వినుతులను చేయంగ "

ఈ వర్ణనమునందు నటరాజు ప్రదర్శించిన మూడు భంగిమలున్నవి. త్రివిధ భంగిమలు క్రమముగ త్రివిధ భావములను ప్రకటించుచున్నవి పతాక హస్తము ద్వార నొకభంగిమ, త్రిపతాక హస్తముద్వారా మరియొక భంగిమ అర్ధపతాక హస్తముద్వార మూడవ భంగిమ ఏర్పడినది. హస్త, పాద, శీర్ష, దృష్ట్యభినయ విశేషమిట్లున్నది.

**సమశీర్షకము :-** అనగా శిరస్సు సమానముగనుంచుట

**సమదృష్టి :-** అనగా నిశ్చలమైన చూపు

**సమపాదము :-** పాదములను సమానముగనుంచుట

**హామస్తము :-** అధో వక్త్రముగ సంధించబడినది,
దాపటికేలునందు పతాక హస్తము.

పతాకహస్తమనగా అన్నివేళ్ళను చాచి బొటనవ్రేలును కుంచితముచేయుట. నేను (అహమపి) నాకును (మామాపి) నాచేతను (మాయాపి) నాయందును (**మయ్యపి**) అను అర్థములలో ప్రయోగింపవచ్చునని నాట్యశాస్త్రము.[8] తాత్పర్యముగ పతాక హస్తముద్వారా నేనే జగదీశ్వరుడననితెల్పి, అధోవక్త్రముగ సంధించిన హస్తము చేత-ఈసర్వసృష్టియు నేనేననియు, నాకారకేననియు, నాచేతనే నడచుచున్నదనియు అంతర్యామిగ నాయందున్నదనియు తెలిపెడి పరమాత్మతత్వము ఈభంగిమ చెప్పుచున్నది. ఈభావమును సమశీర్షకము. సమదృష్టి, సమపాదము బలపరచు చున్నది. సాధారణముగ దైవప్రతిమలలో అభయహస్తముండును. అభయహస్తమునకు, పతాక హస్తమునకు అత్యంతసామ్యము కలదు. అభయహస్తమున అంగుష్ఠము తక్కినవ్రేళ్ళతో కలియక విడిగానుండును. పతాకహస్తమున అంగుష్ఠము కుంచితమగును అంగుష్ఠమునందు బ్రహ్మాత్మ భావనము సంధ్యావందనములోని కరన్యాసమున కలదు పతాకహస్తమున కుంచితమైన అంగుష్ఠము ప్రేక్షకుల దిక్కైయుండును. దీనిని బట్టి బ్రహ్మమునేనే "**అహంబ్రహ్మాస్మి**" అను మహా వాక్యార్థము అభినయింపబడినదనవచ్చును. నాట్యప్రయోగములందు ముద్రలద్వారా మూర్తులను ప్రదర్శించు పద్ధతి కలదు. శివమూర్తులలో జ్ఞానమూర్తియైన దక్షిణా మూర్తి స్వరూపము ఇచట భాసించుచున్నది. పతాకహస్తము విజయ తాండవమును కూడ సూచించుచున్నది,

*రెండవ భంగిమ:—* దృష్టి, శీర్షము, పాదము అట్లేయుంచి పతాకహస్తము మార్చి త్రిపతాకమును బట్టుటవలన రెండవభంగిమ ఏర్పడినది త్రిపతాక హస్తమున అనామికను ముందుకు వంచుదురు. పిలుచుట, విసుట, నిదర్శనముచూపుట-అను అర్థములలో త్రిపతాకమును అభినయింపవలెనని నాట్యశాస్త్రము. ఇచట త్రిపతాక హస్తాభినయము నిటుల చెప్పవచ్చును. మొదట పతాక హస్తముద్వారా ప్రకటింపబడిన పరమాత్మ తత్వము సత్యమైనదను నిదర్శనము చూపుటకే అనామిక వంచి చూపించబడినది. అనగా తనకన్న ద్వైతములేదని నిర్ధారించుటకేనని వ్యాఖ్యానించవచ్చును సంధ్యావందన కరన్యాసమున *"ధీమహి సత్యాత్మనే అనామికాభ్యాంనమః"*— అని కలదు.

*మూడవ భంగిమ:—* ఈసత్యము తెలుసుకొనుటయే జ్ఞానమని చెప్పుటకు మూడవ భంగిమ అభినయింపబడినది ఇందు అర్ధపతాకము పట్టుట జరిగినది. కనిష్ఠిక అరచేతిలోనికి వంచిపెట్టుట అర్ధపతాక కనిష్ఠిక జ్ఞానమునకు చిహ్నము *"ధియో యోనః జ్ఞానాత్మనే కనిష్ఠికాభ్యాంనమః* - అని గాయత్రి కరన్యాసము.

ఈ విధముగా ఈ మూడు భంగిమలలో బ్రహ్మ, సత్యజ్ఞానాంశములను వ్యక్తపరచు హస్తవిశేషములను ప్రదర్శించి చపలదృష్టులు, ధూతమస్తము అభినయింపబడినది చపలదృష్టులనగా, కనుగ్రుడ్లను కెలకులకు అటు,నిటు త్రిప్పుట ధూతమస్తము అనగా శిరమునటు, నిటు నాడించుట నృత్తమునందు పైవిధమగు హస్తాభినయముతో- కనుగ్రుడ్లను త్రిప్పుచు, శిరమునాడించుట *"దిగాంచలములు"* అని చెప్పుటచేత నాల్గు దిక్కులు తిరుగుట నభినయించెను. పరమాత్మ తత్వమైన తానే బ్రహ్మ, సత్య, జ్ఞానములని చెప్పబడుచు అంతటను వ్యాపించియున్నానని *"సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ"* అను ఉపనిషద్వాక్యమును నటరాజు అభినయించెను అందులకే వీతరాగులైన ఋషులు వినుతులు చేసిరని వర్ణింపబడినది ఇది శివుని పంచకృత్యములలోని *"అనుగ్రహము"*ను చెప్పుచున్నది

కొందరు విమర్శకులు, హస్తములో, పతాక, త్రిపతాక, అర్ధపతాక ముద్రలు ప్రదర్శించినపుడు తర్జని, మధ్యమాంగుష్ఠలు చాచబడి యుండును కదా! వాటి అర్థమేమి? అని ప్రశ్నించిరి. తర్జని, మధ్యమాంగుష్ఠలపై విష్ణు, రుద్రాత్మ భావనము సంధ్యావందన కరన్యాసమున కలదు *"సత్యం జ్ఞానం అనంతం బ్రహ్మ"* యైన అవ్యక్తమైన తాను వ్యక్తమైనపుడు అర్ధనారీశ్వర రూపము.

అర్ధనారీశ్వర రూపములోని పార్వతి విష్ణురూపమని ఇదివరకే నిరూపింపబడినది. తాత్పర్యముగ ముద్రలో ముడువబడిన అంగుళులు నిర్గుణ బహ్మమును, చాచబడిన వేళ్లు సగుణ (బహ్మమైన అర్ధనారీశ్వర రూపమును ప్రకటించినవి )

" హంసాస్యమును రెండు హస్తంబులనునించి
అంసభాగంబులకు నానించి చూపించి
కలికిచూపుల చంపకములు పైజల్లించి
కెలకులకు గంరమ్ము మెలపుతో నాడించి
కనుగ్రుడ్లు కనులచక్రముచుట్టి చుట్టిరా
ధనువులై బొమలు తద్దియు గాంతిచూపరా
నొకకాలు దివిగొల్వ నొకకాలు భువినిల్వ
ప్రకటముగ దేవతావరులు భక్తి నిగ్గొల్వ
ఇలయెల్ల చెలువురూపెత్తి నిల్చినయట్లు

నిష్కలంక శివస్వరూపము సకల రూపమున బ్రహ్మాండమున అవతరించి అర్ధనారీశ్వర రూపముతో సృష్టికార్య కలాపమున లీలావినోదములు సల్పు శృంగార స్వరూపము ఈ భంగిమయందు వర్ణించబడినది.

హస్తములోని తర్జని, మధ్యమ అంగుష్ఠములు మూడింటిని చేర్చిపట్టి తక్కిన వేళ్ళు రెంటిని ప్రసారితము చేసిన హస్తాభినయమునకు "*హంసాస్యము*" అని పేరు.9 అల్పము, లాఘవము, మృదుత్వము అను అర్థములలో ఈ అభినయ హస్తము ప్రయుక్తము. రెండు హస్తములందు హంసాస్యముద్రపట్టి – అంస భాగంబులకు నానించి చూపించుట ఇచట మృదుత్వభావనయందు ప్రయుక్తమైనదని భావించవలెను. తరువాత చెప్పబడిన "*కలికి చూపులు*" ఈ భావము నుద్దీపింప చేయుచున్నది. శృంగార భావమును సువ్యక్తముచేయు ఈ అభినయము, హంసాస్య ముద్రద్వార, కలికి చూపులతో చంపకములు పై జల్లుట ద్వారా ప్రకటితమగు చున్నది. "*కెలకులకు కంఠమ్ము మెలపుతో నాడించుట*" అర్ధనారీశ్వర వేషములోని స్త్రీ, పుం, భావ ఐక్యము సూచించుచున్నది. ఈ అభినయమే సృష్ట్యారంభమునకు మూలమగుచున్నది. "*ఒక కాలు దివిగొల్వ నొక కాలు భువినిల్వ*" బ్రహ్మాండ మంతయు ఆవరించిన పరమాత్మ సృష్టి తేజమును ప్రకటించుచున్నది. "*పాదోస్య విశ్వాభూతాని, త్రిపాదస్యామృతం దివి*" అను పురుష సూక్త శృత్యర్ధము ధ్వనింప బడుచున్నది

దీనిని మరొక విధముగా చెప్పవచ్చును దివిగొల్పిన పాదము మరణమునకు భువి నిల్చిన పాదము జననమునకు సూచకములు. ఈ కావ్యముననే మరొకచోట

"ఒక యడుగు జననంబు—ఒక యడుగు మరణంబు
ఒక భాగమున సృష్టి—ఒకవైపు ప్రళయంబు"

అని చెప్పబడియున్నది. ప్రళయ మనగా జీవకోటి పాక్షిక లయము. సృష్టిలో యుగముల మధ్యకాలమున, సంధి యుగములందు పాక్షిక ప్రళయములు సంభవించును. దివి కొల్చిన కాలు పాక్షిక ప్రళయమునకు సూచనము

నాట్యప్రయోగాను సారముగ నటరాజు ప్రదర్శించిన ఈ అభినయమును త్రివిక్రమావతారముగ భావింపవచ్చును. ముల్లోకములు ఆక్రమించిన వామనుని రెండవ పాదమును దేవతావరులు భక్తితో కొలిచిరి కదా. నాట్యప్రయోగముల ననుసరించి ఈ భంగిమ సతీశివ ప్రణయ తాండవమును లేక ఊర్ధ్వతాండవమును సూచించుచున్నది

ఈ భంగిమలో హంసాస్య ముద్ర పట్టుట ఒక విశేషము హంస యనగా జీవునకు పేరు పరమాత్మ జీవాత్మగా సృష్టిలోనికి దిగివచ్చుట అట్టి జీవునకు హంసయని పేరు, సోహమ్ అను పదము తిరుగ వేసిన హంసయగును. "*కనుగ్రుడ్లు కనుల చక్రము చుట్టుట*" సంసార సృష్టి, లయ, రూప చక్రమును స్ఫురింప జేయుచున్నది, అఖండ సచ్చిదానంద పరబ్రహ్మము తిరోధానమై జీవాత్మగా సృష్టిలోనికి అవతరించి జనన మరణ రూపమైన సంసారచక్రమున పరిభ్రమించుట అను భావమును ఈ భంగిమ ప్రకటించినది. పంచకృత్యములలోని శివుని తిరోధాన కృత్యము ఈ భంగిమ వెల్లడించినది.

పాద చాలనము నాట్యశాస్త్రమున "*భౌమచారి*" అని "*ఆకాశికీచారి*" అని రెండు విధములు. ఇట ఆకాశకీచారి ప్రయుక్తమైనది. పరమాత్మ జీవునిగా దిగి వచ్చి ప్రకృత్యావరణలో పడుట పై భంగిమలో వర్ణింపబడగా జీవుడు పరమాత్మను చేరుకొను ప్రయత్నము ఈ క్రింది రగడలలో సూచింపబడినది.

పడగలెత్తును నాగుబాములై యొకసారి
ముడిచికొను కమలంపు మొగ్గలై యొకసారి
జ్ఞాన ముద్రికల బక్షము లెత్తు నొకసారి
దీనదీనంబులై తేలాడు నొకసారి
కటాకాముఖంబులై కనుపట్టు నొకసారి

పటుముష్టి బంధ సంపదజూపు నొకసారి
శుకతుండ హస్తమున శోభిల్లు నొకసారి
ప్రకట భ్రమరీ సరళి వరగించు నొకసారి
అటువైపు నిటువైపు నమల హస్తములూగి
అటమీద లిట క్రింద నందములు చెలరేగి

ఇందు పై నాల్గు పాదములలో హస్తములను నాగుపాములతోను, కమలపు మొగ్గలతోను, జ్ఞానముద్రికలతోను రూపించి చివరగ, "*దీనదీనంబులై తేలాడు నొకసారి*" అని చెప్పబడినది. అలాగా ఉపమానములతో హస్తముద్రలను కవి సూచించెను. నాగుబాములని చెప్పటచేత సర్పశీర్ష హస్తాభినయము, కమలంపు మొగ్గలనుటచేత ముకుల హస్తాభినయము, జ్ఞాన ముద్రికయని చెప్పుటచేత అరాల హస్తాభినయము సూచింపబడుచున్నది. వర్ణనమందు ఈ హస్తచాలనము బాహు ప్రచారముగ చెప్పబడినది.

అభినయ హస్తార్థములిట్లున్నవి. సర్పశీర్ష, హస్తము దేవతర్పణము, పామునడక, మొక్కలకు నీరుబోయుట అను అర్థములలో ప్రయోగించవచ్చును. ముకుల హస్తము, దేవతార్చనము, బలిహరణము మొదలగు అర్థములలో ప్రయోగించవచ్చును. అరాల హస్తము దిష్టపెట్టు సంకేతము. పరమార్థముగా ఈ హస్తాభినయముల తాత్పర్యము నిట్లూహింప వచ్చును. దేవతార్చన, దైవ తర్పణముల ద్వారా జ్ఞానము కల్గును. కాని ఒక్కొకసారి అజ్ఞాన మాయాపిహితుడైన జీవుడు దీనుడై సామాన్యునివలె ఉండవచ్చును.

ఈ భంగిమను మరొక విధముగ సమన్వయింప వచ్చును. సృష్టించి, సృష్టిలోనికి అవతరించిన పరబ్రహ్మను జీవుడు కలిసికొను ప్రయత్నముగ "*నాగుబాములై పడగలెత్తుట*" అనువర్ణనము. నాగుబాములై పడగ లెత్తుట-మూలాధారము నుండి ఉత్థానమైన కుండలినీ శక్తిని స్ఫురింపజేయుచున్నది. "*కమలంపు మొగ్గ*" దహరాకాశమున నుండు పద్మకోశమును చెప్పుచున్నది. అచట పరమాత్మ సాక్షిగ చిన్మయ రూపమున నిలిచియుండును. "*జ్ఞానముద్రికల పక్షములెత్తుట*" సర్వాత్మనాస్థిర చర జీవరాసులయందున్న పరమాత్మ ఉనికిని గుర్తించుటయే. "*దీనదీనంబులై తేలాడుట*" అజ్ఞానమునకు చిహ్నము. ఈ విధముగ ఉపమానములతో ముద్రలను స్ఫురింపజెసి తరువాత స్పష్టముగ హస్త ముద్రలు చెప్పబడినవి.

*"కటకాముఖంబులై కనుపట్టు నొకసారి"*- చాచిన అంగుష్ఠమును చూపుడు వ్రేలుతో నొక్కి, మధ్యవేర్రెలు అరచేతిలోనికి తాకునట్లు వంచి, తక్కిన రెండు వేర్రెళ్ళు అరచేతిని తాకకుండ వంచినచో కటకాముఖము. ఈ హస్తాభినయముద్వార వస్తు గ్రహణ తాత్పర్యముద్దిష్టము.

*"ముష్టి బంధము"* అనగా అన్ని వేర్రెళ్ళను అరచేతిలోనికి వంచి అంగుష్ఠముచే నొక్కిపట్టుట. శుకతుండ హస్త ప్రదర్శనము ద్వారా అనేక భావములు చెప్ప వీలున్ననూ ఇచ్చట **"తిరస్కారము"** అను భావము భావించిన అర్థ సమన్వయము కుదురును. భ్రమర హస్తము సంసార చక్రమున చరించు జీవుని తెల్పుచున్నది. ఫలితముగ ఈ హస్తాభినయ తాత్పర్యమునిట్లు చెప్పవచ్చు ఐహిక ప్రపంచమున మునిగిన జీవుడు అరిషడ్వర్గములచేత పీడితుడై ప్రపంచములోని వస్తు సంపదనంతయు అనుభవించవలెనని-తనకే సొంతము కావలెనని భావించును. తాను సాధించిన సంపాదించిన ద్రవ్యము నిలువజేసుకొని దానధర్మములు చేయక ఇతర మానవులను ఈసడించును. తద్వారా ఈ జనన మరణ సంసార చక్రమున పరిభ్రమించుచుండును.

ఈ పైన చెప్పబడిన హస్తాభినయములందు రెండు భాగములు

1) స్థితి స్వరూపమునుండి పరమేశ్వరుని తోడి లయమునకు ఉత్థానమార్గము
2) అరిషడ్వర్గ పీడితమైన ఐహిక పతన మార్గము.

1) **ఆధ్యాత్మ మార్గము** :— నాగుబాము-కమలము-జ్ఞానము-అని సాగినది.
2) కటకాముఖ, ముష్ఠి, శుకతుండ, భ్రమర, హస్తాభినయములతో సమన్వయింపబడినది.

ఇట్లు రెండు విధములుగ చెప్పబడిన విషయము ఈ క్రింది భంగిమలో సమన్వయింపబడినది. పంచకృత్యములలో నిదిస్థితి స్వరూపము

" హస్తంబు కనుదోయి కద్దంబుగా నిలిపి
శస్త్రంబరాళంపు సంజ్ఞనెదురుగ నిలిపి
చూతంబు శిరము సాకూతంబు కనుచూపు
ప్రీతిగావింప నిల్చిన దేవతలకెల్ల "
నా పై కెదురుగ దక్షిణంబైన హస్తమ్ము
కౌశలను జర్లింప సోలపద్మపు ముద్ర "

| | | |
|---|---|---|
| అరాళహస్తముద్ర | - | దివ్యవస్తు సంకేతము |
| హస్తము కనుదోయికి అడ్డముగ నిలుపుట | - | యవనికార్థము |
| ధూతశిరము | - | చపలత్వము |
| సాకూతమైన చూపు | - | ప్రబోధము |

సోలపద్మపు ముద్ర నాభికి ఎదురుగ చూపుటవలన

"*పద్మ కోశ ప్రతీకాశం హృదయంచాప్యధోముఖం*" అనెడి శ్రుత్యర్థము గ్రహించి అభినయ తాత్పర్యమిట్లు చెప్పవలెను.

' ప్రాకృతికమైన తెరవెనుక దివ్యజ్యోతి కలదనియు, ఆదిహృదయమున ముఖముగనున్న పద్మ కోశాంతర్గతమైనదనియు, అట్టి పరంజ్యోతిని చపలత్వము వదలి - ఏకాగ్రత తోడి ధ్యానముతో దర్శింప వచ్చుననియు ఈభంగిమ సారాంశము ఈ అర్థము రెండుచేతులలో విభిన్న ముద్రాభినయము ద్వారా ఈక్రింది భంగిమలో ప్రదర్శింపబడెను.

' ఒకవైపు నర్ధ చంద్ర కరంబు బరగించి
యొకవైపు సూచీ ముఖోద్వృత్తి జూపించి
క్రీగంటితో నవ్వు క్రేళ్ళురుక వీక్షించి
మాగన్నువైచి తన్మయత దానటియించి
వామపాదము జక్కగా మహిని నాటించి
సీమమున దక్షిణము వింత మీదికి నెత్తి '

ఈ భంగిమలో సవ్య భాగ హస్తాభినయముచేత నివృత్తి లక్షణము, వామహస్తాభినయము చేత ప్రవృత్తిలక్షణము చెప్పబడినవి,

| | | |
|---|---|---|
| ఒకవైపు (వామ) | – | మరొకవైపు(దక్షిణ) |
| అర్ధచంద్రకరము | – | సూచీముఖము |
| క్రీగంటినవ్వు క్రేళ్ళురుక వీక్షించు | – | మాగన్నువైచితన్మయత |

వామపాదము చక్కగా మహిని నాటించి –సీమమున దక్షిణపాదము పైకెత్తి,

ప్రవృత్తిలక్షణము దుఃఖము అని చెప్పుటకే అర్ధచంద్రాభినయము శాస్త్రము కూడ అర్ధచంద్రము దుఃఖమును తెల్పుటకు అభినయింపవచ్చునని చెప్పినది. క్రీగంటినవ్వు క్రేళ్ళురుక వీక్షించుట శృంగార భావ ప్రవర్తనను

చెప్పుచున్నది. వామభాగము సృష్టికిగుర్తు. తాత్పర్యముగా వామభాగాభినయముచేత ఐహిక శృంగార ప్రవర్తనము దుఃఖము కల్గించునని సూచించుచున్నది.

దక్షిణ హస్తమున సూచీ ముఖాభినయము సూచించుము ఊర్ధ్వముగ నున్న ప్రదేశమును, ఒకే సంఖ్యను తెలుపుటకు ఉపయోగింతురు కావున సూచీ ముఖము జీవగమనలక్ష్యమును సూచించుచున్నది దానికి ప్రయత్నము ధ్యానము "మార్గన్నుపై చితన్మయత" నటించుటలో సూచింపబడినది ధ్యానముచేత ఆత్మతాదాత్మ్యముకలుగును ఉపదేశ గర్భితమైన అభినయమిది. దక్షిణపాదము—లయమునకు గుర్తు కావుననే ఈ పాదము "నీమముతో" పయికెత్తుటగా వర్ణింప బడినది. సృష్టిలోని రాగలక్షణము—లయములోని యోగ లక్షణము అభంగిమలో ప్రదర్శింపబడినవి.

తరువాత ప్రదర్శింపబడిన భంగిమలన్నియు పరమేశ్వరుని ఆనంద తాండవమును వ్యక్తీకరించునవి. సుకుమార కరణములు, శృంగార భావములు లాస్యమునకు సంబంధించినవి కనుక ఈ భంగిమలు నటరాజు ప్రదర్శించిన లాస్యమనవచ్చును.

'కుడి కాలినంబువలెఁ గొంచెముగ మునువంచి
యెడమ పాదము వైపు వింత శీర్షము వంచి
కమళ నాళములు హస్తములు బారలు సాచి
ప్రమదమ్ముతో రెండు వైపల్లఁజూచి
సవ్యవక్షము పులకచయముతో నుబ్బంగ
సవ్యేతరము సిగ్గుతో వెన్కకొదుగంగ
నొకకపోలము నగవు వికసించి రాజిల్ల
నొకకపోలము బిగువు ప్రకటించిలోఁబల్క'

బాణము వలె కుడికాలు ముందునకు వంచినపుడు సహజముగ ఎడమ భాగము వెనుకకు ఒదుగును. మరియు శీర్షమునుకూడ ఎడమ పాదము వైపు వంచినపుడు సవ్యవక్షము ముందునకు వచ్చును అర్ధనారీశ్వర భావము దృష్టిలో నుంచుకొని కవి సవ్య వక్షము పులక చయముతో నుబ్బినదనియు, సవ్యేతరము సిగ్గుతో వెనుకకు ఒదిగినదనియు వర్ణించెను. అందులకే ఒక చెక్కిలియందునగవు, ఒక చెక్కిలి యందు బిగువు,

అర్ధనారీశ్వర భావము విడచి కేవలము స్త్రీమూర్తిగ నటరాజు ప్రదర్శించిన శృంగారము ఈ క్రింది భంగిమ యందున్నది.

" ఎడమ చేతిని ప్రీతి నడుముపై సంధించి
కుడి చేతిలో నంచ కొదమ గుఱుతు లగించి
యంచముక్కున దృష్టినంచితముగ జేర్చి
సంచాలిత మొనర్చి సమశిరము ముందునను
పరివాహితము జూపి పైపైని కాంతమ్ము
పరిగించి చూపు భావావేశ మధురమ్ము "

అంచ కొదమగురుతు అనగా హంసాస్యము. ఈ హస్తాభినయము సుకుమారార్థమున ప్రయుక్తము. చక్రాకారమున తిరుగు శిరము పరివాహితము. భావాధిక్యతను, ఉన్మత్తతను సూచించును. "*కాంతమ్ము పరగించుట*" అనగా శృంగార దృష్టి. నాట్య శాస్త్రమున దృష్టి భేదములలో "*కాంతమ్ము*" శృంగారమునకు పర్యాయముగ వాడ బడినది.

"*ఇది సంతోష అనుగ్రహముల వలన జనించును. కనుబొమలు ఎగుర వేయుటను, క్రిగంటి చూపులను ఇందుండును. అత్యధికముగా మన్మధ భావ మును వెల్లడిచేయు ఈ కాంత దృష్టి శృంగార రసమునందు ప్రయుక్తము*"10 లాస్యమును ప్రదర్శించిన ఇట్టి స్త్రీమూర్తి భంగిమను నాట్య ప్రయోగానుసారముగ అమృతము పంచియిచ్చు జగన్మోహినీ రూపముగ భావింపవచ్చును.

ఈ విధముగ నటరాజు ప్రదర్శించిన భంగిమలయందు తాత్వికాభి వ్యక్తిని ముద్రలు కల్గియున్నవి. సృష్టి, స్థితి, తిరోధాన, అనుగ్రహలయాత్మకమగు శివుని పంచకృత్యములు వెల్లడించు ఈ భంగిమలు తాండవ లాస్య లక్షణములుకల్గి నృత్త నృత్యములను అభినయించినవి.

శివతాండవ కావ్యమున హస్తకరణ రూపముగా తాంత్రికములైన ముద్రలను ప్రదర్శించి లౌకిక, అలౌకిక, సృజనాత్మక, అధ్యాత్మిక, భావుక ధ్యానిక తత్వము లకు ఒక అపూర్వ సమావేశము ఏర్పడబడినది. సృష్టి – చైతన్యమున ఏకాత్మ తత్వము దీని వలన నిరూపితమైనది

## సూచికలు :

1) నాట్యశాస్త్రము—80

2) నాట్యశాస్త్రము—హస్తాభినయము

3) ఛండీ మాసపత్రిక—డిసంబరు—1983, అలహాబాద్

4) దేవాలయ అర్చా విధానమ్—వంజీపురం నృసింహాచార్య
యాదగిరిగుట్ట దేవస్థానం ప్రచురణ.

5) లలితా సహస్రనామ స్తోత్రమ్—179 శ్లో॥
సంపాదకులు—హరిరాధా కృష్ణమూర్తి

6) చండీ మాస పత్రిక— అలహాబాద్ 1983

7) "హైందవారాధనా విధులలో ముద్రల ప్రాధాన్యము"
ప్రొఫెసర్ కోవెల సుప్రసన్నాచార్య

8) నాట్యశాస్త్రము

9) నాట్యశాస్త్రము

10) ,,

# కావ్యవర్ణనా సౌందర్యము

దర్శనము వర్ణనము కలిగిన వారే లోకమున కవులుగ ప్రసిద్ధులగుదురు. దర్శనము అనగా తాము చెప్పదలచిన వస్తు సౌందర్యమును గూర్చి భావనాలోకమున సమగ్రముగ దర్శించుట, వర్ణన మనగా తాను దర్శించిన వస్తు సౌందర్యమును సముచిత శబ్దజాలముతో నందముగా ప్రకటించుట. దర్శనమునకు తపస్సు, వర్ణనమునకు శిల్పనైపుణ్యము కావలెను. ఈ శివతాండవ కావ్యకర్త అగస్త్యేశ్వ-రాలయ ప్రదక్షిణలు చేయుచున్నపుడు అకస్మాత్తుగ హృదయాంతరాళము నుండి ఈగేయమిటికి వచ్చినది [1] భక్త్యావేశమున పొంగిన భావధారయగు ఈ కావ్యమున భావనా కల్పనలు అహమహమికతో పరుగులెత్తినవి.

ఈ కావ్యమున వర్ణనము ద్వివిధముగ సాగినది. ఈ మూడు భావమార్గములు శివతత్త్వమును ప్రతిపాదించునవి. సృష్టియంతయు నటరాజు నాట్యము తిలకించుటకై ఉన్ముఖమై, తన్మయమై యుండుట ఒకటి. ఇదిలయభావమును జ్ఞానమును సూచించును. నటరాజు తన అభినయము ద్వారా అనేక భావనలు ప్రకటించెననుట రెండవది. ఇది సృష్టిభావమును సూచించును. శివా శివ లాస్యతాండవ స్వరూప-వర్ణనము మూడవది. ఇది స్థితిలోని అంతర్యామితత్వమును స్థితిభావమును సూచించును.

ఈ విధముగ తాత్త్వికముగ సాగిన కావ్య వర్ణనము ప్రాబంధిక శైలిని భావకవిత్వ శైలిని సంతరించుకొని మార్గ-దేశిచ్ఛందో రూపములలో విలక్షణముగ రచింపబడినది.

ప్రథమఖండిక ప్రకృతి పర్యుత్సుకతను ప్రదర్శించినది.

> " అలలై బంగరు
> కలలై పగడపు పులుగుల
> వలె మబ్బులు విరిసినయవి "

మబ్బులు ఆకాశమున విరిసినవి. అవి అలలుగా, బంగరు కలలుగానున్నవి. అలలు ప్రావాహికత లక్షణము కలవి. మబ్బులు వాయు చలనమునచలించుచు వచ్చి నిలచినవి బంగరుకలలు మానవుని ఒకానొక మానసిక ప్రవృత్తి అవి అదృశ్యం.

అలలవంటి మబ్బులు దృశ్యము. తాత్పర్యముగ సృష్టి దృశ్యాదృశ్యమను భావ-మిట వ్యంజింపబడినది.

"*పగడపు పులుగుల వలె మబ్బులు విరిసినయవి*" ఈ అంశమునిట్లు భావింపవచ్చును. సంధ్యారాగ రుచి మేఘములపై ప్రసరించి వాటికి పసుపురంగు కలిగింపజేసెను. కనుక పగడపు పులుగుతో మబ్బు ఉపమింపబడినది. పక్షి జీవునకు సంకేతము. పగడము కాంతిమంతమైనది. జీవుడు చైతన్య వంతుడు పగడపు కాంతి సంధ్యనుండి సంక్రమించినది. జీవునకు చైతన్యము శక్తి నుండి సముద్భవించినది. అనగా చైతన్యవంతులగు జీవులు చిదాకాశమున పరమేశ్వరుని తాండవ దర్శనమునకు సంసిద్ధులైరని భావము. తరువాతి వర్ణనమున అప్సరసలు మేఘములై వచ్చిరి యేమొ, అని స్పష్టము చేయబడినది. ఈ విధముగ కావ్యారంభము జీవచైతన్య విలసనమును వ్యంజింప చేసినది.

" పలికెడునవి— పక్షులు ప్రాంబలుకులో
కలహైమవతీ— విలసన్నూపుర నినాదమ్ములకు
ననుకరణంబులో "—

పక్షుల పలుకులు వేదములా? హైమవతి నూపుర నినాదానుకరణములా? అను సందియము ప్రకటింపబడినది. విజయా ప్రార్థనమున కూడ "*విరావైర్మాంజీరైః శిమవి కథయంతీవ మధురం, రహస్యం వేదానాం*" అని ఈ భావము మరల వర్ణించబడి వెదరహస్యార్థములను పార్వతీదేవి మంజీర నాదములు ప్రకటించు-చున్నవను భావమును స్థిరపరచినది.

" తకఝుం తకఝుం— తకదిరికిటనా
దమ్ములతో లోకమ్ముల వేలుపు "

లోకమ్ముల వేలుపులయానుగతి క్రమముగా నృత్యమాడునపుడు శృతి బట్టుటకై భృంగమ్ములు గొంతులు సవరించుకొనుచున్నవని తుమ్మెదఝుంకారము వర్ణింప-బడినది. సంగీత పరముగ ఈ భావము ఔచిత్యావహమైనది. తుమ్మెదఝుంకారము ఒకే ధ్వనిని వెలువరించును. కాని అందు హెచ్చు తగ్గులుండును. అందులకే అవి శృతి బట్టుటకు గొంతులు సవరించుకొనుచున్నవని చమత్కరింపబడినది. తాత్త్విక ముగ భ్రమరము జీవ సంకేతముగ గ్రహించిన, అవ్యక్త మధురము అదృశ్యము, ప్రకృతి విలసనరూపమగు పరమేశ్వర నృత్యమును అనుభవించెడి జీవుని ఆనందము భ్రమరఝుంకారమన వచ్చును.

" చతురాననుడే సవదరించునట
శర్వున కుత్తమ సర్పవిభూషలు "

సర్పము జీవశక్తికి సంకేతము. భూమి నావహించిన పరశివ విభూతికి శర్వుడని పేరు. పురాణములలో సృష్టి క్రమమును పేర్కొనునపుడు మొదటగా సృష్టింప బడినవి సర్పములు. సర్వప్రపంచ సృష్టి స్పందనమే శివనృత్యము కనుక జీవశక్తి నటరాజునకు అలంకారమైనది అనగా అతని ఉనికిని స్థితిరూపమున ప్రకటించు—చున్నది. పరమేశ్వరుడు పృధివ్యాది పంచభూతములుగా మారిన తరువాతనే బ్రహ్మకు సృష్టి కర్తృత్వము నిచ్చినట్లు శివపురాణము పేర్కొనిది 2 అందులకే చతురాననుడు నటరాజునకు సర్పవిభూషలు నూతనముగ—సవదరించునట.

సెలయేరులు కన్నెలుగా వర్ణింపబడిరి. కన్నెలు పరుగెత్తునపుడువారి పరకుచ్చిళ్లు దుసికిళ్ళాడును, ఆవిధముగ సెలయేళ్ళుపతుగురెత్తినవి వాటికి ఆ సర్వేశ్వరు ననినయ మహమును యెవ్వరు చెప్పిరో'— అని కవి ఆశ్చర్యము ప్రకటించెను **"సర్వేశ్వరుడు"** అని చెప్పుటలోనే అంతటను వ్యాపించి యున్న ఈశ్వరుడు అను అర్థము స్ఫురింపచేసి ఒకరు చెప్పపని లేదు అను సమాధానము గర్భీకరించబడినది.

సంధ్యాసతి శివపూజకు సమాయత్తమగు చున్నదని. వర్ణించిన తీరు పరాశక్తియైన లలితాంబను స్మరింపజేయుచున్నది.నవకుసుంభరాగవసనము, లజ్జా మధుర కటాక్షము, " ***విలాస వక్రీకృత విచలన్మధ్యంబున హ్రీమతి*** " అను సంబోధనలు లలితా సహస్రములోని దేవి నామ సామ్యమును కలిగియున్నవి 5 మరియు ప్రియుని కొఱకు అభిసరించు అభిసారికా లక్షణముకూడ నిటవ్యంజింపబడినది

" ***హ్రీమతి*** " అను శబ్దము " ***హ్రీం*** " అను మంత్రాక్షరమును చెప్పు చున్నది. " ***హ్రీం*** " మంత్రాక్షరము మాయాబీజమని మంత్రశాస్త్రము. మాయ అనగా ప్రకృతి. ప్రకృతి విలసనమే ప్రథమ ఖండికయందు వర్ణింపబడినది. ఆ ప్రకృతి యందంతర్యామిగనున్న పరమ శివుని నృత్తము తరువాత వర్ణింప బడినది. జ్ఞాన సభలో పరమ శివుడు నృత్తము చేయునపుడు ఆతని నర్తన పీఠము క్రింద "హ్రీం" బీజముండునని నటరాజు రామకృష్ణ పేర్కొనెను 4 ఈ కావ్యము శ్రవ్యకావ్యము కనుక ప్రకృతి వర్ణనలో ఈ బీజమును కవి నిక్షేపించెను. ప్రకృతి పీఠముగా నటరాజు సంధ్యా తాండవము ప్రదర్శించెను

ఆర్యా ప్రాణేశ్వరుని ఆటను జూచుటకు దినమంతము నిలువుమని సూర్యుని కోరుటలోనే ఈ శివనృత్తము సంధ్యాతాండవమని స్పష్టీకరించెను. పడమట దేశ వాసులకు ఈ కథ నెరిగించుటకై పరుగెత్తుదువో. అనుటలో చమత్కారమున్నను, పాశ్చాత్య దేశములలో కూడ శివతాండవమును గూర్చిన భావన, ఆ రా ధ న, విశేషములున్నవను చారిత్రక సత్యము కూడ నిటస్మరింపబడినది.[5]

"అలమృగములుగన్నుల బాష్పమ్ములు
విడిచెడు నెందుకు– విశ్వేశ్వరునకు
నడుగులు గడుగుట– కైపాద్యంబో"

అని వర్ణించుట భావ కవితా ప్రభావము ***"కరియుమురా–కన్నీటిని మరిమరి విల–వింపుమురా"*** ఆ కన్నీటి సరమును పరమశివుడు దాల్చునని కృష్ణశాస్త్రి వర్ణించెను[6]

గాలికి కదలు చిగురుటాకుల సవ్వడిని గుసగసలుగ భావించి పరమేశ్వరుని నాట్యమును గూర్చి అవి మాటలాడుచున్నవని చెప్పుట సర్వత్ర శివనాట్యమును దర్శించుటయే ఈ విధముగ మొదటి ఖండికలో పక్షులు– జంతువులు, నదులు, వృక్ష సంతతులు సర్వము పరమేశుని నృత్తమున లీనమగుటకు ఉన్ముఖమై యున్నవని వర్ణించుట, జీవ చైతన్య విలసనమే శివనృత్తమను తత్వమును ప్రకటించుచున్నది. మరియు ఉన్ముఖమైన ప్రకృత్యుత్సాహము, నటేశుని నృత్యమున లీనమగుటకు సిద్ధమైన వాతావరణము స్థితినుండి లయమునకు పయనించు చైతన్య గమనమును తెలుపుచున్నది

రెండవ ఖండిక నంది నాంది. భూతగణములు జయ జయధ్వానములతో శివుని నృత్యమాడుటకు ఆహ్వానించిరి. ఈ భావములన్నియు సంస్కృత భాషలో వృత్తములలో రచింపబడినవి. చివరలో గీత పద్య రచన మున్నది. ఇందలి వృత్త రచనా పద్ధతి పతంజలి తాండవాష్టకమును స్ఫురింపజేయును ఈ రచన మంతయు ఉదాత్త కావ్యశైలిలో నడిచినది నాట్యశాస్త్ర విశేషములు కొన్నినాందిలో ప్రదర్శింప బడినవి.

*"భావ పరిముగ్ధ గిరిజా వనజతుల్యం పదయావకరసాక్త – శిరసమ్"* అనెడి వర్ణనము లలాటతిలకము– లేక నిటాలతిలకము అనుకరణమును తెల్పు చున్నది. వృశ్చిక పాదము యొక్క బొటనవేలితో లలాటమునందు తి ల క ము రచించినట్లు భిసయించుట లలాట తిలకమందురు. ఈ కరణ ప్రయోగమునందున

కుడికాలి బొటనవేలితో పాటు ఎడమచేయి బొటనవేళ్ళు కూడ లలాటము పైకి రావలెను.7

*"దధన్నేత్రం గౌరీ ప్రణయముకురం"* అని మరొకచోట శివుడు వర్ణింప బడెను. పార్వతి నటరాజు నేత్రములయందు తన ప్రతిబింబమును జూచుకొని అలంకారము తీర్చుకొనుసట అందువలన శివుని నేత్రము ఆమెకు లీలాదర్పణమని కవియే తెల్పియున్నాడు శివతాండవారంభమునందు *"కనుపాపలో గౌరికనినప్రతి బింబింప"* అని ప్రతిబింబవర్ణనము చూడవచ్చును

నందిస్తుతించిన నటరాజు నృత్యము సృష్ట్యావిర్భావమును సూచించినది. ఈ విషయము *"శివనృత్తమునందు సృష్టితత్వము"* అను చోట పరామర్శింపబడినది. స్మశానమునందు భీషణమైన అట్టహాసములు చేయుచు,ఆకాశమందంతటను తన హస్త ములు విసరుచు, పాదఘట్టనలచేత సవనగిరి గుహాకోటిని కంపింపజేయుచు, హృద యమును చలింపచేయు మహాకాలుడు స్తుతించబడెను ఆ మహాకాల స్వరూపము భీకరముగనున్నది వేగముగ నృత్తము చేయుటవలన జడలనుండి ఛటచ్ఛటనాదము ఉత్పత్తిల్లినవి విషమలోచనము నుండి అగ్నికణములు వెదజల్లబడినవి. తుహిన శైలమునందు అట్లు ప్రమత్తుని వలె నృత్తము చేయు నటరాజును నందిస్తుతించెను. నృత్తము చేయుటవలన గళితమైన పట్టబంధము కలవాడును, తన పదయుగళము చేత మహాస్ఫోటము పుట్టించిన వాడును, లయబద్ధముగ అనేక రీతులలో నృత్తము చేయు శూలిని నందిస్మరించెను. ఈ వర్ణనమంతయు అభినయ వర్జితమైన ఆంగిక చాలనము

నాట్యశాస్త్ర ప్రకారముకరణ అంగహార సంపన్నమగు నృత్తమును పూర్వ రంగమున కూర్చుమని బ్రహ్మతో శివుడు చెప్పెను ఈ కావ్యమున శివతాండవము నకు ముందు నాంది రచింపబడి అందు శివనృత్తము స్తుతింపబడుటచే నాట్యశాస్త్ర మతము ననుసరించినటయినది. తరువాతి శివతాండవ వరసమునందు నృత్తమునకు అభినయము కూడ జోడింపబడినది. తండువు (నంది) భరతునకి విద్య ఉపదేశించె నని చెప్పబడుటచే ఈ కావ్యమున నాంది తరువాత శివతాండవము వర్ణింపబడుటచే ఔచిత్యావహమైనది.

నటరాజ నృత్యమున విన్యసింపబడిన వర్ణనమునిట్లు విభాగించ వచ్చును 1) దృగ్విన్యాసము 2) పదవిన్యాసము 3) భ్రూవిన్యాసము 4) హస్తవిన్యాసము 5) మంజీర విన్యాసము

## దృగ్వి న్యాసము :

సర్వేంద్రియములలో నయనము ప్రధానమైనట్లు సాత్వికాభినయమున నయనము నుండి వెడలు దృక్కులు ప్రధానమైనవి. ఈ చూడ్కుల ద్వారా అనేక భావములను సూచింపవచ్చును అభినయించవచ్చును.

నటరాజు నయనములు అనేక భావములు సూచించెను, ప్రదర్శించెను అట్టి నయనములు శ్వేత, రక్త, నీల, హేమ, ధూమ్ర వర్ణముల విరజిమ్మెనని వర్ణింప బడినది.

ఈ వర్ణనము శివుని పంచముఖ తత్త్వమును తెల్పుచున్నది. ఆగమములలో శివునకు పంచముఖములు, పంచముఖములకు పంచవర్ణములు చెప్పబడినవి.8

1) పంచముఖములలో పూర్వదిశలోని ముఖము పృధ్వీతత్త్వమును తెలుపును. పృధ్వీశక్తి యొక్క కాంతిచేత ఈముఖము హేమవర్ణములోనుండును. "***మొగలి పూవులు తావి పుక్కిలించినయట్లు***" అనెడి దృక్-వర్ణన ద్వారా పసుపు ఛాయ గల హేమ వర్ణనము వ్యంజింపబడినది. ఇట్టి వర్ణముతో కూడిన ముఖముగల శివుని మహాదేవుడందురు.

2) తొలుకారు మెరుపుల్లు దోబూచు లాడునటు .. రక్తకిసలమ్ములై. ... . లే యెండవలె . . " మొదలైన చూడ్కుల వర్ణనము ఎరుపురంగును చెప్పుచున్నది. ఈ వర్ణనము కలిగిన శివునిభైరవుందురు. ఇది అగ్నితత్త్వమును తెలుపును

3) పశ్చిమదిశలోని ముఖమును "***నంది***" యని పిలచెదరు. ఇదివాయుతత్త్వమును తెలుపును ధూమ్రవర్ణము ఈముఖమును వ్యంజించును.

" నల్లకలువలు దిక్కులెల్ల విచ్చు విధాన
మొత్తముగ తుమ్మెదలు మొనసికొన్న విధాన
దడివి చీకటులు గొప్పగ గప్పెడు విధాన "

కనులలో పొడ సూపిన శ్యామల కాంతులు ధూమ్రవర్ణము గల శివుని నంది ముఖమును చెప్పుచున్నవి.

4) సంతోష తరంగితమైన చూపులను ప్రసరింపజేయు ముఖము ఉత్తర దిశలో నుండును దీని విశేషనామము జౌమేయము. ఇది జలతత్వము, శ్వేత వర్ణము కల్గియుండును, కావ్యమున ఈవర్ణనమిట్లుకలదు.

" తంటితీపు వెన్నెలలు విరిసికొన్న విధాన
నెరజాదులంవి కుప్ప నెరసికొన్న విధాన
తెలిబూదిపూత దెట్టులు కట్టిన విధాన
చలికొండ మంచు కుప్పలు కూర్చిన విధాన
పొనగ ముత్తెపు సరుల్ పోహళించిన విధాన
ఘన సారమును దెచ్చి కలియజల్లు విధాన
తనలోని సంతసము కనుల జారు విధాన "

5) నీలవర్ణము కల్గినది శివుని ఊర్ధ్వముఖము. ఆకాశతత్వాత్మమైన ఈముఖవర్ణనము
"*నీలంపునగపు* . *అబ్బురంపు నీలములబ్బి పేరు విధము*"
మొదలుగా చెప్పబడినది

ఈ విధముగ చూపులను వర్ణించుటలో వర్ణములు చెప్పబడినందున శివుని పంచముఖములు వ్యంజింపబడినవి మరియు సంధ్యా దేవతయైన గాయత్రి పంచ ముఖి ఆమె, శివుని పంచవక్త్రములవలె ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ చ్ఛాయలు కల్గినది ఈ కావ్యమున వర్ణింపబడినది. సంధ్యా తాండవము కనుక నటరాజు పంచవర్ణములను అభినయించి తనశక్తిని ప్రకటించెననవచ్చును.

చూపుల స్వభావము ననుసరించు నృత్తశాస్త్రమున, చెప్పబడిన భావదృష్టులను నటరాజు అభినయించెను. నృత్తరత్నావళి యందు పేర్కొనిన భావ సంచారీ దృష్టులు ఇరువది అవి వరుసగా— 1) శూన్యము 2) లజ్జా సమన్వితము 3) శ్రాంతము 4) విషణ్ణము 5) మలినము 6) శంకితము 7) ముకులము 8) గ్లాని 9) కుంచితము 10) లలితము 11) అభితప్తము 12) అర్ధము కులము 13) విభ్రాంతము 14) వితర్కితము 15) ఆకేకరము 16) వికోశము 17) జిహ్మము 18) త్రస్తము 19) విప్లుతము 20) మదిరము 9

పైన పేర్కొనబడిన సంచారీ దృష్టులు—ద్రుక్—వర్ణనములో కొన్ని ఈ క్రింది విధముగ ప్రకటింపబడినవి

| | | |
|---|---|---|
| ''నను సిగ్గుతో ముడిచికొను పోవునట్లు'' | — | లజ్జా సమన్వితము |
| పెను వెరవుతో రాలి వణకెడునట్లు'' | — | అభితప్తము |
| ''రోసమ్ముతో రూక్షమైనట్లు'' | — | విరోధము |
| ''వేసరికతో సరిగ వికసింపనట్లు'' | — | ముకులము |
| ''అచ్చెరువుతో స్తబ్ధమైనట్లు'' | — | జిహ్మము |
| ''తొలివలపు బిగువు జారినయట్లు'' | — | క్లాంతము |
| ''తొలిసారి రతివింత సొలపు గ్రమ్మినయట్లు'' | — | ఆకేకరము |
| ''కులపాలికా ముగ్ధ కిలికించితమువోలె'' | — | లలితము |

చూపులను ఉపమించి భావమును వ్యంజింపజేయుట,

''*తరగలను చిరుగాలి పొరలు వేచినయట్లు*''— చూపులను క్రమక్రమముగ ప్రసరింపజేయు పద్ధతియిది సంచారీ భావములలోని అర్ధముకుల దృష్టిని సూచించు చున్నది అర్ధముకుల దృష్టి ఆహ్లాదము కలిగించు సుగంధ, స్పర్శాది సుఖము లందు ప్రయుక్తము. సుగంధ స్పర్శసూచించు వర్ణన ''చిరుగాలిలో తమ్మివిరులు కదలుట,- విరులలోనునుతావి తెరలులేచుట— గా చెప్పబడినది

''*చిగురు టాకులు గాలికి వగలు వోయినయట్లు*'' గాలికి చిగురుటాకులు చలించును. చిగురుటాకుల చలనమట్లు చూపులుండెనవి బావము. ఇట్టి చూపులుగల దృష్టిని విప్లుత దృష్టి అందురు.

భావ దృష్టులకందని చూపులను కూడ నటరాజు అభినయించెను.

''*కన్నెమదికోరికల కలలు దూకినయట్లు*''—

కుతూహలముగ చూచుట, చూడరానిది చూచుట ఆకేకర దృష్టి, కాని కోరికలు కలలు దూకెడు చూపుల, భావాను భూతి కందును కాని రూపానుభూతి కష్టము

''*తొలు సంజలో తెల్వి దూకి వచ్చినయట్లు*''

తెలివి అనగా వెలుగు. తెల్విదూకివచ్చుట యనగా ఉదయకాలములోని వెలుగురేఖల కాంతి ప్రవాహము ఆకాశమున—భూమిపైన ప్రసరించినట్లు. ఈ పదబంధముద్వారా ఉషఃకాలసౌందర్యము ఊహింపబడినది.

" ఎలగాలిపైఁదేవి పొలయుగీతికవోలె"

గీతమువాయు తరంగములపై ప్రయాణించును. కంటిచూపుల ప్రవాహములోనుండి అవ్యక్తభావములు ప్రసరించుచున్నవని భావము.

" నెలపాప పెదవిపై మలయు నవ్వునుఁబోలె "

పసిపాప పెదవిపై అమలినమైన చిరునవ్వు-నంటి చూపులు ప్రసరింపబడినవని భావము పెదవి కనుగుడ్డుగను, చూపులు హాసముగను చెప్పబడినవి. 'నెలపాప' అను పదమును బాలచంద్రుడని భావించిన వెన్నెలవంటి చిరునవ్వులను చూపులు చిందించెనని భావము.

" ప్రణయ రథమున మూగివడు కింకిణులవలె "

ప్రేమవివశుల శరీరమే రథము. వారి భావ వ్యంజకములైన అవయవ స్పందనలే రథకింకిణులు. నటరాజు ప్రదర్శించెడి చూపులు అట్టి-ప్రణయస్పందనలు కలవని తాత్పర్యము. చూపులలోధ్వని నారోపించిచెప్పుట భావగాఢత్వమును తెలుపుచున్నది. ప్రేమ భావముచేత స్పందించు ప్రేయసీ ప్రియుల రూపమును ఈ భావముచే నూహింపవచ్చును.

" ప్రణయార్ద్ర భావమున పొరాడు వెలుగువలె "

ప్రణయ భావ తన్మయత్వము చేత చూపులు ఒకానొక కాంతిరేఖలు ప్రసరింపజేసి నవని భావము. ఈవిధముగ శాస్త్ర నిర్వచనముల కందని భావములను నటరాజు ప్రదర్శించెను.

**భ్రూవిక్షేపము:-** నటరాజు భ్రూవిన్యాసము షడ్విధముగ విన్యసింపబడినది

1) " ఒకసారి తిరములైయుండి కాంతులు గ్రుమ్మ "

సాధారణమైన భావమును ప్రదర్శించు కనుబొమ్మలు స్థిరముగ నుండును. శాస్త్రము ఈస్థితిని " స్వాభావికము " అని చెప్పినది.

### 2) " ఒకసారి గంటువేసుకొని పూత్కృతి జిమ్మ "

పూత్కృతి సర్పలక్షణము " గంటువేసుకొని " యని చెప్పుటలో బొమలుముడిచి కొనుటకుయని భావింపవలెను. చుట్టచుట్టుకొని పూత్కరించు సర్పము కనుబొమ్మల అభినయముద్వారా చిత్రింపబడెను ఎక్కువ కోపము కల్గినపుడు, పెద్దవెలుపప జూచినపుడు బొమల మొదళ్ళను పైకెత్తుట " భృకుటి " యని నృత్త రత్నావళి పేర్కొనినది.10 ఇచట అంతకంటెను అధిక రోషభావము ప్రదర్శింపబడెను అందులకే కవి పూత్కరించెనని వర్ణంచెను. శాస్త్రమును దాటి తనదగు స్వాతంత్ర్యమును నటరాజు ప్రదర్శించెను, ఇవి ఒక విధముగ దేశి లక్షణము అని చెప్ప వచ్చును

### 3) " ఒకసారి మనుబిళ్ళయోజ చెంగుల దాటు "

బొమలను పైకిక్రిందికి నాడించుట యని భావము దీనికి ఉత్క్షేపమని పేరు.

### 4) " ఒకసారి వ్రేలు వాడిన పూలరేకులై "

వాడిన పూలరేకులు క్రిందికి వారిగి పోవును. అట్లుకనుబొమల క్రిందికి జార్చబడినవని భావము. ఈక్రియను " పాతనము " అందురు అసూయ, అసహ్యము, నవ్వు, మూర్కొనుట అను భావములందు ఈక్రియ ప్రయుక్త మగును.

### 5) " ఒకసారి దుసికిళ్ళపోవు చిఱుచేపలై "

కనుబొమలు చేపలవలె నటునిటు పరువెత్తినవని భావము. కనుబొమలు మెల్లగా విరచుట 'కుంచితము' అని చెప్పుదురు. కాని ఇచట మెల్లగాగాక, కనుబొమ్మలు నాట్యము చేసినవి. నీటిలోపారాడు చిరుచేపలెంత వేగముగా చరించునో కనుబొమలంత వేగముగా చరించినవి లాస్యము నందీక్రియ ప్రయుక్తము.

### 6) " ఒకసారి ధనువులై యుబ్బు కన్నులబొమ్మలు "

ఈ భ్రూవిన్యాసము చతురభంగి. శృంగారాభినయమును తెల్పుచున్నది. నటరాజు లాస్యతాండవములు ప్రదర్శించెను కనుక కనుబొమల అభినయమునందు సుకుమారోషలక్షణములు ప్రదర్శింపబడెను.

## హస్త విన్యాసము :-

హస్త వర్ణనము రెండు విధములుగనున్నది. హస్తస్వరూపవర్ణనము. హస్తములు ప్రదర్శించిన పతాకాది హస్తాభినయ వర్ణనము. భంగిమల తత్వముసందు హస్తాభినయము వివరింపబడెను. ఇచట హస్తస్వరూప వర్ణనము వివరింపబడుచున్నది.

శివుడు అర్ధనారీశ్వరుడు. నటరాజునుకూడా కవి అట్లే వర్ణించెను. తాండవమును-లాస్యమును ప్రదర్శించిన నటరాజు హస్తద్వయములో దక్షిణ హస్తము పురుహస్తమును సూచించునట్లు, వామహస్తము స్త్రీ హస్తమును సూచించునట్లు ఏనుగు తొండముగ గొనబైన తీగలుగ వర్ణింపబడెను. మందగతిని కదలినయపుడు — సుమదామమువలె — శిరీషములవలె నున్నవని లాస్యగతి వర్ణింపబడెను. తాండవము ప్రదర్శించినవుడు హస్తములు శీఘ్రగతిని పొందును. అపుడు హస్తములు కానరాక *"పుష్పాడి కాంతివలె-మెరుపు తీగలవలె"* హస్తకాంతి మాత్రమే దర్శనమగును. ఈ విధముగ హస్తవిన్యాసమున లాస్యతాండవములను నటరాజు ప్రదర్శించెను. శాస్త్రమున చెప్పబడిన నృత్తహస్తములిట్లు వర్ణింపబడెను.

*"పడగలెత్తును నాగులాములై యొకసారి"* ఈ అభినయమున హస్తములు శిరము మీదికి పరుగెత్తును. దీనిని *"ఊర్ధ్వగతము"* అందురు. *"ముడుచుకొను కమలంపు మొగ్గలై యొకసారి"* ఈ స్థితి కుంచితమని చెప్పవచ్చును. *"జ్ఞాన ముద్రికల పక్షములెత్తు నొకసారి"* ఈ స్థితిలో బాహువులు వక్షమునుండి వెడలి మండలముగా సాగును. దీనిని అపవిద్ధము అని పేర్కొందురు. *"దీన దీనంబులై తేలాడు నొకసారి"* ఈ క్రియలో హస్తములు క్రిందికి వ్రేలాడబడును. దీనికి *"అధోముఖము"* అని పేరు.11 ఈ విధముగ హస్తవర్ణనమున్నది.

## పదవిన్యాసము :

పదతల విన్యాసము వర్ణింపబడిన పద్ధతి మూడు విధములుగ నున్నది. ప్రసిద్ధోపమానములచేత పదతల విన్యాసము వర్ణించి పాదలక్షణమును వ్యంజింప చేసిన విధమొకటి. భావ గర్భితమైన వర్ణనము మరియొకటి. తాత్త్వికమైన వర్ణనము మూడవది.

"*స్థల పద్మముపోలె మెల్లగా నిలువబడి*" పాదములు పద్మములతో పోల్చ బడినవి. స్థలపద్మములు — పదము చలించని స్థితిని తెలుపుచున్నది నేలమీద చక్కగా ఊనిన పాదము సమము. ఇది సమస్థానమను కరణమున స్వభావ స్థితి యందు వచ్చును.

"*మెలగు కూర్మముపోలె మెల్లగా జరియుంచి*" ఇందు పాద గమనము కూర్మగమనముతో పోల్చబడినది మధ్యభాగము ఉచ్చింపబడి, మడమచేతను, కాలివ్రేళ్ళు వంచుట చేతను కలుగు గమనము కూర్మగమనము పాదలక్షణములలో అగ్రితల సంచారి లక్షణమునకు దగ్గరగా నున్నది.

"*గజ గమన భంగి ముందునకు సాగినది*"

గజగమనము స్త్రీగమనమునకు చెప్పుదురు. లాస్యసోఽరకము మడమ మీదికి నెత్తి, వ్రేళ్ళను నడిమి భాగమును కుంచించునది కుంచిత పాదమని శాస్త్ర నిర్వచనము

"*వాలుగల కులుకువలె వంకరలు చిత్రించి*"

వాలుగలు — ఇవి ఒక రకమైన మత్స్యములు. మత్స్యగమనము వంటి గమనము పాదమునభినయించెను దీనిని "*పార్శ్వగము*" అందురు

"*నాగము పోలె పార్ష్ణి భాగంబెత్తి*"

మడమతో వెనుకకు నడచుట పార్ష్ణిగము. పామువలె వెనుకకు మెల్లగా నడచు పద్ధతి పాదము అభినయించెనని భావము

"*వెనుక భాగంబెత్తి మునుము నేలకునొత్తి*"

ఇది "*అంగుళీ స్పృష్టగము*" అను పాద భేదమును సూచించుచున్నది ఇది స్ఫురిత యను దేశి పాదభేదము నందును, నృత్యమును నించుట యందును పండితులు విధింతురని చెప్పబడినది 12 ప్రసిద్ధోపమానంబులచే పాదతల విన్యాసములను వర్ణించిన పద్ధతి.

భావగర్భితమైన వర్ణన ఈ విధముగ నున్నది. "*గాలికి కదలు ఆకులపోలె తమ్ముల పూలవలె, మిన్ను కన్నట్టి చిరుమేఘములవలె*" పాదచాలనమున్నది. శాస్త్రమును మించిన భావగాఢత్వము కలిగిన వర్ణనమిది.

పాదములు చలించుటతోడనే పాదములకు కట్టబడిన మంజీరములు ధ్వనించును. తాత్త్విక భావము పాద మంజీర ధ్వనులలో ప్రకటింపబడినది.

''జననాంతరంబులో సంసక్తమై వచ్చి
మనసులోతుల నిల్చి మాటాడు వాసనలో
యమృత మయమైన ఆత్మనంటిన సుషుప్తిలో
క్రమముగా గప్పు నిర్ఝర మహచ్ఛాయలో
ప్రమదంబె రూపెత్తు బంగారు కలలో
నమరకాంతలు సేయునట్టి కనుసైగలో
యన సూక్ష్మతమముగా నటు సూక్ష్మతరముగా
వినబడియు వినబడని విధిగ మువ్వలు మ్రోగ''

ఈ వర్ణనలో జాగ్రత్, స్వప్న, సుషుప్త్యవస్థలు తెలుపబడినవి. నటరాజ పాద గతులు శృతులుగా ముందు వర్ణింపబడినది. పాదగతులచే చలించిన మంజీరముల నుండి నిర్గతమైన ధ్వనులు సూక్ష్మము, సూక్ష్మతరము, సూక్ష్మతమముల్లుగా వేదార్థములను ధ్వనింప జేసినవని తాత్పర్యము ''*భావస్థిరాని జననాంతర* ''*సౌహృదాని*'' అనెడిభావము *జననాంతరంబులలో సంసక్తమై వచ్చి మనను లోతుల నిల్చి మాటాడు వాసనలుగా*'' చెప్పబడినవి. సూక్ష్మముగా మ్రోగిన మువ్వల ధ్వని ఈ విధముగా పూర్వ జన్మ కృత కర్మఫల వాసనా విశేషముల తెల్పెనని చెప్పవచ్చు

''*స్వర్గకామో యజేతా*'' అనెడి ఉపనిషద్వాక్యము ''*ప్రమదంబె రూపెత్తు బంగ్గారు కలలుగ*'' అమరకాంతలు సేయునట్టి కనుసైగలుగ వర్ణింపబడెను. పుణ్యకర్మల వలన లభించు స్వర్గసౌఖ్యములోని అమర కాంతల పొందు సూచింప బడినది. ఇది సూక్ష్మ తరమైన మువ్వల ధ్వనిచే ప్రకటింపబడినది.

సూక్ష్మతమమైన మువ్వల ధ్వని ఆత్మనంటిన సుషుప్త్యవస్థను చెప్పుచున్నది. వేదార్థములైన ఉపనిషత్తులన్నియు కంఠోక్తిగా నిష్కామ కర్మను చెప్పినవి. నిష్కామ కర్మవలననే ఆత్మదర్శనము కలిగి మానవత్వము దాటి దైవత్వము కల్గును.13 అదియే ''*నిర్ఝర మహచ్ఛాయ*''.

ఈ విధముగా పాద మంజీర ధ్వనులు వారివారి జన్మసంస్కారముల వలన జీవులనుభవించు దశలను పేర్కొనినవి మరియు ప్రాకృత కర్మ, పుణ్యకర్మ

నిష్కామ కర్మల ఫలితములను ప్రకటించి ఆత్మ దర్శనోపాయమగు సుషుప్త్యవస్థయే జీవుడనుభవించెడి తుది అవస్థగా నిష్కర్షించినది.

ఈ విధముగ అనేక భావపరంపరలను ప్రదర్శించిన నటరాజు అష్టరస భావముల నభినయించెనని చెప్పి వర్ణన ముగించబడినది.

కరుణ జూపినయప్డు దొరగు బాష్పములు —కరుణము
అచ్చెరువు జూపినప్డు జిగినించు నిశ్చలత —అద్భుతము
వీరంబులో అగ్గి వెడలించు తారకలు —వీరము
ఘోరంబులో కెలంకుల నిల్చు కనుగ్రుడ్లు —బీభత్సము
వికృతంబులో వంగి వికటించు కనుబొమలు —భయానకము
శృంగారమున విలోలిత దృష్టిపాతంబు —శృంగారము
వికచంబులగు తారకలు హాస్యమునందు —హాస్యము
రౌద్రమున దుర్భర కటాక్షముతో —రౌద్రము

సాత్త్విక భావ వర్ణనయే గాక సంగీత శాస్త్రాంశముల వర్ణనము కూడా యిందున్నది, ఇందు ప్రయోగింపబడిన నవ్యపదబంధములుకొన్ని

''తరుణకౌతుకము, గాలికి వగలుపోవుట, నగవు జార్చుట, తెల్విదూకి వచ్చుట తలపు గలగల, మొలక తుంపర, చికిలిగొంతుక, చెలువు రూపెత్తుట, గుచ్చములు గునిసి పోపుట, కలలబరువు, చిలిపి గజ్జెలు, క్రొన్నెలపూపు, తసుకుచూపు, దుసికిక్కుపోవుట, జలదాంగన, గోటీరితాల్పుడు, కసినవ్వు కటికనవ్వులు, వలపూర, కలలు దూకుట, పొలియుగీతిక, పారాడు వెలుగు, పుదమార, సిగ్గు చెలువము.

## సంగీతలక్షణము :

రాగతాళములు కలసి నడచునది స్వరప్రధానమైన సంగీతము. నటరాజు తాండవము నందు అభినయము చూపుటయేగాక సంగీతము నందు క్రొత్త లయలను సృష్టించెను. ఆయన నృత్తగతులకు తాళము వేయు మార్దంగికుల — అమరుల గానములోని స్వరసంపకమున జాతులు వెనువెంటనే మార్చుటచేత తాళము తప్పిపోయిరట.

'ఎత్తుగడ కెత్తుగడ కేరీతితోచునో
క్రొత్తతీరులను గ్రొంగొత్త భావములాచి
సరసిలో లేయలల తెరలవలె నుబుకునో
స్వరపంపకములోని జాతులను వెసమార్చి
మానతీష్ణ్యంబదెంత ఏదొ-తాః మువేయ
బూని యమదులు దప్పిపోయినారెచ్చటనో: సర
స్వతి గుండె కంపించి జల జలా పారంగ

ఆడెనమ్మా శివుడు
పాడెనమ్మా భవుడు'

సంగీతములో మంద్ర స్థాయి, మధ్యమ స్థాయి, తారస్థాయి, అను భేదములుండును. ఈ భేదములను మదురముగా జూపుచు నటరాజు గానముచేసెను. నటరాజు గానమునకు సరిగా తాళము వేయలేకపోవుటయేగాక త్వరితముగా ఆయన మార్చెడి రాగములను నటబృందము గుర్తింపలేకుండిరి. '*కనకాంగియేయంచుకనుగోనలవె నవ్వి-వినివించి శుద్ధ స్వర నిచయంబునె*' అని నటరాజు నటబృందమునకు కనకాంగి రాగమును తెల్పెను. నటరాజు అర్ధనారీశ్వరరూపము నభినయించెను. '*కనకాంగియే*' అనుటలో వామభాగమున నుండెడి హైమవతి స్ఫురించుచున్నది. కనకాంగి రాగము శుద్ధగాంధార, శుద్ధమధ్యమ, శుద్ధధైవతాది స్వరముల కల్గియుండును.

స్వరములలో '*మధ్యమము రాగ సామ్రాజ్యాధిదైవతము*' అని వర్ణించబడినది. డెబ్బదిరెండు మేళకర్తలలో ముప్పది ఆరు రాగములు మారును. శంకరాభరణరాగములోని శుద్ధమధ్యమమును ప్రతి మధ్యమముగ చేసిన కళ్యాణియగును. కావుననే కవి మధ్యమ ప్రాశస్త్యమును వర్ణించెను, మద్దెల పరుసల ప్రస్తారమున మోహనరాగ స్వరములను ద్విరదగతి రగడలో నిబద్ధించిన తీరు విలక్షణమైనది.

తాళములు ముప్పది ఐదుఅని శాస్త్రవచనము. ఒక అక్షరకాలమును విడిచి పట్టి పాటనారంభించుట కాలు (1/4)భాగమని పేరు. రెండక్షరకాలమును విడిచిన

అజారగ(1/2) అనిపేరు. మూడక్షరముల కాలము విడిచి పట్టి పాట ప్రారంభించుట పద్ధతికి ముక్కాలుజాగ(1/3) అనిపేరు,14 నటరాజు తన గానమున ఈ విశేషములు ప్రదర్శించెను.

'కాలు విడుపరయు ముక్కాలు చోటులనెత్తి
కోలు జూపించి నిక్కగబల్లవులబాడి
కాల భేదములతో గలితనంబెలయించి
సోలు నిర్జర మనస్సుల నెల్ల వంచించి'

ఇట్టి రాగ విశేషములను ప్రదర్శించు నటరాజు గాత్రము "*గలగల మనంగ చిరుగవ్వలను వైచకినటు*" "*పలపలని యెండుటాకుల మర్మరము లట్లు*" వర్ణింపబడెను. పురుషుని గాత్రము సహజముగ పెళుసుగనుండును. అందులకే గవ్వల, ఎండు టాకులధ్వనితో పోల్చబడినది. నటరాజుతాండవమున, నృత్త, నృత్యగానములను కలిపి వర్ణించినతీరు విలక్షణమైనది.

'అరపల్కు వచియించి. యక్షులను పూరించు
బూరించి నర్థంబు బొందించు హస్తముల
మెచల గన్నులకొంత ముచ్చటించుచు—మిగులు
గదియించు వాఙ్మయాఖండ పుణ్యము పంత
గసులసైగలమాట పెనవేసి చూపించు,'
వెనుక మాటలు బల్కిమునుదీర్చుకన్నులను
వచియించు పల్కులావల నేత్రములుదిద్దు
ఖచరులెల్ల దిగ్భ్రమ పొంది వీక్షింప

ఈ విధముగా నటరాజ తాండవమున నృత్త, నృత్యగానములు ప్రదర్శింపబడెను. "*గీతవాదిత్రనృత్యానాంత్రయంసంగీతముచ్యతే*" అన్నట్లు సంగీత, సాహిత్య, నర్తనరూపములన్నియు తాండవము నందంతర్భవించుచున్నవి. ఇట్టికావ్యము తత్త్వము నందును, వర్ణనమునందును తాండవమునను విపులార్థమును సంఘ- టించినది.

## జ్ఞాపికలు

1) *తొలి పలుకు* — శివతాండవము. పుట్టపర్తి.

2) *లీలా ఖండము* — శివపురాణము.
శ్రీమతి ఏలూరిపాటి లక్ష్మీ సరస్వతి

3) 15, 70, శ్లోకములలోని నామములు,
లలితా సహస్ర నామస్తోత్రమ్.

4) దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర— పేజీ—59
నటరాజ రామకృష్ణ

5) *మూడుడు*— పేజీ—345, చాప్టర్—14,
"నటరాజా ఇన్ ఆర్ట్, డాన్స్, అండ్ లిటరేచర్"
సి శివరామమూర్తి.

6) *"పాపీ" ఖండిక*— కృష్ణపక్షము, కృష్ణశాస్త్రి

7) *'లలాటతిలకమను కరణవిశేషము'* – నాట్యశాస్త్రము
డా॥ పోణంగి శ్రీరామ అప్పారావు.

8) *"విగ్రహ ప్రతిమా లక్షణం"* — పేజీ—15, సప్తగిరి,
తిరుమల తిరుపతి దేవస్థానం మాసపత్రిక— ఏప్రియల్ 1986

9) *"సంచారీ దృష్టులు"* రెండవ అధ్యాయము— పేజీ—31
నృత్త రత్నావళి— జాయపసేనాని-
తెలుగు అనువాదము— రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ

10) *"బొమ్మలవని"*— రెండవ అధ్యాయము. పేజీ—47
నృత్త రత్నావళి.

11) *"బాహు ప్రకారములు"* రెండవ అధ్యాయము. పేజీ—93
నృత్త రత్నావళి— తెలుగు— రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ.

12) *"పాద లక్షణము"* రెండవ అధ్యాయము— పేజీ—119
నృత్త రత్నావళి

13) *కఠోపనిషత్ వ్యాఖ్యానము*—స్వామి చిన్మయానంద, పేజీ—15

14) *"ఆంధ్ర సారస్వత వేదిక పై శివతాండవమట"*— శశిశ్రీ-
ఆంధ్రజ్యోతి వారపత్రిక— 2—5—1987.

# శివతాండవాను కరణ కావ్యములు

పుట్టపర్తి నారాయణాచార్యుల శివతాండవము ననుకరించుచు రెండుగేయ కావ్యములు కన్పించుచున్నవి మొదటిది మైనంపాటి వేంకట సుబ్రహ్మణ్యము వ్రాసిన "*శ్రీకృష్ణ తాండవము*" సల్లదీగ శ్రీనివాసాచార్యులచే రచింపబడిన "*తాండవ మదనుడు*", రెండవది

శ్రీకృష్ణ తాండవము స్వరూప స్వభావములందు శివతాండవము ననుకరించి-నది. ఈ కావ్యమునకు పరిచయ వాక్యములు వ్రాసిన రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, తల్లావజ్ఝల శివశంకరస్వామి, డా॥ జి యన్ రెడ్డి — కృష్ణ తాండవము అన్ని విధముల శివతాండవమునకు అనుకరణ ప్రాయమనియే తెలిపిరి పుట్టపర్తి కూడ తమ సంతోషమును కృషతాండవమునకు ముందుగల పరిచయ వాక్యములలో తెలిపియుండుట విశేషము. (చూడుడు—శ్రీకృష్ణ తాండవ పీఠికలు)

కవియు స్వయముగ కావ్యమునకు ముందుగల "*నమస్సుమము*" లో

"ఆత్రిపురాంతకోద్ధత మహా నటనా కృతిలో సరస్వతీ
పుత్రు విచిత్ర రీతుల నపూర్వముగా కృతి తీర్చుటన్నవి
మాత్రమె పూర్వపుణ్యఫల మాధురిగాక మరొండు కల్గునే"

అని తనగేయ కావ్య రచనమునకు మార్గదర్శకమైన శివతాండవ కృతిని కృతికర్త సరస్వతీ పుత్రుని భక్తితో స్మరించెను శివతాండవ కావ్యమున ప్రధాన విభాగములు రెండు 1) శివతాండవము 2) శివాలాస్యము. అట్లె కృష్ణతాండవమున 1) కృష్ణతాండవము 2) గోపికాలాస్యము శివతాండవమున నంది నాందికలదు. ఇది సంస్కృత రచన. అట్లే కృష్ణతాండవమున గోబృంద నాంది సంస్కృత రచనమే. రచనలలో వృత్తానుకరణము కనిపించుచున్నది. పతంజలి తాండవాష్టక ప్రభావము శివతాండవములోని నాందీ శ్లోకములయందు ప్రసరించగా, శివతాండవ వృత్త రచనా ప్రభావము కృష్ణతాండవమున కన్పించుచున్నది.

"మత్తగజ కృత్తి యుతముత్తమ మహర్షి గణచిత్త వనకోకిలమజం
నిత్యసుఖదం, త్రిదశ కృత్యఫలదం, భువన మర్త్య పరిరక్షణ చణం
భావ పరిముగ్ధ గిరిజావనజతుల్యా పదయాపరరసా క్త శిరసం
పీవర భుజం ప్రమథ జీవనమముం సకల పాపసతనుం హృదిభజే"

(శివతాండవము— నందినాంది)

'' ఫుల్ల కుసుమోల్లసిత వల్లవితహాసరుచి సల్లవిత వాక్య మధురమ్
ఝల్లక నిశాచరణ మల్లబలశోషణసముల్లసితముష్టి బిరుదమ్
వల్లవ సతీహృదయ పల్లవ మశేష సుగుణోల్లసన రూపతురం
హృల్లసిత భక్తజన వల్లభ మనర్ఘ శుభవల్లభశిశుం హృదిభజే ''
(కృష్ణతాండవము-గోబ్బృందనాంది)

నాంది చివర కొంత తెలుగు రచన కలదు. అందును స్పష్టాను కరణము కన్పించు చున్నది అనుకరణాంశములు క్రిందనీయబడుచున్నవి.

| *శివతాండవము* | **కృష్ణతాండవము** |
|---|---|
| జయజయ శంకర శత్రుభయంకర | — జయజయ శుభకర జయమురళీధర |
| నీనృత్తములో నిఖిలవాఙ్మయము | — నృత్తారంభోద్వృతి వైఖరిలో |
| తానముగాగ మరిగానముగాగను | — సాత్త్విక భావము సర్వవాఙ్మయము తానగానముల నినదింపగ |
| ఖండేందు ధరా కదులుము నెమ్మది | — కమలా కాన్తా కదులుము నెమ్మది |
| జయనాద లయా సాదితమూర్తి | — జయజయతాండవ సాత్త్వికమూర్తి |
| జయజయ తాండవ సంభృతకీర్తి | — జయజయకేళీ సంభ్రమవృత్తి |

శివతాండవమున నందినాంది సంస్కృతములో కలదు. తాండవమదనునిలో ''*మాధవాభినందనమ్*'' అను పేర సంస్కృతమున వృత్తరచనమున్నది.

| | |
|---|---|
| సాంచ్యంతముస శివతాండవమున, | తాండవ మదనుని యందు, |
| నీ నృత్తములో నిఖిల వాఙ్మయము | నీ నటనలలో నిఖిల జగమ్ములు |
| తానముగా మరి గానముగాగను | రసమయములుగా రమణీయములై |
| తాండవింపగా తరుణంబైనది | తాండవించుటకు తరుణ భావమున |
| ఖండేందుధరా కదులుము నెమ్మది | తరగని మహిమల తహతహలాడెను |

సమద నృత్యమును సలుపుటకై ఇల
నరసేశు ధరా సాగుము నెమ్మది.

తరువాత అనుయాయుల జయజయ ధ్వానములు కూడ కావ్యద్వయమున సమానము గనే వర్ణింపబడియున్నవి

నృత్యారంభమునందు శివతాండవమున రెండు పద్యములున్నవి. ఈకావ్యమున కూడ నృత్యారంభమున పద్యరచనమున్నది ద్విరదగతిరగడయే నృత్య వర్ణనమున యిందును ఉపయోగింపబడినది పది పాదములకు విరామము పాటింపబడినది. తాండవారంభముకూడ,

" తలపైన చదలేటి అలలు తాండవమాడ
అలల త్రోపుడుల క్రొన్నెల పూవు కదలాడ

కనుపాపలో గౌరి కసినవ్వు బింబింప
ఆడెనమ్మా శివుడు.పాడెనమ్మా భవుడు "

శివతాండవమునకు అనుకరణముగానే కనిపించును కాని స్వరూపమున రచయిత చాల మార్పును చేసిరి. ప్రస్తుతము శివతాండవాను కరణములు మాత్రమిచట చూప బడుచున్నవి.

శివతాండవమునకు ముందు ప్రకృతి పర్యుత్సుకత — తాండవ మొదటని యంప

ఓహో హో హో
యూహా2 తీతం
ధీయానందం
బిలాతలంబున

ఏమానందం
దేమాహ్లాదం
బిమ్మహి లోపల
కమ్మని మమతల
తాండవ మదనుడు
తాండవించునట

అని సాగిన వర్ణనము రెంటిలోను చతురస్రగతిలోనే నడిచినది. శివతాండవమున ప్రకృతి పాంచయు పరమేశ్వరుని పూజించుటకై ఉద్యమించినదని వర్ణింపబడినది.

| | |
|---|---|
| | తాండవ మదనునియందు, |
| | ఎవ్వరికోసం |
| ఎవరికోసము | బీ బిబ్బోకం |
| ఈ బిబ్బోకము | బెందుకులే |
| శివపూజకో | ఆనందపు మైకం. |

అని సాదృశ్యము కనిపించుచున్నది.

శివతాండవమునకు ముందు ఒక కంద పద్యము, ఉత్పలమాల రచింపబడి తాండవ రచన మారంభమైనది కృష్ణతాండవమునందు రెండు కంద పద్యములు మూడు ఉత్పల మాలలు రచింపబడినవి. సంఖ్య అధికమైననూ ఛందము ఒకటే యగుట గమనింపదగిన విషయము శివతాండవము ద్విరదగతిరగడలో సాగినట్లే కృష్ణతాండవము ద్విరదగతి లోనే సాగినది. 10 రగడల తరువాత ముక్తాయింపుగా,

"*ఆడెనమ్మా శివుడు-పాడెనమ్మా భవుడు*" అని శివతాండవమున యుండగా-కృష్ణతాండవమునపదిరగడల తరువాత ముక్తాయింపుగా

"ఆడెనమ్మా కృష్ణుడు
పాడెనమ్మా విష్ణువు."

ఈ విధముగా కృష్ణతాండవము శివతాండవానుకరణ కావ్యము. శివతాండవమున కవిత్వములో శాస్త్రము కొంత ఒదిగి వచ్చినది. కృష్ణతాండవమున అడుగడుగున శాస్త్రము వర్తివర్తించినది.

తాండవ మదనుడు అను పేరుతో నల్లధీగ శ్రీనివాసార్యులు రచించిన గేయ కావ్యమునకూడ శివతాండవాను కరణమున్నది. ఇందలికథా వస్తువు మన్మధ నృత్యము.

కవిపూర్వకవులస్తుతించుచు "*వరసరస్వతీపుత్రు*" అని శివతాండవ కర్తను స్మరించెను. పీఠికలువ్రాసిన వారిలో వానమామలై వరదాచార్యులు "*ఇంతకు ముందు పుట్టపర్తి నారాయణాచార్యులు శివతాండవము వ్రాసినారు. తరువాతనే నెరింగినంత వరకు ఆచార్యులవారి మదన తాండవము సంప్రదాయ బద్ధముగ*

*నడచినది.*'' అని పేర్కొనిరి దివాకర్ల వేంకటావధాని ''*శివతాండవ కావ్యరచన యిందువారికి ప్రేరకమైయుండును.*'' అనిరి. నారాయణరెడ్డి ''*నాటని తాండవము మనకు తెలిసిందే. ఈకృతిపై పుట్టపర్తి శివతాండవ ప్రభావమేకాదు ప్రాచీన సంస్కృత నుతికృతుల ప్రసరణమూవుంది.* '' అనితెలిపిరి (చూడుడు తాండవ మదన పీఠికలు)

పైన పేర్కొనిన అభిప్రాయముల కనుగుణముగనే, శివతాండవము తాండవ మదనారంభమునకు ప్రేరణనిచ్చినది.

'' మొగముపై అలలేటి ముంగురులు నడయాడ
ఎగసికను బొమలింపెసగ నటనలగూడ
.. ...... .... . ........ . . .   .
ముదమొలుక రతిరాణి మునినవ్వు బింబింప
ఆడెనే రతిరాజు ఆనందనిలయుడై
పాడెనే రతిరాజు భావనాలోలుడై ''

ఈవిధముగా అచ్చటచ్చట భావ విన్యాసమునందు రగడల ఎత్తురడలందు శివ తాండవ రచనమును జప్తికి తెచ్చుచున్నది.

శివాలాస్యము పూర్ణరగడలో సాగినట్లు, రతీదేవిలాస్యము కూడ పూర్ణరగడలో సాగినది. శివాలాస్యాంతమున సంస్కృత శ్లోకమిట్లున్నది.

'' గౌర్యై నమోనిత్య సౌభాగ్యదాయై
తురీయార్థ దాత్ర్యైధరాకన్యకాయై''

తాండవ మదనునియందు రతీలాస్యముచివర

'' నమోచారు శక్త్యైనమోభోగరక్త్యై
నమో మోహనాంగ్యై నమోకామదేవ్యై''

ఇట్లు పుట్టపర్తి శివతాండవ రచనము తరువాతి కావ్యములపై తన ప్రభావము ప్రతిఫలింపజేసినది.

# ఉపసంహారము

రాయలసీమ ఈ శతాబ్దమున ప్రకటించిన సాహిత్య విభూతులలో శ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులది గౌరవస్థానము. ఆయన పెరిగిన వాతావరణము చదివిన విద్యాస్థానము, పొదుగుగొన్న బహుభాషా, బహుసంప్రదాయ, బహు సామాజికోద్యమ ప్రాచుర్యము, వారివ్యక్తిత్వమును విలక్షణముగా తీర్చిదిద్దినవి. ఆయన పెరిగినప్పటికి తెలుగునాటకాల్పనికోద్యమము సాహిత్యరంగమున మిన్ను ముట్టుచున్నది రాయప్రోలు, కృష్ణశాస్త్రి, విశ్వనాథ, నండూరి, నాయని ప్రముఖులకవితా ప్రవాహము తెలుగు కవితారంగములో నూతన దిశలను ఆవిష్కరించినది.

రాయలసీమలో పుట్టపర్తి నారాయణాచార్యులు ఎదిగినప్పటికి నెలకొన్న సాహిత్యవాతావరణము ప్రధానముగా సంప్రదాయ మార్గసంబంధమైనది. జనమంచి శేషాద్రిశర్మ బహుపురాణేతిహాస సమాకలనము, పూతలపట్టు శ్రీరాములు రెడ్డి కంబ రామాయణానువాదము మొదలైనవి ప్రాచీన సాహిత్య మార్గ నిర్వహణమునకు ఆలవాలములైనవి. ఆధునిక సంస్కార ప్రభావము అంతయో ఇంతయో ప్రసరించి వెలువడ్డరచనలు కట్టమంచి రామలింగారెడ్డి "ముసలమ్మ మరణము", రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ గారి కావ్యములు అప్పటికే అవధాన మార్గములనుండి ప్రక్కకు తొలగుచు నవ్యసంప్రదాయమువైపు తిరుగుతున్న కవులు దుర్భాక రాజశేఖర శతావధాని, గడియారం వేంకట శేషశాస్త్రి.

ఈ సన్నివేశములో పుట్టపర్తిసాహిత్యవ్యక్తిత్వము రూపు దిద్దుకొనుట ప్రారంభించినది. శ్రీ వైష్ణవ సంప్రదాయము, శాస్త్రసాహిత్యపాండిత్యము పెన వేసి కొన్న కుటుంబ వాతావరణంలో, కపిస్థలం దేశికాచార్యులు వంటి మహా విద్వాంసులకు ఉనికి పట్టయిన తిరుపతిలో ఆయన విద్యాభ్యాసము జరిగినది. అప్పటికే నారాయణచార్యులలో ఏదో కొంత తిరుగుబాటుతనము నెలకొని యున్నట్లు మనకు తెలియువచ్చుచున్నది. ప్రాచీనాంధ్ర కావ్యములే గాక, నవీ నాంధ్రకవుల రచనలు ముఖ్యముగా కాల్పనికోద్యమ కాలమునాటి రచనలు ఆయన మనస్సును లోగొనినట్లు తెలియుచున్నది. తిరుపతిలో తన సహపాఠకులకు కాల్పనికోద్యమ కవుల కావ్యములుచదివి విన్పించెడివాడు.

పుట్టపర్తి సృజనాత్మకత ఈపునాదిపై కొనసాగినది తన. మేనమామ అనంత కృష్ణశర్మ వలన ఆయనలో ఆధునిక సారస్వత వాసనలతోపాటు, సంగీత సాహిత్య సామంజస్యమును గూర్చిన భావన కూడ నెలకొన్నది. అసలు రాయల సీమ కవులలో ఇటు కన్నడముతోను, అటు తమిళము లోను, అంతో ఇంతో సంబంధము నెలకొని యుండుట ఒకలక్షణమైనచో ఈ కవికి మత సంప్రదాయ సిద్ధముగ తమిళభాష తోను, గురుపీఠమైన పరకాల మఠ సంబంధము వలన కన్నడ భాషతోడను గాఢ పరిచయము ఏర్పడుట జరిగినది సహజమైన సంస్కృత భాషా పాండిత్యముతోపాటు, ఈ రెండు భాషల పరిచయము ఆయన అధిగ మించిన చతుర్దశ భాషా వైదుష్యము ఆయన వ్యక్తిత్వమును ఇతర కవులకన్న విశిష్టముగ తీర్చిదిద్దినది.

పుట్టపర్తి సాహిత్య సృజనముచేయునాటికి రాయలసీమలో తనతో పాటు ఎదిగి వచ్చిన కవులు జేష్మారి శ్రీనివాస మూర్తి, నండూరి రామకృష్ణమాచార్యులు, శంఖవరం రాఘవాచార్యులు (సంపత్) వీరందరును సాహిత్య రంగమున ఇంచుమించు ఒక త్రోవనే పయనించిరి.

ఈ కవులు సారస్వత సృజనము పారంభించు నాటికి, తెలుగు దేశమున కాల్పనికోద్యమ కవిత్వము పొంగు తగ్గి నవ్య సంప్రదాయ మార్గముగా రూపు దిద్దుకొనుచున్నది. సౌందర నందము 1932 లో వచ్చినది. 1934 లో శ్రీ మద్రామాయణ కల్పవృక్షము ప్రారంభమైనది. కాల్పనికోద్యమ వాసనలు అభివ్యక్తిలోనున్ననూ, ఆ పేరిరణ తోడనే దుర్భాక వారి **"రాణా ప్రతాప సింహ చరిత్ర"** గడియారము వారి **"శివభారతము"** మూడవదశకములోనే వెలువడినవి.

ఈ దశాబ్దములో ప్రారంభమయి చివర వరకు రూపు దిద్దుకున్న ప్రగతి వాద కవితా మార్గము నవ్య సంప్రదాయ మార్గమునకు ప్రతి ద్వంద్వియై నిల చినది. ఈ కవిత్వమును ఉద్యమముగా తరువాతి దశాబ్దమున అభ్యుదయ రచయితల సంఘము నిర్వహించినది.

పుట్టపర్తి పెనుగొండలక్ష్మి నుండి శివతాండవము వరకు తన వ్యక్తిత్వమునకు సహజమైన నవ్య సంప్రదాయ కవితా మార్గమును అనుసరించుచువచ్చి తరువాత సర్వాంధ్ర దేశమున సామాన్యమైన, అభ్యుదయ రచయితల సంఘము వారి ప్రగతి వాద కవితోద్యమ ప్రభావమునకు కూడా లోనై ఒకటి రెండు రచనలు

ఆ దోరణి ప్రకటించునవిగా ప్రకటించెను. ఈ రచనలు కూడా పుట్టపర్తిలోని నవ్య కవితా సంప్రదాయమార్గమును దాచుకొనలేదు.

పుట్టపర్తి సాహిత్య వ్యక్తిత్వమును మూడుదశలుగా విభజించుటకు వీలున్నది. 1930 నుండి '50 వరకు తొలిదశ, 1950 నుండి '60 వరకు మలి దశ, '60 నుండి ఇప్పటి వరకు మూడవదశ, మొదటి దశ పెనుగొండ లక్ష్మి నుండి శివతాండవము వరకు వ్యాపించినది. రెండవ దశలోని ముఖ్యరచనలు పురోగమనము, మేఘదూతము, నవోదయము మొదలగునవి. మూడవ దశలో పండరీ భాగవతము, జనప్రియ రామాయణము, శ్రీనివాస ప్రబంధము మొదలగు నవి పేర్కొన వచ్చును. ఈ దశావిభజనకు ఒక అవగాహనకు చేసినది తప్ప రచనా రంభములతో జూచినచో అంతగా కుదరక పోవచ్చును.

ఈ సిద్ధాంత వ్యాసము పుట్టపర్తి సాహిత్యమును అంచనా కట్టుట ప్రారంభించి, దానివైశాల్యమును గమనించిన తరువాత పరిశీలనకు మొదటి రెండు దశలనే పరిశోధనా విషయముగా స్వీకరించినది. అయినను సర్వేతరాంధ్రకవి విలక్షణముగ ఈ కవి ప్రత్యేకతను నిలబెట్టినది శివతాండవము. ఈకావ్యమున సృష్టితత్వము దిన్యాదివ్య లోకముల సమాగమము ప్రతీకాత్మకముగ చెప్ప బడుటయేగాక, సాహిత్య నాట్యశాస్త్రములు అపూర్వముగా సంధానింపబడినవి. అందు వలన ఈ పరిశీలనమున శివతాండవమునకు ప్రత్యేక స్థానమీయబడినది.

పుట్టపర్తి సృజనాత్మక ఖండకావ్య సాహిత్యమునంతయు పరిశీలించిన ఒక ఏక సూత్రతా లక్షణము కన్పించుచున్నది. అదియే ఈ సృష్టితత్వమును గూర్చిన భక్తిపూర్వక అన్వేషణము. పరిమిత సిద్ధాంతములకు లోబడక అనేక సాంప్రదాయముల సంస్కారము నాకళించికొని ఈ అన్వేషణము కొనసాగినది.

దృశ్యమగు ప్రపంచమును పరిశీలించుచు, ప్రతి సన్నివేశమునకు స్పందించి ప్రత్యణువున పరమాత్మ భావనము భావించిన కవి ప్రకృతిని జూచినపుడు భావకవిగా, స్వాతంత్ర్యము నాకర్షించినపుడు జాతీయకవిగా, ఆర్థిక సమానత్వము నాశించినపుడు భక్తునిగ ప్రకటింపబడెను.

మానవునిగ భగవంతుని ఉనికిని ప్రశ్నించుకుని ''***ఏమో ఈ వికటంపు రూపకము***'' అని సాగిన కవి ఆలోచనము ''***సకల భువనంబు లాంగికము గాగ శ్లోకదుకు***'' అని సృష్టితత్వమును శివతాండవ రూపముగా నావిష్కరించినది.

ఈ సిద్ధాంత వ్యాసమున ఈ క్రింది విషయములు ప్రత్యేకముగా ప్రతిపాదింప బడినవి.

1 తెలుగు కవితా చరిత్రలో కాల్పనిక—ప్రగతివాద ఉద్యమముల నడిమిదశ నెలకొన్న ఆధునిక సంప్రదాయమునకు మూల ద్రవ్యములైన జాతీయత, సౌందర్యోపాసన, స్వేచ్ఛాప్రియత మొదలైనవానిని నెలకొల్పుటలో పుట్టపర్తి వారి సాహిత్యకృషి.

2 మేఘసందేశములో కవి జాతీయభావమునకు — ప్రగతి వాదమునకు సాధింపనెంచిన సమన్వయము.

3 సిద్ధాంతములకు, ధోరణులకు, వాదములకు భిన్నముగా, అతీతముగా పరిపూర్ణత్వము వైపు ఎదుగనెంచిన మానవుని వ్యక్తిత్వము. శ్రీ అరవిందుల తత్త్వభూమికలో కొన్ని కవితలలో వ్యక్తమగుట.

4 శివతాండవ కావ్యము యొక్క అపూర్వ సౌందర్యము.

5 శివతాండవ కావ్యము ఛందస్సులో, రూపములో, భాషలో నిర్మాణములో సాధించిన గీతీ సాంతత్యము.

6 సృష్టితత్త్వమును ప్రకృతి పురుషుల సమన్వయము, ఆధునిక వైజ్ఞానిక శాస్త్రము చెప్పుచున్న అణువులలోని శక్తి పరిభ్రమణము శివతాండవమున అపూర్వ లయ విన్యాసములో అభివ్యక్తమైన స్థితి.

7 కవి ఎన్నుకొన్న సృజనాత్మక సాహిత్యరూపములలోని నూతన విశేషములు

# అనుబంధము

## పుట్టపర్తితో సాహిత్య పరిసంగం

*1 ప్రశ్న :- కవిత్వ ప్రయోజనమేమిటి? కవికి కమిట్ మెంట్ అవసరమా?*

జవాబు - కవిత్వానికి ఆనందమే ప్రధాన ప్రయోజనము కవి మానసిక సంస్కారాన్ని కవిత్వముద్వార కలిగిస్తాడు ధనిక దరిద్రభేదం లేక మేధస్సును సంస్కరించే ప్రయత్నమే కవిత్వం వల్ల జరుగుతుంది. అది విశాలవలయం మిగతావన్ని చిన్న వలయాలు

*2 ప్రశ్న :- కవి ఏ ఉద్యమముతోనైనా ప్రభావితమైతే ఆ ఉద్యమానికే అంకితం కావాలా?*

2 జ॥ ఒక ఉద్యమానికి అంకితం అవడం అంటే అతని విరాడూపాన్ని సంకుచిత పరచడం అన్నమాట.

*3 ప్రశ్న :- కవిత్వం అందరికీ అందుబాటులో ఉండేదే ఉత్తమ కవిత్వమా?*

3 జ॥ మనదేశంలో పాఠకుల స్థాయికి కవి దిగిరావాలి ఇది భాషా భావ దరిద్రుడు చేస్సే వాదన. కవిసార్వత్రికంగా ఎన్నడూ ఉపయోగపడడు అందరికీ అర్థమయ్యే టట్లు కవిత్వం ఎవడూ రాయలేడు. కవి ఎప్పుడు పార్శ్యల్.

*4 ప్ర॥ :- మాతృభాష కాకపోయినా యితర భాషల్లో మీరు కవిత్వం ఎలా వ్రాయగలిగారు?*

4 జ॥ భావము మూలమైన మనస్సు సమానంగా స్పందించే గుణం కల్గివుంటుంది. భాషలు తొడుగులు. అటువంటప్పుడు కృషిచేస్తే ఏ భాషలోనైనా కవిత్వం వ్రాయగలడు.

*5 ప్ర॥ మీ తొలిరచన ఏమిటి? కవిత్వం వ్రాయడం ఎప్పటినుంచి మొదలు పెట్టారు*

5 జ॥ చాలా చిన్నప్పటినుండి. మా యింట్లో పండిత గోష్ఠులు జరుగుతుండేవి. అనంత కృష్ణశర్మ అన్నగారు, మా నాన్నగారు ఇంకా చాలామంది పండితులు కూర్చొని చర్చిస్తుండేవారు మా నాయనగారి వెంట తిరగడం, తిక్కన భారతం

చదవడం, పండిత సభలలో జరిగే సాహిత్య చర్చలు వినడం నాలో కవిత్వ రచనకు ప్రేరణ నిచ్చాయి. చాల చిన్నవయస్సులో నేనొక పద్యాన్ని వ్రాయబోయి పూర్తి చేయలేక పోయాను "అల కవితా లోక చుతకు - కలిమికి వైరంబదేల కల్గెను చెపుమా" అనివ్రాసి ఊరుకున్నాను. ఆపై సాగలేదు. మానాన్నగారది చూసి "కలికాల మహిమ సద్గుణ-కలితుల నృపసింహముల గనకుండుటయే"- అని పూరించిరి. నాకు జ్ఞాపకమున్నంత వరకు యిదే నాతొలిరచన అనిపిస్తున్నది.

*6 ప్ర॥ :* మీ రచనలు చాలావున్నాయి కదా అందులో దేనిని బాగా అభిమానిస్తారు

6 జ॥ ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క సన్నివేశానికి ప్రతి స్పందించి కావ్యాలు వ్రాసినాను. అన్ని నాకు ప్రియములే

*7 ప్ర॥* భావ కవిత్వోద్యమ కాలంలో మీ రచన ఆరంభమైంది కదా. మీపై ఆనాటి కవుల ప్రభావం ఉందా?

7 జ॥ భావ కవితా ప్రభావంకన్న క్లాసికల్ రచనల ప్రభావమే నాపై వుందను కుంటాను. నేను రచన చేస్తున్నప్పుడు పూర్వ పూర్వ కవుల కవితాంశ-ములు, కొన్ని కొన్ని వాక్యధోరణులు వచ్చిపడుచుంటవి.

*8 ప్ర: మీపై మార్క్సిజం ప్రభావం వుందా?*

8 జ॥ మార్క్సిజం ప్రభావం వుంది. నా చిన్నతనంలోనే పేదలు కష్టపడు తున్నారన్న భావన, నేననుభవించిన దారిద్ర్యం నన్ను కొంత ఉద్రేకింప చేసాయి. శ్రీపాద అమృత డాంగే వంటివారి పరిచయము కలిగింది. ప్రిమిటివ్ కమ్యూనిజం చాలుసార్లు చదివాను. అరవిందుని ప్రభావము కూడ నాజీవితముపై వుంది. మార్క్సిజము తత్వాన్ని, అరవింద తత్వాన్ని కలిపిచూస్తె మనజాతికి ఏదో ఒక నూతన మార్గం గోచరిస్తుందని నాకు అనిపిస్తుంది.

*9 ప్ర: మీరచనలలో సంగీత లక్షణం ఎక్కువగా వుండడానికి గల కారణం ఏమిటి?*

9 జ॥ చిన్నప్పుడు మా అమ్మగారు సంగీత పరమైన కృతులు ఆలపిస్తుండేవారు. నాకు ఆమె సంగీతంతో పాటు అమిరాది నిఘంటు పాఠము చెప్పినట్లు జ్ఞాపకం. ... అనే విద్వాంసురాలివద్ద సంగీత నాట్యములు చిన్నప్పుడే నేర్చుకున్నాను. నాకే రచనైనా పాడుకోవడంపై ఇష్టం. అందువల్ల నా రచనల్లో సంగీత లక్షణం వుంటుంది.

*10 ప్ర॥* "శివతాండవం" మీ అసాధారణ గేయరచన అని అందరూ కంఠోక్తిగా అంటున్నారు కదా. అట్టి శివతాండవం వ్రాయడానికి మీకు కలిగిన మానసిక ప్రేరణ ఏమిటి?

జ॥ 10 శివకేశవా ద్వైతాన్ని ఖండించే రచనలు చదవడంచేత శివకేశవు లిద్దరు నాలో జీర్ణించుకు పోయినారు. అగస్తీశ్వర దేవాలయ ప్రదక్షిణలు చేస్తున్నపుడు అనాలోచితంగా భక్తిస్రోతస్వినిగా ఉబికి వచ్చిన భావం శివతాండవం చిన్నప్పటి నుండి నాలో భక్తికి సంబంధించిన జిజ్ఞాస అధికం. ఏదో సాధించాలనే తపన బ్రహ్మచారిగా నున్నపుడే 24 లక్షల గాయత్రిచేసాను.

ఇప్పటి వరకు 20కోట్లు అష్టాక్షరి జపించాను ఆ తరువాత లెక్కబెట్టడం మానేశాను నాసాహిత్యానికి భక్తి ప్రావాహికత సహజమైంది. అందుకే తులసీదాసు మీరా మొదలైన భక్తుల రచనల ప్రభావం నాపైనవుంది

" ప్ర॥ రామాయణాన్ని ఆధునిక కాలంలో అనేకమంది రచించారు విశ్వనాథ "కల్పవృక్షం "-జ్ఞానపీఠ బహుమతినికూడా గెల్చుకుంది మరల అట్టి రామాయణమే మీరు వ్రాయడానికి పూనుకొనడంలో పరమార్థం ఏమిటి?

జ॥ ఉత్తరహిందూస్థానంలో తులసీ రామాయణం-దానికున్న ప్రాశస్త్యం గమనించి నేను తెలుగులోగూడ పాడుకోవడానికి వీలుగా ఉండే రామాయణం రచిస్తే బాగుంటుంది అనుకున్నాను, "*మాత్రాఛందస్సు మహాకావ్యానికి పనికిరాదు*" అనే ప్రశ్నఉంది అది తప్పని నిరూపించేదే నాఈ ప్రయత్నం తులసీదాసు రామాయణం ఏ విధంగా ఆబాలగోపాలం పాడుకుని ఆనందించే పద్ధతిలో వుందో అదే విధంగా నారామాయణంకూడా తెలుగుప్రజల నాలుకలపైనాట్యం చేయాలన్న తలంపుతోనేను షట్పదాలతో రామాయణం వ్రాయడం మొదలెట్టాను ఇంకొకటి వాల్మీకి రామాయణం "*శరణాగతి*" ధర్మాన్ని ప్రపంచించేది. ఇటీవలి రామాయణములుకానీ విశ్వనాథ రామాయణంకానీ అదృష్టితోగాక అద్వైతదృష్టితో వ్రాయబడ్డవి నేను అట్లుగాకుండ శరణాగతి ధర్మాన్ని ప్రపంచిస్తూ రామాయణం వ్రాస్తున్నాను.

## ఉపజీవ్య గ్రంథసూచి :


1) అంజయ్య, వడ్డెగుంట — ఆంధ్ర కవిత్వము గాంధీతత్త్వము
శ్రీ వేంకటేశ్వర గ్రంథమాల—పొన్నూరు

2) అనంతకృష్ణశర్మ, రాళ్ళపల్లి — నృత్తరత్నావళి (ఆంధ్రవ్యాఖ్య)
సంగీత నాటక అకాడమి ప్రచురణ
కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్. 1969

3) అనంతరావు చి. — సంఖ్యాపదకోశము
శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ ప్రైజెస్
లిమిటెడ్, విజయవాడ

4) అప్పకవి, కాకునూరి — అప్పకవీయము
వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
మద్రాసు. 1970

5) అప్పలాచార్యులు, శ్రీ భాష్యం — తిరుప్పావై (ఆంధ్రవ్యాఖ్య)
దుర్గా ప్రెస్—కాకినాడ. 1974

6) అమరసింహుడు — అమరకోశము
వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
మద్రాసు. 1973

7) అరవిందులు — అరవింద వ్యాసావళి
అరవింద సొసైటి, తెనాలి.

8) అరుణకుమారి బి. — చారిత్రక కావ్యములు
డైరెక్టర్—ఆంధ్రా యూనివర్సిటి ప్రెస్,
విశాఖపట్టణం

9) కాళిదాసు — మేఘదూతము
వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
మద్రాసు. 1966

10) కృష్ణమాచార్య ఎక్కిరాల — శ్రీ మద్భాగవత రహస్య ప్రకాశము
ది వరల్డ్ టీచర్స్ ట్రస్ట్ ప్రచురణ
14—38—2. రాధామాధవము
ముప్పిడి కాలనీ—విశాఖపట్నం

| | | |
|---|---|---|
| 11) | కృష్ణశాస్త్రి, దేవులపల్లి | కృష్ణ పక్షము<br>కృష్ణశాస్త్రి సన్మాన సంఘం - ప్రచార కార్యాలయం<br>14, సుంకురామ చెట్టి వీధి. మద్రాసు—I |
| 12 | గురుదత్ | సృష్టి రచనా (హింది)<br>శాశ్వత సంస్కృతి పరిషద్ కొత్త ఢిల్లీ- 1977 |
| 13) | గోపాలాచార్య తె.కం | శ్రీ మద్భగవద్గీత (తెలుగు అనువాదం)<br>ఉభయ వేదాంతాచార్య పీఠము వారిచే ప్రచురణ<br>తృతీయ ముద్రణ—1975 |
| 14) | గోపాల కృష్ణారావు | కె ఆంధ్రశతక సాహిత్య వికాసము<br>హైదరాబాద్—1976<br>తెలుగు కవులపై ఉర్దూ ఫారసీ ప్రభావం<br>1968—వెంకటరమణ ముద్రణాలయం<br>వరంగల్ |
| 15) | చిన్మయానందస్వామి | కఠోపనిషత్ (తెలుగు వ్యాఖ్యానము)<br>జె వేమయ్య-సెంట్రల్ చిన్మయమిషన్ ట్రస్ట్<br>చిన్మయ పబ్లికేషన్—ప్రొద్దుటూరు<br>516 360. (పిన్) 1981 |
| 16) | చిరంత నానందస్వామి | శ్రీ రామకృష్ణ జీవిత చరిత్ర<br>శ్రీ రామకృష్ణ మఠము<br>మైలాపూర్—మద్రాసు |
| 17) | తారాచంద్ | భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్ర<br>(ఆంగ్లానువాదము) |
| 18) | తిమ్మయ—కూచిమంచి, | కుక్కుటేశ్వర శతకము<br>సంకలన కర్త. శివశంకరస్వామి<br>సాహిత్య అకాడమి ప్రచురణ—1968 |
| 19) | త్రిపురాంతకుడు—రావిపాటి, | త్రిపురాంత కోదాహరణము<br>ఉదాహరణ వాఙ్మయ చరిత్ర<br>నిడదవోలు వెంకటారావు. |

20) తుక్కోజ మహారాజు — శివకామ సుందరీ పరిణయము
సంపుటము—II తంజాపూరి యక్షగానములు
ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణ

21) ద్రోణప్ప—తూమాటి. — తెలుగు హరికథా సర్వస్వం
శ్రీ లక్ష్మి ప్రెస్—అరండల్ పేట
గుంటూరు—2. 1978

22) నందికేశ్వరుడు — అభినయ దర్పణము
వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
మద్రాసు

23) నన్నెచోడుడు — కుమార సంభవము
వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
మద్రాసు

24) నరసింహాచార్య—కిడాంబి. — "తిరునామములు సమగ్ర పరిశీలనము"
శ్రీమతి కె. పద్మ, H.No EWS 208
న్యూ సంతోష్‌నగర్ కాలని, హైద్రాబాద్-1984

25) నాగేశ్వరరావు, చలసాని. — గీతా వ్యాసములు
ఆంగ్లమూలము—శ్రీ అరవిందులు
శ్రీ అరవింద సొసైటీ—తెనాలి—1977

26) నారాయణరెడ్డి, సి. — 'ఆధునికాంధ్ర కవిత్వము-సంప్రదాయములు
ప్రయోగములు'
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్
సికింద్రాబాద్—1977

27) నారాయణాచార్యులు, పుట్టపర్తి — రామకృష్ణుని రచనా వైఖరి
తెలుగు భాషా సమితి—కర్నూలు.

28) నృసింహాచార్య, వంగీపురం — శ్రీపాంచరాత్రాంతర్గత పాద్మసంహితాను
సారి దేవాలయార్చనా విధానమ్
లక్ష్మీ నృసింహ దేవస్థానం.
యాదగిరి గుట్ట—1984

29) పతంజలి — తాండవాష్టకమ్
బృహత్స్తోత్ర రత్నాకరము
బాలా బుక్ డిపో, కర్నూలు—1980

30) పోతన భాగవతము
వెంకట్రామ అండ్ కో—విజయవాడ—1976

31) భర్తృహరి వాక్యపదీయము
తెలుగు అకాడమి—1974

32) భూమయ్య, అనుమాండ్ల నాయని సుబ్బారావు కృతులు—పరిశీలన
శ్రీమతి ఏ. లక్ష్మి 5—8—55
లష్కర్ బజారు—హన్మకొండ—1981

33) మాధవరాయశర్మ, జమ్మల మడక భావ ప్రకాశనము
(తెలుగు అనువాదము)
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి
హైదరాబాద్—1973

34) మార్కండేయశర్మ కనుపర్తి తైత్తిరియోపనిషత్తు
(సాయణ భాష్యమునకు ఆంధ్రటీక)

35) రఘునాథాచార్యులు, న.చ. ఈశావాస్యోపనిషత్ ముండకోపనిషత్,
ఉభయవేదాంత ట్రస్ట్-ప్రకటితము
హన్మకొండ

36] రాజశేఖర శతావధాని, దుర్భాక—రాణాప్రతాపసింహ చరిత్ర
శ్రీ ప్రకాశ్ ముద్రాక్షరశాల
ప్రొద్దుటూరు—1934

37) రామకృష్ణ నటరాజ నృత్యరేఖ
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజయవాడ.
దాక్షిణాత్యుల నాట్యకళా చరిత్ర
పేరిణి ఇంటర్నేషనల్— అశోక్‌నగర్,
హైదరాబాద్—20, 1987

38) రామమూర్తి, ధర్మాల మృదంగ తత్వము
సరస్వతీ పవర్ ప్రెస్—రాజమండ్రి
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
సంగీత నాటక అకాడమి న్యూఢిల్లీ 1966

| | | |
|---|---|---|
| 39) | రామానుజాచార్యులు | శ్రీ భాష్యమ్<br>ఉభయవేదాంత గ్రంథమాల<br>మద్రాసు |
| 40) | రామకృష్ణ కవి, మానవల్లి | భరతకోశము<br>(భరతాది ప్రణీత నాట్యసంగీత శాస్త్ర గ్రంథస్థ<br>పారిభాషిక పదకోశము — సంస్కృతము)<br>తిరుమల తిరుపతిదేవస్థాన ప్రచురణము 1951 |
| 41) | రామమోహన్ రాయ్,<br>కడియాల | తెలుగు కవితా వికాసం<br>(1947 నుండి 1980)<br>సాహిత్య అకాడమీ ప్రచురణ. |
| 42) | రామిరెడ్డి, దువ్వూరి | కవి కోకిల గ్రంథావళి<br>నాల్గవ సంపుటము<br>కవి కోకిల గ్రంథమాల-నెల్లూరు 1967 |
| 43) | రాములు, సి.హెచ్. | సూర్ జార్ పోతనాకె కావ్యమ్ భక్తి తత్వ<br>దక్షిణాచలీయ సాహిత్య సమితి<br>గాంధీనగర్—హైదరాబాద్—1980 |
| 44) | రావణుడు | శివతాండవ స్తోత్రమ్<br>బృహత్స్తోత్ర రత్నాకరమ్<br>బాలా బుక్ డిపో, కర్నూలు |
| 45) | లలిత జి. | తెలుగులో ఆశు కవిత్వము<br>క్వాలిటీ పబ్లిషర్స్, విజయవాడ. |
| 46) | లక్ష్మి సరస్వతి,<br>ఏలూరిపాటి | శివవచన మహా పురాణము<br>బాలా బుక్ డిపో, కర్నూలు |
| 47) | లక్ష్మయ్య పైడి | జ్ఞాపకాలు - వ్యాపకాలు<br>తెలుగు విద్యార్థి ప్రచురణలు |
| 48) | వాల్మీకి | కిష్కింధకాండము<br>వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్<br>మద్రాసు-1954 |

సుందర కాండము
బాల సరస్వతీ బుక్ డిపో-కర్నూలు. 1982

49) విశాఖదత్తుడు — ముద్రారాక్షసము (నాటకం)
వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
మద్రాసు.

50) విశ్వనాథశాస్త్రి, సరిపెల్లి — ధనంజయుని దశరూపకము
(తెలుగు అనువాదము)
శివాజీ ప్రెస్, సికింద్రాబాద్. 1967

51) వ్యాసుడు — భగవద్గీత
తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ 1982

52) విజయ సారధి శ్రీ భాష్యం — శివతాండవమ్
సంస్కృత భారతి—విజయ ప్రెస్
వరంగల్ 1978

53) వీరరాఘవాచార్యులు కొండూరు— శిల్పదర్శనము

54] వెంకటేశ్వర్లు-బులుసు — భారతీయ తత్వశాస్త్రము
తిరుమల తిరుపతి దేవస్థానం
ప్రచురణ. 1981

55) వెంకట నరసయ్య — నవవిధ భక్తులు
సాధన గ్రంథ మండలి, తెనాలి.

56) వెంకటనారాయణ వి యస్. — కాళహస్తీశ్వర శతనామాబ్జ మాలిక
శ్రీ కాళహస్తీశ్వర దేవస్థానం ప్రచురణ
కాళహస్తి.

57) వెంకట పార్వతీశ్వర కవులు — ఏకాంత సేవ
ఆంధ్ర ప్రచారిణీ లిమిటెడ్—కాకినాడ—1938

58) వెంకటరావు, నిడదవోలు — ఉదాహరణ వాఙ్మయ చరిత్ర
విజయభాస్కర పబ్లికేషన్స్
హైదరాబాద్.

59) వేంకట సుబ్రహ్మణ్యం మైనంపాటి — శ్రీ కృష్ణ తాండవమ్

60) వెంకట హనుమంతరావు పిల్లలమర్రి, సీతారామయ్య—కురుగంటి — సర్వాంధ్ర సాహిత్య వీధులు
తృతీయ భాగము
హైదరాబాదాంధ్ర సాహిత్య పరిషత్తు

61) శరభయ్య—మల్లంపల్లి — కుమార సంభవము (తెలుగు అనువాదము)

62) శర్వానందస్వామి — శ్వేతాశ్వతరో పనిషత్
శ్రీరామ కృష్ణ మఠము-17
మైలాపూర్—మద్రాసు 1983

63) శాహజీ — రతి కళ్యాణము
పంచరత్న ప్రబంధము
తంజాపూరి యక్షగానములు
ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రచురణ్ణము

54) శూద్రకుడు — మృచ్ఛకటికము.
వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్
మద్రాసు.

65) శంకరాచార్యులు — శివానంద లహరీ

66) శ్రీనాధుడు — హరవిలాసము
భీమేశ్వర పురాణము
వావిళ్ళ రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్
మద్రాసు - 1973

67) శ్రీనివాసాచార్యులు, నల్లదీగ — తాండవ మదనుడు
పద్మావతీ ఆర్ట్స్ ప్రింటర్స్
హైదరాబాద్

68) శ్రీరామచంద్రుడు, పుల్లెల — లఘు సిద్ధాంత కౌముదీ
శ్రీపతి పుల్లెల సుబ్బలక్ష్మి
ఉస్మానియా యూనివర్సిటి క్యాంపస్ 25
హైదరాబాద్. 1971

69) శ్రీ రామశర్మ, పాలావజ్ఝల — శివమహాత్మ్య ఖండము
భద్రాచలము. 1977
శ్రీ రుద్రాధ్యాయము-శ్రీరామా బుక్ డిపో
సికింద్రాబాద్. 1980

70) శ్రీరామ అప్పారావు పోణంగి — నాట్యశాస్త్రము
వెంకట్రామా పేపర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్
హైదరాబాద్

71) సంపత్కుమార — కోవెల — తెలుగు ఛందో వికాసము
కులపతి సమితి, వరంగల్

72) సత్యనారాయణ, విశ్వనాథ — కిన్నెరసాని పాటలు
పావనిశాస్త్రి, విజయవాడ.

73) సత్యనారాయణ, వేదుల — దీపావళి. యం శేషాచలం అండ్ కో,
మచిలీపట్నం, మద్రాసు.

74) సుప్రసన్నాచార్య, కోవెల — సాహిత్య వివేచన
సాహితీ బంధు బృందం—1971

75) సుబ్బయ్య కె. — మహాకవి పుట్టపర్తి
సర్వోదయ పబ్లికేషన్స్, ప్రొద్దుటూరు.

76) సుబ్బారావు, కొడాలి — హంపీక్షేత్రము
వి.ఆర్ అండ్ సన్స్, విజయవాడ 1951

77) సుబ్బారావు, రాయప్రోలు — తృణకంకణము, రమ్యాలోకము
జనరల్ ప్రింటర్స్, మారీసుపేట-తెనాలి-1944

78) సుబ్బారెడ్డి మద్దూరి — తెలుగులో జాతీయోద్యమ కవిత్వం
రాగసుధా ప్రచురణలు — 518
బాలాజీ కాలనీ—తిరుపతి.

79) సుబ్రహ్మణ్యం జి.కె. — భారతదేశ చరిత్ర ద్వితీయ భాగము
తెలుగు అకాడమి హైదరాబాద్. 1980

80) సూర్యనారాయణశాస్త్రి సన్నిధానం — కావ్యాలంకార సంగ్రహం
యం. శేషాచలం అండ్ కం.
సికింద్రాబాద్. 1959

81). సోమనాథుడు, పాల్కురికి — బసవ పురాణము, పండితారాధ్య చరిత్ర
వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్
మద్రాసు. 1966

82) హరి రాధాకృష్ణమూర్తి — లలితా సహస్రనామ స్తోత్రమ్
డాక్టర్ హరిశివకుమార్, 8—4—18
శ్రీవిహార్—శ్రీకృష్ణకాలనీ, వరంగల్ 1984

# వ్యాసములు

1) కృష్ణశాస్త్రి, దేవులపల్లి — పీఠిక, ఏకాంత సేవ
ఆంధ్ర ప్రచారిణీ లిమిటెడ్ కాకినాడ 1938

2) కోటీశ్వరరావు, తుమ్మపూడి — ''పోతన భాగవతము-జీవుని వేదన''
పోతన భాగవత నీరాజనము
సంపాదకులు :— అమరేశం రాజేశ్వరశర్మ
కోవెల సంపత్కుమారాచార్యులు
తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ 1982

3) గణపతి స్థపతి — 'శివలింగం' విజ్ఞాన సర్వస్వం 14వ సంపుటం

4) గోపాలరావు, కడియాల — ''అభ్యుదయ కవిత్వము''
తెలుగు సాహిత్య వికాసము
సంపాదకులు కె.కె. రంగనాథాచార్యులు
ఆంధ్ర సారస్వత పరిషత్తు, తిలక్ రోడ్,
హైదరాబాద్ 1979

5) భరద్వాజ,—రావూరి — "వెలుగుబాట'' రేడియో ఇంటర్వ్యూ నిర్వహణ
30—1—1986

6) మాధవరామశర్మ,
జమ్మల మడక — 'వాకోవాద్యము' అగ్నివీణ
పుట్టపర్తి నారాయణాచార్యులు
విజ్డమ్ పబ్లికేషన్స్, కడప

7) రామమూర్తి రేణు, వారణాసి — శ్రీ వల్లభ చైతన్య సంప్రదాయములు
పోతన భాగవత నీరాజనము

8) రామ సుబ్బారెడ్డి — విగ్రహ ప్రతిమా లక్షణము
సప్తగిరి ఏప్రియల్ 1986
తిరుమల తిరుపతి దేవస్థాన మాసపత్రిక.

9) రాఘవన్, వి. — నాట్యకళ విజ్ఞాన సర్వస్వం 3వ సంపుటము

10) లక్ష్మీరంజనం, ఖండవల్లి — 'తృణ కంకణం ఒక ప్రేమ గీతి'
రాయప్రోలువారి సాహిత్య సౌందర్య దర్శనం
సంపాదకులు రావూరి వేంకట
సత్యనారాయణ, కిన్నెర ఆర్ట్ థియేటర్స్,
హైదరాబాద్

12) వెంకట రమణయ్య, నేలటూరి — మొగలాయీ వంశచరిత్ర
విజ్ఞాన సర్వస్వం, 3వ సంపుటము
13) వేంకటావధాని, దివాకర్ల — "శైవము" విజ్ఞాన సర్వస్వము
6వ సంపుటము
14) శశిశ్రీ — 'ఆంధ్రసారస్వత వేదికపై శివతాండవమట'
ఆంధ్రజ్యోతి వార పత్రిక 2-5-1986
15) శివశంకరశాస్త్రి, తల్లావజ్ఝల — 'అభిప్రాయము' శివతాండవము
రవి అకడమిక్ సొసైటి గుంటూరు. 1985
"బహుభాషా వైదగ్ధ్యము"
పుట్టపర్తి అభినందన సంచిక
సాహితీ విస్తీర్ణం. 3-5-1977
16) శ్రీనివాసాచార్యులు, కలచవీడు — "మధురస్మృతులు"
పుట్టపర్తి అభినందన సంచిక
సాహితీ విస్తీర్ణం, కడప
17) సంజీవదేవ్ — "కళాస్వరూపం" విజ్ఞాన సర్వస్వం
14వ సంపుటము
18) సత్యనారాయణ, విశ్వనాథ — "వీరిక" రాణాప్రతాపసింహ చరిత్ర
శ్రీ ప్రకాశ్ ముద్రాక్షరశాల
ప్రొద్దుటూరు. 1934
19) సుప్రసన్నాచార్య, కోవెల — "నవ్యకవితా ప్రారంభము" విమర్శిని
కాకతీయ విశ్వవిద్యాలయము
"హైందవారాధనా విధులలో ముద్రల
ప్రాధాన్యము" కైలాస పర్వతం.
పి.వి. మనోహరరావు 6-4-108
బ్రహ్మణవీధి, హనుమకొండ. 1986
20) హనుమచ్ఛాస్త్రి జానుమద్ది — "రక్తి - భక్తి వారధి పుట్టపర్తి"
ఆంధ్రజ్యోతి దినపత్రిక 29-6-87
"బహుముఖ ప్రజ్ఞానిధి డా॥ పుట్టపర్తి"
ఆంధ్రప్రభ దినపత్రిక-28-6-1987
'శ్రీమతి పుట్టపర్తి కనకమ్మ"
పుట్టపర్తి అభినందన సంచిక

## ఆంగ్ల గ్రంథములు :


Aurobindo — 'The foundations of the Indian Culture', Indian Art-2, Sri Aurobindo Birth centerary Ashram Pandicherry-1971.

Ananda Kumara Swamy' — Dance of Shiva' Asian Publishing House Bombay-1956

Engels — 'On Marx's Capital' Progress Publishers Mascow-1972

Frity of Capra — 'The toy of Physics' Fontana Paper Backs 8 Grafton Street London WIX 3 LA-1983.

Projesh Benerji — Nataraja-The Dancing God, Alahabad

Shivarama Murthy, C. — Nataraja in Art, 'Thought and Literature' National Muslum New Delhi-1974

Statesman — An English Essay in Puttaparthi Abhinandana Sanchika 'Science and Technology' Andhra Pradesh Open University Hyderabad-1983.


500

**PUTTAPARTHI VARI KHANDA KAVYAMULU**
**SHIVATANDAVM - PARISILANA**

ప్రథిత శివతాండవాది కావ్య ప్రకాశ
మొడిసి పట్టి తెనుగు భావుకోత్కరముల
కద్దమును గూర్చి రసలోక మందు కొత్త
హద్దులను దీర్చుపరిశోధనా కృతి ఇది.

- సుప్రసన్న